


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 326

SUNDAY Special

ఆదివారం 16-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఉత్కంఠ పోరులో ఢిల్లీ పైచేయి

డబ్ల్యూపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌పై 2 వికెట్ల తేడాతో క్యాపిటల్స్ గెలిచింది. ముంబై 164 పరుగులకు ఆలౌట్ కాగా, ఢిల్లీ 20వ ఓవర్ చివరి బంతికి లక్ష్యాన్ని ఛేదించింది.

- వివరాలు 14లో



సార్కోమాను ఎదుర్కోలేమా!

సూక్ష్మ కణజాలానికి వచ్చే ఆరు రకాల కేన్సర్లలో సార్కోమా ఒకటి. ధనిక దేశాలతో పోలిస్తే భారత్‌లో మరణాల రేటు ఎక్కువ. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి గురించి ప్రత్యేక కథనం.

- వివరాలు 13లో

ఆఫ్రికాను చీలుస్తూ ఆరో మహాసముద్రం!

టెక్టానిక్ ప్లేట్ల కదలికలతో శరవేగంగా పుట్టుకొస్తున్న వైనం

విడిపోనున్న ఆఫ్రికా తూర్పు ప్రాంతం.. నడుమ ఖాళీలోకి అపార జలరాశి

పలు దేశాలకు కొత్తగా తీర రేఖలు

→ ఆఫ్రికా ఖండాన్ని రెండుగా చీలుస్తూ శరవేగంగా ఆరో మహాసముద్రం పుట్టుకొస్తోంది! టెక్టానిక్ ప్లేట్ల కదలికల వల్ల చోటుచేసుకోబోయే ఈ ప్రక్రియకు కోట్ల ఏళ్లు పట్టొచ్చని ఇప్పటిదాకా భావించిన పరిశోధకుల అంచనాలను తల్లకిందులు చేస్తూ కొన్ని వేల ఏళ్లలోనే ఈ పరిణామం సంభవించనుంది.

- వివరాలు 6లో



భారత్‌కు మెటా 'ప్రాజెక్ట్ వాటర్‌వర్త్'

సముద్ర కేబుల్స్ ద్వారా యావత్ ప్రపంచం అనుసంధానం

50,000 కిలోమీటర్ల మేర కేబుల్ లైన్స్

డిజిటల్ కనెక్టివిటీని పెంచడమే లక్ష్యం

→ అంతర్జాతీయంగా డిజిటల్ కనెక్టివిటీని పెంచేందుకు సోషల్ మీడియా దిగ్గజం మెటా నడుం బిగించింది. ప్రపంచంలోనే అతిపొడవైన సముద్రగర్భ కేబుల్ ప్రాజెక్ట్ 'ప్రాజెక్ట్ వాటర్‌వర్త్'కు శ్రీకారం చుట్టింది. ఐదు ప్రధాన ఖండాలను కలుపుతూ 50,000 కి.మీ. దూరం సముద్రగర్భంలో కేబుల్స్ వేయనుంది. ఈ దశాబ్దం చివరి నాటికి ఈ ప్రాజెక్టుతో భారత్‌ను అనుసంధానించనుంది.

- వివరాలు 16లో



కమిటీ లేదా కమిషన్!

కులగణన అమలుపై అధ్యయనానికి ఏర్పాటు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

రెండో విడత సర్వే పూర్తయిన వెంటనే విధివిధానాలు ఖరారు

కులగణనపై మార్చి తొలి వారంలో అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రం పరిశీలనకు..

విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో దీని అమలు, నిధుల కేటాయింపుపై కసరత్తు

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చల్లో కీలక నిర్ణయాలు

కులగణన, ఎస్సీ వర్గీకరణ అమల్లో రాష్ట్రం దేశానికి దిక్సూచిగా ఉండాలన్న రాహుల్

ఎమ్మెల్యేల అసంతృప్తితో ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచన

ఎస్సీ వర్గీకరణపై చట్టం చేశాక బహిరంగ సభ ఏర్పాటుకు నిర్ణయం



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో రెండో విడత కులగణన పూర్తయిన వెంటనే, దానిని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసే దిశగా అధ్యయనం చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జరిపిన భేటీలో నిర్ణయించారు. ఇందుకోసం కమిషన్ లేదా ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని.. అది ఇచ్చే నివేదిక మేరకు చట్టం తేవాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. విద్య, వైద్య, ఉపాధి రంగాలతోపాటు వివిధ పదవుల నియామకాలు, నిధులు, కేటాయింపులు సహా విధానపరమైన నిర్ణయాలన్నీ కులగణన ఆధారంగా ఉండేలా భవిష్యత్ ప్రణాళికలు రూపొందించాలని అభిప్రాయానికి వచ్చారని సమాచారం. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎస్సీ వర్గీకరణ, కులగణన అంశాలపై చర్చించేందుకు శుక్రవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. శనివారం మధ్యాహ్నం రాహుల్‌గాంధీతో

మిగతా 2వ పేజీలో ▶



ఇప్పటికిప్పుడు బీసీ కోటా అసాధ్యం!

- పార్లమెంట్‌లో ఆమోదం పొందాకే 42% రిజర్వేషన్ల అమలు
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- మార్చి తొలివారంలో రిజర్వేషన్లపై తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం.. పార్లమెంట్‌లో ఆమోదింపజేసే బాధ్యతను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలి

- 2లో

రాజధానిలో ఘోరం

న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట.. 15 మంది దుర్మరణం

మహాకుంభ్‌మేళా భక్తులతో కిక్కిరిసిన రైల్వేస్టేషన్



శనివారం రాత్రి ప్రయాణికులతో కిక్కిరిసిన న్యూఢిల్లీ రైల్వే స్టేషన్. (ఇన్‌సెట్‌లో) రైలు ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ఘోరం జరిగింది. మహాకుంభమేళాకు వెళ్లేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసిన న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 10 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని హుటాహుటిన సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని వార్తలొచ్చాయి. శనివారం రాత్రి 9.55 గంటలకు తొక్కిసలాట జరిగింది. ఘటనా స్థలిలో భక్తుల బ్యాగులు, దుస్తులు, చెప్పులు చెల్లాచెదురుగా పడ్డాయి. భయంతో జనం తమ చిన్నారులను భుజాలపైకి ఎత్తుకుని, బ్యాగులు పట్టుకుని పరుగెడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తొక్కిసలాటకు కారణాలపై ఇంకా అధికారికంగా ఎలాంటి

మిగతా 2వ పేజీలో ▶



ఆహా.. ఏమి టీ!

ఖమ్మంలో స్వయం సహాయక సంఘాల 'స్త్రీ టీ క్యాంటీన్లు'

వారికి శిక్షణ, యూనిట్ల కేటాయింపు

చొరవ చూపిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

విజయవంతంగా నడుస్తున్న 22 క్యాంటీన్లు.. మరో 300 యూనిట్ల ఏర్పాటుకు కార్యాచరణ

ఒక్కో క్యాంటీన్‌కు బ్యాంకు లింకేజీతో రూ.1.5 లక్షల రుణం

16లో



శాటిలైట్ టెలికం.. మన దేశంలోకి వెల్‌కం!

కొండలు, గుట్టలు, అడవులు.. ఎక్కడైనా సిగ్నల్ పొందే వెసులుబాటు

త్వరలో భారత్‌లో అందుబాటులోకి..

ఇప్పటికే రెండు సంస్థలకు లైసెన్స్

మరో 2 కంపెనీలు వెయిటింగ్.. సాధారణ సేవలతో పోలిస్తే ఖరీదు ఎక్కువే

ప్రస్తుతానికి బిజినెస్ టు బిజినెస్‌కు మాత్రమే అనుమతి

2లో



భయపెడుతున్న జీబీ సిండ్రోమ్

బాధితుల్లో కాళ్ల నుంచి మెడ దాకా క్రమంగా అచేతనం

పరిశుభ్రమైన నీరు, ఆహారమే ముందు జాగ్రత్తలు

12లో



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి

ఆ జిల్లాల్లో ఇందిరమ్మ నిర్మాణాలు

పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేనందున ప్రారంభించండి

ప్రభుత్వ భూముల సంరక్షణపై దృష్టి పెట్టండి

బడ్జెట్ సమీక్షలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

హాజరైన మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వర్తించని ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో వెంటనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్లు భాగమైనందున ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మించే పనులకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌తోపాటు రంగారెడ్డి జిల్లా నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. శనివారం సచివాలయంలో రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన సమీక్షించారు. బడ్జెట్ ప్రతిపాదనలను వాస్తవిక అంచనాల మేరకు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకుని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బడ్జెట్ రూపొందించాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు,

మిగతా 12వ పేజీలో ▶

ఈ కామర్స్‌కు 'ప్రేమోత్సవ్'!

ప్రేమికుల రోజు ఆన్‌లైన్‌లో గిఫ్టుల అమ్మకాల జోరు

బ్లింకిట్, స్విగ్గీ, జొమాటో వంటి వేదికల్లో రికార్డు అమ్మకాలు

పూలు, చాక్లెట్లు, బొమ్మలు, గ్రీటింగ్స్‌కే అధిక గిరాకీ

రూ.29,844 పెట్టి 174 చాక్లెట్లు కొన్న ఢిల్లీ కస్టమర్

12లో

'గురి'తప్పిన గురుకులాలు!

ఈ స్కూళ్లలో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి

గత ఏడాది ఉమ్మడి ప్రవేశ పరీక్షకు 1.20 లక్షల దరఖాస్తులు

ఈ ఏడాది 40 వేలు తగ్గి.. 80 వేలకే పరిమితం

వసతుల లేమి, ఫుడ్ పాయిజన్ ఘటనలతో తగ్గుతున్న ఆదరణ

23న అర్హత పరీక్ష



సాక్షి, హైదరాబాద్

సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపటం లేదు. ఈ పాఠశాలల ప్రారంభ సమయంలో ఒక్కో సీటుకోసం కనీసం నలుగురు విద్యార్థులు పోటీపడగా, ఇప్పుడు ఇద్దరు కూడా పోటీలో లేకపోవడం గమనార్హం. ఇటీవల గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు అధికం కావటం, వసతుల లేమి కారణంగా వాటిల్లో చేరేందుకు విద్యార్థులు, చేర్పించేందుకు వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపటం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల సొసైటీల పరిధిలోని పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ గతేడాది డిసెంబర్‌లో విడుదల కాగా, గడువు ముగిసేనాటికి దాదాపు 80 వేల మందే దరఖాస్తు చేసుకున్నారు.

సీట్లు 51 వేలు.. దరఖాస్తులు 80 వేలు

రాష్ట్రంలో ఐదు గురుకుల సొసైటీలున్నాయి. ఇందులో నాలుగు సొసైటీలు సంక్షేమ శాఖలకు అనుబంధంగా కొనసాగుతుండగా.. జనరల్ సొసైటీ పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉంది. ప్రస్తుతం టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీఆర్‌ఈఐఎస్)లు ఐదోతరగతికి ఉమ్మడిగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నాయి. మైనార్టీ గురుకుల సొసైటీ మాత్రం ప్రత్యేకంగా సెట్ నిర్వహించి ప్రవేశాలు

మిగతా 12వ పేజీలో ▶



మత మార్పిళ్లు, లవ్ జిహాద్‌పై నిషేధం!

- చట్టం తీసుకురావాలని మహారాష్ట్ర ప్రభుత్వం యోచన
- అధ్యయనం కోసం ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విపక్షాలు
- ప్రేమ లేదా పెళ్లిపై ప్రభుత్వం జోక్యం ఏమిటని మండిపాటు

6లో



మరో ముగ్గురు బందీల విడుదల

- దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ పట్టణంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులకు అప్పగించిన హమాస్
- ప్రతిగా 369 మంది ఖైదీలను వదిలేస్తున్న ఇజ్రాయెల్
- కాల్పుల విరమణ ఒప్పందంలో మరో అంకం పూర్తి

6లో

ఇదం జగత్



పాతాళానికి నీళ్లు!

రాష్ట్రంలో వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

డిసెంబర్‌లో 6.7 మీటర్ల లోతున.. జనవరికి 7.46 మీటర్ల లోతుకు క్షీణత

నెల రోజుల్లో 0.74 మీటర్లు తగ్గిపోయిన తీరు..

పలు జిల్లాల్లో ఆందోళనకరంగా భూగర్భ జలమట్టాలు

156 మండలాల్లో గత దశాబ్దకాలంలో లేనంత దారుణ పరిస్థితి

వేసవికి ముందే పలు ప్రాంతాల్లో ఎండిపోతున్న బోర్లు

33 జిల్లాల్లోని స్థితిగతులపై భూగర్భజల శాఖ నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. ఎండాకాలం ఇంకా మొదలవక ముందే బోర్లలో నీళ్లు ఇంకిపోతున్నాయి. యాసంగిలో బోరుబావుల కింద సాగుచేస్తున్న పంటలకు నీటి కోసం కటకట తప్పని పరిస్థితి కనిపిస్తోంది. డిసెంబర్‌లో 6.7 మీటర్ల లోతుగా ఉన్న రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం జనవరిలో 7.46 మీటర్ల లోతుకు తగ్గిపోయింది. అంటే నెల రోజుల్లోనే సుమారు 0.74 మీటర్ల మేర భూగర్భ జలమట్టం పడిపోవడం ఆందోళన రేపుతోంది. వ్యవసాయం, ఇతర అవసరాలకుతోడు తాగునీటి కోసం వేసవిలో వినియోగం మరింత పెరగనుండటంతో.. రానున్న రోజుల్లో భూగర్భ జలమట్టాలు మరింతగా పడిపోయే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి రూపొందించిన నివేదికలోనే ఈ అంశాలు

మిగతా 5వ పేజీలో ▶

ఎండ ముదిరి.. చేను ఎండి

పశువులకు మేతగా మారుతున్న వరి పైరు

భూగర్భజలాలు అడుగంటి పొట్ట దశలో నీటి తిప్పలు

నీరందక నెర్రెలు వారుతున్న పంటపొలాలు

5లో



రాష్ట్రంలో భూగర్భ జలాల పరిస్థితి ఇదీ..

జలాలు ప్రమాదకర స్థాయిలో పడిపోయిన ప్రాంతాలు: 4%

పరిమితికి మించి లోతుకు తగ్గిపోయిన ప్రాంతాలు: 18%

ప్రస్తుతానికి సాధారణ లోతులో నీళ్లున్న ప్రాంతాలు: 54%

కాస్త సురక్షితంగా ఉన్న ప్రాంతాలు: 25%



కేజ్రీవాల్ 'శీష్ మహల్' అక్రమాలపై లోతైన దర్యాప్తు

- ఆదేశాలు జారీ చేసిన కేంద్ర విజిలెన్స్ కమిషన్
- బీజేపీ నేత విజేందర్ గుప్తా వెల్లడి
- భవన నిర్మాణంలో మితిమీరిన ఖర్చు జరిగిందని ఆరోపణ

6లో

శాటిలైట్ టెలికం.. మన దేశంలోకి వెల్‌కం!

మనం ఇప్పుడు జేబులో సెల్‌ఫోన్ పెట్టుకుని గడిపేస్తున్నాం. ఎక్కడున్నా కాల్స్, మెసేజీలు పంపడం, అందుకోవడం దగ్గరి నుంచి ఇంటర్నెట్ దాకా యథాలాపంగా వాడేస్తున్నాం. కానీ అడవులు, ఎడారులు, మారుమూల ప్రాంతాల్లో మొబైల్ సేవలు సరిగా అందవు. అలాంటి చోట మంచి పరిష్కారం శాటిలైట్ టెలికం సేవలు. ఇక్కడా, అక్కడా అని లేకుండా ఎక్కడైనా సరే... సిగ్నల్స్ అందుకోగలగడం దాని ప్రత్యేకత. త్వరలోనే ఈ శాటిలైట్ టెలికం సేవలు మన దేశంలో అందుబాటులోకి రానున్నాయి. భారత టెలికం రంగం మరో మెట్టు ఎక్కబోతోంది. అయితే శాటిలైట్ ఆధారిత టెలికం సేవలు సామాన్యుడికి చేరడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇంకా ప్రారంభదశలోనే ఉండటం, వీటి ధరలు, ఈ సాంకేతికతను వినియోగించగల హ్యాండ్‌సెట్ల ధరలు ఎక్కువగా ఉండటం దీనికి కారణమని పేర్కొంటున్నారు. - నూగూరి మహేందర్, సాక్షి ప్రతినిధి



కొండలు, గుట్టలు, అడవులు..
ఎక్కడైనా సిగ్నల్ అందుకునే వెసులుబాటు

త్వరలోనే అందుబాటులోకి.. ఇప్పటికే 2 సంస్థలకు లైసెన్స్
మరో కంపెనీ వెయిటింగ్..
సాధారణ సేవలతో పోలిస్తే ఖరీదు ఎక్కువే..
ప్రస్తుతానికి బిజినెస్ టు బిజినెస్‌కు మాత్రమే..
వ్యక్తిగత వినియోగానికి మరింత సమయం పట్టే అవకాశం

కాస్త ఖరీదైనవే..

శాట్‌కామ్ సేవలు ఖరీదైనవే. దేశంలో టెల్కోల హోమ్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్లు నెలకు కనీసం రూ.400 నుంచి రూ.4,000 వరకు ఉంటాయి. అవసరాన్ని, తాహతును బట్టి ఎంచుకోవచ్చు. కానీ ఉపగ్రహ టెలికం, ఇంటర్నెట్ వ్యయాలు అంతకు 7 నుంచి 18 రెట్లు ఖరీదైనవని జేఎం ఫైనాన్షియల్స్ సంస్థ వెల్లడించింది. సైన్యం, నావికా దళం, మారుమూల ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు సాగించే సంస్థలకు శాటిలైట్ కమ్యూనికేషన్స్ ఉపయోగకరం. ఆతిథ్య రంగంలో లగ్జరీ హోటళ్లు, కొండ ప్రాంతాల్లో రిసార్టులు ఏర్పాటు చేసే సంస్థలు తమ వినియోగదారుల కోసం శాటిలైట్ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో తొలుత బిజినెస్ టు బిజినెస్ విభాగంలో శాటిలైట్ టెలికం సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ప్రముఖ టెలికం కంపెనీ ప్రతినిధి ఒకరు 'సాక్షి బిజినెస్ బ్యూరో'కు తెలిపారు. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్ కంపెనీ కెన్యాలో ఒక్కో యాంటెన్నాకు నెలకు 30 డాలర్లు వసూలు చేస్తోందని.. ఇతర దేశాల్లో అది 100 డాలర్లు, అంతకంటే అధికంగా ఉందని చెప్పారు. మన దేశంలో ప్రవేశపెడితే ధర ఎంతనేది తెలుస్తుందని పేర్కొన్నారు. ఇక ఇండియా మొబైల్ కాంగ్రెస్ వేదికగా యూటెల్‌శాట్ వన్‌వెబ్ తన సత్తాను ప్రదర్శించిందని.. ఆ సంస్థతో చేతులు కలిపేందుకు భారత సైన్యం ముందుకు వచ్చిందని వెల్లడించారు.

రెండు సంస్థలకు లైసెన్స్.. మరొకటి వెయిటింగ్..

శాట్‌కామ్ సేవలు భారత్‌లో అందించాలంటే కంపెనీలకు 'గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్ బై శాటిలైట్ (జీఎంపీసీఎస్)' లైసెన్స్, 'ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్–ఆథరైజేషన్ సెంటర్ (ఇన్‌స్పేస్)' లైసెన్స్ ఉండటం తప్పనిసరి. ప్రస్తుతం కేంద్రం నుంచి వన్‌వెబ్ ఇండియా కమ్యూనికేషన్స్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ సంస్థలు శాటిలైట్ కమ్యూనికేషన్స్ లైసెన్స్ దక్కించుకున్నాయి. వన్‌వెబ్ ఇండియా.. యూటెల్‌శాట్ భాగస్వామ్యంతో భారతీ ఎయిర్‌టెల్ ప్రమోట్ చేయగా... లక్సెంబర్గ్‌కు చెందిన ఎస్ఈఎస్ సంస్థతో రిలయన్స్ జియో చేతులు కలిపి.. జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్‌ను ప్రమోట్ చేస్తోంది. ఇప్పటికే పలు దేశాల్లో సేవలు అందిస్తున్న యూటెల్‌శాట్ వన్‌వెబ్ గుజరాత్, తమిళనాడులో బేస్ స్టేషన్లను ఏర్పాటు చేసిందని, అనుమతులు రాగానే సేవలు ప్రారంభిస్తామని భారతీ ఎంటర్‌ప్రైజెస్ వైస్ చైర్మన్ రాజన్ భారతీ మిత్తల్ ఇటీవలే ప్రకటించారు. ఇక జియో–ఎస్ఈఎస్‌కు సైతం భారత్‌లో రెండు ప్రాంతాల్లో బేస్ స్టేషన్స్ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ రంగంలో టాప్‌లో ఉన్న స్టార్‌లింక్ సంస్థ 100కుపైగా దేశాల్లో ఇప్పటికే సర్వీసులు ప్రారంభించింది. భారత్‌లో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంది. అమెజాన్‌కు చెందిన కైపర్ కూడా ఇక్కడ అడుగుపెట్టే అవకాశాలు ఉన్నాయి.

ఎవరి సామర్థ్యం వారిదే..

తమకు భూమిచుట్టూ కక్ష్యలో 6,900కుపైగా ఇంటర్నెట్ ఉపగ్రహాలు ఉన్నాయని స్టార్‌లింక్ చెబుతోంది. యూటెల్‌శాట్ వన్‌వెబ్ ఖాతాలోని ఉపగ్రహాల సంఖ్య 635కుపై మాటే. ఇక ప్రపంచ జనాభాలో 99 శాతం మందికి వీడియో, డేటా సేవలను అందించగలిగేలా రెండు వేర్వేరు కక్ష్యలలో పనిచేస్తున్న దాదాపు 70 ఉపగ్రహాలను కలిగి ఉన్నట్టు ఎస్ఈఎస్ సంస్థ తెలిపింది. 100 కోట్లకుపైగా టీవీ వ్యూయర్స్, టాప్–10 గ్లోబల్ టెలికం కంపెనీల్లో ఏడింటికి, ప్రపంచంలోని ఆరు ప్రధాన క్రూజ్ లైన్స్‌లో ఐదింటికి తాము సేవలు అందిస్తున్నట్టు వెల్లడించింది.

వైఫై తరహాలో సేవలు..

శాటిలైట్ నుంచి సిగ్నల్స్ అందుకోవడానికి చిన్న యాంటెన్నా ఏర్పాటు చేస్తారు. ఆ యాంటెన్నా వైఫై జోన్ మాదిరిగా పని చేస్తుంది. దాని ద్వారా కాల్స్, ఎస్సెమ్మెస్‌లు చేసుకోవచ్చు. సాధారణ ఫోన్లు వాడేవారి నుంచి కాల్స్ అందుకోవాలంటే.. సంబంధిత సంస్థకు బేస్‌స్టేషన్ ఉండాలి. సాధారణ కస్టమర్ కాల్ చేస్తే ఆ బేస్‌స్టేషన్ ద్వారా శాటిలైట్‌కు, అక్కడి నుంచి యాంటెన్నా పరిధిలో ఉన్న వినియోగదారులకు కనెక్ట్ అవుతుంది. సాధారణ కాల్స్, సందేశాలకు మాత్రమే శాటిలైట్ ఆధారిత టెలికం సేవలు ఉపయుక్తం. 4జీ, కేబుల్ బ్రాడ్‌బ్యాండ్ మాదిరి వేగంగా డేటాను అందుకునే అవకాశం తక్కువ.

ప్రభుత్వమే స్పెక్ట్రమ్ కేటాయించి..

శాటిలైట్ టెలికం బేస్‌స్టేషన్ పనిచేయాలంటే ప్రత్యేక స్పెక్ట్రమ్ (తరంగ దైర్ఘ్యం) కేటాయింపులు అవసరం. లైసెన్స్ పొందిన కంపెనీలకు ప్రభుత్వం ఇంకా దీనిని కేటాయించలేదు. శాటిలైట్ సేవల కోసం ప్రభుత్వం స్పెక్ట్రమ్ కేటాయిస్తుంది (అడ్మినిస్ట్రేటివ్ అలకేషన్). దీనిని అన్ని కంపెనీలు పంచుకోవాల్సి ఉంటుంది. అలాకాకుండా రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు స్పెక్ట్రమ్ వేలం వేయాలని ప్రతిపాదించాయి. విదేశీ సంస్థలు స్టార్‌లింక్, ప్రాజెక్ట్ కైపర్‌లు మాత్రం అడ్మినిస్ట్రేటివ్ కేటాయింపుల విధానం అమలు చేయాలని కోరాయి. బ్రెజిల్ గతంలో స్పెక్ట్రమ్ వేలం వేసి విఫలమై ప్రస్తుతం అడ్మినిస్ట్రేటివ్ మార్గాన్ని ఎంచుకుందని వివరిస్తున్నాయి. దీనితో మన దేశం కూడా అడ్మినిస్ట్రేటివ్ మార్గం అనుసరించాలని నిర్ణయించింది.

కొన్ని ఫోన్ మోడల్స్‌లోనే అందుబాటులో..

శాటిలైట్ ఆధారిత టెలికం సేవలు అందుకోవాలంటే మొబైల్ ఫోన్‌లో ప్రత్యేక ఏర్పాటు తప్పనిసరి. యాపిల్ తయారీ ఐఫోన్–14, ఆ తర్వాతి మోడళ్లు శాటిలైట్ కనెక్టివిటీని సపోర్ట్ చేస్తాయి. గూగుల్ పిక్సెల్ 9 సిరీస్, సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25 ఈ వరుసలో ఉన్నాయి. ఇవేగాక ప్రత్యేక శాటిలైట్ ఫోన్స్ కూడా లభిస్తాయి. ఇరీడియం 9555, ఇన్‌మాశాట్ ఐశాట్ ఫోన్ 2, థురాయో ఎక్స్‌టీ–లైట్, గ్లోబల్ స్టార్ జీఎస్‌పీ–1700 మోడళ్లను ఎయిర్‌టెల్ విక్రయిస్తోంది. వీటి ధరలు రూ.70 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ఉన్నాయి. పోస్ట్ పెయిడ్ ప్లాన్ల ధర రూ.1,500 నుంచి ప్రారంభమవుతుంది. పరిమితి దాటితే ప్రతి నిమిషానికి అదనంగా చార్జీ చెల్లించాల్సి ఉంటుంది.


శాట్‌కామ్ అంటే..

శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలు (శాట్‌కామ్) డేటా, వాయిస్‌ను ప్రసారానికి, స్వీకరణకు ఉపగ్రహాలపై ఆధారపడతాయి. అదే మామూలు టెలికం సేవలు ఫైబర్ ఆప్టిక్స్, ఇతర కేబుళ్లపై ఆధారపడతాయి. శాట్‌కామ్ సేవలకు ఇటువంటి మౌలిక సదుపాయాల అవసరం లేదు. భారత్‌లో సాధారణ నెట్‌వర్క్ 98 శాతం భూభాగంలో విస్తరించి ఉంది. అయితే ఈ సంప్రదాయ నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేయడం ఆర్థికంగా, లాభపరంగా సాధ్యంకాని కొండలు, గుట్టలు, అడవులు, మారుమూల ప్రాంతాల్లో శాట్‌కామ్ సేవలు ప్రయోజనకరంగా ఉంటాయి. అత్యవసర పరిస్థితులు, తీవ్ర వాతావరణ పరిస్థితులలో కూడా ఇవి పనిచేయగలవు.

క్లుప్తంగా...

వక్ఫ్ బోర్డుకు పూర్తిస్థాయి సీఈవో భర్తీ ఎప్పుడు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు పూర్తిస్థాయి సీఈవోను ఎప్పుడు నియమిస్తారని ప్రభుత్వాన్ని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. ఎండీ అసదుల్లాను వెంటనే తొలగించాలన్న సింగిల్ జడ్జి ఆదేశాలను సస్పెన్షన్‌లో ఉంచింది. ప్రభుత్వం అసదుల్లాను వక్ఫ్ బోర్డు సీఈవోగా ఏడాదిపాటు డిప్యుటేషన్‌పై మాత్రమే నియమించిందని, వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 23 ప్రకారమే నియామకం జరిగిందని వ్యాఖ్యానించింది. అసదుల్లాను సీఈవో పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం సమర్థనీయం కాదంటూ సింగిల్ జడ్జి తీర్పును తప్పుబట్టింది. తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేసింది. గోల్కొండ ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్బర్ దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై గత నెలలో సింగిల్ జడ్జి విచారణ చేపట్టి తీర్పునిచ్చారు. అసదుల్లాను తక్షణమే తొలగించాలని ప్రభుత్వాన్ని, వక్ఫ్ బోర్డును ఆదేశించారు. ఇన్‌చార్జి సీఈవోగా షేక్ లియాకత్ హుస్సేన్‌ను కొనసాగించవచ్చన్నారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ ఈ.తిరుమలాదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఏ.సుదర్శన్‌రెడ్డి హాజరై వాదనలు వినిపించారు. పూర్తి స్థాయి సీఈవో నియామకంపై త్వరలో నిర్ణయం తీసుకుని ధర్మాసనానికి వెల్లడిస్తామన్నారు.

ఎస్‌బీఐకి రూ.30.71 కోట్ల విలువైన ఆస్తుల అప్పగింత

శీతల్ రిఫైనరీస్ జప్తు ఆస్తుల నుంచి చెల్లించేలా ఈడీ చొరవ

సాక్షి, హైదరాబాద్: ఫోర్జరీ డాక్యుమెంట్లతో బ్యాంకులను మోసగించి రుణాలు తీసుకుని, ఎగవేసిన శీతల్ రిఫైనరీస్ లిమిటెడ్ జప్తు ఆస్తుల నుంచి ఎస్‌బీఐకి రూ.30.71 కోట్ల విలువైన ఆస్తులు తిరిగి అప్పగించే ప్రక్రియలో ఈడీ అధికారులు విజయం సాధించారు. ఈడీ అధికారుల చొరవతో సదరు స్థిరాస్తుల విడుదల కోసం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ప్రత్యేక కోర్టు (మనీలాండరింగ్ నిరోధక చట్టం)లో ఎస్‌బీఐ చేసుకున్న దరఖాస్తును కోర్టు అనుమతించింది. ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకుల నుంచి తప్పుడు ధ్రువపత్రాలతో పలు దఫాల్లో శీతల్ రిఫైనరీస్ లిమిటెడ్ రుణాలు తీసుకుంది. వాటిని తిరిగి చెల్లించకపోవడంతో ఎస్‌బీఐకి రూ.136.28 కోట్లు, పీఎన్‌బీకి రూ.53.82 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఈ మొత్తం కుంభకోణంలో మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఈడీ శీతల్ రిఫైనరీస్‌కు చెందిన రూ.52.77 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు ఎస్‌బీఐ బ్యాంకు రుణాల ఎగవేతకు సంబంధించిన ఆధారాలు సేకరించారు. వీటి ఆధారంగా ఎస్‌బీఐ అధికారులు కోర్టులో ప్రజా ప్రయోజనం దృష్ట్యా సరైన హక్కుదారునికి, అంటే ఎస్‌బీఐకి శీతల్ రిఫైనరీస్ సంస్థ జప్తు ఆస్తులను విడుదల చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు కోర్టు అనుమతించినట్టు ఈడీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇప్పటికిప్పుడు బీసీ కోటా అసాధ్యం!

పార్లమెంట్‌లో ఆమోదం పొందాకే 42% రిజర్వేషన్ల అమలు

- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- మార్చి తొలివారంలో రిజర్వేషన్లపై తీర్మానం చేసి కేంద్రానికి పంపుతాం
- పార్లమెంట్‌లో ఆమోదింపజేసే బాధ్యతను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలి
- రాహుల్‌గాంధీ నా బాస్.. ఆయన మాట తప్ప వేరెవరినీ లెక్క చేయనని వ్యాఖ్య
- ప్రధాని కులంపై ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని వివరణ



ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో ఇప్పటికిప్పుడు బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు పార్లమెంట్ ఆమోదం తప్పనిసరని, వచ్చే నెల తొలివారంలో అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే బాధ్యతను రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ బాధ్యత తీసుకోవాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో సమగ్రంగా కులగణన చేపట్టామని, అది దేశానికే ఒక రోడ్ మ్యాప్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. కులగణనలో సేకరించిన వివరాల ఆధారంగానే కమిషన్ లేదా అధికారులతో కమిటీ వేసి భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి.. అనంతరం అక్కడి తుగ్లక్ రోడ్డులోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే...

''మేం చేపట్టిన కులగణనలో బీసీలు ఆరు శాతం పెరిగారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వేలో 4 కేటగిరీలు మాత్రమే చూపారు. అందులో బీసీలు 51 శాతం, ఎస్సీలు 18 శాతం, ఎస్టీలు 10 శాతంకాగా.. మిగతా వాళ్లను ఓసీలుగా చూపారు. మేం చేసిన సర్వేలో మొత్తం ఐదు కేటగిరీలుగా విభజించాం. మా సర్వే ప్రకారం హిందూ, ముస్లిం బీసీలంతా కలిసి 56 శాతం ఉన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం తీసుకొచ్చి, పార్లమెంట్ ఆమోదానికి పంపిస్తాం. కేసీఆర్ సర్వేలో ఎస్సీల్లో 82 కులాలున్నాయని చెప్పారు. కానీ ఉన్నవి 59 కులాలే. స్పెల్లింగ్ తప్పుగా ఎంట్రీ అయినా దాన్ని మరో కులంగా చూపారు. లేని కులాలను ఇప్పుడు చూపెట్టాలంటే నేను ఎక్కడి నుంచి తేవాలి? ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసిన నేను పట్టించుకోను.

ప్రధానిపై తప్పుడు వ్యాఖ్యలు చేయలేదు..

1994లో ప్రధాని మోదీ లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని నేను చెప్పాను. నేను చేసిన వ్యాఖ్యలను కూడా అంగీకరించాను. కాకపోతే తేదీ, సమయం విషయంలో కొంత తేడా వచ్చింది. కిషన్‌రెడ్డి చెప్పింది నేను అంగీకరిస్తున్నా.. ప్రధానిపై తప్పుడు వ్యాఖ్యలు చేయలేదు. ఆయన హోదాను తగ్గించలేదు. అగౌరవపరిచే విధంగా మాట్లాడలేదు.

ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం..

పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఎలా వస్తుందో చూడాల్సి ఉందని.. ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను పాటిస్తామని రేవంత్ చెప్పారు. కేటీఆర్ తానే కోర్టు అన్నట్టుగా మాట్లాడుతున్నారని, కోర్టు తీర్పు రాకముందే తీర్పులు ఇచ్చేస్తున్నారని విమర్శించారు. న్యాయ ప్రక్రియకు లోబడే ఈ విషయంలో ముందుకు వెళతామని తెలిపారు. అయితే దానం నాగేందర్ ఒక పార్టీలో గెలిచి మరో పార్టీ గుర్తుపై పోటీచేసిన రుజువులున్నాయి కదా అని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా... 'గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఏ పార్టీలో గెలిచారు? ఏ పార్టీలో మంత్రులుగా పనిచేశారు? నేను ఈ అంశంపై ఫిర్యాదులు చేసినా ఏం జరిగింది?' అని రేవంత్ పేర్కొన్నారు.

రాహుల్ గాంధీయే నా బాస్..

కాంగ్రెస్ సీఎంగా నేను ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచన మేరకు నడుచుకుంటా. ఆయన మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తా. ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు, ఫిర్యాదులు చేసినా పట్టించుకోను. కేవలం రాహుల్ గాంధే నా బాస్. ఆయన చెప్పినట్టు నడుచుకుంటా. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ నాపై అనేక ఫిర్యాదులు, విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. రాహుల్ ఆదేశాల మేరకు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం ఏర్పాటు చేశాం. పీసీసీ, మంత్రివర్గ విస్తరణ అంశాల్లో కొందరు నాపై అబద్ధపు ప్రచారాలు, ఊహాగానాలు వ్యాప్తిచేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు..'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా సంత్ సేవాలాల్ మహరాజ్ నిలిచారని కొనియాడారు.

జీసీసీల్లో తెలంగాణ యువతకు ఉద్యోగాలు

బీటెక్ పట్టభద్రులకు నైపుణ్య శిక్షణ కోర్సు: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు తెలంగాణ కేంద్రంగా మారుతున్న నేపథ్యంలో యువతకు ఉద్యోగావకాశాలు దక్కేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 355 జీసీసీల్లో మూడు లక్షల మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్‌లో అనువైన వాతావరణం ఉండటంతో దిగ్గజ కంపెనీలు కొత్తగా తమ జీసీసీలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. 'ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా రంగాల్లో (బీఎఫ్ఎస్ఐ) జీసీసీల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నైపుణ్య శిక్షణపై దృష్టి సారిస్తున్నాం' అని శ్రీధర్‌బాబు చెప్పారు.

స్కిల్స్ వర్సిటీ ద్వారా శిక్షణ: 'బీఎఫ్ఎస్ఐ కన్సార్టియం సహకారంతో స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా జీసీసీల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. దీని కోసం ప్రత్యేకంగా 'బీఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్' పేరిట శిక్షణ కార్యక్రమం ప్రారంభించాం. బీటెక్ పట్టభద్రులకు నాలుగు నెలలపాటు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ మార్కెట్స్, బీమా, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌పై శిక్షణ ఇస్తాం. వీటితోపాటు సాఫ్ట్‌వేర్, ప్రోగ్రామింగ్, అప్లికేషన్ అండ్ డేటాబేస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. శిక్షణను పూర్తి చేసిన అభ్యర్థులు ప్లేస్‌మెంట్స్ పొందేలా సహకరిస్తాం. కోర్సు కోసం ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా కేవలం సర్టిఫికెట్, అడ్మినిస్ట్రేటివ్ అవసరాల కోసం రూ.5వేలు చెల్లించాలి' అని శ్రీధర్‌బాబు చెప్పారు.

కమిటీ లేదా కమిషన్!

▶ మొదటి పేజీ తరువాయి

భేటీ అయ్యారు. సుమారు గంట పాటు చర్చించారు. రాష్ట్రంలో కులగణన నిర్వహించిన తీరు, అసెంబ్లీ ఆమోదం, చట్టబద్ధత కల్పించే దిశగా ప్రణాళికలు, బహిరంగ సభ తదితర అంశాలను రాహుల్‌కు రేవంత్ వివరించారు. కచ్చితత్వంతో, పారదర్శకంగా కులగణన నిర్వహించామని, బీసీల జనాభా గతం కన్నా 6% మేర పెరిగిందని తెలిపారు. 42% బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంట్ ఆమోదానికి పంపిస్తామని.. త్వరగా ఆమోదించేలా బీజేపీపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. దీనిపై రాహుల్‌గాంధీ స్పందిస్తూ.. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికే దిక్సూచిలా ఉండాలని, సామాజిక న్యాయంలో రాష్ట్రం దేశానికే మార్గదర్శి కావాలని సూచించారని తెలిసింది. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే దిశగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని సమాచారం. పార్టీ, ప్రభుత్వ పదవులతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సామాజిక న్యాయ అంశానికి ప్రాధాన్యత నిచ్చి బలహీన వర్గాలకు రాజకీయ న్యాయం చేయాలని రాహుల్ సూచించారని తెలిసింది.

ఎస్సీ వర్గీకరణపై చట్టం..: ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో బిల్లుపెట్టి, చట్టం చేస్తామని, ఆ తర్వాత బహిరంగ సభ పెడతామని రాహుల్‌తో రేవంత్ చెప్పినట్లు తెలిసింది. ఏకసభ్య కమిషన్ నివేదికను యథాతథంగా అమలు చేస్తామన్నట్లు సమాచారం. ఇక కులగణన డిమాండ్‌తో దేశవ్యాప్త ఉద్యమం చేయాలని, ఇందుకోసం ఇండియా కూటమి పక్షాలను కలుపుకొని పోవాలని ఈ భేటీలో నిర్ణయించారని తెలిసింది. ఇండియా కూటమి ఎంపీల ఆధ్వర్యంలో పార్లమెంటులో ఆందోళన చేపట్టాలని తీర్మానించారని సమాచారం. ఇండియా కూటమి ఆధ్వర్యంలో సభ నిర్వహించే అంశంలో కూటమి పార్టీల ముఖ్యమంత్రులతో సమన్వయం చేసే బాధ్యతలను రేవంత్‌కు రాహుల్ గాంధీ అప్పగించారని తెలిసింది.

ప్రతిపక్షాలు కాచుకుని ఉన్నాయి..: ఇటీవలి ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీ, విపక్షాల విమర్శలు వంటి అంశాలూ ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చాయి. విపక్షాలు దూకుడుగా ఉన్నాయని, చిన్న అవకాశం దొరికినా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తాయని, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని రాహుల్ సూచించారని సమాచారం. అందరితో సమన్వయం మొదలు ప్రభుత్వ పథకాల అమలు, కీలక నియామకాల వరకు అధిష్టానం ఆదేశాల మేరకు నడుచుకుంటానని రేవంత్ పేర్కొన్నట్టు సమాచారం.

రాజధానిలో ఘోరం

▶ మొదటి పేజీ తరువాయి



ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తోసుకుంటూ రైల్లోకి ఎక్కుతున్న ప్రయాణికులు

ప్రకటన వెల్లడి కాలేదు. అయితే ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాల్సిన రెండు రైళ్లు ఆలస్యంగా రావడంతో అప్పటికే వేచిఉన్న భక్తులు త్వరగా ఎక్కేందుకు ప్రయత్నించడం, కిక్కిరిసిన జనం కారణంగా తొక్కిసలాట జరిగినట్టు వార్తలొచ్చాయి. ఊపిరాడక స్పృహ తప్పిన కొందరిని సమీప ఆస్పత్రులకు తరలించారు. దాదాపు 12 మందిని లోక్‌నాయక్ జైప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చినట్టు ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ చెప్పారు. ఘటనపై రైల్వే డీసీపీ కేపీఎస్ మల్హోత్రా ట్లాడారు. ''14వ నంబర్ ప్లాట్‌ఫామ్ ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగి ఉన్నప్పుడు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు అక్కడ వేచి ఉన్నారు. అదే సమయానికి రావాల్సిన స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లు ఆలస్యంగా నడుస్తున్నాయి. వాటిని ఎక్కాల్సిన ప్రయాణికులు 12, 13, 14వ నంబర్ ప్లాట్‌ఫామ్‌లపై వేచి ఉన్నారు. దీంతో ప్లాట్‌ఫామ్‌లపై జనం ఊహించనంతగా పెరిగిపోయి చివరకు 14వ నంబర్ ప్లాట్‌ఫామ్, 16వ నంబర్ ప్లాట్‌ఫామ్ ఎస్కలేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. కమర్షియల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్పెక్టర్(సీఎంఐ) తెలిపిన వివరాల ప్రకారం రైల్వేస్ ప్రతి గంటకు 1,500 టికెట్లు విక్రయించింది. ఊహించనంతగా ప్రయాణికులు వచ్చారు. అందుకే పరిస్థితి అదుపు తప్పింది'' అని డీసీపీ మల్హోత్రా చెప్పారు. ఘటనపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పరిస్థితి ఇప్పుడు అదుపులోనే ఉంది. ఘటనాస్థలికి వెంటనే రైల్వే పోలీస్, ఢిల్లీ పోలీస్, సీఆర్‌పీఎఫ్ బలగాలు వెంటనే చేరుకున్నాయి. వారాంతం కావడంతో అధికంగా వచ్చిన భక్తుల రాకపోకల కోసం అదనపు రైళ్లను నడుపుతున్నాం'' అని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు.

గ్రీన్ సిటీగా ఫ్యూచర్ సిటీ: భట్టి




తెలంగాణ గ్రీన్ సమ్మిట్ 2025లో బ్రోచర్‌ను విడుదల చేసిన ఉపముఖ్యమంత్రి భట్టి

మాదాపూర్ (హైదరాబాద్): ముచ్చెర్ల సమీపంలోని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మా ఫ్యూచర్‌సిటీ ఐజీబీసీ గ్రీన్ అండ్ సస్టైనబుల్ ప్రమాణాలతో చేపట్టామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రీన్ తెలంగాణ సమ్మిట్–2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ వెయ్యి ఐజీబీసీ రిజిస్టర్డ్ గ్రీన్, నెట్‌జీరో ప్రాజెక్టుల మైలురాయిని దాటిందని తెలిపారు. ఈ మైలురాయి ప్రాజెక్టులలో రైల్‌నిలయం, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, క్యాప్ జెమిని హైదరాబాద్, జెన్‌పాక్ట్ ఉప్పల్, అపర్ణవన్, రెయిన్‌ట్రీ విస్టాస్ రాక్‌గార్డెన్ తదితర నిర్మాణాలు ఉన్నాయన్నారు. తెలంగాణ యంగ్ స్టేట్ అని, వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని చెప్పారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని తీసుకువచ్చే విధంగా ప్రణాళికలను తయారు చేసినట్టు తెలిపారు. రూ.10 వేల కోట్లు నగరాభివృద్ధికి కావాల్సిన అన్ని రకాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం కేటాయించినట్టు తెలిపారు. రాష్ట్రంలో బిల్డర్లకు, పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.

గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు.. సమీక్షలో మంత్రి ఉత్తమ్ హెచ్చరిక
- రాజస్తాన్‌లో జరిగే సదస్సు కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి



సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులనుఆదేశించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నీటిపారుదల శాఖపై శనివారం ఆయన జలసౌధలో సమీక్షించారు. రాజస్తాన్‌లో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న అఖిల భారత నీటిపారుదల శాఖ మంత్రుల సదస్సుకు రాష్ట్ర సాగునీటి రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, డిజిటల్ మానిటరింగ్ వంటి అంశాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలన్నారు. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సు కేంద్ర ప్రభుత్వ విధానకర్తలు, నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురానుందన్నారు. నీటి నిర్వహణ, నిల్వల పెంపుదల, సాగునీటి సామర్థ్యం పెంపు వంటి అంశాలు ఈ సదస్సులో చర్చకు వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అవలంబిస్తున్న సూక్ష్మ సేద్యం, జలాశయాల్లో పూడికతీత, తక్కువ వ్యయంతో అధిక ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అమలు చేస్తున్న ప్రణాళిక, నదుల పరిరక్షణ వంటి విధానాలను జాతీయ వేదికపైకి తెలియజేయాల్సిన అవసరముందని చెప్పారు. సదస్సులో రాష్ట్రం తరఫున ఏర్పాటు చేయనున్న ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడానికి గణాంకాలు, కేస్ స్టడీస్‌తో దృశ్యరూపాలను సిద్ధం చేయాలన్నారు. ఈ జాతీయ సదస్సులో తెలంగాణ నీటి పారుదల వ్యూహాన్ని దేశవ్యాప్తంగా ప్రదర్శించేందుకు గొప్ప వేదిక కానున్నట్టు ఉత్తమ్ చెప్పారు. గత ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేసినా పరిమిత ఫలితాలనే సాధించిందని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ, డిండి, పాలమూరు–రంగారెడ్డి, దేవాదుల తదితర ప్రాజెక్టుల పురోగతిపై అధికారులు ఈ సమావేశంలో మంత్రికి నివేదిక సమర్పించారు.





ఘల్లు.. ఘల్లు..
గజ్జెల గొల్లగట్టు

నేటి నుంచే దురాజ్‌పల్లి లింగమంతుల జాతర

ఐదురోజులు జరిగే ఈ వేడుకకు 20 లక్షలకుపైగా భక్తులు వస్తారని అంచనా

లింగా.. ఓ లింగా అంటూ శివ నామస్మరణతో మార్మోగిపోయే దురాజ్‌పల్లి లింగమంతులస్వామి జాతర (పెద్దగట్టు జాతర) ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. మేడారం తర్వాత ఎక్కువమంది భక్తులు హాజరయ్యే రెండో అతిపెద్ద జాతర ఇదే. యాదవుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న ఈ లింగమంతుల జాతరను ప్రతి రెండేళ్లకోసారి నిర్వహిస్తారు. మాఘమాసంలో తొలి ఆదివారం ప్రారంభమై 5 రోజులపాటు సాగుతుంది. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతర కనుల పండువగా జరగనుంది. తెలంగాణలోని అన్ని జిల్లాలతోపాటు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు తరలివస్తారు. ఈసారి జాతరకు 20 లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- సాక్షి ప్రతినిధి, నల్లగొండ

ఒక్కో రోజు ఒక్కో విశిష్టత..

ఆదివారం రాత్రి గంపల ప్రదక్షిణతో సూర్యాపేట మండలం కేసారం నుంచి దేవరపెట్టెను తీసుకురావడంతో లింగమంతుల స్వామి జాతర ప్రారంభమవుతుంది. ఐదోరోజు ఊరేగింపుతో దేవరపెట్టెను కేసారానికి తీసుకెళ్లడంతో జాతర ముగుస్తుంది. అక్కడి నుంచి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చీకటాయపాలెంలోని బైకాన్ల ఇళ్లలో దేవరపెట్టె భద్రపరుస్తారు. మళ్లీ రెండేళ్ల తర్వాత జాతరకు నెల రోజుల ముందు దీనిని చీకటాయపాలెం నుంచి కేసారం తీసుకొస్తారు.

1 జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం గంపల ప్రదక్షిణ. ఆదివారం కేసారం నుంచి చౌడమ్మతల్లి ఉన్న దేవరపెట్టెను రెడ్డిగొల్ల కులస్తులు కాలినడకన బయలుదేరి దురాజ్‌పల్లిలో ఉన్న గొల్లగట్టు (పెద్దగట్టు)కు చేరుకుంటారు. ఈ సందర్భంగా గజ్జెల లాగులు ధరించి భేరీ చప్పుళ్లు, కత్తుల విన్యాసాలు చేస్తూ ఓ లింగా.. ఓలింగా నామస్మరణతో గంపలతో ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తారు. మెంతబోయిన, రెడ్డిగొల్ల, మున్న వారి సమక్షంలో రెండు బోనాలు చేసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం రాజులు, పూజార్ల (గొల్ల కులస్తులు) అవసరాలు (కత్తులను కడుపునకు అంటుకోవడం) పెడతారు.

2 సోమవారం చౌడమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తారు. మెంతబోయిన వంశస్తులు తెచ్చిన తొలి గొర్రె (తల్లి గొర్రె), మున్న వంశీయులు తెచ్చిన బద్దెపాల గొర్రె, రెడ్డిగొల్ల వంశీయులు తెచ్చిన వర్ధ గొర్రెను అమ్మవారి ముందు జడత పడతారు. అనంతరం మున్న వంశీయులు ఉపవాసం ఉండి నిష్ఠతో తెచ్చిన బద్దెపాల గొర్రెను అమ్మవారికి బలి ఇస్తారు. అనంతరం గొర్రె ఆయాలు సాయాలు (పేగులు, లివర్, కిడ్నీలు, నల్లెడ, గుండె, మాంసం) నెయ్యిలో వేసి వంట చేస్తారు. చౌడమ్మతల్లికి గొర్రె అవసరాలు పెట్టి పూజిస్తారు. మెంతబోయిన వారు జాగిలాలుగా వ్యవహరిస్తూ, వారి మెడలో కండువాలు ఉంచి మున్న వంశీయులు పట్టుకోగా, బండపై పోసిన అన్నాన్ని మెంతబోయిన వారు తింటారు.

3 మంగళవారం స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా చంద్రపట్నం వేస్తారు. మెంతబోయిన వారు తీసుకొచ్చిన పూజాసామగ్రి, తెల్లపిండి, పచ్చపిండి, పసుపు, కుంకుమలతో చంద్రపట్నం వేస్తారు. చెక్కపై పసుపు, కుంకుమలు వేసి అందంగా పట్నం వేస్తారు. అనంతరం యాదవ వంశీయులు స్వామివారి కల్యాణం జరిపిస్తారు. దీంతో చంద్రపట్నం, స్వామివారి కల్యాణం తంతు ముగుస్తుంది. ఈ సందర్భంలో రాజులు, పూజారులు, బైకాన్లు కథలు చెబుతారు.

4 బుధవారం జరిగే కార్యక్రమం నెలవారం. కేసారం నుంచి పాలు తీసుకొచ్చి రెండు కొత్త బోనం కుండల్లో పొంగిస్తారు. అనంతరం మున్నవారి గొర్రెను బలి ఇస్తారు. ఈ సందర్భంగా బైకాన్లు, బక్కులు కథలు చెప్పడం ద్వారా తంతు పూర్తి చేస్తారు. బలి ఇచ్చిన గొర్రెను బైకాన్లకు సగం, మెంతబోయిన వారికి సగం ఇస్తారు. అనంతరం ఆయా వంశీయులు ఆ మాంసాన్ని వండుకొని తినడం ఆనవాయితీ.

5 గురువారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. జాతర తంతు పూర్తయిన తర్వాత భక్తులు తుదిసారిగా మొక్కులు చెల్లించి ఇంటికి బయలుదేరుతారు. దీంతో జాతర ముగుస్తుంది.

వాహనాల మళ్లింపు ఇలా

సూర్యాపేట టౌన్: పెద్దగట్టు జాతర నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామునుంచి వాహనాల మళ్లింపు కోసం పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రద్దీ తగ్గే వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి.

- హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద మళ్లించి నల్లగొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ మీదుగా విజయవాడకు పంపిస్తారు.
- విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను కోదాడ వద్ద మళ్లించి హుజూర్‌నగర్, నేరేడుచర్ల, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి మీదుగా పంపిస్తారు.
- హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలను టేకుమట్ల వద్ద జాతీయ రహదారి 365 మీదుగా మళ్లించనున్నారు.
- కోదాడ నుంచి సూర్యాపేటకు వెళ్లే వాహనాలు కోదాడ, మునగాల, గుంపుల మీదుగా ఎస్సారెస్పీ కెనాల్ నుంచి బీబీగూడెం వద్ద నుంచి సూర్యాపేటకు వస్తాయి.
- సూర్యాపేట నుంచి కోదాడ వెళ్లే వాహనాలు కుడకుడ, ఐలాపురం వద్ద గల ఖమ్మం జాతీయ రహదారి మీదుగా రాఘవపురం స్టేజీ నుంచి నామవరం గ్రామం మీదుగా జాతీయ రహదారి 65పై గుంజలూరు స్టేజీ వరకు మళ్లించి కోదాడ, విజయవాడ వైపు పంపిస్తారు.

నేటి నుంచి మళ్లీ కులగణన

- గత సర్వేలో పాల్గొననివారి వివరాలు నమోదు
- టోల్ ఫ్రీ నంబర్ 040-211 11111 ఏర్పాటు
- ఈ నంబర్‌కు ఫోన్‌చేస్తే ఇంటివద్దకు ఎన్యూమరేటర్లు
- 28వ తేదీ వరకు వివరాల సేకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నేటి నుంచి మరోమారు కులగణన జరగనుంది. గత ఏడాది నవంబర్ 6 నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో పాల్గొననివారి వివరాలను నమోదు చేసేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెల 28 వరకు సర్వే నిర్వహిస్తారు. గత సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 3,56,323 (3.1 శాతం) మంది వివరాలు నమోదు చేసుకోలేదని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. తాజా సర్వేలో వీరి వివరాలు సేకరించనున్నారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 040-211 11111ను ఏర్పాటు చేశారు. ఈ నంబర్‌కు ఫోన్ చేసిన వారి ఇళ్లకు ఎన్యూమరేటర్లు వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటారని అధికారులు తెలిపారు. ఎంపీడీవో, వార్డు కార్యాలయాలకు వెళ్లి కూడా ప్రజలు స్వచ్ఛందంగా తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు.

చిన్నారికి కేసీఆర్‌తో అక్షరాభ్యాసం


చిన్నారితో అక్షరాలు దిద్దిస్తున్న కేసీఆర్

ములుగు(గజ్వేల్): సిద్దిపేట జిల్లా ములుగు మండలం శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం సోషల్ మీడియా ఇన్‌చార్జి కొమ్ము నవీన్‌కుమార్.. శనివారం తన కొడుకు రోహన్‌తేజ్ అక్షరాభ్యాసాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జరిపించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారితో కేసీఆర్ అక్షరాలు దిద్దించారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆశీర్వదించారు.

ఇద్దరు ఏఐసీసీ సభ్యులపై కేసు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: కేరళ, ఢిల్లీలకు చెందిన ఏఐసీసీ సభ్యులు పి.విష్ణువర్ధన్, మన్సూర్ అలీఖాన్‌లపై సికింద్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసును హైకోర్టు కొట్టివేసింది. 2023, నవంబర్ 22న రాత్రి 11 గంటల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కోట నీలిమ ఆధ్వర్యంలో.. విష్ణువర్ధన్, మన్సూర్ అలీ ఖాన్‌తో పాటు 100 మంది సికింద్రాబాద్ పరిధిలో ధర్నా నిర్వహించారు. అనుమతి లేకుండా రోడ్డుపై బైఠాయించి బీఆర్ఎస్ నేతలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ విష్ణువర్ధన్, మన్సూర్ అలీఖాన్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రాన్ని దివాలా తీయించారు

- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ.10 లక్షల కోట్ల అప్పు చేశాయి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్: తెలంగాణ ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు దివాలా తీయించాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ పార్టీల ప్రభుత్వాలు రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాయన్నారు. శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఆయన పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డితో కలసి విలేకరులతో మాట్లాడారు. కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చామో ఎక్కడ ఖర్చు చేశామో చర్చకు తాము సిద్ధమని, మీరు ఎన్ని హామీలు నెరవేర్చారో చర్చకు వస్తారా? అని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ప్రధాని మోదీ సామాజికవర్గంపై ఇష్టానుసారంగా మాట్లాడటం తగదన్నారు. 1994 జూలై 25న గుజరాత్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.. మోదీ సామాజిక వర్గాన్ని బీసీ కులాల్లో చేర్చిందని చెప్పారు.

మోదీది ఏ కులం, రాహుల్‌ది ఏ మతం..

- చర్చకు సిద్ధమేనా?.. ఇదే రెఫరెండంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు వెళదామా?
- కాంగ్రెస్ పార్టీకి కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీది ఏ కులం, రాహుల్ గాంధీది ఏ మతం? అనే అంశాలపై చర్చకు తాము సిద్ధమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇదే విషయాన్ని రెఫరెండంగా భావిస్తూ.. ఎమ్మెల్సీ ఎన్నికలకు వెళదామా అని కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని కులంపై అవాకులు, చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం. ఇది తెలిసి కూడా కాంగ్రెస్ డ్రామాలాడుతోంది. బీసీ సంఘాలకు ఈ విషయం తెలుసు' అని పేర్కొన్నారు.

రాహుల్‌కు ఒక కులం లేదు, మతం లేదు..

'రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ ఖాన్. ఆయన తల్లి సోనియా గాంధీ క్రిస్టియన్. ఇటలీ దేశస్తురాలు. రాహుల్‌కు ఒక కులం లేదు, మతం లేదు, జాతి లేదు. మరి అలా చర్చ చేయాలంటే టెన్ జన్‌పథ్ నుంచే రాహుల్ కులం, మతం గురించి చర్చ ప్రారంభిద్దామా?' అని సంజయ్ పేర్కొన్నారు.

దేశంలో కులగణన చేస్తే రాహుల్ కులమేంటో తెలుస్తుంది

- బీజేపీ నేతలవి బట్టిబాజ్ మాటలు... కవిత పింక్‌బుక్‌తో మరిన్ని స్కామ్‌లు
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాహుల్‌గాంధీ కులమేంటో చెప్పాలంటూ బీజేపీ నేతలు ఎవరినీ ప్రశ్నించాల్సిన పనిలేదని, దేశవ్యాప్తంగా త్వరలో జరిగే జనగణనలో కులగణన కూడా చేస్తే రాహుల్‌గాంధీ కులమేంటో తెలుస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ కులం గురించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడినప్పటి నుంచి బీజేపీ నేతలు హైరానా పడుతున్నారని చెప్పారు. మోదీ కులం గురించి రేవంత్‌రెడ్డి ఎక్కడా తప్పుగా మాట్లాడలేదని, ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని మాత్రమే చెప్పారన్నారు. నిజంగానే మోదీ పుట్టుకతో బీసీ కాదని, గాన్సీ అనే కులాన్ని 1994లో బీసీల్లో చేర్చినప్పటి నుంచి ఆయన బీసీ అయ్యారని తెలిపారు. బీఆర్ఎస్ నేత కవిత పింక్‌బుక్ గురించి మాట్లాడుతున్నారని, ఆమె పింక్ బుక్ తెరిస్తే మరిన్ని స్కామ్‌లు బయటపడతాయన్నారు.

'వెటర్నరీ' వీసీ ఎంపిక ఎప్పుడో?

- సెర్చ్ కమిటీ సమావేశాలు రెండుసార్లు జరిగినా వెల్లడి కాని పేరు
- ఓ కీలక వ్యక్తి చక్రం తిప్పుతున్నారంటూ వర్సిటీలో చర్చ



సాక్షి, హైదరాబాద్: పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎంపికలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. రెండుసార్లు సెర్చ్ కమిటీలు భేటీ అయినా వీసీని ఎంపిక చేయలేదు. అయితే ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలోని ఓ వ్యక్తి తన బంధువు కోసం చక్రం తిప్పుతున్నారా? వెటర్నరీ యూనివర్సిటీలో ఎవరిని కదిపినా ఇవే ప్రశ్నల పరంపర వెల్లువెత్తుతోంది. రాష్ట్రంలోని దాదాపు అన్ని యూనివర్సిటీలకు ఒకేరోజు వీసీలను ఎంపిక చేసి.. ఆ జాబితాను గవర్నర్ ఆమోదానికి సీఎం పంపిన విషయం తెలిసిందే. ఆ జాబితాలో వెటర్నరీ వర్సిటీ వీసీ పేరు లేదు.

- గత డిసెంబర్ 28న తొలిసారిగా సెర్చ్ కమిటీని ఏర్పాటు చేశారు. తమిళనాడు వెటర్నరీ వర్సిటీ వీసీ, పశుసంవర్థక శాఖ సంచాలకులు డాక్టర్ గోపీ, ఐసీఏఆర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రాఘవేంద్ర భట్‌తో కూడిన ఈ కమిటీ అదే రోజు సమావేశమై వీసీ పోస్టుకు అర్హులైన ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లను ప్రభుత్వానికి పంపించింది. కానీ ఆ సెర్చ్‌కమిటీ ప్రతిపాదించిన వారిలో ఒకరిని ఎంపిక చేయలేదు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 5న మరోసారి వీసీ ఎంపిక కోసం సెర్చ్ కమిటీ సమావేశమైంది. ఆరోజు నుంచి ఇప్పటివరకు వీసీ ఎంపిక ఏమైందో ఎవరికీ తెలియని పరిస్థితి. రెండో విడత సమావేశమైన సెర్చ్ కమిటీ ఇచ్చిన పేర్లలో ముఖ్యమంత్రి ఒకరిని ఎంపిక చేసి గవర్నర్‌కు పంపించాల్సి ఉంటుంది. గవర్నర్ ఆమోదముద్రతో వీసీ నియామకం అధికారికంగా జరుగుతుంది.

అయితే యూనివర్సిటీల చరిత్రలో రెండోసారి సెర్చ్ కమిటీ సమావేశమై అర్హుల జాబితాను ప్రభుత్వానికి పంపినా, వీసీ ఎంపికపై ఏ నిర్ణయమూ తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తి ఒకరు వీసీ నియామక విషయంలో జోక్యం చేసుకుంటున్నారని వెటర్నరీ వర్సిటీలో చర్చ జరుగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వీసీ రేసు లో ప్రొఫెసర్లు చంద్రశేఖర్, పురుషోత్తం, కొండల్‌రెడ్డి, జ్ఞానప్రకాశ్ ఉన్నట్టు తెలిసింది.


కవితకు చీర, సారె అందజేస్తున్న రవిచంద్ర

బీసీల కోసం మూడు బిల్లులు పెట్టాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీసీల రిజర్వేషన్లకు సంబంధించి ఒకే బిల్లు కాకుండా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలకు సంబంధించి వేర్వేరుగా మూడు బిల్లులు పెట్టాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం వచ్చిన ఆమె బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే, సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరయ్యారు. తొలుత రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఇంటి వద్ద కవిత మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ వెంటపడటంతోనే ప్రభుత్వం కులగణన చేపట్టినా చాలా మంది ఇళ్లలో గణన నిర్వహించలేదని పేర్కొన్నారు. 46 శాతం బీసీలకు అంతే రిజర్వేషన్లు అమలు చేయాలే తప్ప 42 శాతం కల్పిస్తామనడం సరికాదన్నారు.

'స్థానిక' సన్నాహాలు

- పోలింగ్ కేంద్రాల గుర్తింపు.. ప్రచురణ
- ఎన్నికలెప్పుడు వచ్చినా... సంసిద్ధమైన పీఆర్, ఎస్‌ఈసీ



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మరో మూడు నెలల సమయం పట్టే అవకాశమున్నా, ఎన్నికల పనుల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) పూర్తిస్థాయిలో నిమగ్నమైంది. శనివారం జిల్లాలు, మండల స్థాయిలో పోలింగ్ కేంద్రాలను గుర్తించి దానికి సంబంధించిన జాబితాలను జిల్లా, మండల కేంద్రాల్లో ప్రచురించారు. రాష్ట్రవ్యాప్తంగా 570 జెడ్పీటీసీ, 5,817 ఎంపీటీసీ స్థానాల్లో పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు ప్రకటించారు. మరోవైపు ఓటర్ల జాబితాకు సంబంధించిన కసరత్తు సాగుతోంది. ఎన్నికలు వాయిదా పడుతున్నాయనే భావనలో ఉండొద్దని, ఆయా పనులకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తూనే ఉండాలని అధికారులు, సిబ్బందికి పంచాయతీరాజ్ కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, సిబ్బందికి శిక్షణ తదితరాలన్నీ పూర్తి చేసి, ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ వచ్చినా వెంటనే ఎన్నికల విధుల్లో దిగేందుకు సిద్ధంగా ఉండాలని ఈ ఆదేశాల్లో స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఎన్నికల ఏర్పాట్లపై జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఇతర క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌లు, గూగుల్‌మీట్‌లు నిర్వహిస్తూనే ఉన్నారు.

ఎస్‌ఈసీ ఆదేశాలకు అనుగుణంగా...

ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎస్‌ఈసీ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పీఆర్ శాఖ ద్వారా పోలింగ్ కేంద్రాల జాబితా, ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. పైగా సిబ్బందికి కూడా దీనికి సంబంధించిన శిక్షణను కూడా పూర్తి చేసింది. శనివారం పోలింగ్ స్టేషన్లు ఖరారు కావడంతో టీ–పోల్ యాప్‌లో పోలింగ్ కేంద్రాల వారీగా 500 నుంచి 700 ఓటర్లను మ్యాపింగ్ చేసి ఆయా కేంద్రాలకు కేటాయించాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్లు ఇతర అంశాలకు సంబంధించి హైకోర్టులోనూ కేసు విచారణ సాగుతున్న విషయం తెలిసిందే. కోర్టుకు ఆయా విషయాలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని, జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పీఆర్ శాఖ ఆదేశించింది. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఏవి ముందు నిర్వహించాల్సి వచ్చినా, అందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమై ఉండాలని సూచించింది. కులగణనలో రెండోవిడతలో వివరాల సేకరణ, పరిశీలన, ఆపై కేబినెట్ భేటీలో సమగ్ర నివేదిక ఆమోదం, ఆపై అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టబద్ధత కల్పించేలా బిల్లు పెట్టి కేంద్రానికి, పార్లమెంట్‌కు పంపించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు మరికొన్ని నెలల సమయం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



జ్ఞానము సంపాదించినవాడు,
వివేచన కలిగిన నరుడు ధన్యుడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం,శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.చవితి రా.12.26 వరకు తదుపరి పంచమి, **నక్షత్రం:** హస్త రా.3.04 వరకు తదుపరి చిత్త, **వర్జ్యం:** ఉ.9.53 నుండి 11.37 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.31 నుండి 5.19 వరకు, **అమృత ఘడియలు:** రా.8.25 నుండి 10.11 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం : 5.57
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

దీపికా పదుకోన్ (బాలీవుడ్ నటి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇప్పటికీ నాకు ఒక కల వస్తూ ఉంటుంది. ఇప్పటికీ అంటే, పాతికేళ్లు దాటిపోయినప్పటికీ! బహుశా ఇంకో పాతికేళ్లు దాటి పోయినా ఆ కల నాకు వస్తూనే ఉంటుందనుకుంటాను.

అది ఎప్పుడూ వచ్చిపోతుండే కలే అయినా, అప్పడే మొదటిసారిగా ఆ కలను కన్నట్లుగా ప్రతిసారీ నేను దిగ్గున మేల్కొంటాను! గుండె వేగంగా కొట్టుకుంటూ ఉంటుంది. నుదురు చెమట పట్టి ఉంటుంది. గొంతు ఆర్చుకునిపోయి ఉంటుంది. "సిద్ధివినాయకా! నాపై నీకెంత అనుగ్రహం! ఇది వట్టి కలేనా..." అని మనసులోనే ఆయనకు ప్రణమిల్లి పైకి లేస్తాను. ఒక గ్లాసు నీళ్లు తాగుతాను. అమ్మతో మాట్లాడతాను. నాన్నను పలకరిస్తాను. రణ్‌వీర్‌ను లేపుతాను. నా ఐదు నెలల కూతురు దువాను ముద్దాడతాను. నా స్ట్రెస్ అంతా పోతుంది.

'పరీక్షా పే చర్చ' కోసం ఢిల్లీ నుండి ఆహ్వానం రాగానే మొదట నాకు నా కలే గుర్తొచ్చింది! పిల్లల్లో పరీక్షల భయం పోగొట్టటం కోసం 'మోదీజీ మోటివేషన్ టీమ్' నన్నక్కడికి పిలిపించింది.

నా ఎదురుగా స్కూలు ఫైనల్ పరీక్షలకు సిద్ధమౌతున్న చిన్నారులు కూర్చొని ఉన్నారు. అంతా పద్నాలుగూ పదిహేనేళ్ల వాళ్లు. "దీపికాజీ! చదువుతుంటే స్ట్రెస్‌గా ఉంటోంది.



చదివింది ఒక్కటీ గుర్తుండటం లేదు. ఏం చేయమంటారు?" అని ఒక స్టూడెంట్!

25 ఏళ్ల క్రితం మోదీజీ ప్రధానిగా ఉండి, ఇరవై ఐదేళ్ల క్రితమే 'పరీక్షా పే చర్చ' ఉండి ఉంటే... అలా ఆ ప్రశ్నను అడిగిన అమ్మాయి కచ్చితంగా దీపికా పదుకోన్ అయి వుండేది!

అప్పుడు నేను టెన్త్‌కి ప్రిపేర్ అవుతున్నాను. సోఫియా హైస్కూల్‌లో చదివే అమ్మాయిలకు పరీక్షలంటే భయం ఉండదని టీచర్లు గొప్పగా చెబుతుండేవారు! పేరెంట్స్ ఆ మాటను ఇంకా గొప్పగా వింటుండేవారు. కానీ నాకు భయంగా ఉండేది. 'మిస్'తో నా భయం గురించి చెబితే, "ఏ సబ్జెక్ట్ అంటే భయపడుతున్నావో, ఆ సబ్జెక్ట్‌తో ఫ్రెండ్‌షిప్ చెయ్యి" అనేశారు! ఇదెక్కడి గొడవ!

నేను ఫ్రెండ్‌షిప్ చేస్తాను సరే, నాతో ఫ్రెండ్‌షిప్ ఆ సబ్జెక్ట్‌కి ఇష్టమవ్వాలి కదా! అది ఆలోచించినట్లు లేరు మా మిస్.

టీచర్లు ఇచ్చే టిప్స్ ఇలాగే అసాధ్యమైన ఫ్రెండ్‌షిప్‌లతో నిండి ఉండేవి! ఇప్పుడు మోదీజీ చెబుతున్నట్లుగా... "కంటి నిండా నిద్రపోండి. కలత లేకుండా చదవండి..." అని మేడ్ ఈజీగా ఒక్కమాటైనా అనేవాళ్లు కాదు. కొరివి దెయ్యాల్లాంటి పరీక్షల్ని వాకిట్లో పెట్టుకుని నిద్ర పోవటం, నిద్ర పట్టటం అయ్యే పని కాకపోయినా... మోదీజీ అంత బిజీలోనూ పిల్లలతో ఇంటరాక్ట్ అవటం; సద్గురువులను, న్యూట్రిషనిస్ట్‌లను ఇంటరాక్ట్ చేయించటం... ఇలా కదా పరీక్షల భయాన్ని పోగొట్టటం!

నిజానికి – బోర్డ్ ఎగ్జామ్స్ కంటే కఠినమైనవి జీవితం పెట్టే పరీక్షలు! జీవితం పెట్టే పరీక్షలకు సిలబస్ ఉండదు. స్కూళ్లు, ట్యూషన్‌లు ఉండవు. టిప్స్ ఇచ్చేవాళ్లున్నా అవి మనకు పనికొచ్చేవై ఉండవు. జీవితంలో ప్రతిదీ ఫైనల్ ఎగ్జామే. పాసైన సంతోషమైనా, ఫెయిల్ అయిన విచారమైనా జీవితం మళ్లీ ఇంకో పరీక్ష పెట్టేవరకే!

టెన్త్ ఎగ్జామ్స్ జన్మకోసారి. కానీ జన్మ మొత్తం కలలోకి వచ్చి జడిపిస్తూనే ఉంటాయి. పెళ్లయి, పేరెంట్సమై అయి, పిల్లలు టెన్త్‌కి వచ్చినా కూడా... మన టెన్త్ మన కలలోకి వస్తూనే ఉంటుంది. రేపే పరీక్ష ఉన్నట్లు, అసలేమీ చదవనట్లు. 'హే... గణేశా! ఎలా రాయాలి తండ్రీ...' అని కలలో మొరపెట్టుకుంటూ ఉంటాం!

'పరీక్షా పే చర్చ'లో పిల్లలకు నేను నాలుగు టిప్స్ ఇచ్చాను. స్లీప్, ఎక్స్‌ప్రెస్, హైడ్రేట్, మెడిటేట్! నాన్న నాకు చిన్నప్పుడు చెప్పిన టిప్స్ అవి. పెద్దయ్యాక, చిన్నప్పటి 'పరీక్ష కల' వెంటాడకుండా ఉండేందుకు కూడా ఏవైనా టిప్స్ ఉండి ఉంటాయా?!

ఉన్నా అవసరం లేదు. కొన్ని కలలు వెంటాడుతుంటేనే జీవితం పాస్ అవుతున్న ఫీల్ ఉంటుంది.

కృత్రిమ మేధలో కిం కర్తవ్యం?

అమెరికా చేయాల్సింది...

అభిప్రాయం



చార్లెస్ ఫెర్గూసన్

చైనా తక్కువ వ్యయంతో అభివృద్ధి చేసిన అద్భుత సామర్థ్యాలున్న 'డీప్ సీక్–ఆర్1 లార్జ్ లాంగ్వేజ్' మోడల్ ప్రపంచ ద్రవ్య మార్కెట్లను దిగ్భ్రాంతికి గురిచేసింది. అయితే, అమెరికా ఉత్పత్తులతో సరిసమానత్వాన్ని సాధించే శక్తిమంతమైన, వినూత్నమైన చైనీస్ మోడల్ మనకు ఆశ్చర్యం కలిగించకూడదు. ఇది అమెరికా, పాశ్చాత్య విధానాల వైఫల్య ఫలితం మాత్రమే. దీనికి ఏఐ పరిశ్రమే చాలావరకు బాధ్యత వహించవలసి ఉంటుంది.

పెరుగుతున్న చైనా కృత్రిమ మేధ సామర్థ్యాలు అందరికీ తెలిసినవే. ముఖ్యంగా పరిశోధన పత్రాలను ప్రచురించడం; ఎవరైనా ఉపయోగించుకోవడానికీ, తమకు ఇష్టమొచ్చినట్లు మార్చుకోవడానికీ, ఇతరులతో పంచుకోవడానికీ వీలు కల్పించే సాఫ్ట్‌వేర్ (ఓపెన్ సోర్స్)ను రూపొందించడం; అమెరికా పరిశోధకులతో, జర్నలిస్టులతో నేరుగా వాటి గురించి మాట్లాడటం వంటివాటి ద్వారా చైనీయుల ఏఐ పరిశోధకులు, కంపెనీల వారు తమ పురోగతిని అసాధారణ స్థాయిలో చాటుతున్నారు.

చైనా కృత్రిమ మేధా రంగంలో అమెరికాతో దాదాపు సమాన స్థాయిని పొందడానికి రెండు అంశాలను కారణాలుగా చెప్పవచ్చు. మొదటిది, వాణిజ్య, సైనిక అనువర్తనాల (అప్లికేషన్ల)లో సెమీకండక్టర్లను ఉత్పత్తి చేయడానికి అవసరమైన ప్రత్యేక యంత్రాలు–పరికరాలూ, ఏఐ ప్రాసెసర్‌ల నుంచి... హార్డ్‌వేర్ ఉత్పత్తులు, ఏఐ మోడల్స్ వరకూ మొత్తం డిజిటల్ టెక్నాలజీ రంగంలో అవసరమైన అన్నింటి విషయంలో స్వయం సమృద్ధినీ, సాంకేతిక ఆధిపత్యాన్నీ చేరుకోవడానికి చైనాకు ఉన్న చురుకైన – స్థిరమైన జాతీయ విధానం. రెండవది... అమెరికా, యూరోపియన్ యూనియన్‌ల ప్రభుత్వ విధానాలు, పరిశ్రమల ఆత్మసంతృప్తి ధోరణి; అసమర్థత, పేరాశలతో కూడిన నిరుత్సాహకరమైన వాతావరణం.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పశ్చిమ దేశాలకు సన్నిహితులు కారు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధకు ఆర్థిక, సైనిక రంగాలను ప్రభావితం చేయగల అపారమైన అవకాశాలను దృష్టిలో ఉంచుకోవాలి. అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థలలో ఏఐ నాయకత్వాన్ని కొనసాగించాలంటే,మన్‌హాటన్ ప్రాజెక్ట్, నాటో, అణ్వాయుధ విధానాల స్థాయిలో అపారమైన ప్రభుత్వ–ప్రైవేట్ వ్యూహాత్మక సమీకరణలు అవసరమవుతాయి.

అయినప్పటికీ, పశ్చిమ దేశాలు దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. తగినంత నిధులు లేకపోవడం వల్ల, అమెరికాలో కృత్రిమ మేధా రంగంలో ప్రభుత్వ, విద్యా పరిశోధనలు... చైనా, ప్రైవేట్ రంగం రెండింటి కంటే వెనుకబడి ఉన్నాయి. గూగుల్, మెటా, ఓపెన్ ఏఐ లేదా వారి చైనీస్ సహచరులు అందించే జీతాలు, కంప్యూటింగ్ సౌకర్యాలతో ప్రభుత్వ సంస్థలు లేదా విశ్వవిద్యాలయాలు పోటీ పడలేవు. అంతే కాకుండా, గ్రాడ్యుయేట్ విద్యార్థుల, పరిశోధకుల పట్ల అమెరికన్ ఇమ్మిగ్రేషన్ విధానం స్వయం ఓటమికి దారితీసేదిగా, అర్థం పర్థం లేని వ్యవహారంగా ఉంది. ఎందుకంటే ఇది అత్యంత ప్రతిభావంతులైన వ్యక్తులను వారి చదువులు ముగిసిన వెంటనే దేశం విడిచి వెళ్ళేలా బలవంతం చేస్తుంది.

ఇప్పుడు కృత్రిమ మేధకు సంబంధించిన సాంకేతికత చైనాకు అందకుండా నియంత్రించడంలో అమెరికాకు నిర్దిష్ట విధానం ఉంది. నియంత్రణలను చైనా సులభంగా తప్పించుకోగలదు లేదా అవి సరిగా అమలు కావు. ఎన్విడియా ప్రాసెసర్‌ల వంటి అంతర్గత సాంకేతికతలు ప్రభుత్వ ఎగుమతి నియంత్రణలకు లోబడి ఉన్నప్పటికీ... సేవలు, లైసెన్సింగ్ ఒప్పందాల ద్వారా అమెరికా ఏఐ సాంకేతికతలను చైనాకు అందకుండా చేయడాన్ని నియంత్రించలేరు.

చివరగా, ఆమెరికా విధానం... కృత్రిమ మేధ పరిశోధన – అభివృద్ధికి బలంగా మద్దతు ఇవ్వాలి. అవసరమైన చోట ప్రైవేట్ రంగం, ప్రభుత్వం, సైన్యాలు అనే తేడా లేకుండా నియంత్రణలు అమలుచేయాలి అనే వాస్తవాన్ని ఈ విధానం విస్మరిస్తుంది. అమెరికా వద్ద ఇప్పటికీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ, నాసా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ లేదా కఠినంగా నియంత్రించే అమెరికా అణ్వాయుధాల ఆర్ అండ్ డీని నిర్వహించే జాతీయ ప్రయోగశాలలకు... సమానమైన ఏఐ లేదా ఐటీ లేదు.

ఈ పరిస్థితి యూరోపియన్ యూనియన్, అమెరికా రెండింటిలోనూ ప్రభుత్వ ఉద్యోగస్వామ్య (బ్యూరోక్రసీ) క్షీణత ఫలితంగానే చోటు చేసుకుంది. యూరోపియన్ యూనియన్ సాంకేతిక రంగం తీవ్రంగా నియంత్రించబడింది. అలాగే అమెరికా రక్షణ, వాణిజ్య విభాగాలు, ఇతర ఏజెన్సీలలో సంస్కరణలు అవసరం. ఇక్కడ, టెక్ కంపెనీలు తమ ప్రభుత్వాలను విమర్శించడం కొంతవరకు సమర్థనీయమే. కానీ పరిశ్రమలు కూడా విమర్శాతీతంగా లేవు. వీటి లాబీయింగ్ ప్రయత్నాలు, ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న సమర్థవంతులను ఎక్కువ జీతభత్యాలతో ఆశ చూపి నియమించుకోవడం వంటి చర్యలు చాలా ముఖ్యమైన ప్రభుత్వ సంస్థల సామర్థ్యాలను బలహీనపరిచాయి.

> ఏఐలో చైనీస్ మోడల్ మనకు ఆశ్చర్యం కలిగించకూడదు. ఇది అమెరికా, పాశ్చాత్య విధానాల వైఫల్య ఫలితం మాత్రమే. కృత్రిమ మేధలో చైనా పెరుగుదల సవాళ్లకు పశ్చిమ దేశాల నుండి బలమైన ప్రతిస్పందన అవసరం. ప్రభుత్వ సామర్థ్యం తక్కువగా ఉన్న చోట, దానిని నాశనం చేయకూడదు, బదులుగా దాన్ని బలోపేతం చేయాలి.



ఇంటర్నెట్ అభివృద్ధిలో 'అమెరికన్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ప్రాజెక్ట్స్ ఏజెన్సీ' మార్గదర్శకత్వం వహించింది. ఇక 'వరల్డ్ వైడ్ వెబ్' అనేది 'యూరోపియన్ ఆర్గనైజేషన్ ఫర్ న్యూక్లియర్ రీసెర్చ్' నుండి ఉద్భవించింది. 'నెట్‌స్కేప్' సహ వ్యవస్థాపకుడు మార్క్ ఆండ్రీస్సెన్ ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయంలోని సమాఖ్య నిధులతో కూడిన సూపర్ కంప్యూటర్ సెంటర్‌లో మొదటి వెబ్ బ్రౌజర్‌ను సృష్టించాడు. ఈ ఆవిష్కర్తలందరూ ప్రభుత్వ సంస్థల్లో పనిచేసినవారే అనేది గమనార్హం.

ఏఐ ఆర్ అండ్ డీ, చైనా పెరుగుదల సవాళ్లకు పశ్చిమ దేశాల నుండి బలమైన ప్రతిస్పందన అవసరం. ప్రభుత్వ సామర్థ్యం తక్కువగా ఉన్న చోట, దానిని నాశనం చేయకూడదు, బదులుగా దాన్ని బలోపేతం చేయాలి. ప్రభుత్వ, విద్యా విషయ సంబంధ పనులకు పోటీ జీతాలు చెల్లించాలి. అమెరికా, ఈయూ తమ సాంకేతిక మౌలిక సదుపాయాలను, విధానాలను ఆధునీకరించాలి. ముఖ్యంగా సైనిక అనువర్తనాల కోసం ప్రభుత్వ స్థాయిలో బలమైన ఆర్ అండ్ డీ సామర్థ్యాన్ని సృష్టించాలి. విద్యా పరిశోధనలను బలోపేతం చేయాలి.

నిజంగా కష్టతరమైన విధాన సమస్య ఏమిటంటే, ముఖ్యంగా ఓపెన్–సోర్స్ లైసెన్సింగ్. ప్రతి నమూనాపై 'టాప్ సీక్రెట్' అని ముద్ర వేయలేము. అందుకే ఒక ఆచరణాత్మక మధ్యేమార్గాన్ని కనుగొనాలి. బహుశా జాతీయ రక్షణ పరిశోధన ప్రయోగశాలలు, ఎగుమతి నియంత్రణల ఇంటర్మీడియట్ కేసుల కోసం జాగ్రత్తగా రూపొందించిన విధానం వంటి వాటిపై ఆధారపడాలి. అన్నింటికంటే మించి కలిసి పని చేయకపోతే మనం బలహీనం అవుతామని పాశ్చాత్య కృత్రిమ మేధాపరిశ్రమ గ్రహించాలి.

వ్యాసకర్త టెక్నాలజీ ఇన్వెస్టర్, విధాన విశ్లేషకుడు
('ప్రాజెక్ట్ సిండికేట్' సౌజన్యంతో)

ఇండియా చేయగలిగింది...

అందిపుచ్చుకుంటే ఇదొక సువర్ణావకాశం. మన ప్రాచీన విజ్ఞానానికి తిరిగి జీవం పోయగల శక్తి ఏఐకి ఉంది. ఫిలాసఫీ, సైన్సు, వైద్య రంగాల్లో భారత సరికొత్త ఆవిష్కరణలకు ఇది బాటలు వేస్తుంది.

ఏఐ పుట్టింది సిలికాన్ వ్యాలీ లోనే. అయితే ఏమిటి? చైనా ఇప్పుడు అమెరికాను వెనక్కు నెట్టేసింది. తన సొంత సంస్కృతిని మేళవించి దాన్ని సరికొత్త శక్తిగా రూపుదిద్దింది. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచింది. గుడ్డిగా పశ్చిమ దేశాలను అనుకరించకుండా తనదైన పద్ధతిలో 'డీప్‌సీక్' పేరిట కృత్రిమ మేధను అభివృద్ధి చేసుకుంది. పుంఖానుపుంఖాలుగా ఉన్న చైనా ప్రాచీన గ్రంథాలను ఆధారంగా చేసుకుని కంప్యూటర్లకు వాటిలో శిక్షణ ఇచ్చింది. తమ దేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సాహిత్య వారసత్వపు విలక్షణతను డీప్‌సీక్ ఒడిసి పట్టుకోగలిగింది. ఈ మోడల్ లోని విశిష్టత అదే.

కృత్రిమ మేధకు కొత్త భాష్యం చెప్పి దాన్ని మరింత ముందుకు తీసుకుపోయే శక్తి మన వద్ద ఉంది. గణిత, ఖగోళ, వైద్య, పరిపాలన, ఆధ్యాత్మిక రంగాల అత్యున్నత విజ్ఞానం మన ప్రాచీన గ్రంథాల్లో నిక్షిప్తమై ఉంది. వేదాలు, ఉపనిషత్తులు, అర్థశాస్త్రం, తమిళ సంగం సాహిత్యం... ఇవన్నీ విశ్వచైతన్యం నుంచి ఆర్థిక సిద్ధాంతం వరకు ఎంతో లోతైన అంతర్ దృష్టులు అందిస్తున్నాయి.

కృత్రిమ మేధ అంటే? ఇదొక ప్యాటర్న్ రికగ్నిషన్ సిస్టం. విస్తృత సమాచారాన్ని (డేటాసెట్‌ను) మెదడుకు మేతలా అందించి మెషీన్లకు అది శిక్షణ ఇస్తుంది. తాము శిక్షణ పొందిన సమాచారం ప్రాతిపదికగానే అవి ప్రపంచాన్ని అర్థం చేసుకుంటాయి. ఒక ఏఐ సిస్టం పశ్చిమ దేశాల సైంటిఫిక్ పేపర్స్, కార్పొరేట్ డాక్యుమెంట్లు, పాప్ కల్చర్ మీద శిక్షణ పొందినప్పుడు దానికి అదే ప్రపంచం అవుతుంది. ఆ ప్రాపంచిక దృక్పథాన్నే అది అలవరచుకుంటుంది. అలా కాకుండా చైనా చేసినట్లు, చైనీయుల సాహిత్య, ఆధ్యాత్మిక సమాచారం మీద శిక్షణ ఇచ్చినప్పుడు అది చైనా మాదిరిగానే ఆలోచిస్తుంది.

ఈ విషయంలో పశ్చిమ దేశాల కృత్రిమ మేధ దానితో పోటీ పడలేదు. వెస్ట్రన్ ఏఐ ప్రధానంగా ఇంగ్లీష్ డేటా మీద రూపొంది పశ్చిమ దేశాల ప్రాపంచిక దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. కాబట్టి శాస్త్ర సాంకేతిక అంశాల్లో వారి ఏఐ సిస్టందే పైచేయిగా ఉంటుంది. తాత్విక చింతన, నైతికత అంశాల్లో మాత్రం బలహీనంగా ఉంటుంది.

మనం అమెరికన్ ఏఐ మీద ఎందుకు ఆధారపడకూడదో ఇప్పుడు ఆలోచించండి. భారతీయ మేధా వారసత్వం పునాదుల మీద మన ఏఐని నిర్మించుకోవలసిన అవసరం బోధపడుతుంది. చాణక్యుడి అర్థశాస్త్రం కోణం నుంచి ఆధునిక ఆర్థిక సిద్ధాంతాలను విశ్లేషించగల సామర్థ్యంతో మన ఏఐ మోడల్‌ను తయారు చేసుకోవాలి. ఆయుర్వేద, సిద్ధ వైద్యాల్లో మన మూలాలు ఏమిటో తెలిసిన కృత్రిమ మేధ కావాలి. అది మాత్రమే సమగ్ర చికిత్సకు కావల్సిన ఇన్ సైట్స్ అందిస్తుంది. ఉపనిషత్తుల్లో అభివర్ణించిన చైతన్యం గురించి వ్యాఖ్యానించి సమకాలీన న్యూరోసైన్స్‌తో పోల్చగల మోడల్ గురించి ఆలోచించాలి. అలాంటి ఏఐ కేవలం సమాధానాలకే పరిమితం కాదు. మన సామూహిక అవగాహనను పెంచుతుంది.

అభిప్రాయం



వివేక్ వాధ్వా

పశ్చిమ దేశాల ఏఐ మోడల్స్ మెటీరియలిస్టు మూసలకే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తాయి. చైనా ఏఐ కన్ఫ్యూషియస్ విలువలను జొప్పించింది. మనకు అంతకు మించిన అవకాశం ఉంది. సైన్సు– స్పిరిచ్యువాలిటీ, ఆర్థికం–నైతికం, సాంకేతికత–సంప్రదాయం... వీటిని వారధిలా అనుసంధానించే కృత్రిమ మేధను మనం సృష్టించగలం. భారత నాగరికత అందించిన వివేకాన్ని ఈ మోడల్ ప్రతిబింబించాలి.

పశ్చిమ దేశాల ఏఐ మీద ఆధారపడితే మరో ప్రమాదం ఉంది. భారతీయులు ఏం నేర్చుకోవాలో, ఎలా ఆలోచించాలో శాసించిన వలసవాద మైండ్ సెట్‌ను అది శాశ్వతం చేస్తుంది. మన వ్యాపారాలు, విశ్వవిద్యాలయాలు, విధాననిర్ణేతలు పశ్చిమ దేశాల ఏఐని ఉపయోగిస్తూ పోతే, దాంతో పాటు వారి ప్రాపంచిక దృక్పథమే అలవడుతుంది. ఒకప్పటి మన విద్యా విధానం బ్రిటిష్ ప్రయోజనాలు ఎలా కాపాడిందో, ఇప్పుడు అలాంటి పరిస్థితే వస్తుంది. మేధాపరంగా మనం పరాధీనులమై పోయే ప్రమాదం ఉంది. ఈ డిజిటల్ యుగంలో మన ఉత్కృష్ట వారసత్వం కనుమరుగవుతుంది.

అమెరికా, చైనాల ఏఐ ఆధిపత్యం వల్ల మన డేటా సార్వభౌమత్వం ప్రమాదంలో పడుతుంది. మన డేటా మన జాతీయ సంపద. మన ప్రయోజనాలకు తోడ్పడని ఏఐ మోడల్స్‌కు మన డేటా ఉపయోగించుకుని విదేశీ టెక్ సంస్థలు లబ్ధి పొందుతాయి. మన ఏఐ అభివృద్ధి మీద మన అదుపు ఉండితీరాలి.

ప్రపంచ దేశాలకు జ్ఞానదీపంలా దారి చూపిన భారత్ ఇప్పుడు తన మేధను విదేశీ అద్దాలతో చూసుకునే పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు సున్నా నుంచి యోగా వరకు... మన ఆవిష్కరణలు ప్రపంచ ప్రగతిని రూపుదిద్దాయి. నేడు వాతావరణ మార్పులు, మానసిక రుగ్మతలు, మహమ్మారులు, ఆర్థిక అసమానతలు ప్రపంచ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సమాచారం వెల్లువెత్తుతున్నా నిజమైన జ్ఞానం లోపిస్తోంది. నేటి కృత్రిమ మేధ భారతీయ సమున్నత వారసత్వం మీద శిక్షణ పొందితే, ఈ ఆధునిక ప్రపంచ సవాళ్లు ఎదుర్కొనేందుకు అది సరికొత్త దృక్పథాలు అందించగలదు.

వేదాంత శోధన ఏఐకి ఆలంబన అయ్యేట్లయితే పశ్చిమ దేశాల న్యూరోసైన్సు పరిమితులను అధిగమించవచ్చు. చైతన్యం పట్ల మానవ అవగాహన విప్లవాత్మకంగా మారిపోతుంది. భారతీయ ఆర్థిక, పరిపాలనా సూత్రాల మీద శిక్షణ పొందిన ఏఐ మోడల్... అభివృద్ధి చెందుతున్న దేశాలకు పశ్చిమ దేశాల పెట్టుబడిదారీ విధానాలు, చైనా విధానాలు కాకుండా ఇతర ప్రత్యామ్నాయాలు సూచించగలదు. లాభాలే ధ్యేయంగా నడుస్తున్న సిలికాన్ వ్యాలీకి భారతీయ నైతిక విలువల ఆధారంగా రూపొందే ఏఐ నూతన మార్గదర్శనం చేస్తుంది. భారత్ నిర్ణయాత్మక చర్యలు తీసుకుని ప్రపంచానికి తన సత్తా చూపించాలి. దీనికోసం అపారంగా ఉన్న ప్రాచీన, ప్రాంతీయ సాహిత్యాన్ని డిజిటల్ రూపంలోకి మార్చాలి. ప్రభుత్వం, ప్రయివేటు సంస్థలు ఇందుకు నడుం బిగించాలి.

కృత్రిమ మేధను భారత్ కేవలం ఒక సాధనంగా చూడకూడదు. అంతకంటే మిన్నగా అది జ్ఞానోదయానికి తోడ్పడుతుందని గ్రహించాలి. మన ప్రాచీన గ్రంథాలు అందిస్తున్న జ్ఞానాన్ని ఆధునిక ఏఐతో మిళితం చేసినట్లయితే, ఆధ్యాత్మిక, శాస్త్ర విజ్ఞాన, వైద్య రంగాల్లో నూతన ఆవిష్కరణలు వెలుగు చూస్తాయి. మన మేధా సార్వభౌమత్వాన్ని తిరిగి కైవసం చేసుకోడానికీ, భారతీయ జ్ఞానాన్ని నలుచెరగులా వ్యాప్తి చేసి ప్రపంచ మానవాళిని సముద్ధరించడానికీ ఇది సరైన సమయం.

> లాభాలే ధ్యేయంగా నడుస్తున్న సిలికాన్ వ్యాలీకి భారతీయ నైతిక విలువలు ఆధారంగా రూపొందే ఏఐ నూతన మార్గదర్శనం చేస్తుంది. భారత్ నిర్ణయాత్మక చర్యలు తీసుకుని ప్రపంచానికి తన సత్తా చూపించాలి. దీనికోసం అపారంగా ఉన్న ప్రాచీన, ప్రాంతీయ సాహిత్యాన్ని డిజిటల్ రూపంలోకి మార్చాలి.

వ్యాసకర్త వయొనిక్స్ బయోసైన్సెస్ సీఈఓ, రచయిత
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

ఈ బంగారు కొండకు అండ కావాలి!

సందర్భం



కృష్ణారావు చొప్పరపు

క్రీడాకారులెవరైనా జాతీయ, అంతర్జాతీయ పోటీలలో విజయాలు, రికార్డులు, పతకాల కోసమే పాల్గొంటారు. అయితే... ఆంధ్ర పరుగుల రాణి, ఆసియా చాంపియన్ 'జ్యోతి యర్రాజీ' మాత్రం ప్రోత్సాహక నగదు బహుమతుల కోసమే (పేదరికం కారణంగా) 38వ జాతీయ క్రీడల బరిలో నిలిచింది. రెండు స్వర్ణాలను కొట్టింది. తెలుగు వారికి గర్వకారణ మయ్యింది.

జ్యోతి యర్రాజీ... క్రీడాభిమానులకు పరిచయం అవసరం లేని పేరు. ఉక్కునగరం విశాఖపట్టణానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం నుంచి జాతీయ అథ్లెటిక్స్‌లోకి దూసుకొచ్చింది. అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన స్ప్రింటర్. మహిళల 100 మీటర్ల హర్డిల్స్, 200 మీటర్ల పరుగు అంశాలలో పలు సరికొత్త రికార్డులు నెలకొల్పిన ధీర. 2023 ఆసియా క్రీడల పరుగులో రజత పతకం సాధించిన తొలి భారత మహిళ. అలాగే ఆసియా పరుగు పోటీలలో స్వర్ణ పతక విజేత మాత్రమే కాదు... 2024 ప్యారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఘనత సైతం ఈ 25 ఏళ్ల జ్యోతిదే. గత మూడు జాతీయ క్రీడలలోనూ వరుసగా బంగారు పతకాలు సాధించిన తెలుగు రాష్ట్రాల ఏకైక రన్నర్ ఆమె.

అయినా... జ్యోతి కష్టానికి తగ్గ ఫలితం దక్కలేదు. ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహం అంతంత మాత్రమే. పీటీ ఉష, షైనీ అబ్రహాం, అశ్వినీ నాచప్ప, వలసమ్మ లాంటి భారత మేటి మహిళా రన్నర్ల సరసన నిలిచే ప్రతిభా పాటవాలు కలిగిన జ్యోతి యర్రాజీ ఇప్పటికీ ఆర్థికంగా నిలదొక్కుకోలేదంటే ఆశ్చర్యపోక తప్పదు. నిరుపేద కుటుంబానికి చెందిన జ్యోతి తండ్రి ఓ ప్రయివేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డు. సోదరుడు ఓ ముఠా కూలీ. వారి సంపాదన నెలకు 23,000 రూపాయలు మాత్రమే. తల్లి అనారోగ్యంతో ఇంటికే పరిమితం. గట్టిగా గాలి వీస్తే ఎగిరిపోయే ఇరుకు ఇంట్లో నివాసం. ఓ అంతర్జాతీయ అథ్లెట్ ఆర్థిక పరిస్థితి ఇది!

ఇటీవలే దక్షిణ మధ్య రైల్వేలో జూనియర్ క్లర్క్‌గా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించింది జ్యోతి. ఆమె



జ్యోతి యర్రాజీ

జీతం నెలకు రూ. 20 వేలు మాత్రమే. అంతర్జాతీయ పోటీల కోసం శిక్షణతో పాటు తగిన పోషకాహారం, వ్యక్తిగత అవసరాలకు ఈ మొత్తం చాలకపోడంతో జ్యోతి నానా పాట్లు పడుతోంది. త్వరలో జరిగే ఆసియా, ప్రపంచ పోటీల కోసం తన సహ అథ్లెట్లంతా జాతీయ క్రీడలలో పాల్గొనకుండా ముమ్మర సాధనతో సన్నాహాలు చేసుకొంటూ ఉంటే... జ్యోతి మాత్రం పతకాలు సాధించడం ద్వారా వచ్చే ప్రోత్సాహక నగదు బహుమతి కోసమే డెహ్రాడూన్ క్రీడల బరిలో నిలిచింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్, 200 మీటర్ల పరుగు అంశాలలో సరికొత్త రికార్డులతో స్వర్ణ పతకాలు సాధించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణంగా నిలిచింది. 7 బంగారు పతకాలతో పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ 18వ స్థానంలో నిలవడంలో జ్యోతి ప్రధాన పాత్ర పోషించింది. వరుసగా మూడు జాతీయ క్రీడల్లో స్వర్ణపతకాలు సాధించిన తొలి తెలుగు రాష్ట్రాల రన్నర్‌గా అరుదైన రికార్డుతో చరిత్ర సృష్టించింది.

38వ జాతీయ క్రీడల్లో బంగారు పతకాలు సాధించిన అథ్లెట్లకు 5 లక్షల రూపాయల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి ఇస్తామని పోటీల ప్రారంభానికి ముందే ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించిన కారణంగానే జ్యోతి యర్రాజీ బరిలో నిలిచింది. రెండు స్వర్ణపతకాల ద్వారా దక్కే 10 లక్షల రూపాయలను తన శిక్షణతో పాటు కుటుంబ అవసరాలకు ఖర్చు చేయాలని నిర్ణయించింది.


గత ఒలింపిక్స్ వరకూ 'టాప్స్' పథకం కింద జ్యోతి నెలకు 50 వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకొంటూ వచ్చింది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు సమాయత్తం కావాలంటే ప్రభుత్వం తాజాగా ప్రకటించే 'టాప్స్' పథకంలో తన పేరు ఉంటుందో లేదో అన్న ఆందోళన జ్యోతిని వెంటాడుతోంది.

రాష్ట్రానికి అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చిన బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్‌లతో పాటు పలువురు ప్రముఖ క్రీడాకారులకు గతంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత ఉద్యోగాలు, పలు రకాల ప్రోత్సాహకాలు ఇచ్చి అండగా నిలిచింది. అదే ప్రోత్సాహం తనకూ అందించాలని 'ఆంధ్ర పరుగుల రాణి' జ్యోతి ఆశపడుతోంది. ఆమె ఆశ అడియాస కాబోదని ఆశిద్దాం.

వ్యాసకర్త సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్
మొబైల్: 84668 64969

అశ్వత్థ రూపుడు

భారతీయ తత్వం, సంస్కృతుల్లో ప్రకృతికి ప్రత్యేక స్థానం ఉంది. చెట్లు, కొండలు, గుట్టలూ, జంతువులూ, పక్షులూ అన్నీ మన మత, సంస్కృతుల్లో భాగమే. ముఖ్యంగా వృక్షాలకు పవిత్ర స్థానం ఉందని చెప్పే కథలు ఎన్నో ఉన్నాయి. అందులో ఈ కథ ఒకటి: పూర్వం సౌరాష్ట్ర దేశంలో ధనుంజయుడు, సుశీల అనే దంపతులు ఉండేవారు. శ్రీహరిని మహా భక్తులయి ఆరాధిస్తూ, భిక్షాటనతో జీవిస్తూ ఉండేవారు. వారికి సరైన బట్టలు లేక పోవటంతో, చలికి తట్టుకోలేక, ఎండు పుల్లలు తెచ్చుకుని మంట వేసుకుని కాలక్షేపం చేసేవారు. ఒకరోజు ఎండు పుల్లలు కూడా దొరకలేదు. దీంతో వారి ఇంటి పెరడులో ఉన్న రావి చెట్టు కొమ్మ నరికి చలి మంట వేసుకోవాలనుకున్నారు. కొమ్మ నరికిన వెంటనే, అందులో నుండి, శంఖ, చక్రాలతో రక్తం కారుతున్న దేహంతో విష్ణువు ప్రత్యక్ష మయ్యాడు. ఆ దంపతులు ఆశ్చర్యంతో ఆయనకు నమస్కరించి రక్తమెందుకు కారుతుందని అడిగారు. అప్పుడు విష్ణువు, 'నేను అశ్వత్థ రూపుణ్ణి. నన్ను గొడ్డలితో నరికారు కదా, అందుకే రక్తం కారుతోంది' అన్నాడు.



జ్యోతిర్మయం

ఆ దంపతులు భయంతో 'మా నేరాన్ని మన్నించు. పేదరికం వల్ల ఎండు కట్టెలు కొనలేక ఈ కొమ్మ నరికాం' అని దీనంగా పలికారు. అప్పుడు విష్ణువు 'మీ దీనావస్థ చూసే మీకు దర్శనం ఇచ్చాను. ఏం కావాలో కోరుకొమ్మ' న్నాడు. వారు లౌకిక సంపదలు కోరుకోలేదు. తమకు, విష్ణు పాద కైంకర్యం అనుగ్రహించి, కాపాడమని ప్రార్థించారు. విష్ణువు, తన నాశ్రయించిన వారిని ఎన్నటికీ వదలనని చెప్పి వారికి సమస్త ఐశ్వర్యాలూ ప్రసాదించాడు.

రావి, మారేడు, వేప ఇత్యాది వృక్షాలను దైవ స్వరూపాలుగా భావించి పూజిస్తుంటాం. ప్రకృతిలో అణువణువులో దైవం నిండి ఉంటాడని దీని సారాంశం. భగవద్గీత విభూతి యోగంలో, పరమాత్మ తన విభూతులను గురించి వివరిస్తూ... 'అశ్వత్థ స్సర్వ వృక్షాణం' అని 'వృక్షాలలో అశ్వత్థ వృక్షాన్ని' అని స్వయంగా చెప్పాడు. తాను అశ్వత్థ రూపుడనని పద్మ పురాణంలో చెప్పాడు. అందుకే హిందువులు అశ్వత్థ వృక్షాన్ని ప్రత్యక్ష దైవంగా భావిస్తారు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళా రైతు కట్టెకోల వసంతది ఆత్మకూర్ (ఎం) మండలం టి. రేపాక గ్రామం. బిక్కేరు వాగు పక్కన ఉన్న 30 గుంటల్లో వరి నాటు వేసింది. చేనును కాపాడుకో వడానికి ఉదయం వ్యవసాయ బావి వద్దకు వస్తుంది. బావిలో నీటి ఊట పెరిగితే మోటార్ ఆన్ చేస్తుంది. నీరు అయిపోగానే బంద్ చేస్తుంది. ఈ విధంగా పంటను కాపాడుకుంటుంది.



ఆలేరు మండలం శ్రీనివాసపురంలో బోరు వేశారు. అయితే ఇక్కడ చుక్క నీరు పడలేదు

ఎండ ముదిరి.. చేను ఎండి

పశువులకు మేతగా మారుతున్న వరి పైరు

భూగర్భజలాలు అడుగంటి పొట్ట దశలో నీటి తిప్పలు

నీరందక నెర్రెలు వారుతున్న పంటపొలాలు

సాక్షి,యాదాద్రి: వేసవి రాకముందే ఎండలు ముదిరిపోయా యి. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో పలుచోట్ల భూగ ర్భజలాలు అడుగంటుతున్నాయి. నాన్‌ఆయకట్టు ప్రాంతం లో ఎక్కువ శాతం బోర్లు, బావుల కింద వరి సాగు చేశారు. దాదాపు 2.80 లక్షల ఎకరాల్లో పంట సాగైంది. సరిగ్గా నీరం దక వరి చేలు ఎండుముఖం పడుతున్నాయి. పొట్టదశలో ఉన్న పైరు ఎండిపోతుండగా రైతులు పశువులను మేపుతున్నారు. ఇప్పటికే దాదాపు వెయ్యి ఎకరాల్లో పంట ఎండిపోయింది. పరిస్థితి ఇలాగే ఉంటే...వేలాది ఎకరాలకు పంటనష్టం జరిగే ప్రమాదం పొంచి ఉంది. దిగుబడి కూడా తగ్గే అవకాశాలున్నాయి. జనవరి నాటికి జిల్లాలో భూగర్భ జలాలు రెండున్నర మీటర్ల లోతుకు పడిపోయాయి.

యాసంగి ఆశలపై దెబ్బ

వానాకాలం సీజన్‌లో భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లాయి. జలకళ సంతరించుకోగా, రైతులు యాసంగి వరిసాగుపై ఆశలు పెంచుకున్నారు. ఫిబ్రవరి మొదటివారం నుంచే ఎండలు తీవ్రరూపం దాల్చడంతో రాజాపేట, ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూర్(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు, వలిగొండ మండలాల్లోని ఎగువ ప్రాంతాల్లో నీటిగండం వచ్చిపడింది. పంటను దక్కించుకోవాలన్న తపనతో కొందరు బోరు బావుల్లో పూడికతీత పనులు చేపట్టారు. మరికొందరు అప్పు చేసి బోర్లు వేయిస్తున్నారు. అయినా చుక్కనీరు పడకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

రెండేళ్లలో తగ్గిన భూగర్భ నీటిమట్టం (మీటర్లలో)

మండలం	జనవరి 2024	జనవరి 2025	వ్యత్యాసం
నారాయణపురం	10.61	22.09	-11.48
ఆత్మకూర్(ఎం)	12.38	17.10	-4.72
ఆలేరు	6.83	11.36	-4.53
భువనగిరి	6.73	10.67	-3.94
రాజాపేట	7.11	10.76	-3.65
వలిగొండ	5.27	7.63	-2.36
గుండాల	6.02	8.31	-2.29
మోటకొండూరు	8.39	11.10	-2.71

రెండు ఎకరాల వరి బీటలు వారింది

నాకున్న ఐదెకరాల్లో వరిసాగు చేశాను. బావి నీటి మట్టం తగ్గడంతో రెండు ఎకరాల వరిపొలం బీటలు వారింది. ఉన్న మూడు ఎకరాలకు రెండు రోజులకో తడి ఇస్తున్నాను. దానిపై కూడా ఆశ లేదు. – పడకాల రాజు, వరి రైతు, మోత్కూర్.

నీరు లేక పంట ఎండిపోయింది



3 ఎకరాల్లో వరి వేశా. నాట్ల సమయంలో బావి లో నీరు బాగానే ఉంది. వరి పొట్టకు వచ్చే దశలో నీరు పూర్తిగా అడుగంటి పోయింది. వారం క్రితం రెండు బోర్లు వేశాను. రెండూ ఫెయిల్ అయ్యాయి. నీరులేక పంట ఎండిపోయింది –చౌదబోయిన కనకయ్య, శ్రీనివాసపురం గ్రామం

ప్రేమికుల రోజే ప్రియుడి బలవన్మరణం



ఇమ్రాన్

సంతోష్‌నగర్: ప్రేమికుల రోజునే ఓ యువకుడు బలవ న్మరణానికి పాల్పడ్డాడు. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ కథనం ప్రకారం... సంతోష్‌నగర్ కళంధర్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ (21) చాంద్రాయణగుట్ట జీఎం కాలనీకి చెందిన మహ్మద్ ఆబిద్ అలీ కూతురు రబియా ఫాతిమాలు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇది రబియా తండ్రి అబిద్ అలీకి తెలియడంతో ఆయన ఈ నెల 14న చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో తన కూతురును ఇమ్రాన్ వేధిస్తున్నాడని రబియాతో ఫిర్యాదు చేయించాడు. దీంతో పోలీసులు ఇమ్రాన్‌ను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ పరిణామంతో మనస్తాపానికి గురైన ఇమ్రాన్ ఇంటికి వచ్చి.. తన మృతికి రబియా తండ్రి కారణమని సూసైడ్ నోట్ రాసి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పాతాళానికి నీళ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడయ్యాయి. భూగర్భ జలవనరుల శాఖ రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన 1,771 పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థితిగతులను ప్రతి నెలా సమీక్షించి, తర్వాతి నెలలో నివేదికలను విడుదల చేస్తూ ఉంటుంది.

8 జిల్లాల్లో 10 మీటర్ల కంటే లోతున...

రాష్ట్రంలోనే అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో 12.29 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. రాష్ట్రంలోని జిల్లాలను సగటు భూగర్భ జలమట్టం 0–5 మీటర్లు, 5–10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు.. అనే మూడు కేటగిరీలుగా భూగర్భ జలశాఖ వర్గీకరించింది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకుగాను 6 జిల్లాల్లో మాత్రమే 5 మీటర్లలోపు భూగర్భ జలమట్టం ఉన్నట్టు గుర్తించారు. భూగర్భ జలాలు సురక్షిత స్థాయిలో ఉన్నది కేవలం ఈ జిల్లాల్లో మాత్రమే. మరో 9 జిల్లాల్లో 5–10 మీటర్ల మధ్య, మిగతా 8 జిల్లాల్లో 10 మీటర్లకుపైగా లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఇలా 10 మీటర్లకన్నా లోతుకు భూగర్భ జలాలు పడిపోయిన జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా భావిస్తారు.

18 జిల్లాల్లో భారీ క్షీణత

గత ఏడాది జనవరితో పోల్చితే ఈ ఏడాది జనవరిలో రాష్ట్రంలోని 18 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో భారీ క్షీణత నమోదైంది. గత ఏడాది జనవరిలో రాష్ట్ర సగటు భూగర్భ జలాల లోతు 7.72 మీటర్లుకాగా.. ఈ ఏడాది 7.46 మీటర్లకు తగ్గింది. రాష్ట్ర సగటు కాస్త మెరుగ్గానే కనిపిస్తున్నా... కొన్ని జిల్లాల్లో బాగా పడిపోయాయి. అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 7.29 మీటర్ల నుంచి 10 మీటర్లలోతుకు అంటే.. 2.71 మీటర్ల మేర పడిపోవడం గమనార్హం.

ఈ ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో..

రంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల ఉత్తర, పశ్చిమ ప్రాంతాలు, వికారాబాద్ జిల్లాలోని దక్షిణ ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయికి భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు 15–20 మీటర్ల మధ్య, కొన్నిచోట్ల 20 మీటర్లకన్నా లోతుకు వెళ్లిపోయినట్టు తేల్చారు. రాష్ట్ర భూభాగం ఈ ప్రాంతాల వాటా 4 శాతమని అధికారులు చెబుతున్నారు. మరో 18 శాతం భూభాగంలో 10–15 మీటర్ల లోతున.. ఇంకో 54 శాతం ప్రాంతాల్లో 5–10 మీటర్ల లోతున, 25 శాతం ప్రాంతాల్లో పరిధిలో 5 మీటర్ల కంటే తక్కువ లోతున భూగర్భ జలమట్టాలు ఉన్నట్టు గుర్తించారు.

156 మండలాల్లో దశాబ్ద సగటుకన్నా తగ్గి..

గత దశాబ్ద కాల (2015–2024) సగటుతో పోల్చినప్పుడు.. రాష్ట్రంలోని మొత్తం 612 మండలాలకుగాను 456 మండలాల్లో భూగర్భ జల మట్టాలు కాస్త మెరుగ్గా ఉన్నాయి. మిగతా 156 మండలాల్లో క్షీణించాయి. 53 మండలాల్లో 0.5 మీటర్ల మేర, 33 మండలాల్లో 1–2 మీటర్ల మేర, 37 మండలాల్లో 2 మీటర్లకుపైగా పడిపోయాయి.

ఒక్క రోజే 800 కోళ్ల మృతి

- అంతుపట్టని వైరస్



చనిపోయిన కోళ్లను పరీక్షిస్తున్న పశువైద్యాధికారి

చౌటుప్పల్ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని కోళ్ల ఫారంలో శనివారం తెల్లవారుజామున 800 కోళ్లు మృతి చెందాయి. నేలపట్లకు చెందిన పబ్బు మల్లేశ్ ఫారంను లక్కారం గ్రామానికి చెందిన శివ కొంతకాలంగా లీజుకు తీసుకుని నడుపుతున్నాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా పెద్ద మొత్తంలో కోళ్లు చనిపోవడంతో పౌల్ట్రీ నిర్వాహకుల్లో ఆందోళన మొదలైంది. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి పృథ్వీరాజ్ ఫారం వద్దకు చేరుకుని మరణించిన కోళ్లను పరీక్షించారు. బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని, వైరస్ కారణంగా చనిపోయి ఉంటాయని తెలిపారు. పౌల్ట్రీ రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మృతి చెందిన కోళ్లను భూమిలో పాతిపెట్టారు. కోళ్లు మృత్యువాత పడటంతో తీవ్రంగా నష్టపోయానని నిర్వాహకుడు శివ వాపోయాడు.

బర్డ్ ఫ్లూ ఫిర్యాదులకు వాట్సాప్ నంబర్

సాక్షి, హైదరాబాద్: పక్క రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ కేసులు పెరిగిన నేపథ్యంలో.. ఫిర్యాదుల కోసం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కొత్తగా ఒక వాట్సాప్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. చుట్టుపక్కల గ్రామాల్లో లేదా కోళ్ల ఫారాలలో కోళ్లు చనిపోతున్నట్టు తెలిస్తే.. వాట్సాప్ నంబర్ 91007 97300 కు సమాచారాన్ని తెలియజేయాలని అదనపు డైరెక్టర్ మల్లీశ్వరి కోరారు.

అప్పులతో అన్నదాత ఆత్మహత్య



కొమురయ్య

మొగుళ్లపల్లి: పంట దిగుబడి లేక.. చేసిన అప్పులు తీరక.. ఒక రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామంలో శనివారం జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. ఇస్సిపేటకు చెందిన రైతు పండుగ కొమురయ్య (65) తనకున్న 8 ఎకరాల వ్యవసాయ భూమిలో ఇద్దరు కొడుకులతో కలిసి పత్తి, మిరప పంటలు పండిస్తున్నాడు. పంటల దిగుబడి సరిగ్గా రాక, కుటుంబ అవసరాలు, వ్యవసాయ పెట్టుబడికి తీసుకున్న అప్పులు సుమారు రూ.8 లక్షల వరకు అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలని తరచూ బాధపడుతున్న కొమురయ్య.. శనివారం ఉదయం తన మిర్చితోట వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు అతన్ని పరకాలలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఆయువు తీసిన ఆన్‌లైన్ గేమ్స్

- రూ. 50 లక్షలు నష్టపోయి వ్యక్తి ఆత్మహత్య



దేవేందర్

యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం): ఆన్‌లైన్ గేమ్ ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. రూ.50 లక్షలు పోగొట్టుకొని, అప్పులు తీర్చే మార్గం లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి యైటింక్లయిన్ కాలనీ ఏరియాకు చెందిన చొప్పరి దేవేందర్ (35) కార్లను అద్దెకు నడుపుతుండటమే కాకుండా, జూలపల్లిలో బిర్యానీ సెంటర్ కూడా నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడి రూ.50 లక్షలు పోగొట్టుకున్నాడు. దానికితోడు రూ.5 లక్షల వరకు అప్పులుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై, శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు కరీంనగర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. అక్కడి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పరీక్షించి, మార్గమధ్యంలోనే చనిపోయినట్లు తెలిపారు.

ఆడశిశువు అమ్మకం..?

- బాపునగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి..

చెన్నారావుపేట: పుట్టిన కొద్ది రోజులకే ఆడశిశువును అమ్మకానికి పెట్టారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బాపునగర్‌కు గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. బాపునగర్ చెందిన ఒక గిరిజనుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయినప్పటికీ ఆ వ్యక్తి మరో యువతిని వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ఈ విషయం తెలియడంతో పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. రెండో భార్యకు కూడా ఇద్దరు కుమారులు జన్మించారు. కొద్ది రోజుల క్రితం రెండో భార్య నర్సంపేటలోని ఒక ఆస్పత్రిలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. మూడు రోజుల క్రితం ఆడపిల్లను రూ.లక్షకు విక్రయించినట్లు ప్రచారం సాగుతోంది. ఇంటి వద్ద కూడా పాప లేదని స్థానికులు చెబుతున్నారు. గతంలో రెండో భార్య చిన్న కుమారుడిని కూడా విక్రయించినట్లు తెలియడంతో.. ఐసీడీఎస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించినట్లు తెలిసింది.

కాంగ్రెస్ సర్కార్ వైఫల్యంతో రాష్ట్రంలో నీటి సంక్షోభం

- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ లోపంతో ఎడారిలా గోదావరి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సర్కార్ వైఫల్యంతో రాష్ట్రం నీటి సంక్షోభం దిశగా పయనిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాలు గణనీయంగా తగ్గడంపై శనివారం ఒక ప్రకటనలో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణను భూగర్భజల సంరక్షణలో ఆదర్శంగా నిలిపిన గత బీఆర్ఎస్ ప్రభుత్వ నీటి ప్రణాళికలు కాంగ్రెస్ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని మండిపడ్డారు. 'కేసీఆర్ హయాంలో భూగర్భజలాలు 56 శాతం పెరిగాయి. మిషన్ కాకతీయ ద్వారా 27 వేలకు పైగా చెరువులను పునరుద్ధరించడంతో నీటి నిల్వ సామర్థ్యం 8.93 టీఎంసీలకు పెరిగింది. దీంతో సాగు, తాగునీటి రంగాలు బలోపేతమయ్యాయి. కానీ కేవలం 14 నెల ల కాంగ్రెస్ పాలనలోనే ఈ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో భూగర్భ జలమట్టం రెండు మీటర్లకు పైగా పడిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ వైఫల్యంతో 120 కిలోమీటర్ల పొడవునా నీరు లేక గోదావరి నది ఎడారిని తలపిస్తోంది. మేడిగడ్డ బ్యారేజ్ సహా ప్రాజెక్టు నీటి భద్రతను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. మిషన్ భగీరథ పథకం కుంటుపడటంతో తాగునీటి కోసం మళ్లీ బోరుబావులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది'అని హరీశ్‌రావు పేర్కొన్నారు. నీటిపారుదల రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండటంతో వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. ఈ పరిస్థితిని తప్పించడానికి వెంటనే నీటి పరిరక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

తహసీల్దార్‌కు సైబర్ నేరగాళ్ల టోకరా

- అవినీతి సాకుతో అరెస్టు బెదిరింపు
- రూ.2.80 లక్షలు చెల్లించిన తహసీల్దార్



దామోదర్

రాజాపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట తహసీల్దార్ దామోదర్‌కు సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరిట టోకరా ఇచ్చారు. ఈ నెల 9వ తేదీన ఏసీబీ అధికారినంటూ తహసీల్దార్ దామోదర్ ఫోన్ నంబర్‌కు ఒక వ్యక్తి కాల్ చేశాడు. 'నువ్వు అవినీతికి పాల్పడ్డావు.. మా వద్ద సాక్ష్యాలు ఉన్నాయి'.. అని తహసీల్దార్‌ను బెదిరించి డబ్బులు డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే అరెస్ట్ చేస్తామని బెదిరించారు. జూన్‌లో ఉద్యోగ విరమణ చేయనుండటంతో.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోల్పోతానేమోనని తహసీల్దార్ దామోదర్ భయాందోళనకు గురయ్యారు. దీంతో సైబర్ నేరగాడి మాటలకు తలొగ్గి.. తన కుమారుడు, అతని స్నేహితుల నుంచి విడతల వారీగా రూ.2.80 లక్షల వరకు సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాకు పంపించారు. ఆ తర్వాత తనకు వచ్చిన ఫోన్‌కాల్స్ నకిలీవని తెలుసుకున్న తహసీల్దార్, అతని కుమారుడు సోమవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇద్దరు పిల్లలకు విషమిచ్చి.. తానూ తాగి..

- తల్లి మృతి, పిల్లల పరిస్థితి విషమం
- జగిత్యాల జిల్లా మద్దులపల్లిలో దారుణం



హారిక

పెగడపల్లి: ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తల్లి తను కూడా తాగింది. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా, ఇద్దరు పిల్లలు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పెగడపల్లి ఎస్సై రవికిరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంబాల తిరుపతికి జగిత్యాలకు చెందిన హారికతో సుమారు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు కృష్ణంత్ (10), కూతురు మాయంత లక్ష్మి (8) ఉన్నారు. పిల్లలిద్దరూ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. తిరుపతి, హారిక వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో తిరుపతి ఒగ్గు కథలు చెప్పేందుకు వెళ్తుంటాడు. గురువారం మధ్యాహ్నం తిరుపతి ఒగ్గు కథ చెప్పేందుకు వెళ్లాడు. ఏం జరిగిందో ఏమోగానీ సాయంత్రం పిల్లలు స్కూల్ నుంచి వచ్చాక, ఇంట్లో ఎవరూ లేని సమయంలో హారిక (30) తన ఇద్దరు పిల్లలకూ గడ్డి మందు తాగించి తానూ తాగింది. విషయాన్ని వెంటనే తిరుపతికి వీడియోకాల్ చేసి చెప్పింది. కంగారుపడిన తిరుపతి గ్రామంలోని సమీప బంధువుకు తెలపడంతో ఆయన హుటాహుటిన ఇంటికి వెళ్లేసరికి పిల్లలతోపాటు హారిక అపస్మారక స్థితిలో కనిపించింది. వారిని చికిత్స నిమిత్తం ముందుగా జగిత్యాల.. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం హారిక మృతి చెందింది. ఆమె సోదరుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మరింత సమాచారం సేకరించేందుకు హారికతోపాటు తిరుపతి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆఫ్రికాను చీలుస్తూ... ఆరో మహాసముద్రం



మహాసముద్రాలు ఐదు అని చిన్నప్పుడు చదువుకున్నాం. కానీ ఆరు అని మార్చుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఎందుకంటే ఆఫ్రికా ఖండాన్ని రెండుగా చీలుస్తూ శరవేగంగా ఆరో మహాసముద్రం పుట్టుకొస్తోంది. ఆ క్రమంలో అక్కడి పలు దేశాలను ఆఫ్రికా నుంచి విడదీయనుంది. మరికొన్నింటిని కొత్తగా సముద్ర తీర దేశాలుగా మార్చేయనుంది. ఆఫ్రికా దిగువన జరుగుతున్న టెక్టానిక్ ప్లేట్ల కదలికల వల్ల ఇది తప్పదన్నది తెలిసిన విషయమే అయినా, అందుకు కోట్లాది ఏళ్లు పట్టవచ్చని ఇప్పటి దాకా భావించారు. కానీ తాజా పరిణామాలు చూస్తుంటే ఆరో మహాసముద్రం ఆవిర్భావానికి మహా అయితే కొన్ని వేల ఏళ్ల కంటే ఎక్కువ సమయం పట్టకపోవచ్చని పరిశోధకులు బల్ల గుద్ది చెబుతున్నారు!

శరవేగంగా పుట్టుకొస్తోంది

- టెక్టానిక్ ప్లేట్ల కదలికలే కారణం
- విడిపోనున్న ఆఫ్రికా తూర్పు ప్రాంతం
- నడుమ ఖాళీలోకి అపార జలరాశి
- పలు దేశాలకు కొత్తగా తీర రేఖలు

టెక్టానిక్ ఫలకాల కదలికల కారణంగా ఆఫ్రికా ఖండం నిలువునా చీలిపోతోంది. వేలాది ఏళ్లుగా స్థిరంగా జరుగుతూ వస్తున్న ఈ పరిణామం కొంత కాలంగా అనూహ్య రీతిలో వేగం పుంజుకుంది. ఆఫ్రికా ఖండం దిగువన నుబియన్, సోమాలీ, ఖండాంతర టెక్టానిక్ ప్లేట్లలో జరుగుతున్న కదలికలే దీనికి ప్రధాన కారణం. అవి ఏటా ఏకంగా దాదాపు ఒక సెంటీమీటర్ మేరకు దూరం జరుగుతున్నాయి! ఈస్ట్ ఆఫ్రికన్ రిఫ్ట్ సిస్టం (ఈఏఆర్ఎస్)గా పిలిచే ఈ ప్రాంతం ఇది మొజాంబిక్ నుంచి ఇథియోపియా, కెన్యా, టాంజానియా మీదుగా ఎర్రసముద్రం దాకా వేలాది కిలోమీటర్ల మేర విస్తరించింది. దాని పొడవునా భూగర్భంలో వేలాది ఏళ్లుగా అతి నెమ్మదిగా సాగుతూ వస్తున్న నిరంతర టెక్టానిక్ కదలికల పరిణామం కొన్నాళ్లుగా స్పీడందుకుంది. తూర్పు ఆఫ్రికాను నిలువునా చీలుస్తోంది. ఫలితంగా చివరికి తూర్పు ఆఫ్రికా క్రమంగా మిగతా ఖండం నుంచి పూర్తిగా విడిపోనుంది. వాటి మధ్య ఏర్పడే ఖాళీలో ఏకంగా 10 వేల బిలియన్ గ్యాలన్ల పై చిలుకు అపార జలరాశి నిండిపోయి సరికొత్త మహాసముద్రంగా రూపుదిద్దుకోనుంది. ఇందుకు సంబంధించిన నిదర్శనాలు ఇప్పటికే కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఇథియోపియాలో 2005 నాటికే ఏకంగా 60 మైళ్ల పొడవున లోతైన గుంత ఏర్పడింది. ఇది పలుచోట్ల ఏకంగా 20 మీటర్ల పై చిలుకు లోతుంది! 2018లో కెన్యాలో కూడా ఇలాంటి భారీ పగుళ్లు పుట్టుకొచ్చాయి.

కారణాలెన్నో...

టెక్టానిక్ కదలికలతో పాటు భూమి లోపలి పొరల్లోని శిలాజ ద్రవం తూర్పు ఆఫ్రికా చీలికను మరింత వేగవంతం చేస్తోంది. క్రమంగా లోపలి పొర పూర్తిగా పగుళ్లిచ్చి భారీ లోయల పుట్టుకకు దారితీస్తుంది. అగ్నిప్రమాద కార్యకలాపాలను పెంచుతుంది. 2005లో ఇథియోపియాలో కేవలం కొన్ని వారాల వ్యవధిలోనే ఏకంగా 420కి పైగా భూకంపాలు నమోదయ్యాయి. ఈ పరిణామం సైంటిస్టులతో పాటు పరిశోధకులను కూడా ఎంతగానో ఆశ్చర్యపరిచింది. ఆఫ్రికా ఖండం దిగువ భూఫలకాల్లో మార్పులు శరవేగంగా జరుగుతున్నాయనేందుకు ఇది తిరుగులేని నిదర్శనమని వారంటున్నారు. ఇకపై ఆఫ్రికాలో మరిన్ని భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్ల వంటి పరిణామాలను చూడనున్నామని తులానే వర్సిటీ జియో సైంటిస్టు సింథియా ఎబింగర్ చెప్పుకొచ్చారు.

అట్లాంటిక్ ఇలాగే పుట్టింది...

మహాసముద్రాల్లో వయసురీత్యా అట్లాంటిక్ అన్నింటికంటే చిన్నది. ప్రస్తుత ఆఫ్రికా ఖండం తరహా పగుళ్లే లక్షలాది ఏళ్ల క్రితం దాని పుట్టుకకు దారితీసినట్టు సైంటిస్టులు చెబుతారు. తర్వాత మళ్లీ ఇంతకాలానికి మరో మహాసముద్రం పుట్టుకకు దారి తీయగల స్థాయిలో ఓ ఖండం నిలువునా చీలుతోంది. మహాసముద్రాల ఆవిర్భావ క్రమాన్ని అర్థం చేసుకునేందుకు ఇది చాలా అరుదైన అవకాశమని సైంటిస్టులు అంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కొత్త ఖండం కూడా...

ఆఫ్రికా చీలిక ఆరో మహాసముద్రంతో పాటు కొత్త ఖండం పుట్టుకకు కూడా దారితీయనుంది. ఎందుకంటే సోమాలియా, కెన్యా, టాంజానియా వంటి దేశాలు ఆఫ్రికా నుంచి పూర్తిగా విడిపోతాయి. ఆరో సముద్రం ఆ మధ్యలో విస్తరిస్తుంది.

లక్షల్లో నిర్వాసితులు...

వాతావరణ మార్పుల దెబ్బకు ఆఫ్రికా ఖండంలో ఇప్పటికే 1.5 కోట్ల మందికి పైగా నిర్వాసితులయ్యారు. ఆ ఖండంలో ఏర్పడుతున్న చీలిక వల్ల పలు దేశాల్లో జీవజాలం తీవ్రంగా ప్రభావితం అవుతుంది. దాంతో మొత్తంగా వాటి ఆర్థిక పరిస్థితులే తారుమారు కానున్నాయి. దాంతో పొట్ట చేత పట్టుకుని వలస వెళ్లే వారి సంఖ్య ఊహాతీతంగా పెరిగిపోనుంది. కొత్త మహాసముద్రం ఆఫ్రికా భౌగోళిక స్వరూపాన్నే సమూలంగా మార్చనుంది. పలు దేశాల ఆర్థిక, పర్యావరణ, మౌలిక వ్యవస్థలనే తలకిందులు చేయనుంది. చుట్టూ భూభాగాలతో కూడిన జాంబియా, ఉగాండా వంటి దేశాలు కొత్త సముద్ర తీర ప్రాంతాలు మారిపోతాయి. దాంతో కొత్త వర్తక మార్గాలు, ఆ దేశాల్లో నౌకాశ్రయాల వంటివి పుట్టుకొస్తాయి. అలా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలే సమూలంగా మారిపోతాయి. సరికొత్త సముద్ర వాతావరణ పరిస్థితులు కొత్త ఆవాస ప్రాంతాలుగా మారతాయి. ఈ పరిణామం జీవవైవిధ్యంలో చెప్పుకోదగ్గ మార్పులకు దారి తీస్తుంది. అదే సమయంలో సముద్రమట్టంలో పెరుగుదల మరింత వేగంపుంజుకుంటుంది. భూభాగాల్లో మార్పుచేర్పులు చోటుచేసుకుంటాయి. అంతేగాక పలుచోట్ల తరచుగా తీవ్ర భూకంపాలు సంభవించవచ్చు. ఇలాంటి పరిణామాల వల్ల వచ్చిపడే తీవ్రమైన రిస్కులను ఎదుర్కొనేందుకు పలు దేశాలు ఇప్పటినుంచే సిద్ధపడాల్సి ఉంటుంది. కొత్త మహాసముద్రం ఆవిర్భావం వేలాది ఏళ్ల తర్వాత జరిగినా ఆ క్రమంలో తలెత్తే పరిణామాలు ఆఫ్రికా ఖండంపై సమీప భవిష్యత్తు నుంచే కొట్టొచ్చినట్టుగా కన్పించడం మొదలవుతుంది.

భూగోళం నిరంతరం పరిణామం చెందుతున్న తీరుకు ఈ పరిణామం మరో తాజా ఉదాహరణ. దీని ప్రభావాలను పూర్తిగా అర్థం చేసుకునే ప్రయత్నంలో భూభౌతిక శాస్త్రవేత్తలు ఇప్పటికే తలమునకలయ్యారు. ఎందుకంటే తూర్పు ఆఫ్రికాలో జరుగుతున్నది కేవలం భౌగోళికపరమైన మార్పు మాత్రమే కాదు. సుదూర భవిష్యత్తులో మరిన్ని ఖండాలు విడిపోయి కొత్త మహాసముద్రాల పుట్టుక వంటివి జరిగి చివరికి మనకిప్పుడు తెలిసిన ప్రపంచమే సమూలంగా, శాశ్వతంగా మారిపోతుందనడానికి తిరుగులేని నిదర్శనం. ఆరో మహాసముద్రం ఆవిర్భావంతో ప్రపంచ భౌగోళిక స్వరూపంతో పాటు పర్యావరణ వ్యవస్థలు కూడా సమూల మార్పులకు లోనవడం ఖాయమని భూభౌతిక శాస్త్రవేత్తలు కుండబద్దలు కొడుతున్నారు.

కేజ్రీవాల్ 'శీష్ మహల్' అక్రమాలపై దర్యాప్తునకు సీవీసీ ఆదేశాలు

బీజేపీ నేత విజేందర్ గుప్తా వెల్లడి

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ అధికార నివాస భవనం నిర్మాణంలో అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమికంగా రుజువైనందున దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ) సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్(సీపీడబ్ల్యూడీ)ని ఆదేశించింది. ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని బంగ్లాను విస్తరించడం, అలంకరణ కోసం చేసిన దుబారా వ్యయంపై బీజేపీ నేత విజేందర్ గుప్తా గతేడాది అక్టోబర్ 14వ తేదీన సీవీసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై అదే నెల 16న కేసు నమోదు చేసిన సీవీసీ.. ప్రాథమిక దర్యాప్తు చేపట్టాలంటూ సీపీడబ్ల్యూడీని ఆదేశించింది. ఢిల్లీ సీఎంగా 2015 నుంచి గతేడాది అక్టోబర్ వరకు పనిచేసిన కేజ్రీవాల్ ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డులోని రెండు ప్రభుత్వ బంగళాలు, రాజ్‌పూర్‌లోని రోడ్డులోని 45, 47 నంబర్ ప్లాట్లలోని నిర్మాణాలను కూలగొట్టి మొత్తం 40 వేల చదరపు గజాల విస్తీర్ణంలో ప్రభుత్వ నిధులతో విలాసవంతమైన భవనం 'శీష్ మహల్'ను నిర్మించారన్నారు. ఈ భవనానికి ఎలాంటి లేఔట్ అనుమతులు లేవని, నిర్మాణంలో నిబంధనలను ఉల్లంఘించారని విజేందర్ గుప్తా ఆరోపించారు. విచారణ జరిపిన సీపీడబ్ల్యూడీ విభాగం ఈ ఆరోపణలు నిజమేనంటూ సీవీసీకి డిసెంబర్ 5న ప్రాథమిక నివేదిక అందించింది. అనంతరం విజేందర్ గుప్తా సీవీసీకి మరో ఫిర్యాదు చేశారు. భవన పునర్నిర్మాణ, ఇంటీరియర్ డెకొరేషన్ పనుల్లో మితిమీరి వ్యయం జరిగిందని అందులో పేర్కొన్నారు. విలాసవంతమైన సౌకర్యాల కోసం ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేశారని తెలిపారు. భవనంలో ఏర్పాటు చేసిన టీవీ కొనుగోలుకు రూ.77 లక్షలు, సిల్క్ కార్పెట్‌కు రూ.50 లక్షలు, రైలింగ్ కోసం రూ.42 లక్షలు, వేడి నీటి జనరేటర్ కోసం రూ.18 లక్షలు, టాయిలెట్ సీట్లకు రూ.12 లక్షలు ఖర్చు చేశారని అందులో తెలిపారు. దీనిపై స్పందించిన సీవీసీ సవివరంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఈ నెల 13న సీపీడబ్ల్యూడీని ఆదేశించిందని బీజేపీ నేత, తాజా ఎమ్మెల్యే విజేందర్ గుప్తా శనివారం మీడియాకు వివరించారు.

రష్యా పైకి 'ఆర్మీ ఆఫ్ యూరప్'

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రతిపాదన



మ్యూనిక్: యూరప్ ఖండానికి అవసరమైన సాయం అందించేందుకు అమెరికా సిద్ధంగా లేదని అర్థమవుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో యూరప్ దేశాలు రష్యా దురాక్రమణ నుంచి తమను తాము రక్షించుకునేందుకు 'ఆర్మీ ఆఫ్ యూరప్'ను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. జర్మనీలోని మ్యూనిక్‌లో జరుగుతున్న సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో జెలెన్‌స్కీ మాట్లాడారు. తమ ప్రమేయం లేకుండా, తమకు తెలియకుండా చేసుకునే ఒప్పందాలను ఉక్రెయిన్ అంగీకరించబోదని ఆయన తేల్చి చెప్పారు. అదేవిధంగా, యూరప్‌కు సంబంధించిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు యూరప్ దేశాలకు కూడా ఆ చర్చల్లో స్థానం కల్పించాలన్నారు. శాంతి చర్చలు ప్రారంభించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ సిద్ధమయ్యారంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ఆయనీ విధంగా వ్యాఖ్యానించారు. యూరప్, అమెరికాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న బంధం ఇక ముగిసినట్లేనంటూ అమెరికా ఉపాధ్యక్షుడు శుక్రవారం సదస్సులో పేర్కొన్న విషయాన్ని జెలెన్‌స్కీ గుర్తు చేస్తూ..'ఇప్పటి నుంచి కొత్త పరిణామాలు సంభవించనున్నాయి. వీటికి యూరప్ సమాయత్తం కావాల్సి ఉంది'అని అన్నారు. 'ఇతర దేశాల నుంచి మనకు బెదిరింపులు ఎదురైతే తమకు సంబంధం లేదని అమెరికా తెగేసి చెప్పేందుకు అవకాశముందనే విషయం ఇప్పుడు మనం తెలుసుకోవాలి. అమెరికాపై ఆధారపడకుండా యూరప్ సొంత సైన్యాన్ని సిద్ధం చేసుకోవాలంటూ గతంలో ఎందరో నేతలు చెప్పారు. అవును, మనకిప్పుడు సైన్యం కావాలి. అదే ఆర్మీ ఆఫ్ యూరప్'అని ఆయన స్పష్టం చేశారు.ముఖాముఖి చర్చలకు అంగీకరించడం ద్వారా పుతిన్ అమెరికాను ఏకాకిగా మార్చారన్నారు.

మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కరించుకోవాలి

కొన్ని వివాదాలు కోర్టు రూమ్‌ల్లో విచారణకు సరిపడవు: సీజేఐ



ముంబై: అన్ని రకాల వివాదాలను కోర్టురూమ్‌ల దాకా తీసుకురావాల్సిన అవసరం లేదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా చెప్పారు. కొన్ని వివాదాలు కోర్టురూమ్‌ల్లో విచారణకు సరిపడవని అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. మధ్యవర్తులతో చాలాసార్లు అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో సృజనాత్మక పరిష్కారాలు లభిస్తాయని, మనుషుల మధ్య బంధాలు బలపడతాయని వెల్లడించారు. వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం కూడా ఒక చక్కటి మార్గమని పేర్కొన్నారు. శనివారం నాగపూర్‌లో మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(ఎంఎన్ఎల్‌యూ) మూడో స్నాతకోత్సవంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా మాట్లాడారు. ప్రతి కేసునూ చట్టపరమైన అంశం అనే కోణంలో చూడొద్దని, వాటిని మానవీయ కథనాలుగా పరిగణించాలని చెప్పారు. మన దేశంలో కక్షిదారులకు న్యాయ సహాయం అందించే వ్యవస్థ చాలా బలంగా ఉందన్నారు. ప్రపంచంలో ఇలాంటిది బహుశా ఎక్కడా లేకపోవచ్చని వ్యాఖ్యానించారు. మన దగ్గర కక్షిదారులందరికీ ఏదోరకంగా న్యాయ సహాయం లభిస్తోందన్నారు. ఏవైనా వివాదాలు తలెత్తగానే కోర్టుల్లో వ్యాజ్యాలు, విచారణల వరకూ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మధ్యవర్తుల ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమం అని వివరించారు. అక్కడ కొన్నిసార్లు అవును లేదా కాదు అనే మాటలతోనే వివాదాలు పరిష్కారమవుతుంటాయని గుర్తుచేశారు. మధ్యవర్తిత్వం అనే మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా మనుషుల మధ్య, వ్యాపార సంస్థల మధ్య సంబంధాలు బలపడతాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా ఉద్ఘాటించారు.

మరో ముగ్గురు బందీల విడుదల

ప్రతిగా 369 మంది ఖైదీలను వదిలేస్తున్న ఇజ్రాయెల్



ఖాన్ యూనిస్‌లో బందీలను తీసుకువచ్చిన హమాస్ శ్రేణులు

ఖాన్ యూనిస్(గాజా స్ట్రిప్): ఇజ్రాయెల్, హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ప్రశాంతంగా మరో అంకాన్ని దాటింది. శనివారం తమ అధీనంలోని బందీల్లో ముగ్గురిని హమాస్ వదిలేసింది. ఇజ్రాయెల్, అర్జెంటీనా ద్వంద్వ పౌరసత్వం ఉన్న 46 ఏళ్ల ఇయెర్ హోర్న్, 36 ఏళ్ల అమెరికన్ ఇజ్రాయెలీ సగుయీ డెకెల్ చెన్, 29 ఏళ్ల రష్యన్ ఇజ్రాయెలీ అలెగ్జాండర్ సాశా ట్రౌఫనోవ్‌లను హమాస్ వదిలేసింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ పట్టణంలో వీళ్లను రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులకు అప్పగించింది. విడుదలైన బందీల వాహనాలు ఇజ్రాయెల్‌కు బయల్దేరాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ముగ్గురిని 16 నెలల క్రితం 2023 అక్టోబర్ ఏడో తేదీన కిబ్బుట్జ్ నీర్ ఓజ్ అనే ప్రాంతంలో హమాస్ కిడ్నాప్‌చేసిన సంగతి తెల్సిందే. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని, అందుకు ప్రతిగా శనివారం నాటి బందీల విడుదల ప్రక్రియను వాయిదావేస్తామని గతంలో హమాస్ ప్రకటించడంతో గత కొద్దిరోజులుగా తీవ్ర ఉత్కంఠ నెలకొన్న విషయం తెల్సిందే. అయితే శనివారం మధ్యాహ్నం కల్లా బందీలు విడుదలకాకుండా నరకం చూపిస్తానని హమాస్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడంతో గత షెడ్యూల్ ప్రకారమే శనివారమే ముగ్గురు బందీల ప్రక్రియ సజావుగా సాగింది. దీంతో బందీల కుటుంబసభ్యులు, ఇజ్రాయెల్ వాసులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఇజ్రాయెల్ నగరం టెల్అవీవ్‌లోని 'హోస్టేజెస్ స్క్వేర్'లో సంబరాలు చేసుకున్నారు. బందీల విడుదలకు ప్రతిగా ఇజ్రాయెల్ జైళ్లలోని 369 మంది ఖైదీల విడుదల ప్రక్రియ మొదలైంది. తొలి బ్యాచ్ ఖైదీల బస్సు వెస్ట్ బ్యాంక్‌లోని బెటూనియా పట్టణానికి చేరుకుంది. మరో బస్సు రమాల్లాకు చేరుకుంది. ఎక్కువ మందిని గాజాకు తీసుకొస్తున్నారు. ఈ 369 మందిలో 36 మంది ఇజ్రాయెల్ జైళ్లలో జీవితఖైదు అనుభవిస్తున్నారు. మిగతా వారిని ఎలాంటి నేరనిరూపణ లేకుండా కారాగారంలో బంధించారని పాలస్తీనియన్ ఖైదీల తరపు విభాగం ఆరోపించింది. యావజ్జీవశిక్ష పడి విడుదలైన వారిలో 24 మందిని ఈజిప్ట్‌కు తరలిస్తున్నారు. మిగతా 12 మందిని వెస్ట్‌బ్యాంక్, ఈస్ట్ జెరూసలేంలకు పంపిస్తున్నారు. జనవరి 19న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకిరాగా అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆరుసార్లు బందీలు, ఖైదీల పరస్పర విడుదల ప్రక్రియ జరిగింది. శనివారం ముందు వరకు హమాస్ నుంచి 21 మంది బందీలు, ఇజ్రాయెల్ జైళ్ల నుంచి 730కిపైగా ఖైదీలు విడుదలయ్యారు.

బందీల విడుదలసరే ట్రంప్ సంగతేంటి?

బందీల విడుదలతో ఆనందపడాలో, ఇక్కడి వారందరినీ ఈజిప్ట్, జోర్డాన్‌లకు తరలిస్తానన్న ట్రంప్ ప్రకటనకు భయపడాలో తెలీక పాలస్తీనియన్ల ముఖాల్లో గందరగోళం నెలకొంది. స్వస్థలంలో ఉండబోనప్పుడు అసలు బందీల విడుదలకు అర్థమేముందని పాలస్తీనియన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యుద్ధం ధాటికి 23 లక్షల మంది పాలస్తీనియన్లలో ఇప్పటికే 90 శాతం మంది ప్రాణభయంతో పారిపోయి వేరే ప్రాంతాల్లో శరణార్థులుగా తలదాచుకుంటున్నారు. చాలా మంది పొరుగుదేశాలకు వెళ్లిపోయారు. యుద్ధం మొదలైననాటి నుంచి దాదాపు 48,000 మంది చనిపోయారు. లక్షలాది మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో మిగిలి ఉన్న ఆ కొద్దిమందిని కూడా తరలించేస్తానని ట్రంప్ ప్రకటించడంపై అరబ్ దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం తెల్సిందే.

మత మార్పిళ్లు ▸ లవ్ జిహాద్‌పై నిషేధం!

- చట్టం తీసుకురావాలని మహారాష్ట్ర ప్రభుత్వం యోచన
- అధ్యయనం కోసం ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు
- ప్రేమ లేదా పెళ్లిపై ప్రభుత్వం జోక్యం ఏమిటని మండిపాటు

ముంబై: బలవంతపు మత మార్పిళ్లు, లవ్ జిహాద్‌ను నిషేధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు ఒక చట్టం తీసుకురావాలని భావిస్తోంది. దీనిపై న్యాయపరమైన అంశాల అధ్యయనం కోసం ఏడుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి రాష్ట్ర డీజీపీ సంజయ్ వర్మ సారథ్యం వహిస్తారు. మహిళా–శిశు సంక్షేమ శాఖ, మైనార్టీ వ్యవహారాల శాఖ, న్యాయం–న్యాయ వ్యవస్థ శాఖ, సామాజిక న్యాయం–ప్రత్యేక సాయం విభాగం కార్యదర్శులు, హోంశాఖ ఉప కార్యదర్శులను ఈ కమిటీలో సభ్యులుగా నియమించారు. ఈ మేరకు దేవేంద్ర ఫడ్నవీస్ సర్కారు శుక్రవారం రాత్రి ఒక ఉత్తర్వు జారీ చేసింది. రాష్ట్రంలో కొనసాగుతున్న బలవంతపు మత మార్పిళ్లు, లవ్ జిహాద్ కేసులపై ప్రస్తుత పరిణామాలను కమిటీ అధ్యయనం చేస్తుంది. వీటికి అడ్డుకట్ట వేయడానికి చేపట్టాల్సిన చర్యలను ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. మత మార్పిళ్లు, లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాలను సమగ్రంగా పరిశీలిస్తుంది. మహారాష్ట్రలో కొత్త చట్టం ఎలా ఉండాలన్న దానిపై ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వనుంది.

శ్రద్ధా వాకర్ కేసు

మహారాష్ట్రలో చోటుచేసుకున్న శ్రద్ధా వాకర్ హత్యోదంతం నేపథ్యంలో లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. 27 ఏళ్ల శ్రద్ధా వాకర్ 2022లో దారుణ హత్యకు గురయ్యారు. ఆమెతో సహజీవనం చేస్తున్న అఫ్తాబ్ పూనావాలా అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడ్డాడు. శ్రద్ధా వాకర్ మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికేశాడు. అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

హిట్లర్ సంస్కృతి వద్దు

మత మార్పిళ్లు, లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా చట్టం తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయానికి రావడం, ఇందుకోసం కమిటీని ఏర్పాటు చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుపట్టాయి. హిట్లర్ సంస్కృతిని మన దేశంలోకి తీసుకురావొద్దని డిమాండ్ చేశాయి. ప్రేమ లేదా పెళ్లి అనేవి వ్యక్తిగత అంశాలని, వాటిపై ప్రభుత్వం జోక్యం ఏమిటని ఎన్సీపీ(శరద్ పవార్) నేత సుప్రియా సూలే ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ముస్లింలను వేధించడానికి, సమాజంలో మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబూ అజ్మీ ఆరోపించారు. 18 ఏళ్లు దాటినవారు సహజీవనం చేయొచ్చు గానీ ఇతర మతస్తులను పెళ్లి చేసుకోవద్దని, మతం మారొద్దని ప్రభుత్వం చెబుతోందని అన్నారు. అసలు మన దేశంలో లవ్‌జిహాద్ అనేదే లేదని స్పష్టంచేశారు. భారత్ సెక్యులర్ దేశమని కాంగ్రెస్ పార్టీ నేత హుసైన్ దాల్వాయి గుర్తుచేశారు. ప్రజలు తమకు ఇష్టమైన మతం ఆచరించవచ్చని తెలిపారు. మన దేశంలోకి హిట్లర్ సంస్కృతిని తీసుకురావాలన్నదే బీజేపీ ప్రయత్నమని విమర్శించారు. దయచేసి అలాంటి ప్రయత్నాలు ఆపాలని కోరారు. అయితే, మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ ఎమ్మెల్యే మంగళ్ లోధా సమర్థించారు. దేశంలో లవ్‌జిహాద్ కేసులు నానాటికీ పెరిగిపోతున్నాయని చెప్పారు. వీటిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రద్ధా వాకర్ ఎన్ని ముక్కలైందో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. లవ్‌జిహాద్‌ను అడ్డుకుంటామని చెబితే ప్రతిపక్షాలకు నొప్పేమిటో అర్థం కావడం లేదన్నారు.

లవ్‌జిహాద్ అంటే?

హిందూ యువతులను ప్రేమించి, పెళ్లి చేసుకొని ముస్లిం మతంలోకి మార్చడమే లవ్ జిహాద్. దేశంలో కొన్ని ఇస్లామిక్ సంస్థలు ఉద్దేశపూర్వకంగా లవ్‌జిహాద్ సాగిస్తున్నాయని, వాటికి విదేశాల నుంచి నిధులు అందుతున్నాయని పలు హిందూ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ముస్లిం యువకులను రెచ్చగొట్టి, హిందూ యువతులపై వల విసిరేలా ప్రేరేపిస్తున్నాయని చెబుతున్నాయి. లవ్‌జిహాద్ పేరిట మత మార్పిళ్లే లక్ష్యంగా పెద్ద కుట్ర జరుగుతోందని అంటున్నాయి. లవ్‌జిహాద్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని మహారాష్ట్రలో గతేడాది మహాయుతి ప్రభుత్వం ప్రకటించింది.

అమెరికా నుంచి తిరిగొచ్చిన మరో 116 మంది వలసదారులు

అమృత్‌సర్: అమెరికా నుంచి భారత అక్రమ వలసదారులతో కూడిన రెండో విమానం శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో అమృత్‌సర్ విమానాశ్రయంలో ల్యాండయింది. రాత్రి 10 గంటలకు రావాల్సిన ఈ విమానం ఆలస్యమైంది. ఈ విమానంలో 119 మంది వలసదారులను పంపుతామని అమెరికా అధికారులు ప్రకటించినా, 116 మంది మాత్రం వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీరిలో అత్యధికంగా పంజాబ్‌కు చెందిన 65 మంది ఉన్నారు. ఆ తర్వాత హరియాణాకు చెందిన 33 మంది, గుజరాత్ నుంచి 8 మంది, యూపీ, గోవా, మహారాష్ట్ర, రాజస్తాన్‌ల నుంచి ఇద్దరు చొప్పున, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీరంతా 18–30 ఏళ్ల మధ్య వారేనని అధికార వర్గాలు తెలిపాయి. అమెరికా నుంచి మొదటి విడతలో ఈ నెల 5న 104 మంది అక్రమ వలసదారులు భారత్‌కు రావడం తెలిసిందే.

డిపోర్టేషన్‌కు అమృతసర్‌నే ఎందుకు?: పంజాబ్ సీఎం మాన్

చండీగఢ్: భారతీయ అక్రమ వలసదారులతో కూడిన రెండో విమానం కూడా అమృత్‌సర్‌లోనే ల్యాండవడంపై పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పవిత్ర నగరాన్ని డిపోర్ట్ సెంటర్‌గా మార్చవద్దని ఆయన కేంద్రాన్ని కోరారు. శనివారం రాత్రి అమెరికా నుంచి 119 మంది వలసదారులను తీసుకుని ప్రత్యేక విమానం రానున్న నేపథ్యంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. దేశంలో వైమానిక కేంద్రాలు చాలానే ఉన్నాయని, వలసదారుల విమానాలను అక్కడికి కూడా పంపించ వచ్చని పేర్కొన్నారు. ఇక్కడి వారిని వాటికన్ సిటీకి పంపిస్తామంటే అనుమతిస్తారా? అని ప్రశ్నించారు. మన వాళ్ల కోసం విమానాలను పంపుతామని ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు చెప్పాలని సూచించారు. ఇతన దేశాలు ఇలాగే చేస్తున్నాయన్నారు.

ఇతర దేశాలనూ గౌరవించండి

- మీది మాత్రమే ప్రజాస్వామ్యం కాదు
- పశ్చిమ దేశాలకు జైశంకర్ చురకలు
- జర్మనీ భద్రతా సదస్సులో ప్రసంగం



సమావేశంలో మాట్లాడుతున్న జైశంకర్

మ్యూనిచ్: తాము మాత్రమే ప్రజాస్వామ్య విలువల్ని పాటిస్తామని, మిగతా దేశాలకు వాటి గురించి కొత్తగా నేర్పిస్తున్నట్లు తరచూ హితబోధ చేసే పశ్చిమదేశాలకు భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ గట్టి సమాధానమిచ్చారు. జర్మనీలోని మ్యూనిచ్ నగరంలో జరుగుతున్న భద్రతా సదస్సులో ''ఓటేసేందుకు జీవించే ఉందాం: ప్రజాస్వామ్య సవాళ్లను ఎదుర్కొందాం'' అంశంపై బృందచర్చలో ఆయన ప్రసంగించారు. తమ దేశాల్లో మాత్రమే ప్రజాస్వామ్యం ఉన్నట్లు పశ్చిమ దేశాలు భావిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా పశ్చిమదేశాల వైఖరిని ఖండిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. ''ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలని మీరు(పశ్చిమదేశాలు) నిజంగా భావిస్తే వివిధ దేశాల్లో విజయవంతంగా అమలవుతున్న ప్రజాస్వామ్య విధానాలను మీరూ ఆదరించాల్సిందే. కుండబద్దలు కొట్టినట్లు చెప్పాలంటే పశ్చిమదేశాలు తమ దేశాల్లో మాత్రమే ప్రజాస్వామ్యం ఉన్నట్లు మాట్లాడుతున్నాయి. గ్లోబల్ సౌత్ దేశాలపై ప్రజాస్వామ్యేతర విధానాలను ఈ పశ్చిమదేశాలు రుద్దుతున్నాయి. పశ్చిమదేశాలు సొంత గడ్డపై ప్రజాస్వామ్యానికి ఎంత విలువ ఇస్తాయో గ్లోబల్ సౌత్ దేశాల ప్రజాస్వామ్యానికీ అంతే విలువ ఇవ్వాలి. ఇంటి విధానాలను బయటా ఆచరించి చూపండి''అని వ్యాఖ్యానించారు. ఇతర దేశాల్లోని విజయాలను గ్లోబల్ సౌత్ దేశాలూ అందిపుచ్చుకుంటాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

ప్రజాస్వామ్యం అన్నం పెడుతుంది

ప్రజాస్వామ్యం అన్నం పెట్టదని సెనేటర్ ఎలిసా చేసిన వ్యాఖ్యలను జైశంకర్ పరోక్షంగా తప్పుబట్టారు. ''మీరు చెప్పేది తప్పు. వాస్తవానికి ప్రపంచంలో ప్రజాస్వామ్యం ఆహారాన్ని అందించగలదు. భారత ప్రజాస్వామ్య సమాజంలో ప్రజలకు మేం పౌష్టికాహారం అందిస్తున్నాం. 80 కోట్ల మందికి(రేషన్ ద్వారా) ఆహార భరోసా కల్పించాం. వాళ్లిప్పుడు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు, వాళ్ల కడుపులు నిండాయా లేదా అనేది ప్రధానం ''అని అన్నారు.

భారత ప్రజాస్వామ్యంపై..

''ఇటీవలే నా సొంత రాష్ట్రం ఢిల్లీ(అసెంబ్లీ ఎన్నిక)లో ఓటేశా. నా వేలికి ఉన్న ఈ సిరా గుర్తు ఆ ఓటుదే. గత ఏడాది భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అర్హులైన ఓటర్లలో మూడింట రెండొంతుల మంది ఓటేశారు. అంటే 90 కోట్ల మందిలో ఏకంగా 70 కోట్ల మంది ఓటేశారు. ఇన్ని కోట్ల ఓట్లను మేం ఒకే రోజులో లెక్కించాం''అని అన్నారు. ఈ చర్చలో జైశంకర్‌తోపాటు నార్వే ప్రధాని జొనాస్ గహర్ స్టోర్, అమెరికా సెనేట్ సభ్యురాలు ఎలిసా స్లోట్‌కిన్, వార్సా నగర మేయర్ రాఫల్ ట్రజస్కోవ్స్కీ పాల్గొన్నారు.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



ఒక శాతం పిల్లలకు పుట్టుకతోనే..
ప్రతి వెయ్యిమందిలో సుమారు 10 మంది పిల్లల్లో పుట్టుకతోనే గుండె జబ్బులు వెలుగు చూస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో వీరు సుమారు 20 వేలమంది ఉంటున్నారని అంచనా. -10లో



రైట్.. రైట్.. మిల్లెట్.. డైట్
ఆరోగ్యార్థుల్లో తృణ ధాన్యాలపై అవగాహన పెరుగుతోంది. నగర వాసుల్లో విభిన్న రకాలుగా వాటిని ఆహారంలో భాగం చేసుకోవడం పట్ల ఆసక్తి వ్యక్తమవుతోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.0/17.0
నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

బీఎండబ్ల్యూ కారు ఢీ.. ట్రాఫిక్ పోలీస్ బూత్ ధ్వంసం

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ఘటన



కారు ఢీకొట్టడంతో విరిగిపడిన ట్రాఫిక్ పోలీసు బూత్, దిమ్మెలు

బంజారాహిల్స్: మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టడంతో జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో ట్రాఫిక్ పోలీసు బూత్ పూర్తిగా ధ్వంసమైంది. డివైడర్లు, దిమ్మెలు విరిగిపడ్డాయి. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. దోమలగూడకు చెందిన ప్రముఖ వ్యాపారి ఆయుష్ మాలిక్ శుక్రవారం రాత్రి జన్వాడ ఫామ్‌హౌస్‌లో తన స్నేహితుడి విందుకు హాజరయ్యాడు. రాత్రంతా అక్కడే ఉండి తెల్లవారుజామున 4 గంటలకు బయలుదేరాడు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వస్తుండగా ఆయన ముందు రెండు కార్లు ఇష్టానుసారంగా నడుపుతుండగా చూసుకుని నడపాలంటూ చెప్పే క్రమంలో బయటకు తల తిప్పి చూడడంతో కారు అదుపుతప్పి ట్రాఫిక్ పోలీసు బూత్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కారు మొత్తం పూర్తిగా దెబ్బతింది. ఎయిర్‌బెలూన్స్ తెరుచుకోవడంతో ఆయుష్ మాలిక్ క్షేమంగా బయటపడ్డాడు. జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆయుష్‌కు డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేయగా మద్యం తాగలేదని తేలింది. కారు మాలిక్ జెమ్స్ అండ్ జ్యువెలరీ పేరుతో రిజిస్ట్రేషన్ అయ్యిందని, రెండు పెండింగ్ చలాన్లు కూడా ఉన్నాయని పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కులగణనలో నమోదు కాని వారికి మరో అవకాశం

నేటి నుంచి ఈ నెల 28 వరకు సర్వే

సాక్షి, సిటీబ్యూరో: కుల గణనలో ఇప్పటివరకు నమోదు కానివారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిన నేపథ్యంలో.. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ 040-21111111ను ఏర్పాటు చేశారు. ఇది ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుంది. ఇప్పటి వరకు కుల గణనలో నమోదు కాని కుటుంబ సభ్యులు మాత్రమే కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తమ మొబైల్ నంబర్, అడ్రస్‌తో పాటు పోస్టల్ పిన్ కోడ్ నంబర్ చెప్పాలి. నేటి నుంచి ఈ నెల 28 వరకు సర్వే కొనసాగుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

మెట్రో రైల్ కారిడార్లతో మారనున్న నగర రూపురేఖలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలనే సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షను నెరవేర్చే దిశగా మెట్రో రైల్ విస్తరణ కార్యక్రమాలను చేపడుతోందని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) గ్రీన్ తెలంగాణ సమ్మిట్- 2025లో భాగంగా జరిగిన గ్రీన్ క్రూసేడర్స్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. మేడ్చల్, శామీర్‌పేట్, ఫ్యూచర్ సిటీ మార్గాల్లో రాబోయే మెట్రో కారిడార్లకు సంబంధించి డీపీఆర్ వచ్చే మార్చికల్లా సిద్ధం చేస్తామన్నారు. కొత్త మెట్రో మార్గాలు హైదరాబాద్ రూపురేఖలనే మార్చివేస్తాయన్నారు. కార్యక్రమంలో ఐజీబీసీ నేషనల్ వైస్ చైర్మన్ సి.శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఆఖరి దశలో అదిరే జనం!

నుమాయిష్‌కు సందర్శకులు పోటెత్తారు. శనివారం సుమారు 83 వేల మంది వచ్చినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్ రెడ్డి, బుకింగ్ కన్వీనర్ వనం సత్యేందర్ తెలిపారు. ఎగ్జిబిషన్ ముగింపు దశకు రావడంతో స్టాళ్లన్నీ సందర్శకులతో కిక్కిరిసిపోతున్నాయి. నుమాయిష్ ఈ నెల 17న ముగియనుంది. - అబిడ్స్

గాడి తప్పిన ఆర్టీఏ!

- విధి నిర్వహణలో సమన్వయ లోపం
- ఇన్‌చార్జుల ఏలుబడిలో పలు ప్రాంతీయ రవాణా కేంద్రాలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది అధికారులు

పౌరసేవల్లో కొరవడిన పారదర్శకత



సాక్షి, సిటీబ్యూరో:

అది గ్రేటర్ హైదరాబాద్‌లోని ఓ ప్రాంతీయ రవాణా కార్యాలయం. వందలాది మంది వాహనదారులు ఉదయం పదింటికే వివిధ రకాల పౌరసేవల కోసం అక్కడికి వస్తారు. కానీ.. 11 గంటలు దాటితే తప్ప అక్కడ పౌరసేవలు లభించవు. 8 మంది ఎంవీఐలు పని చేసే ఆ కేంద్రంలో ఉదయం నలుగురు, మధ్యాహ్నం నలుగురు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. ఇది ప్రభుత్వం నిర్ణయించిన పని గంటలకు పూర్తిగా విరుద్ధం. మరో రవాణా కార్యాలయంలో పని చేసే ఓ ఎంవీఐ, మరో ఏఎంవీఐ తమకు వీలైనప్పుడు మాత్రమే కార్యాలయానికి వచ్చి వెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఉద్యోగుల పని తీరును ప్రశ్నిస్తే బదిలీలు తప్పవనే భయంతో పై అధికారులు సైతం మౌనంగా ఉంటున్నారు. 'పైస్థాయి'లో చక్రం తిప్పుతున్న ఓ ఆర్టీఏ ఉద్యోగి అండతోనే కొందరు ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పౌరసేవల నిర్వహణను గాలికి వదిలేసి నచ్చిన చోటకు బదిలీలు, డిప్యుటేషన్‌లు, పదోన్నతుల కోసం జోరుగా పైరవీలు కొనసాగిస్తున్నారు. ఇలా.. గ్రేటర్‌లోని పలు ఆర్టీఏ కేంద్రాలు అస్తవ్యస్తంగా మారాయి.

కొరవడిన క్షేత్రస్థాయి పర్యవేక్షణ

- పౌరసేవల్లో పారదర్శకత కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ సదుపాయం ఆచరణలో సమర్థంగా అమలుకు నోచుకోవడం లేదు. లెర్నింగ్ లైసెన్సులు, డ్రైవింగ్ లైసెన్సులు, చిరునామా బదిలీలు, డూప్లికేట్ డాక్యుమెంట్‌లు వంటి కొన్ని రకాల పౌర సేవలను వాహనదారులు నేరుగా ఆన్‌లైన్ నుంచి పొందవచ్చు. టీ-యాప్ ఫొలియో వంటి మొబైల్ అప్లికేషన్ ఆధారిత సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. కానీ ఈ మొబైల్ యాప్ పనితీరు సరిగా లేదు. ఆన్‌లైన్‌లోనూ రకరకాల కొర్రీలతో వాహనదారులు యథావిధిగా ఏజెంట్‌లనే ఆశ్రయించాల్సి వస్తోంది.
- పలు చోట్ల డ్రైవింగ్‌స్కూళ్లు, ఏజెంట్‌ల దందా తారస్థాయికి చేరింది. ప్రతీ పౌరసేవకు ఓ ధరను నిర్ణయించి వసూలు చేస్తున్నారు. లెర్నింగ్ లైసెన్సు, డ్రైవింగ్ లైసెన్సుల కోసం రవాణా శాఖ సుమారు రూ.450 నుంచి రూ.1500 వరకు ఫీజు విధించింది. కానీ.. డ్రైవింగ్ స్కూళ్లు వినియోగదారుల వద్ద రూ.8000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేస్తున్నాయి. పలు ఆర్టీఏ కేంద్రాల్లో ఈ దందా వ్యవస్థీకృతంగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సిబ్బంది, ఏజెంట్‌లు చెట్టపట్టాలుగా పనులు చక్కబెట్టుకుంటున్నారు.

ఆదాయమార్గంగా అక్రమ రవాణా

కొందరు వ్యక్తులు రవాణా శాఖకు ఎలాంటి పన్ను చెల్లించకుండా నిబంధనలకు విరుద్ధంగా సొంత వాహనాలను ప్రయాణికుల రవాణాకు వినియోగిస్తున్నారు. కార్లు, క్యాబ్‌లు వంటి వివిధ రకాల వాహనాలు ఇటు ఉప్పల్ నుంచి వరంగల్ వైపు, అటు ఎల్‌బీనగర్ నుంచి విజయవాడ వైపు పెద్ద ఎత్తున అక్రమ రవాణాకు పాల్పడుతున్నాయి. జేబీఎస్ నుంచి కరీంనగర్ వైపు, ఇతర అన్ని రూట్లలోనే ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో నిబంధనల మేరకు పన్ను చెల్లించిన ట్రావెల్స్ నిర్వాహకులు, ఆర్టీసీ వంటి ప్రజారవాణా సంస్థల ఆదాయానికి గండి పడుతోంది. అక్రమ వాహనాలను అరికట్టాల్సిన అధికారులే వాటిని ప్రోత్సహిస్తున్నారు. సదరు వాహన యజమానులతో కుమ్మక్కై వాటిని రోడ్డెక్కిస్తున్నారు. ఒక్కో వాహనదారుడి వద్ద రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఓ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో వాహనాల రిజిస్ట్రేషన్ విభాగంలో పని చేసే సీనియర్ మోటారు మెహికల్ ఇన్‌స్పెక్టర్, డ్రైవింగ్ టెస్టులు నిర్వహించే మరో ఇద్దరు ఎంవీఐలు తమ విధులకు భిన్నంగా ప్రతిరోజూ ఉదయాన్నే రోడ్డెక్కి ఈ తరహా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోణలున్నాయి.


ఏదీ జవాబుదారీ తనం?

మరోవైపు కొందరు ఆర్టీఓలు ఆరు నెలల క్రితం పదోన్నతిపై డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌లుగా బదిలీ అయ్యారు. కొన్నిచోట్ల పదవీ విరమణ చేశారు. దీంతో ఆర్టీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అక్కడ ఇన్‌చార్జుల పాలన నడుస్తోంది. దీంతో పౌరసేవల నిర్వహణలో జవాబుదారీతనం కొరవడింది. మధ్యవర్తులు, ఏజెంట్‌ల ప్రమేయం పెరిగింది. కొన్ని చోట్ల మధ్యవర్తులే ఉద్యోగుల విధి నిర్వహణలో సైతం జోక్యం చేసుకోవడం గమనార్హం.

'సీజ్'నల్ టైమ్!

ఆస్తిపన్ను వసూళ్ల కోసం ఆస్తుల జప్తు

- మొండి బకాయిలపై బల్దియా కొరడా



గత ఐదేళ్లలో వసూలైన ఆస్తిపన్ను ఇలా..

ఆర్థిక సంవత్సరం	వసూలు (రూ.కోట్లు)
2020-21	1703.00
2021-22	1493.64
2022-23	1680.54
2023-24	1917.73
2024-25	1470.00 (ఇప్పటివరకు)

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఆదాయ వనరుల్లో కీలకమైన ఆస్తి పన్ను వసూళ్లపై అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. ఆస్తిపన్ను చెల్లించాల్సిందిగా ఇప్పటికే వివిధ రకాలుగా ప్రచారం నిర్వహించిన ట్యాక్స్ సెక్షన్ సిబ్బంది సామ, దాన, భేద, దండోపాయాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆస్తిపన్ను చెల్లించాల్సిందిగా ఎస్‌ఎంఎస్‌ల ద్వారా తెలియజేయడంతో పాటు వివిధ రకాలుగా ప్రచారం నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా నెలన్నర సమయం కూడా లేకపోవడంతో ఆస్తిపన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే పలువురికి రెడ్ నోటీసులు కూడా జారీ చేశారు. అయినప్పటికీ ఖాతరు చేయని మొండి బకాయిదారుల ఆస్తుల్ని సీజ్ చేసే చర్యలు ప్రారంభించారు. కొన్ని సర్కిళ్లలో ఈ చర్యలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

టార్గెట్ రూ.1,970 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను ద్వారా రూ.1,907 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించుకున్న లక్ష్యాన్ని రివైజ్డ్ బడ్జెట్‌లో రూ.1,970 కోట్లకు పెంచారు. ఈ మొత్తం వసూలు చేసేందుకు కార్యాచరణ రూపొందించుకున్నారు. అందులో భాగంగానే ఆస్తుల్ని సీజ్ చేసేందుకు వెనుకాడటం లేదు. జీహెచ్‌ఎంసీలో ఆస్తిపన్ను చెల్లింపుదారులు దాదాపు 19 లక్షల మంది ఉండగా, ఇప్పటి వరకు 12.40 లక్షల మంది తమ ఆస్తిపన్ను చెల్లించారు. తద్వారా ఖజానాకు దాదాపు రూ.1,470 కోట్ల ఆదాయం సమకూరింది. మిగతా రూ.500 కోట్లు వసూలు చేసే లక్ష్యంతో పని చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సగటున దాదాపు రూ.3 కోట్లు వసూలవుతున్నట్లు సమాచారం. పకడ్బందీ చర్యలతో ఈ సంఖ్యను మరింత పెంచవచ్చని ట్యాక్స్ సిబ్బంది భావిస్తున్నారు.

కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ

గత ఆర్థిక సంవత్సరం కంటే ప్రస్తుత ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కువ ఆస్తిపన్ను వసూలు చేసేందుకు కమిషనర్ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ, ముందుకురికిస్తున్నారు. జీహెచ్‌ఎంసీలో ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను మాత్రమే కావడంతో దానిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

అమ్మను నాన్నే చంపేశాడు

కూతురు చెప్పడంతో కూపీ లాగిన పోలీసులు

- రెండేళ్ల తర్వాత వెలుగు చూసిన వాస్తవం.. నిందితుడికి ఎట్టకేలకు జైలు

వెంగళరావునగర్: 'మా అమ్మను నాన్నే కొట్టి చంపాడు' అని ఓ చిన్నారి కేసు పెట్టడంతో నిందితుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన షేక్ సలీంకు కామారెడ్డి జిల్లాకు చెందిన ఫర్జానా బేగంతో 2007లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. జీవనోపాధి కోసం 8 ఏళ్ల క్రితం నగరంలోని జవహర్‌నగర్ మసీదుగడ్డకు వలస వచ్చి అద్దె గదిలో నివసించేవారు. పెళ్లయినప్పటి నుంచీ సలీం, ఫర్జానా దంపతులు తరచూ గొడవ పడేవారు. ఈ నేపథ్యంలోనే సలీం మద్యానికి బానిసయ్యాడు. రెండేళ్ల క్రితం సలీం మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్య బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.50 వేల కోసం గొడవపడ్డాడు. ఆమె నిరాకరించడంతో వంట గదిలో ఉన్న పప్పుగుత్తితో తలపై బలంగా కొట్టాడు. పెద్ద కుమార్తె జోక్యం చేసుకోగా ఆమెను కూడా కొట్టాడు. తెల్లారుజామున కుమార్తె తల్లిని నిద్ర లేపడానికి ప్రయత్నించగా ఆమె లేవలేదు. సలీం వచ్చి తన భార్యకు పల్స్ ఆడటం లేదని తెలుసుకుని ఆమె బంధువులకు తెలియజేశాడు. తల్లిని కొట్టి చంపిన విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని కుమార్తెను బెదిరించాడు. ఇద్దరు కుమార్తెలను కామారెడ్డి వెళ్లి ఫర్జానా సోదరి షెహనాజ్‌కు అప్పగించాడు. అప్పట్లో అనుమానాస్పద మృతిగా మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పెద్దమ్మ వద్దే ఇద్దరు పిల్లలు పెరిగారు. ఇటీవల ఫర్జానా బేగం పెద్ద కుమార్తె తన పెద్దమ్మతో గతంలో జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో ఆమెను తీసుకుని షెహనాజ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. తన తండ్రి కొట్టడం వల్లే తల్లి చనిపోయినట్లు ఫర్జానాబేగం పెద్ద కుమార్తె పోలీసులకు వివరించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని విచారించగా.. భార్యను తానే కొట్టినట్టు అంగీకరించాడు. పోలీసులు హత్యానేరం కిందట కేసు నమోదు చేసి అతనిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు పంపించారు.

పారదర్శకంగా.. దారి తప్పకుండా..



ట్యాంకర్ రియల్ టైం ట్రాకింగ్

- ఆటోమేటిక్ వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్స్
- డ్యాష్‌బోర్డు ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షణ
- వినియోగదారుల కోసం ప్రత్యేక యాప్
- చర్యలకు ఉపక్రమించిన జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: వేసవిలో వాటర్ ట్యాంకర్ల సరఫరా గాడి తప్పకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయోగించేందుకు జలమండలి సిద్ధమైంది. ఒకవైపు ట్యాంకర్ల రియల్ టైం ట్రాకింగ్‌తో పాటు మరోవైపు వినియోగదారుడికి అత్యంత పారదర్శకంగా ట్యాంకర్ నీటిని చేర్చేలా ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకొస్తోంది. వేసవి ఆరంభంలోనే వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతుండటంతో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఆపరేటర్ల చేతివాటాన్ని కట్టడి చేసేందుకు చర్యలకు ఉపక్రమించింది. వాస్తవంగా గత వేసవిలోనే వాటర్ ట్యాంకర్ సరఫరాలో రియల్ టైం ట్రాకింగ్ విధానాన్ని ప్రెలెట్ ప్రాజెక్టు అమలు చేసింది. కొన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో ట్రాకింగ్ విధానాన్ని అమలు చేసింది. ప్రత్యేక యాప్ ద్వారా ట్యాంకర్లను ట్రాకింగ్ లోకి తీసుకొచ్చి ఉబర్, ఓలా తరహాలో తమ కేటాయించిన వాహనం ఫిల్లింగ్ స్టేషన్ నుంచి ఎప్పుడు బయటకు వచ్చింది? ఏ సమయంలో ఎక్కడ ఉంది? ఎంతసేపట్లో ట్యాంకర్ ఇంటికి చేరుతుందో వినియోగదారులు తెలుసుకునేలా పారదర్శక సేవలకు సిద్ధమైంది. కానీ.. అది.. మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. ఈసారి కొన్ని మార్పులు చేర్పులతో యాప్‌ను అప్‌డేట్ చేసి అమలు చేసేందుకు చర్యలకు ఉపక్రమించింది.

డ్యాష్‌బోర్డు ద్వారా ట్రాకింగ్..

జలమండలి ప్రధాన కార్యాలయం డ్యాష్‌బోర్డు ద్వారా వాటర్ ట్యాంకర్ ట్రాకింగ్‌ను పర్యవేక్షించేందుకు సిద్ధమైంది. ట్యాంకర్లకు జీపీఎస్‌ను అమర్చి ఆటోమేటిక్ వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా వాటిని ఎక్కడ డెలివరీ చేస్తున్నారో గుర్తించనుంది. ట్యాంకర్లకు జీపీఎస్ అమర్చడం, వాటికి రెండేళ్ల గ్యారంటీ, ఏవీటీఎస్ అప్లికేషన్లో పర్యవేక్షణ తదితరాల నిర్వహణకు టెండర్ల ప్రక్రియ ద్వారా బాధ్యతలు అప్పగించనుంది. జీపీఎస్ అమర్చడంతో బుకింగ్ చేసేవారికి కూడా వెసులుబాటు కల్పించనుంది. తమ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి బయలుదేరిందా? లేదా? ఎన్ని గంటల వరకు డెలివరీ చేస్తారో అనే అంశాలను ఇకపై ఆన్‌లైన్ ద్వారా పసిగట్టవచ్చు. మరోవైపు బుకింగ్ చేసిన ట్యాంకర్ ఎప్పటి వరకు వస్తుందోననే విషయాన్ని వినియోగదారులు కూడా ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసే విధంగా రూపొందించనుంది.

కేసులో కాసులు స్వాహా!

గత నెలలో ఐదుగురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

వీరి నుంచి రూ.47.5 లక్షలు సీజ్ చేసిన కాప్స్

- ఇందులో రూ.20 లక్షలు వాడుకున్న ఇన్‌స్పెక్టర్
- అనుకోకుండా జరిగిన ప్రెస్‌మీట్‌తో వెలుగులోకి
- హడావుడిగా తీసుకువచ్చి జమ చేసిన అధికారిణి
- ఆమెపై బదిలీ వేటు వేసిన నగర పోలీసు కమిషనర్





సాక్షి, సిటీబ్యూరో: అది హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్.. అందులో పని చేసే ఓ మహిళా ఇన్‌స్పెక్టర్ గత నెలలో ఐదుగురు సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న వాటిలో రూ.47.5 లక్షల నగదు కూడా ఉంది. సొంత అవసరాల కోసం రూ.20 లక్షలు వాడుకుని, ప్రెస్‌మీట్ పెట్టే టైమ్‌కు తిరిగి పెట్టేయాలని భావించారు. అయితే.. దీనికి సంబంధించిన విలేకరుల సమావేశం హఠాత్తుగా ఫిక్స్ కావడంతో కథ అడ్డం తిరిగింది.

ట్రేడింగ్ ఫ్రాడ్‌లో ఐదుగురి పట్టివేత

నగరానికి చెందిన బాధితుడిని సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ఎర వేశారు. ప్రత్యేక యాప్ సైతం డౌన్‌లోడ్ చేయించి రూ.2.06 కోట్లు కాజేశారు. ఈ ట్రేడింగ్ ఫ్రాడ్‌కు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 22న సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన బృందం నగరంలోని జేఎన్టీయూలో ఉన్న కోటక్ మహీంద్ర బ్యాంక్ సేల్స్ మేనేజర్ కాటా శ్రీనివాస్‌తో పాటు తమ పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరవడానికి అంగీకరించిన మాగంటి జయ కిరణ్, రెడ్డి ప్రవీణ్‌లను అరెస్టు చేశారు. వీరి బ్యాంకు ఖాతాల నుంచి డ్రా చేసిన నగదును దుబాయ్‌కి హవాలా ద్వారా పంపడానికి సహకరించిన శాలిబండకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్, ఈ నగదుకు క్రిప్టో కరెన్సీగా మారుస్తున్న బహదూర్‌పురా వాసి మహ్మద్ జునైద్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న వాటిలో రూ.47.5 లక్షల నగదు కూడా ఉంది.

భద్రపరచాలి లేదా డిపాజిట్ చేయాలి...

ఏదైనా ఒక కేసులో నిందితులను అరెస్టు చేసినప్పుడు పోలీసులు నగదు, సొత్తు స్వాధీనం చేసుకుంటూ ఉంటారు. చోరీ, దోపిడీ, బందిపోటు దొంగతనం వంటి కేసుల్లో నగదు, సొత్తును వీలైనంత త్వరగా బాధితులతో కోర్టులో పిటిషన్ దాఖలు చేయించి వారికి అప్పగిస్తారు. సైబర్ నేరాల్లో మాత్రం ఈ విధానం భిన్నంగా ఉంటుంది. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదును వారితో పాటు కోర్టుకు తరలిస్తారు. ఆపై న్యాయస్థానం ఆ నగదు భద్రపరచడం కోసం పోలీసులకే అప్పగిస్తుంది. తక్కువ మొత్తమైతే దర్యాప్తు అధికారులు తమ అధీనంలోనే ఉంచుకుంటారు. ఆ మొత్తం భారీగా ఉండే బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ రసీదును కోర్టుకు అప్పగిస్తారు. కేసు విచారణ తర్వాత న్యాయస్థానం ఎవరికి అప్పగించమని ఆదేశిస్తే వారికి ఆ నగదును పోలీసులు అప్పగిస్తారు.

ప్రెస్‌మీట్ ఆలస్యం కావడంతో షురూ...

సాధారణంగా సైబర్ నేరాల్లో రికవరీ అనేది దుర్లభం. అలాంటి ఒకే కేసులో రూ.47.5 లక్షలు స్వాధీనం చేసుకోవడం పరిగణనలోకి తీసుకోవాల్సిన విషయమే. ఈ నేపథ్యంలోనే దీనిపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించాలని, అందులో ప్రదర్శించిన తర్వాత నగదును బ్యాంకులో డిపాజిట్ చేయాలని సైబర్ క్రైమ్ అధికారులు భావించారు. దీంతో నిందితుల అరెస్టులు, కోర్టుకు తరలింపులు పూర్తయినప్పటికీ.. ప్రెస్‌మీట్ వరకు ఈ మొత్తాన్ని సదరు మహిళా ఇన్‌స్పెక్టర్ అధీనంలోనే ఉంచారు. దీని నిర్వహణ కొన్ని రోజులు ఆలస్యమైంది. మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందనే సూచనలు వెలువడ్డాయి. దీంతో అప్పటి వరకు ఈ నగదు తన వద్దే ఉంటుందని సదరు మహిళా ఇన్‌స్పెక్టర్ భావించారు. తన అవసరాల నిమిత్తం కొంత తీసుకోవాలని, ప్రెస్‌మీట్ లోపు తిరిగి పెట్టేయాలనుకున్నారు.

హఠాత్తుగా ప్రెస్‌మీట్ ఖరారు కావడంతో..

తన అధీనంలో ఉన్న రికవరీ సొమ్ము నుంచి మహిళా ఇన్‌స్పెక్టర్ రూ.20 లక్షలు తీసుకున్నారు. సాధారణంగా ప్రెస్‌మీట్ ఎప్పుడు నిర్వహిస్తారనేది ముందు రోజే తెలుస్తుందని, నగదు తిరిగి సర్దుబాటు చేయడానికి ఆ సమయం చాలని ఆమె భావించారు. అయితే.. గత నెల 29 మధ్యాహ్నం ప్రెస్‌మీట్ నిర్వహించాలని ఆ రోజు ఉదయమే ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో తాను తీసుకున్న నగదు తిరిగి సర్దుబాటు చేయడం ఆమెకు సాధ్యం కాకపోవడంతో విషయం ఉన్నతాధికారులకు తెలిసింది. దీంతో ఆ రోజుకు నామమాత్రపు నగదు చూపిస్తూ ప్రెస్‌మీట్ పూర్తి చేశారు. మహిళా ఇన్‌స్పెక్టర్ వ్యవహారశైలిపై అంతర్గత విచారణకు ఆదేశించారు. ఆ వెంటనే ఆమె నగదు మొత్తం తిరిగి జమ చేయడంతో కఠిన చర్యలకు బదులు సైబర్ క్రైమ్ యూనిట్ నుంచి బదిలీ చేస్తూ సిటీ కొత్వాల్ ఆదేశాలు జారీ చేశారు.

మోదీని విమర్శించే అర్హత రేవంత్‌కు లేదు

సాక్షి, సిటీబ్యూరో: ప్రధాని నరేంద్ర మోదీని కులం పేరుతో విమర్శించడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తగదని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే ఈ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి, కుంభకోణాలకు తావు లేకుండా, దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న మోదీని చూసి ఓర్వలేపోతున్నారన్నారు.

రైలు దిగి ఉంటే ఖల్లాస్!

భోపాల్‌లో దిగిపోవాలనుకున్న ముఖియా గ్యాంగ్

- అదే జరిగి ఉంటే అందరూ చిక్కడం కష్టసాధ్యమే
- నిందితులు దొరికినా చోరీ సొత్తు రికవరీ దుర్లభమే
- స్నేహలత దేవి ఉదంతమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ



నిందితుడు మహేష్ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే కేడియా ఆయిల్స్ అధినేత రోహిత్ కేడియా ఇంటి నుంచి రూ.40 కోట్ల సొత్తు, నగదుతో ఉడాయించిన త్రయం మోల్హు ముఖియా, సుశీల్ ముఖియా, బసంతి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో చిక్కింది. నగరం నుంచి ఢిల్లీ వెళ్లే రైలు ఎక్కిన వీరు ముగ్గురూ భోపాల్‌లో ట్రైన్ దిగిపోవాలని భావించారు. అదే జరిగితే వారు చిక్కడం కష్టసాధ్యమయ్యేదని, నిందితులు దొరికినా సొత్తు రికవరీ అయ్యేది కాదని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది జనవరిలో దోమలగూడ ఠాణా పరిధిలో చోటు చేసుకున్న స్నేహలత దేవి ఉదంతాన్నే ఉదాహరణగా చూపుతున్నారు.

నమ్మకంగా పని చేసిన మహేష్ కుమార్..

బీహార్ రాష్ట్రం, మధుబని జిల్లా, బిరోల్‌కు చెందిన చెందిన మహేష్‌కుమార్ ముఖియా 2023 డిసెంబర్‌లో నగరానికి వలసవచ్చాడు. తన సోదరి వద్ద ఉంటూ... స్నేహితుడి ద్వారా దోమలగూడకు చెందిన సువర్య పవ గుప్తా ఇంట్లో కేర్ టేకర్‌గా చేరాడు. గుప్తా తల్లి స్నేహలత దేవి (62) వయస్సు రీత్యా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆమెకు సపర్యలు చేస్తూ నమ్మకం సంపాదించుకున్నాడు. గుప్తాతో పాటు అతడి కుటుంబీకులు ప్రతి రోజూ తమ వ్యాపార కార్యకలాపాల కోసం ఉదయం వెళ్లి రాత్రికి తిరిగి వచ్చేవారు. ఆ సమయంలో స్నేహలత మాత్రమే ఇంట్లో ఉంటుంది. ఈ విషయం తెలిసిన మహేష్ ఆమెను బంధించి, ఇంట్లో ఉన్న సొమ్ము, సొత్తు కాజేయాలని గత ఏడాది జనవరిలో పథకం వేశాడు.

మోల్హు ముఖియాను పిలిపించి...

దీనికి సహకరించడానికి తన గ్రామానికే చెందిన మోల్హు ముఖియాను పిలిపించుకున్నాడు. గత ఏడాది జనవరి 27న వచ్చిన ఇతగాడు మహేష్ వద్దే ఉన్నాడు. వృద్ధురాలిని బంధించడానికి, నోటికి వేయడానికి అవసరమైన తాళ్లు, టేపు తదితరాలతో పాటు ఓ బ్యాగ్‌ను కొనుగోలు చేశాడు. గత ఏడాది జనవరి 31న ఎప్పటిలానే పనికి వచ్చిన మహేష్... కుటుంబీకులు అంతా బయటకు వెళ్లిన తర్వాత మనోజ్‌ను రప్పించాడు. ఆ సమయంలో హాల్‌లోని సోఫాలో కూర్చున్న స్నేహలతపై ఇరువురూ దాడి చేశారు. ఆమెను చంపేసి రూ.కోటి విలువైన ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులు తీసుకుని ఉడాయించారు.

మూడుసార్లు బీహార్ వెళ్లిన టాస్క్‌ఫోర్స్...

అప్పట్లో ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. సువర్య పవ గుప్తా వద్ద మహేష్ ఇచ్చిన ఆధార్ కార్డు ఆధారంగా బీహార్ వెళ్లింది. అతడి ఆచూకీ లేకపోవడంతో మరో మూడు నెలలకు మరోసారి వెళ్లి... అతడి గ్రామానికి చెందిన వ్యక్తిని ఇన్‌ఫార్మర్‌గా మార్చుకువచ్చింది. ఎట్టకేలకు గత ఏడాది అక్టోబర్ మొదటి వారంలో మహేష్ తన గ్రామానికి చేరుకున్నాడు. ఈ విషయం ఇన్‌ఫార్మర్ ద్వారా తెలుసుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు హుటాహుటిన వెళ్లి మహేష్‌ను అరెస్టు చేశారు. అయితే సొత్తు మొత్తం తమకు సహకరించిన మోల్హుతో పాటు రాహుల్ అనే మరో నిందితుడి దగ్గర ఉన్నట్లు అతడు చెప్పాడు. దీంతో ఎనిమిది నెలల తర్వాత మహేష్, తాజా నేరంలో మోల్హు పట్టుబడినా . ఆ కేసుకు సంబంధించి కనీసం రూ.100 విలువైన సొత్తు కూడా రికవరీ కాలేదు. కేడియా ఇంట్లో చోరీ చేసిన ముగ్గురూ కూడా భోపాల్‌లో రైలు దిగి ఉంటే ఇదే పరిస్థితి ఉండేదని అధికారులు పేర్కొన్నారు.

గుంతలో పడి బాలుడి మృతి

సంతోష్‌నగర్: ఓ బాలుడు ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందిన సంఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం మేరకు... రంగారెడ్డి జిల్లా, రామదుగ్యాల మెగ్యాతండాకు చెందిన శ్రీను నాయక్, అనూష దంపతులు నగరానికి వలస వచ్చింది. ఓల్డ్ సంతోష్‌నగర్ కాలనీలో నివాసముంటున్నారు వీరి కుమారుడు జేశ్వన్ (6),శనివారం ఉదయం సోదరితో కలిసి ఇంటి ముందు ఆడుకుంటూప్రమాదవశాత్తు సమీపంలో ఇంటి నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడిపోయాడు. గుంతలో నీరు ఉండటంతో అందులో మునిగిపోయాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని బయటికి తీసి చికిత్స నిమిత్తం ఓవైసీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య వదిలేసి వెళ్లిందని..

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

దుండిగల్: కుటుంబ కలహాల కారణంగా భార్య ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తాండూరు మల్కాపూర్‌గని గ్రామానికి చెందిన నీలేశ్(24) కు ఆదే గ్రామానికి చెందిన పూజతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. నగరానికి వలస వచ్చిన వారు డి.పోచంపల్లిలోని 60 గజాల్లో నివాసం ఉంటున్నారు. రెండు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పూజ ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికిలోనైన నీలేశ్ శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుండిగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలిసే చేశా..!

- ముగిసిన మస్తాన్‌సాయి కస్టడీ
- కోర్టుకు విచారణ వివరాలు
- సమగ్ర సమాచారం రాబట్టిన పోలీసులు



మస్తాన్ సాయి

మణికొండ: రెండు రోజులుగా పోలీసు కస్టడీలో విచారణ ఎదుర్కొన్న మస్తాన్‌సాయిని శనివారం తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మస్తాన్ సాయి యువతులకు పార్టీలు ఏర్పాటు చేసి డ్రగ్స్ ఇవ్వటం, వారు మత్తులోకి జారుకున్న తర్వాత వారిపై లైంగిక దాడికి పాల్పడటం, దానిని సీక్రెట్ కెమెరాలు, సెల్‌ఫోన్ల వీడియో తీసి రికార్డు చేయటం, వాటిని ఆధారంగా చేసుకుని యువతులను పలుమార్లు బ్లాక్‌మెయిల్ చేయడం చర్యలకు పాల్పడిన విషయం తెలిసిందే. అదే కోవలో సినీహీరో రాజ్‌తరుణ్ మాజీ ప్రియురాలు లావణ్య సైతం అతని ఉచ్చులో చిక్కుకుంది. అతని వద్ద తన వీడియోలు ఉన్న హార్డ్‌డిస్క్‌ను తస్కరించిన ఆమె దాని ఆధారంగా నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన హార్డ్‌డిస్క్ తిరిగి ఇవ్వాలని మస్తాన్‌సాయి లావణ్యను బెదిరించడమేగాక తనతో పాటు తన ఇంటిపై దాడి చేశాడని, తనను చంపేందుకు ప్రయత్నించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. లావణ్య ఇంటికి వచ్చిన సమయంలో మస్తాన్ సాయితో పాటు అతడి స్నేహితుడు ఖాజా మెయినుద్దీన్ డ్రగ్స్ తీసుకుని ఉండటంతో పరీక్షలు నిర్వహించిన పోలీసులు నార్కోటిక్ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఈ నెల 2న అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉద్దేశపూర్వకంగానే నేరాలు...

మస్తాన్‌సాయిని నార్సింగి పోలీసులు తమ కస్టడీకి తీసుకుని విచారించటంతో అతను ఉద్దేశపూర్వకంగానే యువతులకు డ్రగ్స్ ఇవ్వటం, నగ్న వీడియోలు తీయటం, వాటిని అడ్డం పెట్టుకుని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడటం లాంటి చర్యలు ఉద్దేశ పూర్వకంగానే చేశానని అంగీకరించినట్టు తెలిసింది. తల్లితండ్రుల అతి గారాబం కారణంగా ఉన్నత చదువులు చదువుకున్నా వక్రమార్గంలో పయనించినట్లు పోలీసులు గుర్తించారు. తన భార్య, గర్ల్ ఫ్రెండ్స్, ఇతర యువతులను నగ్న వీడియోలు తీయటం, వాటిని అడ్డుపెట్టి బ్లాక్ మెయిల్ చేయడం అతడి నైజంగా పోలీసులు గుర్తించారు. తను చేసిన నేరాలను విచారణలో అంగీకరించటంతో అదే నివేదికను కోర్టుకు అందించినట్లు తెలిసింది.

ఆధునిక జీవన శైలితోనే ఉదరకోశ వ్యాధులు



సదస్సులో పాల్గొన్న వక్తలు

సనత్‌నగర్: ఆధునిక జీవన శైలి, పాశ్చాత్యపు ఆహారపు అలవాట్లు, కదలకుండా ఎక్కువ సేపు ఒకేచోట కూర్చోవడం తదితర కారణాలతో మన దేశంలోనూ ఉదరకోశ వ్యాధులు నానాటికి పెరుగుతున్నాయని పలువురు వైద్య నిపుణులు అన్నారు. దశాబ్ద కాలంగా దేశంలో కోలో-రెక్టల్ కేన్సర్ కేసుల సంఖ్య పెరిగిపోతుందని, అలాగే ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిజీస్ (ఐబీడీ), క్రాన్స్ డిసీజ్, ఇతర సమస్యలూ ఎక్కువవుతున్నాయన్నారు. శనివారం కిమ్స్ ఆస్పత్రి, కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో నగరంలోని కిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వార్షిక సదస్సు నిర్వహించారు. తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా వైద్యులు ఈ సదస్సుకు హాజరయ్యారు. కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు సదస్సుకు చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా వ్యాధులు ఎక్కువ కావడంతో పాటు చికిత్సా పద్ధతులు కూడా గణనీయంగా మారిపోయాయన్నారు. ముఖ్యంగా కోలో-రెక్టల్ కేన్సర్ విషయంలో సరికొత్త శస్త్రచికిత్స, కీమోథెరపీలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇంతకముందు ఆ వ్యాధి వచ్చిన ఎవరికైనా ఒకే రకమైన చికిత్స చేసేవాళ్లమని, ఇప్పుడు వేర్వేరుగా వ్యక్తిగతీకరించిన చికిత్సా విధానాలు పాటిస్తున్నామన్నారు. డాక్టర్ విమలాకర్‌రావు మాట్లాడుతూ క్రాన్స్ డిసీజ్ అనేది ఒకప్పుడు యూరోపియన్ దేశాల్లో మాత్రమే ఉండేదని, కానీ ఇప్పుడు పాశ్చాత్య తరహా ఆహారపు అలవాట్ల కారణంగా మన దేశంలోనూ పెరిగిపోతుందన్నారు. దానికి కూడా సరికొత్త చికిత్సా విధానాలు పాటిస్తున్నట్లు తెలిపారు.

ఎనిమి ఆస్తుల లెక్క తేల్చండి

- మార్చిలోగా సర్వే పూర్తి చేయండి
- సమగ్ర వివరాలు సమర్పించండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎనిమి ఆస్తుల (కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా (సెపీ) సంరక్షణలోని శత్రు ఆస్తుల) లెక్క మార్చిలోగా పక్కాగా తేల్చాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం హోటల్ టూరిజం ప్లాజాలో సీసీఎల్‌ఏ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్, వికారాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కొత్వాల్‌గూడలో 600 ఎకరాలకుపైగా, మియాపూర్‌లో 291 ఎకరాలకుపైగా ఉన్న ఎనిమి ప్రాపర్టీస్‌పై పురోగతి ఏమిటి అని కలెక్టర్ నారాయణరెడ్డిని ప్రశ్నించారు. మార్చిలోగా సర్వే పూర్తి చేసి, సమగ్ర వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ భూములను కాపాడాల్సిందే..

హైదరాబాద్ జిల్లా బాకారంలో 25,503 గజాల వివాదాస్పద స్థలంలో ఎనిమి ప్రాపర్టీస్ వాటా కింద ఉన్న 5,578 గజాలు, బహదుర్‌పురాలోని రికాబ్‌గంజ్‌లోని 710,724,778,784 సర్వే నంబర్లలో ఉన్న 3,300 గజాలు, కొత్తగూడెం పాల్వంచలోని సర్వే నంబర్లు 126/111, 126/112లోని 40 ఎకరాలు, వికారాబాద్ జిల్లా అల్లంపల్లి సర్వే నంబర్లు 426, 427, 428లో 17.22 ఎకరాలు ఎనిమి ప్రాపర్టీస్ ఉన్నట్లు రికార్డులు ఉన్నాయని అన్నారు. సెపీ అధికారులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి సెక్షన్ 8ఏ ప్రకారం వివాదాలను పరిష్కరించాలని సూచించారు. హైదరాబాద్ సహా రంగారెడ్డి ఇతర జిల్లాల్లోని ఎనిమి ఆస్తులు ఇప్పటికే పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయినట్లు ఆయా జిల్లాల అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిని కాపాడి తీరాల్సిందేనని మంత్రి ఆదేశించారు.

ఎనిమి ప్రాపర్టీస్ అంటే?

1962లో చైనీస్ దండయాత్ర, 1965 నుంచి 1971 వరకు జరిగిన ఇండో-పాక్ యుద్ధం అనంతరం భారత్ నుంచి వెళ్లిపోయి పాకిస్తాన్, చైనాలో స్థిరపడి ఆయా దేశాల పౌరసత్వం తీసుకున్న వ్యక్తులకు సంబంధించి భారత్‌లో ఉన్న ఆస్తులను శత్రు (ఎనిమి ప్రాపర్టీ) ఆస్తులుగా ప్రభుత్వం గుర్తించింది. వీటి సంరక్షణ బాధ్యతలను సెపీకి అప్పగించింది. తెలంగాణ, ఏపీతోపాటు దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 13 వేల వరకు శత్రు ఆస్తులున్నట్లు కేంద్రం వద్ద రికార్డులున్నాయి. వీటి మార్కెట్ విలువ రూ.వేల కోట్లు ఉన్నట్లు గుర్తించింది. ఎనిమి ప్రాపర్టీ చట్టంలోని సెక్షన్ 8 (ఏ) ప్రకారం ఈ ఆస్తులను విక్రయించే అధికారం కేంద్రానికి ఉంది. నాటి నుంచి నేటి వరకు ఈ ఆస్తులు చాలా చోట్ల అన్యాక్రాంతమయ్యాయి. మరికొన్ని ఆస్తులకు సంబంధించి న్యాయ వివాదాలు నడుస్తున్నాయి. ఆస్తుల వివాదాల పరిష్కారంపై బండి సంజయ్ సమీక్ష నిర్వహించారు.

క్లుప్తంగా...

20న 'చలో విద్యుత్ సౌధ'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: విద్యుత్ ఆర్టిజన్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 20న 'చలో విద్యుత్ సౌధ'కు పిలుపునిచ్చినట్లు చైర్మన్ ధన్‌రాజ్ తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే ప్రభుత్వాలు, యాజమాన్యానికి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చిన స్పందన లేదన్నారు. ఈ విషయమై ఇప్పటికే పలు రూపాల్లో తమ నిరసనలు చేపట్టినా చర్చలకు కూడా పిలవలేదని, అందుకే 'చలో విద్యుత్ సౌధ'కు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

కొత్త సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి కృషి



జూబ్లీహిల్స్‌లో పర్యటిస్తున్న జలమండలి అధికారులు

బంజారాహిల్స్: కొత్త సీవరేజీ పైప్‌లైన్ల నిర్మాణం చేపడుతామని జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-75లో సీవరేజీ పైపులైన్ లీక్ అవుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ సెక్షన్ మేనేజర్ రాంబాబుతో కలిసి శనివారం ఉదయం పర్యటించారు. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ కార్యదర్శి కిలారు రాజేశ్వరరావుతో పాటు స్థానిక మహిళలు సీవరేజీ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. భారీ వృక్షాల వేర్లు డ్రైనేజీ పైప్‌లైన్లలోకి వెళ్లి పగిలిపోవడంతో నీరంతా లీకవుతుందని మహిళలు పేర్కొన్నారు. స్పందించిన జీఎం కొత్త పైప్‌లైన్ వేసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తామని తెలిపారు.

నగర అభివృద్ధే ధ్యేయం



ప్రేమ్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, పార్టీల గురించి మాట్లాడతామని మిగితా సమయంలో అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్‌రోడ్ నంబర్-1లోని ప్రేమ్‌నగర్ బస్తీలో రూ. 22.30 లక్షలతో సీసీ రోడ్డు పనులతో పాటు రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న 200 ఎంఎం డయా పైప్‌లైన్ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంతమంది నేతలు కాంట్రాక్టర్లను బెదిరిస్తూ పనులు ముందుకు సాగకుండా చేస్తున్నారని, ఇప్పటికైనా అలాంటివి మానేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్-18 డీసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, జలమండలి మేనేజర్ శివకుమార్ స్థానిక నేతలు పాల్గొన్నారు.

'బీసీ జనాభా లెక్కలపై రాద్ధాంతం తగదు'

బంజారాహిల్స్: కుల గణనలో బీసీల జనాభా తగ్గిందని రాద్ధాంతం చేయడం తగదని బీసీ రక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చి ఈ సర్వేలో 5 శాతం బీసీ జనాభా తగ్గిందని ఆరోపించడం అశాస్త్రీయమన్నారు. కులగణనలో లోపాలు లేకపోలేదని, కానీ కుల గణనే తప్పని వాదించడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ వర్గీకరణలో లోపాలు ఉన్నాయని నిరసన తెలుపుతూనే ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బిల్లును స్వాగతించారన్నారు. లోపాలను సవరించేందుకు ప్రభుత్వం మళ్లీ చర్యలు తీసుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మళ్లీ చేపట్టే కుల గణనకు సహకరించాలని కోరారు.

జాన్‌వెస్లీకి సత్కారం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి నేతలతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముచ్చటించారు. శనివారం ఓయూ పరిశోధన విద్యార్థులు, విద్యార్థి నేతల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలో తెలంగాణలో భవిష్యత్తు ప్రత్యామ్నాయ రాజకీయాలు అనే అంశం చర్చాకార్యక్రమం జరిగింది. నూతన కార్యదర్శిగా ఎన్నికైన జాన్‌వెస్లీని విద్యార్థులు సన్మానించారు.

అల్పాహారం అద్భుతం..!

- పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్
- ప్రత్యేక తరగతుల్లో సాయంత్రం అందజేత
- వచ్చే నెల 20 వరకు కొనసాగింపు
- ఒక్కో విద్యార్థిపై రూ.15 ఖర్చు



హైదర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం తీసుకుంటున్న విద్యార్థులు

బంజారాహిల్స్: పదో తరగతి విద్యార్థులపై ప్రభుత్వం మరింత శ్రద్ధ పెట్టింది. ఇప్పటికే సిలబస్ పూర్తికాగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో వారు ఆకలితో అలమటించకుండా ఉండేందుకు సాయంత్రం అల్పాహారం అందిస్తున్నది. విద్యార్థులు ఉదయం 8 నుంచి 9 వరకు స్కూల్లో స్పెషల్ క్లాస్‌లకు హాజరవుతున్నారు. తర్వాత మళ్లీ రెగ్యులర్ తరగతులకు..అవి పూర్తికాగానే సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో విషయ పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకుంటూ టీచర్ల నుంచి సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, వెంగల్‌రావునగర్, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్లతో పాటు హిమాయత్‌నగర్ డివిజన్‌లో 19 ప్రభుత్వోన్నత పాఠశాలలు, 2 రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో సుమారు 3000 వరకు పదో తరగతి విద్యార్థులు ఉండగా వారందరికీ అల్పాహారం అందిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ. 15 చొప్పున 38 రోజుల పాటు మార్చి 20 వరకు అందించనున్నారు. అల్పాహారంగా రోజువారీగా ఉడకబెట్టిన బొబ్బర్లు, పెసర్లు, శనగలు, చిరుధాన్యాలతో చేసిన బిస్కెట్లు, పల్లీపట్టీలు, ఉల్లి పకోడి అందిస్తున్నారు. వీటి ద్వారా పిల్లలు కొంత వరకు ఆకలిని ఓర్చుకోగలుగుతున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పరీక్షల వరకు అల్పాహారం..

మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. ప్రతిరోజూ సాయంత్రం విద్యార్థులకు అల్పాహారం అందిస్తాం. స్టూడెంట్లు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చదువుపై దృష్టి సారించాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. –జనార్దన్, టీచర్ హైదర్‌గూడ ప్రభుత్వ పాఠశాల

ఆకలి బాధ తీరింది..

ప్రత్యేక తరగతుల్లో ప్రతిరోజూ సాయంత్రం అల్పాహారం అందిస్తున్నారు. దీని వల్ల ఆకలి బాధ తీరింది. ఉదయం 8 గంటలకే పాఠశాలకు వస్తున్నాం. మధ్యాహ్నం భోజనం చేసి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలంటే ఆకలిగా ఉండేది. ఇప్పుడు స్నాక్స్ ఇస్తుండడంతో ఎనర్జీగా ఉంటున్నాం. చదువుపై కూడా శ్రద్ధ పెడుతున్నాం.



–భరత్, పదో తరగతి విద్యార్థి

ఇక ఇబ్బంది లేదు..



స్కూల్‌కు సకాలంలో రావాలనే క్రమంలో ఒక్కోసారి ఉదయం టిఫిన్ చేయకుండానే వచ్చేవాళ్లం. దీంతో ఆకలి తట్టుకోలేకపోయేవాళ్లం. ఆ ప్రభావం విద్యపై కూడా పడుతుండేది. కొద్దిరోజులుగా ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ఇప్పుడు చదువుకునేందుకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అయ్యింది.

– దీపిక, పదో తరగతి విద్యార్థి

మెదడు బాగా పని చేయాలంటే..

15 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే ఉడకబెట్టిన కోడిగుడ్లు, బొబ్బర్లు, శనగలు, ఉలవలు, పాలు తీసుకుంటే మెదడు బాగా పని చేస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కీర, దోస, బీట్‌రూట్, క్యారెట్, పచ్చిబఠానీ ఇస్తే శారీరక ఎదుగుదల, జ్ఞాపక శక్తి పెంపొందుతుందని, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఇవి తప్పనిసరిగా ఉండేలా తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు చూడాలని వైద్యులు సూచిస్తున్నారు.

వేతనాలు చెల్లించాలని నిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుల ఆందోళన

లక్డీకాపూల్: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిమ్స్ ట్రామా, స్పెషాలిటీ బ్లాక్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఓపీడీఎస్ సెక్యూరిటీ సిబ్బంది శనివారం విధులు బహిష్కరించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో 130 మంది గార్డులను నియమించాల్సిన ఉండగా 70 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. అరకొరగా సిబ్బంది ఉన్నా విధులు నిర్వహించిన తమ జీతాలు చెల్లించకపోవడం తగదన్నారు. ఈ విషయమై నిమ్స్ యాజమాన్యం చొరవ తీసుకుని బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో నిమ్స్ అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ ఓపీడీఎస్ నిర్వాహకులతో చర్చించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో 2 నెలల వేతనాలకు గానూ రూ.10వేలు చెల్లించేందుకు ఏజెన్సీ సంస్థ ముందుకు రావడంతో భద్రత సిబ్బంది ఆందోళనను తాత్కాలికంగా విరమింపచేశారు. వాస్తవానికి 130 మంది గార్డులు, ఆరుగురు సెక్యూరిటీ ఆఫీసర్లలకు కలిపి ప్రతినెల రూ.24 లక్షల వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే నిమ్స్ యాజమాన్యం తమ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా సకాలంలో వేతనాలు చెల్లించలేకపోతున్నామని ఓపీడీఎస్ సెక్యూరిటీ ఆఫీసర్ పేర్కొంటున్నారు.

హ్యూమన్ వరల్డ్ ఫర్ యానిమల్స్‌గా పేరు మార్పు

బంజారాహిల్స్: యానిమల్ చారిటీ హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్ పేరుతో ఉన్న తమ సంస్థ పేరును హ్యూమన్ వరల్డ్ ఫర్ యానిమల్స్‌గా మార్చినట్లు సంస్థ సీఈవో కిట్టి బ్లాక్ తెలిపారు. బంజారాహిల్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జంతువుల రక్షణ కోసం తమ సంస్థ 30 ఏళ్లుగా పని చేస్తున్నాదని ఇక ముందు కూడా అదే నిబద్ధతతో పని చేస్తామన్నారు. జీవ హింస చేయవద్దని, అడవులు వాటిల్లో ఉండే జంతువుల ఆవశ్యకతపై మరెన్నో కార్యక్రమాలను విభిన్న తరహాలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని ఒకరి మృతి



నజీర్ (ఫైల్)

పంజగుట్ట: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బహదూర్‌పురాకు చెందిన నజీర్ శనివారం ఉదయం బైక్‌పై అల్వాల్ నుంచి వస్తున్నాడు. గ్రీన్ ల్యాండ్స్ ప్రజాభవన్ ఎదురుగా ఐటీసీ కాకతీయ హోటల్ వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నజీర్ బైక్‌పై నుంచి కిందపడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారును పంజగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్ ఆరిఫ్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు



అధికారులు, సిబ్బందితో సమావేశమైన జీఎం హరిశంకర్

అమీర్‌పేట: ఉద్యోగులు అవినీతికి పాల్పడితే విధుల నుండి తొలగించడమే క్రిమినల్ కేసులు పెడతామని జలమండలి డివిజన్-6 జనరల్ మేనేజర్ హరిశంకర్ హెచ్చరించారు. ఎస్ఆర్‌నగర్‌లో డివిజన్ పరిధిలోని డీజీఎంలు, సెక్షన్లలకు చెందిన మేనేజర్లు, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్స్, మీటర్ రీడింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా డివిజన్ పరిధిలోని అన్ని చోట్ల నీటి కనెక్షన్లకు సంబంధించిన కమర్షియల్ సర్వేను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంతో ఎవరైనా అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని,కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎలాంటి అంతరాయం నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. నగరంలో చేపడుతున్న సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీలో భాగంగా 90 రోజుల స్పెషల్ డ్రైవ్ మొదటి దశ విజయవంతమైందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కేసీఆర్ హయాంలో క్రీడలకు పెద్ద పీట

మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి



బీఆర్ఎస్వీ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో క్రీడలకు పెద్ద పీట వేసినట్లు మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. ఈ నెల 17 కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగరం ప్రశాంత్ ఆధ్వర్యంలో జరుగుతున్న కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయంలో పట్టణాలతో పాటు గ్రామాల్లోను క్రీడా కారులను ప్రొత్సహించేందుకు ప్రత్యేకంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్‌కుమార్, ఎస్సీ ఎస్టీ కమీషన్ మాజీ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ స్పోర్ట్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేలెండర్‌ను ఆవిష్కరించారు.

లీకేజీతో రోడ్డుపై మురుగు

మోతీనగర్: గాయత్రీనగర్ 60 ఫీట్ల రోడ్డులో కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ పొంగి పొర్లడంతో రోడ్డంతా మురుగునీటితో ప్రవహిస్తున్నది. దీంతో స్థానికులు దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. సంబంధిత అధికారులకు సమస్యను పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనే పాఠశాల, దుకాణాలు ఉండటంతో మురుగు దాటుకుంటూనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : స్వర్ణజయంతి 11 కేవీ ఫీడర్ ఈఎస్ఐ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హుడా కాంప్లెక్స్, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

'బీసీని ముఖ్యమంత్రి చేయాలి'

బంజారాహిల్స్: కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాజీనామా చేసి బీసీని ముఖ్యమంత్రి చేయాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యెర్రా కామేశ్ డిమాండ్ చేశారు. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన పేరుతో బీసీలకు అన్యాయం, అగ్రవర్ణాలకు ప్రయోజనం చేసేలా ఉందన్నారు. కుల గణన అంటూనే వాస్తవాలను వక్రీకరించి బీసీలను మోసం చేస్తుందన్నారు. 50 శాతానికి పైగా ఉన్న బీసీలను 50 శాతానికి లోపు చూపించడం, 2014లో 8 శాతం ఉన్న అగ్రవర్ణాలను ఇప్పుడు 15 శాతం చూపించడం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కాపాడుకునేందుకు ఆడుతున్న డ్రామాలని ఆరోపించారు. ఈ పదేళ్లలోనే 21 లక్షల పైగా బీసీలు చనిపోయారనడం ఎవరిని మోసం చేసేందుకు అని ప్రశ్నించారు.

బాలానగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు



రికార్డుల నిర్వహణ, ఎఫ్ఐఆర్ నమోదు గురించి వివరిస్తున్న సీఐ

బాలానగర్: శిక్షణలో భాగంగా 2024 బ్యాచ్ ట్రైనీ ఐపీఎస్‌లు శనివారం బాలానగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో జరుగుతున్న పనులను, వివిధ కేసుల పనితీరును పరిశీలించారు. 2024 ట్రైనీ ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన శశాంత్ ఎస్ఎం, కర్ణాటక, అభిషేక్ పిర్రా, రాజస్థాన్, హస్సన్ రియాజ్ (మాల్దీవులు) పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన వారిలో ఉన్నారు. వీరికి బాలానగర్ సీఐ నర్సింహరాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. స్టేషన్ పరిధిలో జరిగే వివిధ అంశాల గురించి సీఐ వివరించారు. ఎస్ఐలు రాంనారాయణ్, హాజిమాయి, సరళ, ఏఎస్ఐలు ఆంజనేయులు, ప్రభాకర్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

- తరలివచ్చిన బంజారాలు
- ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు
- పూజలు నిర్వహించిన పలువురు



కార్పొరేషన్ల చైర్మన్లు జయపాల్, సాయికుమార్



యూసుఫ్‌గూడలోని అమరావతి హైస్కూల్‌లో..



వేడుకల్లో అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి



నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



నందినగర్‌లో వేడుకల్లో ఎమ్మెల్యే దానం

రహమత్‌నగర్ : ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-1 బస్తీలోని ఆలయంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్, ఎంబీసీ, ఫిషరీస్ కార్పొరేషన్ల చైర్మన్లు నిరంజన్, జయపాల్, సాయి కుమార్, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకుడు ఎత్తరి అంతయ్య, స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు సేవాలాల్ విగ్రహ ఊరేగింపు వైభవంగా బోరబండ డివిజన్ బంజారానగర్ నుంచి ప్రారంభమై మోతీనగర్ మీదుగా ఆలయానికి చేరుకున్నది. వివిధ ప్రాంతాలకు చెందిన బంజారా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ నృత్యాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, ఎస్‌హెచ్ఓ వీరశేఖర్, బీజేపీ నాయకులు బోరబండలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డా. కల్యాణ్ నాయక్, కార్యాలయ కార్యదర్శి బర్మావత్ రమేశ్‌నాయక్‌తో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు రమేశ్‌నాయక్, నందునాయక్, రాజునాయక్, మల్లేశ్ నాయక్ తదితరులు ఆలయంలో నిర్వహించిన భోగ్‌బండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయ ఆవరణలో మహా అన్నదానం చేపట్టారు.

అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో..

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి హాజరై మాట్లాడుతూ.. బంజారాల బాగు కోసం, వాళ్ల ఆత్మగౌరవం కోసం సేవాలాల్ పనిచేశారని యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అలాగే వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సూర్య ధనంజయ్ ప్రధాన వక్తగా పాల్గొని 'సేవాలాల్–దూరదృష్టి' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. ఈ మధ్య సేవాలాల్ కీర్తి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా ప్రాచుర్యం పొందిందని, దానికి తాను చేసిన పరిశోధనలు, ప్రచురణలు కూడా కారణం కావడం గర్వంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ లైజన్ ఆఫీసర్ బానోత్ ధర్మ, చంద్రకళ, ప్రమీలాకేతావత్, భోజు శ్రీనివాస్, రెడ్యానాయక్, మాలోత్ బుద్ధా నాయక్, పాండునాయక్, కాంతం ప్రేమకుమార్, రజనీకాంత్, పలు విభాగాల అధిపతులు, డీన్స్, బోధన, బోధనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్ భోగ్ భండార్ పూజల్లో నేతలు

యూసుఫ్‌గూడ టీజీఎస్‌పి ఫస్ట్ బెటాలియన్‌లో..

వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడలోని టీజీఎస్పీ ఫస్ట్ బెటాలియన్‌లో టీజీఎస్పీ అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫస్ట్ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ బి.రామకృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందినగర్‌లో మైదానంలో..

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నందినగర్ మైదానంలో జరిగిన వేడుకల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సేవాలాల్ మహరాజ్ ఆలయం వద్ద భోగ్‌భండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమానత్వం, అహింస మార్గాల వైపు నడిపించిన గొప్పవ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, రాములు చౌహాన్, బాబా నాయక్, ఈశ్వర్ నాయక్, రతన్ నాయక్, రాంజీ చౌహాన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025

చెస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



తెలంగాణ చెస్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు


బంజారాహిల్స్: తెలంగాణ చెస్ అసోసియేషన్ 2025–2029 టర్మ్ ఎన్నికలను బంజారాహిల్స్‌లోని బికనేర్‌వాలా హోటల్‌లో శనివారం నిర్వహించారు. అసోయేషన్ అధ్యక్షులుగా రెడ్డి లక్ష్మీ (హైదరాబాద్), ప్రధాన కార్యదర్శిగా జయచంద్ర (వరంగల్), కోశాధికారిగా నర్సింగరావు (మహబూబ్‌నగర్), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వివేక్ (వరంగల్) ఎన్నికయ్యారు. ఎన్నికల్లో వరంగల్ రూరల్ డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామోజు వినయ్ మద్దతు తెలిపారు. రిటర్నింగ్ అధికారిగా కె.అప్పారావు, ఆలిండియా చెస్ ఫెడరేషన్ నుంచి పరిశీలకులుగా భవేష్ పటేల్, పరిశీలకులుగా తెలంగాణ క్రీడా శాఖాధికారి రవికుమార్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నుంచి పరిశీలకుడిగా ఎ.ప్రవీణ్‌కుమార్ హాజరై ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు.

ఒక శాతం పిల్లలకు పుట్టుకతోనే గుండెజబ్బులు

30 ఏళ్లు దాటాక తల్లి గర్భం దాల్చడం, ఆహారపు అలవాట్లు కారణమంటున్న వైద్యులు

95 శాతం మందికి పిండదశలోనే చికిత్సలతో నయం

దేశంలో ఏటా సుమారు 2 లక్షల మంది వరకు బాధితులు



సాక్షి, సిటీబ్యూరో: అప్పటివరకు సరదాగా ఆడుతూ పాడుతూ తిరిగే పిల్లలు, యువత ఒక్కసారిగా కుప్పకూలిపోతున్నారు. ఒక్కోసారి తనువు చాలిస్తున్నారు. ఈ తరహా మరణాలు తరచూ చూస్తున్నాం. ఈ సడన్ కార్డియాక్ అరెస్ట్ సంఘటనల్లో అధిక శాతం మందికి పుట్టుకతోనే హైపర్ ట్రోఫిక్ అబ్‌స్ట్రక్టివ్ కార్డియోమయోపతి(హెచ్‌ఓసీఎం) కారణమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అప్పుడే పుట్టిన ప్రతి వెయ్యిమంది శిశువుల్లో 10 మందికి పుట్టుకతోనే గుండెజబ్బులు వెలుగు చూస్తున్నాయి. దేశంలో ఏటా 2 లక్షల మంది వరకు బాధితులు నమోదవుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సంఖ్య సుమారుగా 20 వేలమంది వరకు ఉంటుందని అంచనా.

గర్భంలో ఉండగానే గుర్తించొచ్చు..

పిండం తల్లి గర్భంలో ఉన్న మూడు నెలలకే గుండె కొట్టుకోవడం(హార్ట్ బీట్) మొదలవుతుంది. 5వ నెల వచ్చేసరికి గుండె పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుంది. ఈ సమయంలోనే టిఫా, ఫీటల్ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకుంటే పిండం పెరుగుదలను గుర్తించవచ్చు. కొన్ని సందర్భాల్లో గుండె 3 గదులతో ఉండటం, రంధ్రాలు, రక్తనాళాలు వ్యతిరేక దిశలో ఉండటం గుర్తించవచ్చు. గర్భంలో ఉండగానే శస్త్ర చికిత్సలు చేయవచ్చు. పిల్లలు పుట్టిన తరువాత నీలం రంగులోకి మారిపోవడం, నెలల బిడ్డ ఊపిరి తీసుకోవడానికి ఆయాస పడటం, పాలు తాగే సమయంలో ఆగి ఆగి తాగడం, డొక్కలు ఎగరవేయడం, నుదుటి నుంచి చెమటలు రావడం, వయసుకు తగ్గట్టు పెరుగుదల లేకపోవడం, ఎక్కువగా ఏడవటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే హృద్రోగ వైద్యనిపుణులను సంప్రదించడం మేలు.

ఎందుకిలా.. కారణాలేంటి..

పిల్లలకు పుట్టుకతో వచ్చే గుండెజబ్బులకు ప్రధానంగా గర్భిణి ఆహారపు అలవాట్లు, ఫాస్ట్, జంక్ ఫుడ్, ఎక్కువ పాలిష్ చేసిన అన్నం తినడం, కాలుష్యం, మధుమేహం, 30 ఏళ్లు దాటిన తరువాత గర్భం దాల్చడం, జన్యుపరమైన, పౌష్టికాహార లోపం వంటి కారణాలు కనిపిస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. అప్పుడే జన్మించిన ప్రతి వెయ్యిమంది శిశువుల్లో సుమారు 10 మంది గుండె జబ్బుల బారిన పడుతున్నప్పటికీ 95 శాతం మందికి పిండ దశలోనే చికిత్సలతో నయం చేయగలిగే అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. దీనికి సుమారు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశాలు ఉన్నాయి. అక్కడ పరిస్థితులను బట్టి ఈ మొత్తం పెరగొచ్చు. సుమారుగా 5 శాతం మంది మృత్యువాత పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

ఒక దఫా శస్త్ర చికిత్స చేస్తే...



ఒక దఫా శస్త్రచికిత్స చేస్తే జీవితాంతం పనిచేస్తుంది. ఇటీవల సంగారెడ్డిలో మేం హెల్త్ క్యాంప్ నిర్వహించాం. అక్కడికి అనుమానాస్పదంగా ఉన్న 40 మంది పిల్లలను ఆశా కార్యకర్తలు తీసుకొచ్చారు. పరీక్షిస్తే 15 మందిలో గుండె జబ్బులున్నాయని తేలింది. కుటుంబంలో ఏడాది లోపు పిల్లలు చనిపోయారంటే కుటుంబం మొత్తం పరీక్షలు చేయించుకోవడం మంచిది. ఇలాంటివి మా దగ్గర 28 కేసులు ఉన్నాయి. అందులో ఐదుగురిలో జన్యుపరమైన సమస్యలున్నాయి.

– డి. భార్గవి, పీడియాట్రిక్ కార్డియాలజిస్టు, రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి, హైదరాబాద్

దిగి రాకపోతే నిరవధిక బంద్

ప్రభుత్వానికి ఆటోడ్రైవర్స్ జేఏసీ హెచ్చరిక



నారాయణగూడలో చేపట్టిన ఆటో డ్రైవర్ల ర్యాలీ

కాచిగూడ: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిరాకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక ఆటో బంద్ చేపడతామని తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ హెచ్చరించింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటోడ్రైవర్ల సమస్యలపట్ల రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరిని నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం నుంచి నారాయణగూడ చౌరస్తా వరకు ఆటోడ్రైవర్లతో భారీ ర్యాలీ నిర్వహించింది. అనంతరం ఆటోడ్రైవర్లు రాస్తారోకో నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఇప్పుడు కాలయాపన చేయ డం తగదని ధ్వజమెత్తారు. ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం, ఆటో మీటర్ చార్జీలు పెంచడం, రవాణారంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, కొత్త ఆటో పర్మిట్ల మంజూరు వంటి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఎ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), పి.శ్రీకాంత్ (సీఐటీయూ), ఎంఏ సలీం, ఎండి నజీర్ (యూటీఏడబ్ల్యూ), వి.మారయ్య, నిరంజన్ (బీఆర్‌టీయు), వి.ప్రవీణ్ (టీయూసీఐ), రాంరెడ్డి (ఐఎఫ్‌టీయూ), సీహెచ్ జంగయ్య, ఎస్.అశోక్, ఎండి ఒమర్‌ఖాన్, ఎం.శ్రీనివాస్, ఎం.కృష్ణ (ఏఐటీయూసీ) పాల్గొన్నారు.

జాతి మూలాలు మరువొద్దు

సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో మంత్రి సీతక్క



బంజారా భవన్‌లో జరిగిన భోగ్‌బండార్‌లో పాల్గొన్న మంత్రులు సీతక్క, భట్టి విక్రమార్క



లంబాడా మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి సీతక్క

బంజారాహిల్స్: రిజర్వేషన్లు ఉపయోగించుకొని ఎంతో ఎత్తుకు ఎదిగిన తర్వాత మూలాలను మర్చిపోవడమంటే ఆ జాతి మనుగడను దెబ్బతీయడమేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క అన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలు శనివారం బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ ఎంచుకున్న భక్తి, విశ్వాసం, నమ్మకం, శాంతి వంటి ఆశయాల తో మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని సూచించారు. బంజారాలను సంచార జీవితం నుంచి విముక్తి చేసిన మహనీయుడని, స్థిర నివాసం కోసం తండాలు ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 17 వేల కోట్లను ఎస్టీ సంక్షేమం కోసం కేటాయించిందన్నారు. తండాల్లో రోడ్ల నిర్మాణం కోసం వందల కోట్లు ఖర్చు పెడుతున్నామని వివరించారు. బంజారా భాషను అధికారిక భాషగా గుర్తిస్తూ రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా భవన్ వద్ద లంబాడా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వారితో కలిసి మంత్రి సీతక్క కూడా పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు.

నగరంలో నేడు

- శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వేదికగా ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్ రన్నర్స్ మారథాన్ 2025 జరుగుతుంది.
- ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటలకు లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ జరుగుతుంది. ఈ ప్రదర్శన నేడు ముగియనున్నది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మూట్ ట్రిబ్యునల్ పోటీలతో నైపుణ్యాల వృద్ధి



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న జస్టిస్ శ్రావణ్‌కుమార్ తదితరులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్

కాచిగూడ: మూట్ ట్రిబ్యునల్ పోటీలు చార్టెడ్ అకౌంటెంట్, న్యాయశాస్త్ర విద్యార్థులకు చట్టపరమైన అంశాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం బిర్లా భాస్కర ఆడిటోరియంలో తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ నాలుగో మూట్ ట్రిబ్యునల్ పోటీలు–2025 నిర్వహించింది. దాదాపు 300 మంది క్వాలిఫైడ్ చార్టెడ్ అకౌంటెంట్లు, లా విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్, హైదరాబాద్ జోన్, జ్యుడీషియల్ సభ్యుడు కె.నరసింహ చారి, అకౌంటింగ్ సభ్యులు మధుసూదన్ జడ్జిలుగా వ్యవహరించారు. ఆదాయపుపన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్, హైదరాబాద్ జోన్ ఉపాధ్యక్షుడు విజయ్‌పాల్ రావు ప్రారంభించగా జస్టిస్ శ్రావణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్ అమృత్ కుమార్ కోట, అసోసియేషన్ అధ్యక్షుడు హితేష్ జైన్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ వేముల, సలహాదారు రామ్‌దేవ్ బుత్రా, కోశాధికారి అశిష్ జోషి పాల్గొన్నారు.

చిన్నారుల కేన్సర్ సహాయనిధి ఏర్పాటు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో–అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందే చిన్నారుల సహాయార్థం చిన్నారుల కేన్సర్ సహాయనిధి ఏర్పాటు చేశారు. ప్రపంచ చిన్నారుల కేన్సర్ రోజును పురస్కరించుకుని ఆస్పత్రిలో ప్రారంభించిన ఈ నిధి ద్వారా పేద చిన్నారుల చికిత్సకు ఆర్థక సహాయం అందిస్తారు. కార్యక్రమంలో డాక్టర్ వీరేంద్రపాటిల్, ఏఎస్ఆర్ ప్రసాద్, డాక్టర్ కె.కృష్ణయ్య, డాక్టర్ టీఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు తమన్‌కు ఖరీదైన కారును బహూకరించారు.

టీపీసీసీ చీఫ్‌తో జీహెచ్ఎంసీ మేయర్ భేటీ



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల దృష్ట్యా శనివారం హైదర్‌గూడ ఎమ్మెల్యేల క్వార్టర్స్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠమే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలపై మహేష్‌కుమార్ కార్పొరేటర్లకు దిశా నిర్దేశం చేశారు.

ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అభినందనీయం

బంజారాహిల్స్: సర్వైకల్ కేన్సర్‌ను నిరోధించేందుకుగాను పేద బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతివెస్లీ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ నగరంలోని 500 మంది పేద బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంతివెస్లీ మాట్లాడుతూ తెలంగాణ కేన్సర్ రహిత రాష్ట్రంగా మారాలని ఆకాంక్షించారు. ఒక్కో బాలికకు మొదటి వ్యాక్సిన్ వేసిన ఆరు నెలల్లోపు రెండో వ్యాక్సిన్ వేయాల్సి ఉంటుందని చెప్పారు. ఒప్పందం ప్రకారం సుమారు వెయ్యి డోస్‌లుగా ఈ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చిన్నబాబు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వంశీ ముత్యపు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నిరంతరాయంగా విద్యుత్

- ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా



మోనో పోల్స్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు

దుండిగల్: రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలో రూ.212 కోట్లతో నిర్మిస్తున్న 220 కేవీ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ నెలాఖరు వరకు పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ముందుగా శంభీపూర్‌లోని ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న మోనో పోల్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట టీజీ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ, టీజీ ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాస రావు, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ టి.జగత్‌రెడ్డి, మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ చిరంజీవి, ఎస్‌పీడీసీఎల్ మేడ్చల్ సీఈ కామేశ్, ఎస్ఈలు రామ్ జీ, రవికుమార్ తదితరులు ఉన్నారు.

తీరనున్న కరెంట్ వెతలు..

నగరంతో పాటు వివిధ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో నర్సాపూర్ నుంచి బౌరంపేట్ టీజీ ట్రాన్స్‌కోకు అనుసంధానంగా రూ.212 కోట్లతో నూతనంగా సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఇది పూర్తి అయితే మేడ్చల్, బౌరంపేట, పఠాన్ చెరువు, అమీన్‌పూర్, ఆర్‌సి పురం. కూకట్‌పల్లి, బాచుపల్లి, నిజాంపేట, మయూరినగర్, ప్రగతినగర్, మియాపూర్, అశోక్‌నగర్ ప్రాంతాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా కానుంది. అధునాతన సాంకేతికతను ఉపయోగించి బౌరంపేటలోని సబ్ స్టేషన్‌ను విద్యుత్ సౌధ నుంచి కూడా ఆపరేట్ చేసే విధంగా రూపొందించారు.

హజ్ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ బియబానీ



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా హజ్ యాత్ర–2025కు ఎంపికైన వారికి అన్ని జిల్లాలతోపాటు నగరంలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ బియాబానీ ఖుస్రో పాషా తెలిపారు. శనివారం నాంపల్లి హజ్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ పలు మండల కేంద్రాల్లోనూ హజ్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణశిబిరాలను 15 నుంచి 20కు పెంచాలని అధికారులకు సూచించారు. హజ్ ఆరాధనలకు సంబంధించిన విధివిధానాలు, నియమాలతో పాటు చేయాల్సిన ప్రార్థనల గురించి ధార్మిక పండితులు సూచిస్తారన్నారు. ఎంపికైన వారికి ఎస్ఎంఎస్ ద్వారా శిబిరానికి సంబంధించిన సమాచారం తెలియజేస్తామన్నారు. శిబిరాల్లో పాల్గొనే వారు వివరాలు నమోదు చేసుకోవడానికి హజ్ కమిటీ ద్వారా స్టేషనరీ అందిజేస్తామని చెప్పారు.

ఈ పురుగుల అన్నం మాకొద్దు

- ప్రభుత్వ పాఠశాల ముందు విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా




కొత్తగూడ ప్రభుత్వ పాఠశాల ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గచ్చిబౌలి: మధ్యాహ్న భోజనంలో పురుగులు ఉంటున్నాయని, ఈ నాసిరకం ఆహారం తమకు వద్దని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆందోళనకు దిగారు. కొండాపూర్ కొత్తగూడ ప్రభుత్వ పాఠశాలల ముందు విద్యార్థులు, తల్లిదండ్రులు శనివారం ధర్నా చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తరచూ భోజనంలో పురుగులు, రాళ్ళు వస్తున్నాయని, ఉడికీ ఉడకని భోజనం తింటూ ఆస్పత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు కొంత కాలంగా తరచూ అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అనారోగ్యానికి కల్తీ ఆహారమే కారణమని వైద్యులని చెబుతున్నారని గుర్తు చేశారు. వెంటనే మిడ్ డే మీల్స్ కాంట్రాక్టర్‌ను తొలగించాలని, పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినాఎటువంటి మార్పు లేకపోవడంతో స్కూల్ ఎదుట ధర్నా చేయాల్సిన పరిస్థితి నెలకొందని వారు వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలన్నారు. ఇలాంటి పరిస్థితి మళ్ళీ పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు.

శాంతి కల్యాణోత్సవం



శాంతి కల్యాణోత్సవం దృశ్యం



సమతాకుంభ్‌లో శాంతి కల్యాణోత్సవంలో పాల్గొన్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: సమతాకుంభ్ తృతీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న సమతాస్ఫూర్తి కేంద్రంలో చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు జరుపుతున్నారు. కల్యాణం అంటే మంగళం కలుగజేసేదని, ఒకే వేదికపై శ్రీరంగం నుంచి వైకుంఠం వరకు 108 దివ్య దేశాల పెరుమాళ్లకు ఒకేసారి ఇక్కడ శాంతి కల్యాణం జరిపించడం విశేషమని చినజీయర్‌స్వామి తెలిపారు. కల్యాణ వీక్షణతో ఆ భగవంతుడు 108 రూపాల్లో మనకి సంపూర్ణ అనుగ్రహాన్ని ప్రసాదిస్తారని చెప్పారు.

జిల్లా కలెక్టర్ భూపరిశీలన

శామీర్‌పేట్: శామీర్‌పేట్ మండలం జీనోం వ్యాలీ మెయిన్ రోడ్డు నుంచి రాష్ట్ర ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పార్కుకు ప్రత్యామ్నాయ రోడ్డు కోసం జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు శనివారం క్షేత్రస్థాయి భూపరిశీలన చేశారు. భూసేకరణ కోసం మ్యాప్‌లను పరిశీలించిన అనంతరం మురారిపల్లి గ్రామస్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజయ్ వాటర్‌ప్లాంట్ ముందు నుంచి ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ పర్యటనలో ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ఏర్పాటుకు మ్యాప్‌లను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్

నిమ్స్‌లో చాలెంజ్‌గా చికిత్సలు

- అరుదైన వ్యాధులకు మెరుగైన సంరక్షణ
- సెన్సిటైజేషన్ వర్క్‌షాపులో ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప



నిమ్స్‌లో అరుదైన వ్యాధులపై సెన్సిటైజేషన్ వర్క్‌షాపులో డైరెక్టర్ బీరప్ప తదితరులు

లక్డీకాపూల్: నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తున్న నిమ్స్ చికిత్సలను చాలెంజ్‌గా తీసుకుని విజయవంతంగా నిర్వహిస్తోందని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. 'కేర్ ఫర్ రేర్: టుగెదర్ వుయ్ విన్'అనే పేరుతో అరుదైన వ్యాధులకు సైతం స్ఫూర్తిదాయకమైన రీతిలో వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. శనివారం నిమ్స్‌లో అరుదైన వ్యాధులపై సెన్సిటైజేషన్ వర్క్‌షాప్ జరిగింది. నిమ్స్‌తోపాటు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ) సహకారంతో నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్(ఎన్‌పీఆర్‌డీ) నిర్వహించిన ఈ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. అరుదైన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్యతా ప్రమాణాలతో అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. అన్ని వర్గాల రోగులకు అందుబాటులో అంటూ సరళతరమైన రీతిలో అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను అందిస్తున్నట్టు వివరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి స్థాయిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అరుదైన వ్యాధులకు రోగనిర్ధారణ పద్ధతులు, చికిత్స ఎంపిక, నివారణ వ్యూహాల పట్ల అవగాహనకు సెన్సిటైజేషన్ వర్క్‌షాపు దోహదపడుతుందన్నారు. వర్క్‌షాపులో నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, సీడీఎఫ్‌డీ డయాగ్నస్టిక్స్ విభాగం అధిపతి, సీఓఈ నోడల్ అధికారి డాక్టర్ అశ్విన్ దలాల్, డబ్ల్యూహెచ్‌వో అరుదైన వ్యాధుల అధికారిణి డాక్టర్ ఆస్తా చుగ్, సీఓఈ కమిటీ సభ్య కార్యదర్శి డాక్టర్ ప్రజ్ఞా రంగనాథ్, నిమ్స్ మెడికల్ జెనెటిక్స్ విభాగం ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ షగున్ అగర్వాల్, ప్రభుత్వ వైద్య కళాశాలల పీడియాట్రిక్స్, ప్రసూతి–గైనకాలజీ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'కొమెడ్ కె'తో 150 కాలేజీల్లో ప్రవేశానికి అర్హత

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా 150కి పైగా ఇంజినీరింగ్ కళాశాలలకు, 50కి పైగా ప్రసిద్ధ ప్రైవేట్, డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందేందుకు కొమెడ్‌కె యుగెట్/యుని గేజ్ పరీక్ష ఉపకరిస్తుందని కొమెడ్‌కె సంస్థ ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ డాక్టర్ కుమార్, యునిగేజ్ ఆధ్వర్యంలోని ఎరా ఫౌండేషన్ సీఈఓ పి.మురళీధర్ తెలిపారు. నగరంలోని మారియట్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది కొమెడ్‌కె యుగెట్/యుని గేజ్ ప్రవేశ పరీక్ష మే 10న జరగనుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు మార్చి 15వ తేదీలోగా www. comedk. org or ww-w-. unigauge. com లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

వక్ఫ్‌బోర్డు చట్టంలో సంస్కరణలు అవసరం

- పట్నా హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ నరసింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ. చిత్రంలో జస్టిస్ నరసింహారెడ్డి, హనుమాన్ చౌదరి

కాచిగూడ: న్యాయ వ్యవస్థకు వక్ఫ్‌బోర్డు చట్టం సవాలుగా మారిందని, దీనిలో పూర్తిస్థాయి సంస్కరణలు అవసరమని పట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. శనివారం రాత్రి కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో గోపాల్‌రావు ఠాగూర్ స్మారక సమితి ఆధ్వర్యంలో 'వక్ఫ్ బోర్డు చట్టం అంటే ఏమిటి, దాని పరిణామాలు'అనే అంశంపై గోపాల్‌రావు ఠాగూర్ స్మారక ప్రసంగం నిర్వహించారు. జస్టిస్ నరసింహారెడ్డి మాట్లాడుతూ 2013లో తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సంస్కరణలు సరైనవి కావని విమర్శించారు. మొదటగా మూడు లక్షల ఎకరాల ఆస్తులు ఉన్న వక్ఫ్ బోర్డు ఇప్పుడు 8 లక్షల మేర సమకూర్చుకుందని అన్నారు. సనాతన ధర్మాన్ని, భారత జాతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నిర్ధారిస్తే తప్ప వక్ఫ్ ఆస్తి కాదనే నిబంధనను కొత్త సంస్కరణలలో పొందుపర్చారని తెలిపారు. దేశంలో రక్షణ శాఖ, రైల్వే శాఖ తర్వాత మూడో స్థానంలో వక్ఫ్‌బోర్డు ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో వక్ఫ్‌బోర్డుకు పూర్తి అధికారం ఇవ్వడం వల్ల ప్రశ్నించేవారు లేకపోయారని, ట్రిబ్యునల్ వల్ల కోర్టుకు వెళ్లే అవకాశం కూడా లేకపోయిందన్నారు. 1995 వక్ఫ్‌చట్ట సవరణ సరిగా లేదని చెప్పారు. వక్ఫ్‌బోర్డుకు భారతదేశంలో ఉన్నన్ని ఆస్తులు ప్రపంచంలో ఎక్కడా లేవని వివరించారు. వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పద్మశ్రీ టి.హనుమాన్ చౌదరి, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కోరుకునే వారిలో చిరు/తృణ ధాన్యాలపై అవగాహన ఇంతింతై అన్నట్టుగా వేగంగా పెరుగుతోంది. నగరవాసుల్లో విభిన్న రకాలుగా వాటిని ఆహారంలో భాగం చేసుకోవడం పట్ల ఆసక్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అవగాహన మరింత పెంచడంతో పాటు ఔత్సాహిక వ్యాపారవేత్తలను మిల్లెట్ స్టోర్ల ఏర్పాటుకు ప్రోత్సహించడం లక్ష్యంగా జాతీయస్థాయి పోర్టల్ మిల్లెట్ న్యూస్ డాట్ కామ్ పని చేస్తోంది. - సాక్షి, సిటీబ్యూరో





రైట్.. రైట్..
మిల్లెట్ డైట్





చిరుధాన్యాలకు జాతీయ స్థాయిలో ప్రచారం

- ఔత్సాహిక వ్యాపార వేత్తలకు అండదండలు
- ఒకేసారి 100 మిల్లెట్ స్టోర్ల ప్రారంభోత్సవం
- రైతులతో సమన్వయం, వైద్యులతో అనుసంధానం

దేశ ప్రధాని నరేంద్ర మోదీ 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించడం నుంచి తాము స్ఫూర్తి పొంది మిల్లెట్స్ నేషనల్ పోర్టల్(డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.మిల్లెట్ న్యూస్ డాట్‌కామ్) ఏర్పాటు చేశామని, దీనిని నగరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి అధికారికంగా ప్రారంభించారని పోర్టల్ నిర్వాహకులు బిజినెస్ మెంటర్, డిజిటల్ మార్కెటింగ్ ట్రైనర్ శ్రీనివాస్ సరకదం తెలిపారు. ఏకకాలంలో 100 మిల్లెట్ స్టోర్లను నగరం వేదికగా ప్రారంభించిన సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ తమ కార్యక్రమం వివరాలను ఇలా వెల్లడించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

ఆరోగ్య అవగాహన కోసం..

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఏ రకమైన ప్రయోజనాన్ని అందిస్తాయి? ఏ వ్యాధులను దూరం చేస్తాయి? తదితర విషయాలు తెలియజేసేందుకు హెల్త్ అండ్ న్యూట్రిషన్ అంబాసిడర్స్(హెచ్ఎన్ఏ) కౌన్సిల్‌ను స్థాపించాం.. ఇది ప్రస్తుతం 50 మంది వైద్యులను కలిగి ఉంది. ఈ సంవత్సరాంతానికి వెయ్యి మంది సభ్యులకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ కౌన్సిల్ మిల్లెట్ స్టోర్ యజమానులతో కలిసి పని చేస్తుంది. సహకారంలో భాగంగా.. మిల్లెట్ స్టోర్ యజమానులు పోషకాహార నిపుణులు వైద్యుల నుంచి నిరంతర మార్గదర్శకత్వాన్ని అందుకుంటారు. అలాగే.. స్టోర్ యజమానులకు అవసరమైన శిక్షణ, మద్దతు నిరంతరం అందిస్తాం. బీపీ, డయాబెటిస్, బీఎమ్ఐ అసెస్‌మెంట్‌లను కవర్ చేసే బేసిక్ హెల్త్ చెకప్ ట్రైనింగ్ సెషన్‌లను శనివారం నిర్వహించాం. ఈ సెషన్‌లను పోషకాహార నిపుణుడు ఓ.మనోజ ప్రకృతి వైద్యురాలు డాక్టర్ మోనికా స్రవంతి సారథ్యం వహించారు.

100 మిల్లెట్ స్టోర్ల ప్రారంభం..

తెలుగు రాష్ట్రాల్లో నెలకొల్పిన 100 మిల్లెట్ స్టోర్లను మాదాపూర్‌లోని మినర్వా హోటల్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో శనివారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి వర్ధమాన తారలు వేద్విక, వాన్యా అగర్వాల్‌లు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా మహిళా ఔత్సాహిక వ్యాపారులు 100 మంది పాల్గొన్నారు. మిల్లెట్ పోర్టల్‌తో కలిసి పనిచేస్తున్న వైద్యులు, రైతులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కొత్త మిల్లెట్ ఉత్పత్తులను విడుదల చేశారు.

కొత్త చిరుధాన్యాల గుర్తింపు..

దేశంలోని 50 అధిక–నాణ్యత గల మిల్లెట్ ఉత్పత్తులను మార్కెట్లోకి ప్రవేశపెట్టాం. ఇవి ఇప్పుడు కొత్తగా ప్రారంభించబడిన స్టోర్‌ల ద్వారా అందుబాటులో ఉంటాయి. పెద్దగా పెట్టుబడి పెట్టలేని వారు సైతం వ్యాపారులుగా మారడానికి వీలుగా, మిల్లెట్ స్టోర్ ఏర్పాటుకు ప్రారంభ పెట్టుబడిని తగ్గించగలిగాం. తమ వ్యాపారాన్ని కనీస పెట్టుబడి రూ.85 వేలతోనే ప్రారంభించవచ్చు. ఇందులో 50 మిల్లెట్ ఉత్పత్తులు, బిల్లింగ్ మెషిన్, ఆరోగ్య అవగాహన కంటెంట్‌ను ప్రదర్శించడానికి టీవీ సెటప్, బ్యానర్లు, బ్రోచర్లు, వెబ్‌సైట్, హెల్త్ చెకప్ కిట్ బ్రాండింగ్ మెటీరియల్ సైతం అందిస్తాం.





మాదాపూర్‌లో అరైవల్

సాక్షి, సిటీబ్యూరో: వర్మ స్టీల్ ఆధ్వర్యంలో మాదాపూర్, దుర్గం చెరువు ఎదురుగా ఏర్పాటైన ప్రీమియం హాస్పిటాలిటీ వెంచర్ అరైవల్ హోటల్స్‌ను ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్మ స్టీల్స్ చైర్మన్ అండ్ ఎండీ ఏవీపీ వర్మ మాట్లాడుతూ ప్రపంచస్థాయి చెఫ్‌లను కలిగి ఉన్న ఫైన్ డైనింగ్ రెస్టారెంట్, అడ్వాన్స్‌డ్ స్మార్ట్ టెక్నాలజీతో రూపొందిన అత్యాధునిక గదులు, సూట్ రూమ్స్ తదితర విశేషాలెన్నో తమ హోటల్స్ ప్రత్యేకతగా పేర్కొన్నారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా తమ గ్రూప్ హోటల్స్ విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు కొరటాల శివ, సినీ నిర్మాత సునీల్ నారంగ్, సినీ ఆర్టిస్టులు శ్రీనివాస్‌రెడ్డి, శివాజీ, కృష్ణుడు, రజిత, భావన పాల్గొన్నారు.



శివ్ మీనన్ లైవ్.. నేడు

సాక్షి, సిటీబ్యూరో: గాయకుడిగా, గిటారిస్ట్‌గా.. వన్ మ్యాన్ షో చేసే శివ్‌మీనన్ నగర సంగీత ప్రియులకు సుపరిచితులు. హైటెక్ సిటీలోని హార్డ్ రాక్ కేఫ్‌లో ఆదివారం ఆయన తనదైన సంగీత ధ్వనులను వినిపించనున్నారు. సూఫీ రాక్, బ్లూస్.. తదితర శైలుల్లో ప్రసిద్ధి చెందిన శివ్ మీనన్ మ్యూజిక్ షోను ఎంజాయ్ చేయాలనుకుంటే ఈ ఆదివారం సాయంత్రం ఓ మంచి అవకాశం అంటూ ఆహ్వానిస్తోంది ఈ కేఫ్.

ఇన్‌ఫ్యూజన్ షో..

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన రాక్ బ్యాండ్ పార్టీ ప్రియులకు ఇన్ ఫ్యూజన్ సంగీతాభిమానుల కోసం వైవిధ్యభరితమైన మ్యూజిక్ కిక్ అందించనుంది. ఎల్బీనగర్‌లోని అర్బన్ మాయాబజార్ వేదికగా ఈ బ్యాండ్ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. రాత్రి 8గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుంది.



యూకేలో విద్య, ఉపాధి అవకాశాలపై ఫెయిర్



సాక్షి, సిటీబ్యూరో: యూకేలోని విద్య, ఉపాధి అవకాశాలపై దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఐ గ్లోబల్ ఇండియా యూనివర్సిటీ ఫెయిర్ నగరంలో 18వ తేదీన జరగనుంది. ఈ విషయాన్ని ఎస్ఐ గ్లోబల్ ఎండీ లక్ష్మీ అయ్యర్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ నెల 14న ప్రారంభమై మార్చి 1వ తేదీతో ముగిసే తమ దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా నగరంలో బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో నిర్వహించనున్నామని, దీనిలో యూకేలోని కళాశాలల్లో ప్రవేశాల దగ్గర నుంచి స్కాలర్‌షిప్స్, వీసాలకు అవసరమైనవాటిపై అవగాహన, ఉద్యోగావకాశాలు.. వంటి వాటిని ఈ ఫెయిర్ అందిస్తుందని, యూకేకి చెందిన 35 అగ్రగామి విశ్వవిద్యాలయాలు ఈ ఫెయిర్ పాల్గొంటున్నాయని వివరించారు.



ఆరేళ్ల వయసు నుంచే..

- జంతువుల కోసం పనిచేస్తున్నాను..
- సినీ నటి అక్కినేని అమల

సాక్షి, సిటీబ్యూరో: ఆరేళ్ల వయసు నుంచి జంతువుల సంక్షేమంలో నా ప్రయాణం ప్రారంభమైందని జంతు ప్రేమికురాలు, సినీ నటి అమల పేర్కొన్నారు. యానిమల్ ఛారిటీ హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్ ఇండియా మిషన్ పేరును హ్యూమన్ వరల్డ్ ఫర్ యానిమల్స్‌గా మార్చారు. దీనికి సంబంధించిన కొత్త పేరు, లోగోలను నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జంతువుల బాధలను అంతం చేయాలనే లక్ష్యంతో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నానన్నారు. విద్యార్థులు సైతం మాతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చారని తెలిపారు. సర్కస్‌లో వన్యప్రాణులను నిలుపుదల చేయడం నుంచి జంతువులపై ప్రయోగాలు నిర్వహించే ప్రయోగశాలల వరకు అందరితో మాట్లాడామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జంతు ప్రేమికులంతా కలిసి చేసే పనులు, తీసుకువస్తున్న మార్పులే లేకుంటే నా జీవితానికి విలువ లేదన్నారు. జంతువులు, ప్రకృతి పట్ల ఉన్న ప్రేమ మనల్ని ఒకచోటకు చేరుస్తుందని పేర్కొన్నారు. అన్ని రకాల జంతువుల పట్ల జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ జంతువుల పట్ల మానవత్వం చూపే సంప్రదాయం రావాలని ఆకాంక్షించారు. హ్యూమన్ వరల్డ్ ఫర్ యానిమల్స్ సంస్థ చేస్తున్న అద్భుతమైన కృషికి ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హ్యూమన్ వరల్డ్ ఫర్ యానిమల్స్ అధ్యక్షులు, సీఈవో కిట్టి బ్లాక్, పలువురు సంస్థ ప్రతినిధులు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.



నగరంలోని ఓ హోటల్‌లో సంస్థ కొత్త లోగోను ఆవిష్కరిస్తున్న అమల



మార్కెట్లోకి స్థూపాకారపు హైడ్రాలిక్ ఎలివేటర్..

సనత్‌నగర్: ఓ కంపెనీ దేశంలో మొట్టమొదటి సిలిండ్రికల్ ఆకారపు హైడ్రాలిక్ ఎలివేటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు బేగంపేట టూరిజం ప్లాజా హోటల్‌లో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఈ స్థూపాకార హైడ్రాలిక్ ఎలివేటర్‌తో పాటు మరో మూడు ఎలివేటర్ మోడల్స్‌ను ఆవిష్కరించారు. ఇదే వేదికపై సంస్థ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సినీనటి జన్నత్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీ కుర్రాడు..
సైక్లింగ్‌లో మెరిశాడు

పుష్ప అంటే నేషనల్ అనుకుంటివా.. ఇంటర్నేషనల్.. ఇటీవల వచ్చిన ఓ సినిమాలోని సూపర్‌హిట్ డైలాగ్.. అలాగే పాతబస్తీకి చెందిన ఓ విద్యార్థి పారా సైక్లింగ్‌లో నేషనల్ లెవెల్ దాటుకొని ఇంటర్నేషనల్‌కు చేరాడు. చిన్ననాటి నుంచి చదువుతో పాటు సమయం దొరికినప్పడల్లా క్రీడలపై మక్కువ చూపుతుండేవాడు. జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించి ప్రస్తుతం థాయిలాండ్‌లో జరుగుతున్న 13వ ఏషియన్ పారా రోడ్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నాడు శాలిబండ సైక్లింగ్ క్లబ్ విద్యార్థి ఆశీర్వాద్ సక్సేనా.. - చార్మినార్




పాతబస్తీ బేలా కాలనీకి చెందిన ఆశీర్వాద్ సక్సేనా కుటుంబం వ్యాపార రంగంలో ఉండగా చిన్ననాటి నుంచి క్రీడలంటే ఇష్టం ఉండటంతో కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు. ఎప్పటికప్పుడు తన కోచ్‌ల ద్వారా మెళకువలు నేర్చుకుంటూ సైక్లింగ్‌లో ప్రతిభ కనబర్చాడు. మెల్‌బోర్న్‌లోని డాకిన్ యూనివర్సిటీలో ఎక్సైర్‌సైజ్ అండ్ స్పోర్ట్స్ సైన్స్‌లో డిగ్రీ విద్యాభ్యాసం చేస్తూనే సైక్లింగ్‌లో రాణిస్తున్నారు. దేశ, విదేశాల్లో జరిగే సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఓవైపు విద్యాభ్యాసం.. మరోవైపు సైక్లింగ్‌లో పాల్గొంటూ పతకాల వేట కొనసాగిస్తున్నాడు. థాయిలాండ్‌లో కొనసాగుతున్న 13వ ఏషియన్ పారా రోడ్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్–2025లో పాల్గొనేందుకు నగరం నుంచి తన కోచ్‌లతో కలిసి వెళ్లాడు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులు, రివార్డులు సాధించిన ఆశీర్వాద్ సక్సేనా థాయిలాండ్‌లో మెడల్ సాధిస్తాడని పలువురు క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



38వ జాతీయ ఆటల పోటీలలో..

ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన 38వ జాతీయ పోటీల్లో 120 కిలో మీటర్ల మాస్ స్టార్ట్ రోడ్ రేస్ పోటీలో కాంస్యం గెలుచుకున్నారు.



ఇంటర్నేషనల్ సైక్లిస్ట్ ఆఫ్ హైదరాబాద్‌గా..

రాష్ట్రం తరపున కాంస్యం సాధించిన ఆశీర్వాద్ సక్సేనాను తెలంగాణ స్టేట్ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.విజయ్‌కాంత్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.దత్తాత్రేయ తదితరులు అభినందించారు. ఆశీర్వాద్ సక్సేనాను ఇంటర్నేషనల్ సైక్లిస్ట్ ఆఫ్ హైదరాబాద్‌గా పిలుస్తున్నామని కె.దత్తాత్రేయ పేర్కొన్నారు.

యువ క్రీడాకారులకు రోల్ మోడల్‌గా..

“అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాలని నా కోరిక. విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా ఓ వైపు ఉన్నత విద్యాభ్యాసం చేస్తూనే.. మరోవైపు ఇష్టమైన సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటున్నాను.
- ఆశీర్వాద్ సక్సేనా

సాధించిన మెడల్స్..

- 2019లో మహారాష్ట్రలో జరిగిన ఇండియన్ రోడ్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలో కాంస్యం
- 2021లో జైపూర్‌లో ట్రాక్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో వెండి, కాంస్య పతకాలు
- 2022లో గౌహతిలో ట్రాక్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండు వెండి పతకాలతో పాటు రెండు కాంస్య పతకాలు
- 2022లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా ట్రాక్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం
- 2024లో మెల్‌బోర్న్‌లో అండర్–23 విభాగంలో క్రిటేరియం సైక్లింగ్ రేస్‌లో కాంస్యం
- 2024లో కర్ణాటకలో జరిగిన నేషనల్ రోడ్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం
- 2024లో చెన్నైలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రెండు బంగారు పతకాలతో పాటు వెండి పతకం సాధించారు.

క్లుప్తంగా...

కేటీఆర్ ఎప్పుడు జైలుకు పోతాడో చిలక జోస్యం చెప్ప

- మాజీ మంత్రి ఎర్రబెల్లి వ్యాఖ్యలపై విప్ ఆది శ్రీనివాస్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: నలభై ఏళ్ల రాజకీయ చరిత్ర అని గొప్పలు చెప్పుకునే బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు చిన్న అమ్మాయి చేతిలో చిత్తు చిత్తుగా ఓడిపోయినా సిగ్గు రాలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయన చిలకజోస్యం చెప్పుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందంటూ ఎర్రబెల్లి చెప్పిన మాటలు చిలుక జోస్యం లాగానే ఉన్నాయని, ఆయనకు నిజంగా జ్యోతిషం తెలిస్తే ఫామ్‌హౌస్‌లో పడుకున్న కేసీఆర్ ఎప్పుడు లేస్తాడో, ఫార్ములా ఈ–రేసులో కేటీఆర్ ఎప్పుడు అరెస్టు అవుతాడో చెప్పాలని శ్రీనివాస్ హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల గురించి ఆలోచించాల్సిన అవసరం ఎర్రబెల్లికి లేదని, ఇప్పటికే ఆ పార్టీ నుంచి 10 మంది వెళ్లిపోగా మిగిలిన వారిని కాపాడుకోవాలని సూచించారు. సీఎం వ్యాఖ్యలను బండి సంజయ్ వక్రీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 18, 19 తేదీల్లో నిరసన

- 9 వామపక్ష పార్టీల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి, సంపన్నులకు రాయితీలు పెంచడం ద్వారా సామాన్యులకు తీరని ద్రోహం చేసిందని తొమ్మిది వామపక్ష పార్టీలు విమర్శించాయి. ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ అఖిలభారత వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 18, 19 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వామపక్ష పార్టీల నేతలు జాన్ వెస్లీ (సీపీఎం), కూనంనేని సాంబశివరావు (సీపీఐ), పోటు రంగారావు (సీపీఎం–ఎంఎల్) మాస్‌లైన్, గాదగోని రవి (ఎంసీపీఐ–యూ), సాదినేని వెంకటేశ్వర్‌రావు (సీపీఐ–ఎంఎల్ న్యూ డెమోక్రసీ), జానకిరాములు (రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ), సీహెచ్ మురహరి (ఎస్‌యూసీఐ–సీ), రమేశ్ రాజా (సీపీఐ–ఎంఎల్ లిబరేషన్), బి.సురేందర్ రెడ్డి (ఫార్వర్డ్ బ్లాక్) శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ కల్పించి, బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐని ఉపసంహరించాలనే పలు డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నాలన్నారు.

వంగ రవీందర్‌రెడ్డిపై సీఈవోకు బీజేపీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డిపై బీజేపీ ప్రతినిధి బృందం.. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. తన తమ్ముడు, ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్‌రెడ్డికి ఓట్లు వేయాలంటూ తన సంఘాన్ని ఉపయోగించి రవీందర్‌రెడ్డి.. ఎంఈవోలు, టీచర్లను బెదిరిస్తున్నారని సీఈవో దృష్టికి తీసుకెళ్లింది. ఎన్నికల నియమాల ప్రకారం ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరింది. శనివారం ఈ మేరకు సీఈవోకు బీజేపీ ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, పార్టీ అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ గోకుల రామారావు, బీజేపీ ఆర్టీఐ జాయింట్ కన్వీనర్ పవన్ మైత్రేయ వినతిపత్రం అందించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా తన తమ్ముడు మహేందర్‌రెడ్డికి అనుకూలంగా తన సంఘంతో పనిచేయిస్తున్నారని తెలిపారు. మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో వివిధ జిల్లాల డీఈవోలు, ఎంఈవోలు, టీచర్లను భయపెట్టి మహేందర్‌రెడ్డికి అనుకూలంగా ఓటు వేయాలని ప్రచారంతో ప్రభావితం చేస్తున్నారని చెప్పారు.

'స్థానిక' పోరులో కాంగ్రెస్ మిత్రపక్షాలతో కలవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సాక్షి, హైదరాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మిత్రపక్షాలతో పరస్పర అవగాహన విషయంలో కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని చాటుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శత్రువును ఎదుర్కొనేందుకు కలసి పనిచేయాల్సిన అవసరాన్ని మొన్నటి ఢిల్లీ ఎన్నికలు నిరూపించాయన్నారు. కాంగ్రెస్, ఆప్ పార్టీల స్వయంకృతాపరాధం వల్లనే ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను స్థానిక సంస్థల ఎన్నికల నాటికి అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైతే అప్పులు చేసైనా.. ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఉచితాల కారణంగా వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని, ఇతర పనులకు కూడా ఎవ్వరూ రావడం లేదని మేధావులు, న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులనే సంక్షేమ పథకాల రూపంలో తిరిగి వారికి ఇస్తున్నారు తప్ప ఉచితంగా కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల గణనను దేశవ్యాప్తంగా చేపట్టాలన్నారు.

భయపెడుతున్న జీబీ సిండ్రోమ్



బాధితుల్లో కాళ్ల నుంచి మెడ దాకా క్రమంగా అచేతనం ● పరిశుభ్రమైన నీరు, ఆహారమే ముందు జాగ్రత్తలు

సాక్షి ఫ్యామిలీ హెల్త్ డెస్క్

గులియన్ బ్యారి సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి వేగంగా విస్తరిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి లక్షణాలేమిటి? దీని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలను ప్రజలు శోధిస్తున్నారు. కలుషిత నీరు, ఆహారం తీసుకునే వారిలోనే జీబీఎస్ అధికంగా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెప్తున్నారు.

జీబీ సిండ్రోమ్ లక్షణాలు

- ఏదైనా వైరల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సోకిన తర్వాత పోస్ట్ వైరల్ లేదా పోస్ట్ బ్యాక్టీరియల్ వ్యాధిగా కనిపించేదే జీబీఎస్.
- మెదడు నుంచి దేహంలోని ప్రతి భాగానికి ఆదేశాలందించడానికి నరాలపై మైలీన్ అనే పొర ఉంటుంది. యాంటీబాడీస్ ఈ పొరను దెబ్బతీసినప్పుడు మెదడు నుంచి సిగ్నల్స్ అందక అవయవాలు అచేతనమవుతాయి.
- మొదట కాళ్లు చచ్చుబడిపోతాయి. క్రమంగా దేహమంతా అచేతనమవుతుంది. గొంతు కండరాలు అచేతనమైతే రోగి మాట్లాడలేడు. మింగడమూ కష్టమవుతుంది. ముఖంలోని కండరాలు అచేతనమైతే కళ్లు కూడా మూయలేడు.
- ఈ ప్రక్రియ ఛాతీ కండరాలు, ఊపిరితిత్తులను పని చేయించే డయాఫ్రమ్ కండరాల వరకు వెళ్లినప్పుడు ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. ఆ స్థితికి వచ్చిన బాధితులు మృతి చెందే అవకాశం ఉంది.
- గుండె స్పందనలు వేగంగా లేదా మెల్లగా మారడం, బీపీ హెచ్చు తగ్గులకు గురికావడం, ముఖం నుంచి వేడి ఆవిర్లు వస్తున్నట్లు అనిపించడం, బాగా చెమటలు పట్టడం జరగవచ్చు. వ్యాధి మొదలయ్యాక 7 నుంచి 14 రోజులపాటు తీవ్రం వస్తుంది. మైలీన్ పొర మళ్లీ యథాస్థితికి వస్తే బాధితులు క్రమంగా కోలుకుంటారు. ఆ ప్రక్రియ రోజుల వ్యవధి నుంచి ఆరు నెలలలోగా జరగవచ్చు.
- శరీరంలో పొటాషియం లేదా కాల్షియం పాళ్లు తగ్గినా జీబీఎస్ లక్షణాలే కనిపిస్తాయి. అయితే అవి భర్తీ కాగానే అచేతనత్వం తగ్గిపోతుంది. కాబట్టి జీబీ సిండ్రోమ్ నిర్ధారణ చాలా స్పష్టంగా జరగాలి.
- కలుషిత నీరు, ఆహారమే జీబీఎస్ రావటానికి ప్రధాన కారణమని గుర్తించారు.

తక్కువ ఖర్చుతో చికిత్స

ఈ జబ్బులో రోగి తన రోజువారీ పనులను సొంతంగా చేసుకోలేని పరిస్థితికి చేరుకుంటే వారికి తగిన మోతాదులో ఐదు రోజులపాటు ఇమ్యూనో గ్లోబ్యులిన్ ఇంజెక్షన్లు ఇస్తారు. ఇవి దేహంలో మైలీన్ పొరను ధ్వంసం చేసే యాంటీబాడీస్‌ను బ్లాక్ చేయడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దుతాయి. మరో పద్ధతిలో రోగి బరువును బట్టి ప్రతి కిలోగ్రాముకు 250 ఎంఎల్ ప్లాస్మాను రక్తం నుంచి తొలగిస్తారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కలుషితమైన నీరు, ఆహారం వాడకపోవడం మేలు.



-డాక్టర్ బి. చంద్ర శేఖర్‌రెడ్డి, సీనియర్ న్యూరో ఫిజీషియన్

'గురి' తప్పిన గురుకులాలాలు

▶ మొదటి పేజీ తరువాయి

చేపడుతోంది. మైనార్టీ సొసైటీలోని పాఠశాలలు మినహా మిగిలిన నాలుగు సొసైటీల్లోని 643 పాఠశాలల్లో ఐదోతరగతిలో 51,924 సీట్లు ఉన్నాయి. వీటిలో ఐదోతరగతి ప్రవేశాలకు గతేడాది డిసెంబర్ 21 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 80 వేలలోపే దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాదితో పోల్చితే ఇవి దాదాపు 40 వేలు తక్కువ. ఈ నెల 23వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించేందుకు ఎస్సీ గురుకుల సొసైటీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం నమోదైన దరఖాస్తుల ప్రకారం ఒక్క సీటు కోసం సగటున 1.6 మంది పోటీ పడుతున్నారు. గురుకుల పాఠశాల ప్రవేశం కోసం గతంలో విపరీతమైన డిమాండ్ ఉండేది. ఒక్కో సీటు కోసం సగటున నలుగురు విద్యార్థులు పోటీపడేవారు. గత ఏడాది కాలంగా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు భారీగా పెరగటమే డిమాండ్ తగ్గటానికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సంవత్సరాలవారీగా దాదాపుగా సీట్లు, దరఖాస్తులు

సంవత్సరం	మొత్తం సీట్లు	దరఖాస్తులు
2020–21	48,000	1,68,000
2022–23	48,000	1,50,000
2023–24	48,000	1,32,000
2024–25	51,000	1,20,000
2025–26	51,000	80,000

సొసైటీల వారీగా పాఠశాలలు, ఐదో తరగతిలో సీట్లు ఇలా..

సొసైటీ	స్కూళ్లు	సీట్లు
ఎస్సీ	232	18,560
ఎస్టీ	82	6,560
బీసీ	294	23,680
జనరల్	35	3,124
మొత్తం	643	51,924

సీపీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి గిరిజన ఉపాధ్యాయ సంఘం మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ బలపరిచిన అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డికి తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు అభ్యర్థి ఇన్నారెడ్డి, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌లను.. శనివారం తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ రాథోడ్ తదితరులు కలిసి మద్దతు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, ఓపీఎస్ సాధనే లక్ష్యంగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో సీపీఎస్ అభ్యర్థి విజయం సాధించడం ద్వారా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లవచ్చని అభిప్రాయపడ్డారు.

ఏపీ సర్కార్‌ది ప్రేరేపిత ఉగ్రవాదం

- రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ అరాచక పాలన
- మార్గదర్శికి కేసు కొట్టేసేందుకు చంద్రబాబు తోడ్పాటు
- మీడియా ముసుగులో మాఫియా రాజ్యం
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఏఏజీ పొన్నవోలు ఫైర్



లక్డీకాపూల్ (హైదరాబాద్): రాష్ట్రంలో టీడీపీ కూటమి సర్కారు ప్రేరేపిత ఉగ్రవాదం రోజురోజుకూ పెచ్చుమీరుతోందని, ఏపీని రావణకాష్టంలా మారుస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. రాజ్యహింస రాజ్యమేలుతోందని.. ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం అరాచకాలకు శ్రీకారం చుట్టిందని.. ఎవరైనా ప్రశ్నిస్తే చాలు ఇష్టారాజ్యంగా కేసులు పెట్టి గొంతునొక్కే చర్యలు, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ అరాచక పాలన సాగిస్తోందని.. అధికార వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, భయానక వాతావరణ పరిస్థితులను సృష్టిస్తోందన్నారు. అలాగే, అతి పెద్ద ఆర్థిక నేరానికి పాల్పడిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులను చంద్రబాబు ప్రభుత్వం నీరుగారుస్తోందన్నారు. ఈనాడు సంస్థలకు చెందిన మీడియా మాఫియా అండ కోసం ఆర్థిక నేరాల నుంచి మార్గదర్శికి విముక్తి కల్పించేందుకు శక్తివంచన లేకుండా సహకారాన్ని అందిస్తోందని పొన్నవోలు విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో ఏపీ సర్కారు తీరును, చంద్రబాబు కుట్రలను తూర్పారబట్టారు. ఆయన ఏమన్నారంటే..

అక్రమమని తెలిసినా డిపాజిట్ల సేకరణ..

అక్రమమని తెలిసినా రామోజీరావు మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా రూ.వేల కోట్ల డిపాజిట్లు చట్ట వ్యతిరేకంగా సేకరించారు. తన చేతిలో మీడియా ఉంది, తననెవరూ ప్రశ్నించలేరన్నట్లుగా వ్యవహరించారు. పైగా.. చంద్రబాబు ప్రభుత్వం మార్గదర్శి కేసు కొట్టేసేందుకు సహకరిస్తూ క్విడ్ ప్రో కోగా వ్యవహరిస్తోంది. అలాగే, మార్గదర్శిపై విచారణ జరిపిన సీఐడీ అధికారులపై ఈనాడులో బురదజల్లే రాతలు రాస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సీఎం చంద్రబాబు అండతో వారికి పోస్టింగ్‌లు ఇవ్వకపోవడం, బదిలీలు చేయించడం చేస్తున్నారు. అలాగే, మార్గదర్శి అక్రమాలపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబాన్ని ఈనాడు పత్రిక వేధిస్తోంది. ప్రభుత్వాలు తమ చెప్పుచేతల్లో ఉంటాయన్న అహంకారంతో పేట్రేగిపోతోంది. ఇక రాష్ట్రంలో ఆస్తులు ధ్వంసం చేస్తున్నా.. వ్యక్తులను చంపుతున్నా.. గ్రామాల నుంచి ప్రజలను తరిమేస్తున్నా పోలీసుల నుంచి కనీస స్పందనలేదు. ఒకప్పుడు ఉగాండాలో ఇలాంటి పరిస్థితి ఉండేది. ఈ రాజ్యహింసపై విచారణకు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన నిజ నిర్ధారణ కమిషన్‌ను వేయాలి.

ఈ–కామర్స్‌కు 'ప్రేమోత్సవ్'!

- ప్రేమికుల రోజు ఆన్‌లైన్‌లో గిఫ్టుల అమ్మకాల జోరు
- బ్లింకిట్, స్విగ్గీ, జొమాటో వంటి వేదికల్లో రికార్డు అమ్మకాలు
- పూలు, చాక్లెట్లు, బొమ్మలు, గ్రీటింగ్స్‌కే అధిక గిరాకీ
- రూ.29,844 పెట్టి 174 చాక్లెట్లు కొన్న ఢిల్లీ కస్టమర్
- స్విగ్గీలో నిమిషానికి 581 చాక్లెట్లు, 324 గులాబీల ఆర్డర్
- ఒక్కరోజే 4 లక్షల గులాబీలు అమ్మిన ఎఫ్ఎన్‌బీ



సాక్షి, హైదరాబాద్: గులాబీలు, చాక్లెట్లు, బంగారు ఆభరణాలు, టెడ్డీబేర్ బొమ్మలు, ప్రముఖులు రాసిన పుస్తకాలు.. ఇలా కాదేదీ ప్రేమ వ్యక్తీకరణకు అనర్హం అన్నట్లుగా సాగింది ఈసారి ప్రేమికుల రోజు. ఏటా ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. గతంలో సమీపంలోని షాపునకు వెళ్లి పూలో, గ్రీటింగ్ కార్డులో కొని తమ మనసు గెలిచినవారికి ఇచ్చి శుభాకాంక్షలు తెలిపేవారు. కానీ, ఇప్పుడు ప్రతి వస్తువుకూ ఈ–కామర్స్ సైట్లవైపే చూస్తున్నాం కదా! ప్రేమికుల రోజున కూడా ప్రేమికులంతా ఈ సైట్లపైనే పడ్డారు. గులాబీలు, చాక్లెట్లు, అందమైన బొమ్మలు తదితర వస్తువులను ప్రేమికులరోజు (శుక్రవారం) వివిధ ఈ–కామర్స్ సైట్లలో రికార్డు స్థాయిలో కొనుగోలు చేశారు.

ఆఫర్ల జోరు

ప్రేమికుల రోజున జొమాటో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో వంటి ప్లాట్‌ఫామ్స్‌తోపాటు రెస్టారెంట్లు, ట్రావెల్ కంపెనీలు కూడా జతకలిసి లిమిటెడ్ ఎడిషన్ ప్రాడక్టులు మొదలు వివిధ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ఐజీపీ, ఫ్లవర్ ఆరా ఫ్లడ్ వంటి గిఫ్టింగ్ ప్లాట్‌ఫామ్స్ పర్సనలైజ్డ్ మగ్స్, హార్ట్ షేప్ కుషన్లు, ఇతర కానుకలను పరిచయం చేశాయి. దేశీయ స్టార్టప్‌లు సైతం వివిధ రంగాలు, సెక్టార్లవారీగా పలు వస్తువులను వ్యాప్తిలోకి తెస్తున్నాయి. చివరకు ఇండిగో స్పెషల్ వాలంటైన్స్ డే సేల్‌ను ప్రకటించి డిస్కౌంట్ రేట్లపై జంటలు విమానాల్లో ప్రయాణించే అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

అ'ధర'హో

ఈ కామర్స్ సంస్థలు ప్రేమికులరోజు రష్‌ను బాగానే క్యాష్ చేసుకున్నట్లు ఫెర్న్ ఎన్‌పెటల్స్ వెబ్‌సైట్ పేర్కొంది. ప్రేమికుల రోజు ప్రత్యేకం పేరుతో పలు వస్తువులను అధికధరలకు అమ్మినట్లు తెలిపింది. పలు గిఫ్ట్ హ్యాంపర్ల ధర రూ.90 వేల పైచిలుకు ఉన్నది. పలు సైట్లలో చాక్లెట్ల ధరలు రూ.499తో మొదలై రూ.82,999 (ఐఫోన్ సహితంగా) వరకు ఉన్నాయి. డైసన్ ఎయిర్‌ర్యాప్ ఫ్యాన్సీ ప్యాకింగ్ హ్యాంపర్‌కు రూ.46,999కు విక్రయించారు. 14న తమ ప్లాట్‌ఫామ్స్‌పై విక్రయాల రికార్డులను పలు ఈ కామర్స్ సంస్థలు ప్రకటించాయి.

- ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి 24 ఆర్డర్ల ద్వారా 174 చాక్లెట్లను రూ.29,844కు కొనుగోలు చేశాడు.
- 14న పీక్‌టైమ్‌లో నిమిషానికి 581 చాక్లెట్లు, 324 గులాబీలకు ఆర్డర్ వచ్చినట్లు స్విగ్గీ ప్రకటించింది.
- ప్రేమికుల రోజున 4 లక్షల గులాబీలకు ఆర్డర్లు పొందినట్లు ఎఫ్ఎన్‌బీ తెలిపింది. ఈ నెల ప్రారంభం నుంచి 13వ తేదీ వరకు 15 లక్షల గులాబీలు విక్రయించినట్లు వెల్లడించింది.
- ఫిబ్రవరిలో మొదటి 11 రోజుల్లోనే యూనీకామర్స్ యూనీవేర్ ప్లాట్‌ఫామ్ కోటికి పైగా బహుమతి వస్తువుల (గిఫ్టింగ్ ఐటమ్స్)ను విక్రయించింది.

బడ్జెట్ కసరత్తు ముమ్మరం

- ఇప్పటికే ప్రభుత్వానికి చేరిన అన్ని శాఖల అంచనాలు
- శాఖల వారీగా సమీక్షలు జరుపుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ రూపకల్పన కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన నిధులను అన్ని ప్రభుత్వ శాఖలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఆర్థిక శాఖకు పంపాయి. ఈ ప్రతిపాదనలపై ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో బడ్జెట్ తయారీ కోసం శాఖల వారీగా సమీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటికే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, ఆర్ అండ్ బీ, బీసీ సంక్షేమం, రవాణా, వ్యవసాయం, జౌళి శాఖలపై సమీక్షలు పూర్తికాగా, శనివారం రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై భట్టి విక్రమార్క.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. బడ్జెట్ రూపకల్పన, ప్రభుత్వ ప్రాధాన్యతల గురించి మంత్రులు అధికారులకు దిశానిర్దేశం చేశారు. మిగిలిన శాఖల అంచనాలపై కూడా వచ్చే వారం నాటికి సమీక్షలు పూర్తవుతాయని, అనంతరం బడ్జెట్ తయారీలో ఆర్థిక శాఖ పూర్తిస్థాయిలో నిమగ్నమవుతుందని తెలుస్తోంది. మార్చి మొదటి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించిన ప్రభుత్వం ఆ సమావేశాల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. కాగా, ఈసారి బడ్జెట్ పరిమాణం పెరుగుతుందా, తగ్గుతుందా అన్న దానిపై ఆర్థిక శాఖ వర్గాలు తర్జనభర్జనలు పడుతున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన సాయం విషయంలో ఆశించిన మేర నిధులు రాకపోవడం, ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో సొంత ఆదాయ రాబడులపైనే దృష్టి సారించి బడ్జెట్‌ను రూపొందించాల్సి ఉంటుందని, బడ్జెట్ పరిమాణంపై రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను బట్టి నిర్ణయం తీసుకుంటామని ఆర్థిక శాఖ వర్గాలు చెప్పాయి.

ఆ జిల్లాల్లో ఇందిరమ్మ నిర్మాణాలు

▶ మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, సమాచార శాఖ కమిషనర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

భూములపై నిరంతర పర్యవేక్షణ

రెవెన్యూ శాఖ సమీక్షలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ ప్రభుత్వ భూములపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. కోట్ల రూపాయల విలువైన భూములు ప్రభుత్వం చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కోర్టు కేసుల్లో ఉన్న భూములను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని కోరారు. సినిమా రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు సమాజ వికాసానికి దోహదపడే విధంగా లఘుచిత్రాలను తీసుకువచ్చేందుకు నిధులు కేటాయిస్తామని చెప్పారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల చుట్టూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం శాటిలైట్ టౌన్‌షిప్ నిర్మాణాలపై హౌజింగ్ శాఖ దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్‌లోని మధ్య తరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసేందుకు ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ ఇళ్ల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి, రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపడం ద్వారా భూసేకరణ చేసుకోవాలని సూచించారు. ఇక, రాష్ట్రంలో భూముల డిజిటల్ సర్వేకు సంబంధించి అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాల జాబితాను సేకరించాలని, ప్రతి నెలా ఈ అద్దెలను చెల్లించేలా ఆర్థిక శాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహకాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

'చక్రధర్ గౌడ్ కేసు'లో ముగ్గురు అరెస్టు

- అందులో హరీశ్‌రావు పేషీ మాజీ అధికారి, మరో ఇద్దరు

సాక్షి, హైదరాబాద్: తన ఫోన్ ట్యాప్ చేశారని, అక్రమ కేసులు బనాయించారంటూ సిద్దిపేటకు చెందిన బీజేపీ నేత చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో పంజగుట్ట పోలీసులు శనివారం ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిలో మాజీ మంత్రి హరీశ్‌రావు పేషీలో పనిచేసిన ఒక అధికారి కూడా ఉన్నారని డీసీపీ ఎస్ఎం విజయ్‌కుమార్ తెలిపారు. చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదు మేరకు గతంలోనే మాజీ మంత్రి హరీశ్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు తదితరులపై కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా ఈ వ్యవహారంలో.. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఆయన పేషీలో పనిచేసిన టి.వంశీకృష్ణ, సిద్దిపేటకు చెందిన టి.సంతోష్‌కుమార్, టి.పర్శరాములుకు పాత్ర ఉన్నట్టు గుర్తించారు. వంశీకృష్ణ ఆదేశం మేరకు పర్శరాములు సిమ్‌కార్డులు విక్రయించే సంతోష్ కుమార్ నుంచి నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఒక సిమ్‌కార్డు ఖరీదు చేశాడని.. దానితోనే వారు చక్రధర్‌గౌడ్‌కు ఫోన్లు, సందేశాలు పంపారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. దీనితో ఈ ముగ్గురినీ శనివారం అరెస్టు చేసినట్టు వెల్లడించాయి. వంశీకృష్ణ ప్రస్తుతం నల్లగొండ జిల్లా ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు.

వంశీకి ప్రాణహాని ఉంది

- నా భర్తపై తప్పుడు కేసులు బనాయించారు
- మీడియాతో ఆయన భార్య పంకజ శ్రీ



గాంధీనగర్ జైలు వద్ద మీడియాతో మాట్లాడుతున్న వంశీ భార్య పంకజ శ్రీ

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు ప్రాణహాని ఉందని ఆయన సతీమణి వల్లభనేని పంకజ శ్రీ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఆయనపై తప్పుడు కేసులు బనాయించిందని ఆరోపించారు. వంశీపై మోపిన అభియోగాలన్నీ అవాస్తవాలేనన్నారు. విజయవాడ గాంధీనగర్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీని శనివారం పంకజ శ్రీ ములాఖత్ అయ్యారు. జైలులో తన భర్తను కలిసొచ్చిన తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే..

వైద్య సదుపాయాలు కల్పించకుండా వేధిస్తున్నారు..

నా భర్త వంశీపై ప్రభుత్వం తప్పుడు కేసులతో జైలులో నిర్బంధించి ఆయనను భౌతికంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వంశీకి టెయిల్ బోన్ ఫ్రాక్చర్ అయ్యింది. దీనివల్ల ఆయన కింద కూర్చోలేరు. కరోనా తర్వాత శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు. అటువంటి వ్యక్తిపై తప్పుడు కేసులు బనాయించి శారీరకంగా, మానసికంగా కుంగదీసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎలాంటి వైద్య సదుపాయాలు కల్పించకుండా వేధిస్తున్నారన్నారు.

ఫోన్‌లో జగన్ మాట్లాడారు..

వంశీ అక్రమ అరెస్టు తర్వాత వైఎస్సార్‌సీపీ నాకు పూర్తి మద్దతుగా నిలిచింది. కేసు వ్యవహారాలన్నీ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ చూసుకుంటోంది. మాజీ సీఎం వైఎస్ జగన్ తనతో ఫోన్‌లో మాట్లాడారు. వచ్చే వారం ఆయన్ను కలవబోతున్నా.

రెండ్రోజులుగా నేలపై పడుకోవడంవల్ల సర్జరీ జరిగిన చోట బాధగా ఉందని, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉందని వంశీ చెప్పారు. ఇక రూ.20వేల కోసమే సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశామని ఆరోపిస్తున్నారు.. ఇది ఎంతమాత్రం నమ్మశక్యంగాలేదు. వంశీపై కేసు విషయంలో సత్యవర్ధన్‌పై ఒత్తిడి తెస్తున్నారని.. కానీ, ఆయన అంగీకరించడంలేదని తెలిసింది. వంశీ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా బెడ్ ఏర్పాటుచేయాలని, అతనికి ఎటువంటి హాని జరగకుండా చూడాలని అప్పీల్ చేయబోతున్నాం.

సుగాలి ప్రీతి కేసు ఇక మూలకే!

చంద్రబాబు సర్కారు రావడంతో రూటు మార్చిన సీబీఐ

సాక్షి, అమరావతి: ఏపీలో సంచలనం సృష్టించిన పదో తరగతి దళిత విద్యార్థిని సుగాలి ప్రీతి అనుమానాస్పద మృతి కేసు ఇక మూలకు చేరనుంది. గత చంద్రబాబు పాలనలో జరిగిన ఈ ఘటనపై అప్పట్లో పోలీసులు తూతూమంత్రంగా విచారించారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని తల్లిదండ్రులు కోరగా, ఆ మేరకు వైఎస్ జగన్ ఉత్తర్వులిచ్చారు. అయినా సీబీఐ దర్యాప్తు చేపట్టకపోవడంతో తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి సాగదీస్తూ వచ్చిన సీబీఐ.. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం రావడంతో యూటర్న్ తీసుకుంది. వనరుల కొరత కారణంగా చూపుతూ దర్యాప్తు చేయలేమని తేల్చి చెప్పింది.

బాబు హయాంలో తూతూ మంత్రంగా..

కర్నూలు నగర శివార్లలోని కట్టమంచి రామలింగారెడ్డి రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న సుగాలి ప్రీతీబాయ్ 2017 ఆగస్టు 19న అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఫ్యాన్‌కి ఉరేసుకుని చనిపోయినట్లు పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు చెప్పింది. తమ కుమార్తె ఉరి వేసుకుని చనిపోలేదని, స్కూల్ యజమాని కొడుకులు లైంగిక దాడి చేసి చంపేశారని తల్లిదండ్రులు సుగాలి రాజు నాయక్, పార్వతిదేవి ఆరోపించారు. అయినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో 'జస్టిస్ ఫర్ సుగాలి ప్రీతి' పేరుతో సోషల్ మీడియాలో పెద్ద ఉద్యమమే జరిగింది. అదే రోజు కర్నూలు పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు పోక్సో చట్ట నిబంధనల కింద కేసు పెట్టినా, అప్పటి ప్రభుత్వ పెద్దల తీరుతో తూతూ మంత్రంగా దర్యాప్తు జరిపారు. అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆ స్కూలు కరస్పాండెంట్, ఆయన కుమారులను అరెస్ట్ చేశారు. కొద్ది రోజులకే వారు బెయిల్‌పై బయటకు వచ్చేశారు. బాబు హయాంలో కేసు దర్యాప్తు ముందుకు సాగలేదు.

సీబీఐ స్పందించకపోవడంతో..

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, సీబీఐ కూడా స్పందించలేదు. దీంతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు దర్యాప్తు చేసేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ 2020 సెప్టెంబర్ 11న హైకోర్టులో ప్రీతి తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు సీబీఐ ఎస్పీ రఘురామ రాజన్ ఈ నెల 13న హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ప్రీతి మృతి కేసులో తాము జోక్యం చేసుకోవాల్సినంత చట్టపరమైన సంక్లిష్టత లేదని పేర్కొన్నారు. పైగా తమకున్న పరిమిత వనరులతో ఈ కేసు దర్యాప్తు చేపట్టడం సాధ్యం కాదని హైకోర్టుకు వివరించారు. సీబీఐ దర్యాప్తు చేసేలా ఆదేశించాలని కోరుతూ ప్రీతి తల్లిదండ్రులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను కొట్టేయాలని హైకోర్టును కోరారు.

కామెంట్

సోషల్ మీడియా అను బంపర్ లాటరీ...



ఈ ఫొటోలో ఉన్న అమ్మాయిని
గుర్తు పట్టారా?
కేరళలో ఒక నగల షాపుకు
ఓపెనింగ్‌కు వచ్చింది.
అంటే డబ్బు ఇచ్చి పిలిపించి
ఆమె చేత ఓపెనింగ్ చేయించారు.
తమాషా చూడండి.
రోడ్డు మీద కూచుని పూసల దండలు అమ్మే
అమ్మాయి బంగారు ఆభరణాల షోరూమ్‌కు
రిబ్బన్ కత్తిరించడం.
సోషల్ మీడియా గొప్పతనం అలా ఉంది.
మీకర్థమైంది కదా.. ఈ అమ్మాయి మోనాలిసా.

మెడలో పూసలు వేసుకుని తిరిగే అమ్మాయి అదే మెడలో ఖరీదైన నెక్లెస్‌ను కాసేపటి కోసమైనా ధరించగలనని ఊహిస్తుందా?

అదే జరిగింది. అదే మేజిక్.

కుంభమేళాకు పూసలమ్ముకోవడానికి వచ్చిన 16 ఏళ్ల మోని భోంస్లే తన అందమైన కళ్లతో ప్రపంచాన్నే ఆకర్షించింది. ఆమె ఫొటోలు సోషల్ మీడియాతోపాటు ప్రొఫెషనల్ మీడియాలో కూడా వైరల్ అయ్యాయి. 'మోనాలిసా' పేరుకు రాత్రికి రాత్రి ఇన్‌స్టాలో ఆమె ఫాలోయెర్లు కోట్లకు పెరిగారు. ఇండోర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన మోని భోంస్లే ఇప్పుడు సెన్సేషన్. 'ది డైరీ ఆఫ్ మణిపూర్' సినిమా కోసం ఆమె 21 లక్షల పారితోషికానికి సైన్ చేసిందని వార్త. ఇక ఇప్పుడు షోరూమ్‌ల ప్రారంభానికి కూడా ఆహ్వానాలు అందుకుంటోంది. కేరళ కోజికోడ్‌కు చెందిన జ్యువెలరీ షోరూమ్‌ను వాలెంటైన్స్ డే రోజున మోని భోంస్లే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించింది. దాని యజమాని బాబీ చెమ్మనూర్ ఒక ఖరీదైన నెక్లెస్‌ను కాసేపు మెడలో వేసి ఆమెను సంతోషపెట్టారు. ఆమెను చూడటానికి జనం విరగబడ్డారు. ఆమెరాకతో ప్రచారం బ్రహ్మాండంగా దొరికింది. బదులుగా ఆమెకు మంచి పారితోషికం లభించింది. విమానాలలో, లగ్జరీ కారుల్లో ఇప్పుడు మోని భోంస్లే తిరుగుతోంది. సోషల్ మీడియా ఎవరి జాతకాన్ని ఎలా మారుస్తుందో ఊహించలేము. టాలెంట్ ఉంటే జనానికి చేరడానికి సోషల్ మీడియా ఉంది. దానిని సరిగ్గా ప్రదర్శించాలి. అయితే ఇదే సోషల్ మీడియాతో మెజారిటీ సెంటిమెంట్స్‌కు వ్యతిరేకంగా ఏదైనా మాట్లాడితే పాతాళానికి పడిపోతాము. కనుక ఆచితూచి వ్యవహరించాలి. ఇటీవల నంబర్ 1 యూట్యూబర్ రణ్‌వీర్ అహ్లాబాదియా మాట తూలి నెటిజన్ల ఆగ్రహానికి గురయ్యాడు. మరో విషయం ఏమిటంటే వ్యక్తిగత వివరాలు, చిరునామాలు వెల్లడి చేయకుండా సోషల్ మీడియాలో కేవలం మన టాలెంట్‌ను, కళను, ప్రతిభను చూపాలి. స్త్రీలు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. అదృష్టం కలిసొస్తే మోనాలిసా లాంటి ఫేమ్ పెద్ద కష్టం కాదు.



కళ

వీణల విందుగా...



వీణ రాగాల వెన్నెలలో పులకించిపోయిన దీప్తికి- వీణ పాఠమే ప్రాణమై పోయింది. వీణ విహంగ రెక్కలపై ఆమె కొత్త ప్రపంచాలను చూసింది. 'ఈ తరం అమ్మాయిలు కూడా వీణ నేర్చుకుంటున్నారా!' అనేది కొందరి ఆశ్చర్యం. నేర్చుకుంటే ఎంత బాగుంటుందో దీప్తిలాంటి అమ్మాయిలు తమ విజయాల ద్వారా నిరూపిస్తున్నారు...

తాను ఒకటి తలిస్తే వీణ ఒకటి తల్చింది!

అవును.. మచిలీపట్నానికి చెందిన మొదలి చంద్రశేఖర్ దగ్గర గాత్రం, కీబోర్డు నేర్చుకుందామని వెళ్లిన అప్పికట్ల దీప్తి అంతలోనే మనసు మార్చుకుంది. వీణపై ఆసక్తి పెంచుకుంది. పాఠాలు నేర్చుకోవడం మొదలు పెట్టింది.

సాధారణంగా చాలామందికి నేర్చుకోవడంలో ఆరంభ శూరత్వం ఉంటుంది. అయితే దీప్తి విషయంలో అలా జరగలేదు.

'ఇంకా ఏదో నేర్చుకోవాలి' అనే తపనతో ఎప్పటికప్పుడు ఉత్సాహంగా పాఠాలు నేర్చుకునేది. దీప్తి ప్రస్తుతం విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ సీఎస్ఈ మూడో సంవత్సరం చదువుతోంది.

'ఇంజినీరింగ్ చదివే అమ్మాయికి వీణలెందుకు.. చదువు దెబ్బతింటుంది కదా!' అనేది కొందరి సందేహం. 'చదువు దెబ్బతినదు. మరింత చదువుకోవాలనిపిస్తుంది' అంటుంది దీప్తి. ఎందుకంటే వీణరాగాల సాధనలో ఒత్తిడి తగ్గి మనసు తేలిక అవుతుంది. ఏకాగ్రత అంతకంతకూ పెరుగుతుంది. ఏది చదివినా ఇట్టే గుర్తుండి పోతుంది అంటుంది దీప్తి. నాలుగు సంవత్సరాలపాటు కర్ణాటక సంగీత సంప్రదాయ వీణ కోర్సును చదివి ఫస్ట్ క్లాస్‌లో సర్టిఫికెట్‌ను సాధించిన దీప్తి ఆ తరువాత పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో వీణలో డిప్లమో చేసింది.

నేర్చుకోవడం ఒక ఎత్తయితే, ప్రేక్షకులు మెచ్చేలా ప్రదర్శన ఇవ్వడం మరో ఎత్తు. మొదటిసారిగా సంగీత కళాకచేరిలో మంచి మార్కులు కొట్టేసింది. ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన 'యువభేరి'లో బహుమతులు సాధించింది. ఎన్నో పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకుంది. తెలంగాణ రాజ్‌భవన్‌లో వీణ వాద్య కచేరి చేసి గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ప్రశంసలు అందుకుంది. వీణ వాద్య ప్రతిభతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో పాటు త్రివిధ దళాధిపతుల ప్రశంసలు అందుకుంది. 'రాష్ట్రపతి భవన్‌లో వీణ ప్రదర్శన ఇవ్వడం, ప్రముఖులను దగ్గరి నుంచి చూడడం, వారి ఆశీర్వాదం అందుకోవడం మరచిపోలేని అనుభూతి' అంటుంది దీప్తి.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో వీణ బృందం

చదువూ, సంగీతంలోనే కాదు కరాటేలోనూ రాణిస్తున్న దీప్తి మరిన్ని కళలలో విజయాలు సాధించాలని ఆశిద్దాం.

– అంబటి శేషుబాబు
సాక్షి, మచిలీపట్నం

ధ్యానం లాంటి వీణ

వీణ అనేది కేవలం కచేరీల కోసం కాదు. నా దృష్టిలో వీణ వాద్య సాధన అనేది ఒకలాంటి ధ్యానం. వీణరాగాల వెలుగులో మనసు ఉత్తేజితం అవుతుందన్నది కాదనలేని సత్యం.

- అప్పికట్ల దీప్తి

కృషి

ఫలితాలకు షార్ట్‌కట్స్ ఉండవు!

'పనిలో షార్ట్ కట్స్ ఉండచ్చు. కానీ, ఫలితాలు అందుకోవాలంటే దీర్ఘ కాలం ప్రయత్నించాల్సిందే' అంటారు డాక్టర్ పింగళి ఉషారాణి. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో క్లినికల్ ఫార్మకాలజీలో డీఎమ్‌గా ఉన్న డాక్టర్ పింగళి ఉషారాణి చేసిన పరిశోధనలకు గాను ఇండియన్ సొసైటీ ఫర్ క్లినికల్ రీసెర్చ్ (ఐఎస్‌సీఆర్) నుంచి జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పాతికేళ్లుగా క్లినికల్ ఫార్మకాలజీలో తాను చేస్తున్న కృషి గురించి వివరించారామె ...

'మా వర్క్‌లో పేషెంట్ కేర్, రీసెర్చ్ రెండూ ఉంటాయి. గాంధీ, నిమ్స్ ఫార్మాస్యుటికల్ విభాగాలలో ఎలాంటి వర్క్ జరుగుతుందో బయటి వారికి తెలియదు. అకడమిక్ విభాగంలో విద్యార్థులకు పాఠాలు చెప్పి, పంపుతారు అనే ఆలోచనలో ఉంటారు. కానీ, దీని వెనకాల ప్రతిరోజూ పరిశోధన ఉంటుంది. విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి నిరంతర ప్రయత్నం ఉంటుంది.

మందుల పనితీరుపై పరిశోధనలు

కార్డియో, లివర్ చికిత్సలకు, నొప్పులకు వేసుకునే మందులు పేషంట్ శరీరంపై ఎలాంటి ప్రభావం చూపుతాయి... అనే అంశంపై పీహెచ్‌డి స్టూడెంట్స్‌తో కలిసి పరిశోధన చేశాం. దేశవ్యాప్తంగా ఉన్న ఫార్మకాలజీ స్టూడెంట్స్‌కి ప్రతియేటా ట్రెనింగ్ ఇస్తుంటాం. పరిశోధనలు చేయడానికి అన్ని మెడికల్ కాలేజీలకు సరైన పరికరాలు ఉండకపోవచ్చు. అందుకని అందరికీ అర్థమయ్యే విధంగా మా పరిశోధనల ఫలితాలు తీసుకువస్తున్నాం.

పాతికేళ్ల ప్రయాణం

ఈ రంగంలో నా వర్క్ మొదలు పెట్టినప్పుడు ఏదీ సులువుగా లేదు. ఒక్కోసారి 15–18 గంటలు వర్క్‌లో ఉండాల్సిన రోజులు ఉన్నాయి. పనికి షార్ట్‌కట్స్ ఉండచ్చు, ఫలితాలకు మాత్రం షార్ట్ కట్స్ ఉండవు అనేది తెలుసుకున్నాను.

ప్రతి నిమిషమూ విలువైనదే

ఒత్తిడి ఎప్పుడూ ఉంటుంది. కానీ, సవాళ్లు ఉంటేనే మరింత బాగా పనిచేయగలం. ప్రస్తుతం



క్లినికల్ ఫార్మకాలజీలో డిఎమ్ అంటే 'డాక్టరేట్ ఆఫ్ మెడిసిన్ లేదా డిఎమ్ ఇన్ క్లినికల్ ఫార్మకాలజీ' అని కూడా పిలుస్తారు. ఈ రంగంలో పేషంట్ కేర్ – రీసెర్చ్ డెవలప్‌మెంట్ లో చేసిన ఇన్నేళ్ల కృషికి ఫలితంగా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ లభించింది. ఐఎస్‌సిఆర్ ప్రెసిడెంట్ పురస్కారంతో పాటు క్లినికల్ రీసెర్చ్‌లో భాగంగా అవార్డులు, ప్రశంసలు అందుతూనే ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లలో పాల్గొనే అవకాశాలూ లభించాయి.

- డాక్టర్ పింగళి ఉషారాణి

ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పేషెంట్స్‌కు బ్లడ్ లెవల్స్‌లో మందుల వాడకం పైన వర్క్ చేస్తున్నాం. మన వర్క్‌ని ఎలా ప్రూవ్ చేసుకోవాలో ఒక ప్రణాళిక వేసుకుని, ఆపైన కృషి చేస్తూ పోతే మంచి గుర్తింపు వస్తుంది. మన వర్క్‌ని మనం బాగా ఇచ్చాం అనే సంతృప్తి కూడా దానికి తోడవుతుంది. నేర్చుకోవాలనే తపన ఏ వయసులోనైనా ఉండాలి' అని వివరించారు ఉషారాణి.

– నిర్మలారెడ్డి

క్యాన్సర్ | హెల్త్

సార్కోమాను ఎదుర్కోలేమా!



దేహంలోని సూక్ష్మ కణజాలానికి వచ్చే ఆరు రకాల ప్రధాన క్యాన్సర్లలో 'సార్కోమా' ఒకటి. సార్కోమాను త్వరగా కనుగొంటే మనుగడ రేటు 81 శాతం. అంటే... దీన్ని ఎంత త్వరగా కనుక్కుంటే అంతగా దాన్ని అంతగా అరికట్టవచ్చని తెలుస్తోంది. అయితే దురదృష్టవశాత్తూ మనదేశంలో సార్కోమాను చాలా ఆలస్యంగా కొనుగొంటుండటం వల్ల పొరుగునే ఉన్న ధనిక దేశాలతో పోలిస్తే మన దగ్గర మరణాల రేటు ఎక్కువే. ఈ నేపథ్యంలో సార్కోమా గురించి తెలుసుకుందాం.

ఎముక చివరన ఉండే మృదులాస్థి అయిన కార్టిలేజ్‌కూ, టెండన్స్‌కూ, కండరాలకూ, ఇక అక్కడి కొవ్వు కణజాలాలలో కనిపించే క్యాన్సర్లకు ఇచ్చిన ఒక కామన్ పేరు 'సార్కోమా'. అంటే శరీరంలో ఉండే ఎముకకు గానీ లేదా దాని సపోర్టివ్ కనెక్టివ్ కణజాలానికి వచ్చే చాలా రకాల క్యాన్సర్లన్నింటికి ఇచ్చిన కామన్ పేరు ఇది. ఇది శరీరంలో ఎక్కడైనా రావచ్చు... అయితే ప్రధానంగా చేతులు, కాళ్లు, ఛాతీభాగంలో, పొట్ట భాగంలో ఈ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తుంది.

సార్కోమాలో మళ్లీ దాదాపు 70 రకాల సబ్ టైప్స్ ఉంటాయి. ఈ క్యాన్సర్ ఉద్భవించే మౌలికమైన కణాలు, వాటి ప్రవర్తన, లక్షణాలు... వీటన్నింటిని బట్టి సార్కోమాను రెండు ప్రధానమైన పెద్ద సబ్‌టైప్స్‌గా విభజించారు. వాటిల్లో... మొదటిది 'సాఫ్ట్ టిష్యూ సార్కోమా', రెండోది ఎముకలకు సంబంధించిన 'బోన్ సార్కోమా'.

రిస్క్ ఫాక్టర్లు (ఈ ముప్పును తెచ్చిపెట్టే అంశాలు)...

ఇటీవలి కొత్త పరిశోధనల ప్రకారం... హానికరమైన పరిశ్రమల్లో లేదా ప్రమాదకరమైన రసాయనాలకు ఎక్స్‌పోజ్ అయ్యే లాంటి చోట్ల పనిచేసేవారిలో ఈ సార్కోమా క్యాన్సర్లు ఎక్కువగా వస్తున్నట్లు కనుగొన్నారు. ఉదాహరణకు ప్లాస్టిక్ పరిశ్రమల్లో పని చేసేవారు విన్టైల్ క్లోరైడ్ లేదా డయాక్సిన్స్ అనే హానికరమైన రసాయనాలకు ఎక్స్‌పోజ్ అయిన ప్పుడు కాలేయానికి వచ్చే యాంజియోసార్కోమా వంటి క్యాన్సర్లు కనిపిస్తుంటాయి. అలాగే పురుగు మందులు, కలుపు మొక్కల నివారణ కోసం ఉపయోగించే మందుల (హెర్బిసైడుల) కారణంగా వ్యవసాయ కూలీల్లోనూ, వ్యర్థాలను తొలగించే కార్మికుల్లోనూ సార్కోమా బాధితులు ఎక్కువ.

ఇక పిల్లల్లో... వారి ఎదుగుదల అనే అంశమే సార్కోమాలు కనిపించడానికి కారణమవుతుంది. వారు ఎదిగే క్రమంలో జరిగే వేగవంతమైన కణవిభజనల్లో ఎక్కడైనా లోపం జరిగాక... ఆ లోపభూయిష్టమైన కణం నుంచి పెరిగే కణజాలం అపరిమితంగా పెరుగుతూ పోతూ సార్కోమాకు దారితీయవచ్చు. అనారోగ్యకరమైన జీవనశైలి, కాలుష్యాలతో కూడిన పర్యావరణం, గతంలో ఏవైనా కారణాల వల్ల రేడియోథెరపీ తీసుకోవాల్సిన రావడం వంటివి సార్కోమా ముప్పును మరింతగా పెంచే అంశాలు. అలాగే 'లి-ఫ్రామెనీ సిండ్రోమ్' వంటి సిండ్రోములు, జెనెటిక్ మ్యుటేషన్లు కూడా సార్కోమాకు కారణమవుతుంటాయి.

నిర్ధారణ...

● సీటీ స్కాన్ వంటి ఇమేజింగ్ టెక్నిక్స్ సార్కోమాలను కనుగొనడంలో కీలక భూమిక పోషిస్తుంటాయి. ఎక్కడో పుట్టిన మూల క్యాన్సర్... అటు తర్వాత మరో చోటకు చేరి అక్కడ పెరగడాన్ని (మెటాస్టేటిస్‌ను) కనుగొనడంలోనూ ఈ ఇమేజింగ్ ఉపకరణాలు సహాయపడతాయి. ● మృదు కణజాలంలో (సాఫ్ట్ టిష్యూల్లో) వచ్చే క్యాన్సర్ గడ్డలను ఎమ్మారై వంటి వాటితో కనుగొనడానికీ, ● రేడియోషన్ దుష్ప్రభావాలను వీలైనంతగా తగ్గించి ఉపయోగించే రేడియో టెక్నిక్స్ అయిన అలారా (ఏజ్ లో ఏజ్ రీజనబ్లీ అచీవబుల్) టెక్నిక్‌తో సురక్షితంగా సార్కోమాలను కనుక్కోడానికీ. ● ఇక పెట్-సీటీ, రేడియోమిక్స్ వంటి అధునాతన టెక్నిక్స్‌తో అవి హానికరం కాని బినైన్ గడ్డలా లేక హానికరమైన మేలిగ్నెంట్ లీజన్సా అన్న అంశాలను కనుగొనడానికి ఆస్కారం ఉంది.

చికిత్సలు / అధునాతన చికిత్సా పద్ధతులు...

● అధునాతమైన శస్త్రచికిత్స పద్ధతుల ద్వారా అలాగే రేడియేషన్ థెరపీ వంటి అంశాల్లో చోటు చేసుకున్న వినూత్న పద్ధతుల ద్వారా సార్కోమాకు చికిత్స అందించడం ఇప్పుడు సాధ్యం. ● బాధితుల కాళ్లు, చేతులను తొలగించకుండానే చేసే శస్త్రచికిత్సలు (లింబ్ స్పేరింగ్ సర్జరీస్), ఒకవేళ అలా తొలగించాల్సి వస్తే వారికోసమే రూపొందించిన (పేషెంట్ స్పెసిఫిక్ ఇంప్లాంట్స్)తో... ఆ తొలగించిన చోట ఇంప్లాంట్స్ అమర్చుతూ అవయవాలు కోల్పోకుండా చేసే టెక్నిక్‌లిప్పుడు అందుబాటులో ● అత్యంత ఆధునికమైన ప్రోటాన్ థెరపీ, ఐఎమ్ఆర్‌టీ (ఇంటెన్సిటీ మాడ్యులేటెడ్ రేడియేషన్ థెరపీ) వంటి అత్యాధునిక రేడియేషన్ పద్ధతులతో చుట్టుపక్కల ఉండే కణజాలానికి హానికలగకుండా లేదా తక్కువ హాని కలిగేలా చేసే రేడియోథెరపీ. ● రకరకాల మందుల కాంబినేషన్లతో ప్రభావపూర్వకమైన కీమోథెరపీ. ● ఇవేకాకుండా టార్గెటెడ్ థెరపీలు, ఇమ్యూనోథెరపీల వంటి వాటితో జెనెటిక్ మ్యుటేషన్ల వల్ల వచ్చిన సార్కోమాలను నయం చేయడానికి ఆస్కారం. ● కొద్దిరోజుల్లో అందుబాటులోకి రానున్న కార్-టీ సెల్ థెరపీల వంటి వాటి సహాయంతో మునుపు అంతగా లొంగని సార్కోమా క్యాన్సర్లను మరింత ప్రభావపూర్వకంగా చికిత్స అందించే వీలుంది.

లక్షణాలు...

బయటకు కనిపించే (క్లినికల్) అంశాలను బట్టి. అలాగే క్యాన్సర్ గడ్డ సైజు. అది ఉండే ప్రాంతాన్ని బట్టి దాన్ని కనుగొనడం ఒక సవాలే. ఎందుకంటే ఇందులో సాధారణంగా నొప్పి అంతగా లేని గడ్డ... లేదా చర్మం కింద ఉబ్బినట్లుగా ఉండే గడ్డ కనిపిస్తుండవచ్చు. ఇక కొన్నిసార్లు చర్మం కింద ఉండే ఈ గడ్డను కదిలించడం లేదా నొక్కడం వల్ల అక్కడి నరాలు నొక్కుకుపోయి నొప్పిగా అనిపించవచ్చు. ఒకవేళ కీళ్ల దగ్గరగా ఆ గడ్డ ఉండే... అది ఉన్నచోట కీళ్ల కదలికలు తగ్గవచ్చు. ఒకవేళ పొట్ట దగ్గర వస్తే... ఆ గడ్డ వల్ల పొట్టలో నొప్పి లేదా పొట్టలో ఇబ్బందిగా అనిపించడం వంటి లక్షణాలు కనిపించవచ్చు.



డాక్టర్ (ప్రొఫెసర్) బి. రాజేష్
మస్క్యులో స్కెలిటల్ రేడియాలజీ స్పెషలిస్ట్, రాయల్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ బర్మింగ్‌హామ్ (యూకే)

హెచ్ఐవీ - ఎయిడ్స్

టీకాకు దీటుగా సూదిమందు...

ఏదైనా వ్యాధి సోకితే మానవుల్లోని వ్యాధి నిరోధక శక్తి / వ్యవస్థ దాన్ని సమర్థంగా ఎదుర్కొంటాయి. అయితే... ఎయిడ్స్ వ్యాధి ప్రత్యేకత ఏమిటంటే... అది దేహంలోని జబ్బుల్ని ఎదుర్కొనే వ్యాధి నిరోధక శక్తినే దెబ్బతీస్తుంది. దాంతో చిన్న చిన్న సాంక్రమిక వ్యాధులకే బాధితులు తేలిగ్గా లొంగిపోతారు. హెచ్ఐవి వైరస్ క్రిమికి ఉండే కొన్ని ప్రత్యేక లక్షణాల కారణంగా సమీప భవిష్యత్తులో దీనికి వ్యాక్సిన్ రూపొందే పరిస్థితి లేదు. అయినప్పటికీ 25 రకాల ఏంటి రెట్రో వైరల్ ఔషధాలతో పాటు ఓ ఇంజెక్షన్‌తో ఈ వ్యాధిని నివారించడం సాధ్యమేనని తేలింది. ఇది ఇంచుమించూ టీకాలాగే పనిచేస్తూ జబ్బు బారిన పడకుండా చేస్తుంది. అదెలాగో తెలుసుకుందాం.

హెచ్ఐవీకి టీకా రూపొందించడానికి అనేక సాంకేతిక ప్రతిబంధకాలు ఉన్నాయి. సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలంటే... ఏదైనా టీకాను అభివృద్ధి చేస్తే... అది ఆ వ్యాధి నుంచి రక్షణ కల్పించేలా 'వ్యాధి నిరోధక వ్యవస్థ'ను ప్రేరేపితం చేస్తుంది. కానీ ఈ వైరస్ మానవ వ్యాధి నిరోధక వ్యవస్థలోని కీలక కణాలైన సీడీ4 లింఫోసైట్స్ తదితర కణాల జీన్స్‌లో కలిసిపోతుంది. దాంతో ఇన్ఫెక్షన్ శాశ్వతమైపోయి వ్యాధి నిరోధక వ్యవస్థే కుప్పకూలిపోయి, దీర్ఘ కాలంలో ఎయిడ్స్ వస్తుంది. అందుకే ఎయిడ్స్‌కు టీకా అభివృద్ధి చేయడం సాధ్యం కా(లే)దు. అయినప్పటికీ హెచ్ఐవీని నిరోధించేందుకు పరిశోధనలింకా జరుగుతూనే ఉన్నాయి.

ఈ ఇంజెక్షన్‌తో విప్లవాత్మక మార్పు...

గతేడాది అంటే... 2024 జులైలో దక్షిణ ఆఫ్రికాకి చెందిన పరిశోధకులు డాక్టర్ లిండా గేయిల్ బెక్కర్ తదితరులు... హెచ్ఐవీని నిరోధించడానికి ప్రీఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్‌గా ఓ సరికొత్త ఇంజక్షన్ 'లెనకపావిర్' సమర్థంగా పనిచేస్తుందని ప్రకటించారు. దక్షిణాఫ్రికా, ఉగాండాలలో నిర్వహించిన ప్రయోగంలో... తమ భర్తలకు హెచ్ఐవీ పాజిటివ్ ఉండి... తాము మాత్రం నెగెటివ్ అయిన ఓ 3204 మంది మహిళలకు (అంటే... సీరో డిస్కార్డెంట్ విమెన్‌కు) టెనొఫోవిర్, ఎమ్ ట్రిసిటాబైన్ అనే మందులు ఇచ్చారుగానీ వారిలో 35 మందికి హెచ్ఐవీ సోకింది.

ఇక మరో ప్రయోగంలో మరో 2134 మంది సీరో డిస్కార్డెంట్ మహిళలకి సరికొత్త ఔషధం అయిన లెనకపావిర్ (927 మిల్లీగ్రాముల) ఇంజక్షన్‌ని ఆరు నెలలకు ఒకటి చొప్పున ఏడాదిలో రెండు ఇంజెక్షన్స్ ఇచ్చారు. వీళ్లలో ఒక్కరికి కూడా హెచ్ఐవి ఇన్ఫెక్షన్ సోకలేదు. దీంతో హైరిస్క్ గ్రూపుల్లో, అంటే... భర్త హెచ్ఐవి పాజిటివ్ అయి, భార్య నెగిటివ్‌గా ఉన్న పరిస్థితుల్లో ఈ ఇంజక్షన్‌తో ఎయిడ్స్‌ను సమర్థంగా నివారించవచ్చని తేలింది.

ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన లెనకపావిర్ ఇంజక్షన్ తాలూకు ఒక్క మోతాదు ఆరు నెలలపాటు రక్షణ ఇస్తుండడంతో అనేక ఆఫ్రికా, ఆసియా దేశాలలో ఎయిడ్స్ వ్యాప్తి నిరోధానికి ఈ ఇంజెక్షన్‌ను వాక్సిన్ (టీకా) తరహాలోనే ఉపయోగంలోకి తీసుకొచ్చే అవకాశాలున్నాయి.

అసలీ లెనకపావిర్ కాప్సిడ్ ఇన్హిబిటర్ ఎలా పనిచేస్తుదంటే...

హెచ్ఐవీ తాలూకు జీన్స్, ప్రొటీన్స్, ఎంజైమ్స్... ఈ అన్నింటినీ కలిపి 'కోర్' (న్యూక్లియో కాప్సిడ్) అంటారు. ఈ 'కోర్'ని కలిపి ఉంచే ఒక సంచి వంటి నిర్మాణమే కాప్సిడ్. ఈ క్యాప్సిడ్ మూలంగానే హెచ్ఐవి తాలూకు 'కోర్ 'కు ఓ శంఖువు లాంటి ఆకృతి వస్తుంది. ఈ కోర్ తాలూకు ప్రొటీన్‌నే 'పీ 24 ఏంటిజెన్'గా పిలుస్తారు. ఇన్ఫెక్షన్ సోకిన తొలివారాల్లో దీన్ని గుర్తించడానికి ప్రత్యేక టెస్టులు ఉన్నాయి.

కొత్తగా అందుబాటులోకి వచ్చిన లెనాకపావిర్ అనేది 'కాప్సిడ్ ఇన్హిబిటర్ ' ఔషధం. అంటే... వైరస్ సంక్రమించే సందర్భంలో కాప్సిడ్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. ఈ ఇంజెక్షన్ ఇచ్చినప్పుడు... న్యూక్లియస్ క్యాప్సిడ్ లోని భాగాలు 'కోర్ 'గా మారి, దాని చుట్టూ సంచి వంటి కాప్సిడ్ ఏర్పడకుండా అడ్డుతుంది. అంతేకాదు... హెచ్ఐవీ జన్యువుల్లోని అణువులను అది మానవుల కణాల్లోకి విడుదల కాకుండా అడుకట్ట వేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే... ఈ ఇంజెక్షన్ హెచ్ఐవీ లోని జన్యువులను మనిషి జీన్స్‌లో కలిసే ప్రక్రియని అడ్డుకుంటుందని చెప్పవచ్చు.

లెనాకపావిర్ ప్రత్యేకతలివి...

ఇప్పటివరకు ఉన్న యాంటీ రెట్రోవైరల్ మందులు... హెచ్ఐవీ సోకి అది మానవుల్లో వృద్ధి చెందే దశల్లోని ఏదో ఒక దశలో మాత్రమే అడ్డుకొంటాయి. అయితే లెనకపావిర్ మాత్రం హెచ్ఐవీ క్రిమి వృద్ధి చెందడాన్ని మూడు దశలలో అడ్డుకుంటుంది. అంతేకాదు... ఈ మందు ఆర్నెల్ల పాటు పనిచేస్తుంది. అంటే ఏడాదికి రెండు ఇంజెక్షన్లతోనే ఏడాదంతా హెచ్ఐవీ / ఎయిడ్స్ రాకుండా చూస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే... ముందుగా ఓ టీకా, ఆర్నెల్ల తర్వాత ఓ బూస్టర్ డోస్ ఎలా పనిచేస్తాయో, ఈ ఇంజెక్షన్ తాలూకు రెండు మోతాదులు అదే పనిచేస్తాయి. పైగా హెచ్ఐవీ బాధితులకు ఇప్పుడు అనేక మందుల్ని రకరకాల కాంబినేషన్లలో వాడుతుంటారు. మందులు పెరుగుతున్న కొద్దీ హెచ్ఐవి క్రిమి వాటికి రెసిస్టెన్స్ పెంచుకుని, వాటికి లొంగకుండా తయారయ్యే అవకాశాలెక్కువ. అలాంటి వారిలో లెనకపావిర్‌ను ఏదో ఒక మందుతో కలిపి వాడుతున్నారు. ఈ రకంగా చూసినప్పుడు కూడా లెనకపావిర్ అనే ఈ ఇంజెక్షన్ ఎయిడ్స్ బాధితుల పాలిట ఆశారేఖగా నిలుస్తోంది.





డా. యనమదల మురళీకృష్ణ,
సీనియర్ ఫిజీషియన్ & ఎయిడ్స్, సాంక్రమిక వ్యాధుల నిపుణులు

అదుపునకు కొన్ని మార్గాలివి...

కండోమ్స్, డిస్పోసబుల్ సిరంజీల వాడకంతో పాటు, బ్లడ్ బ్యాంకులలో హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి చేయడం వల్ల హెచ్ఐవీ వ్యాప్తిని కొంతమేరకు అదుపు చేయడం సాధ్యమైంది. అయితే ఈ జబ్బుకు గురయ్యేందుకు అవకాశమున్న అనేక వర్గాలకు ముందుగానే ఇచ్చేలా 'ప్రీ ఎక్సపోజర్ ప్రొఫైలాక్సిస్' (ప్రెప్) వంటి ప్రక్రియలూ, అలాగే ఈ జబ్బు ఉన్న వారికి సేవలు చేసే సందర్భాలలో ప్రమాదవశాత్తు జబ్బు వచ్చే అవకాశం ఉన్న డాక్టర్లు,నర్సుల వంటివారికి 'పోస్ట్ ఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్' (పెప్)ల వంటి ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయి.



రన్నరప్ నికీ పునాచా జోడీ

న్యూఢిల్లీ: ఏటీపీ చాలెంజర్ 75 టోర్నీ ఢిల్లీ ఓపెన్‌లో భారత టెన్నిస్ ఆటగాడు నికీ పునాచా రన్నరప్‌గా నిలిచాడు. పురుషుల డబుల్స్ ఫైనల్లో రెండో సీడ్‌గా బరిలోకి దిగిన నికీ పునాచా–కోర్ట్నీ జాన్ లాక్ (జింబాబ్వే) జంట చేతిలో ఫైనల్లో ఓడి రన్నరప్‌గా నిలిచింది. శనివారం జరిగిన తుదిపోరులో అన్‌సీడెడ్ మసమిచి ఇమామురా–రియో నొగుచి (జపాన్) ద్వయం 6–4, 6–3తో నికీ–జాన్ లాక్ జోడీపై విజయం సాధించింది. తొలి సెట్ ఆరంభం నుంచే విజృంభించిన జపాన్ జోడీ... 4–1తో ముందంజ వేసింది. ఈ దశలో పుంజుకున్న పునాచా జంట 3–4తో ఆధిక్యాన్ని తగ్గించగలిగిందే తప్ప... చివరి వరకు అదే జోరు కొనసాగించలేక తొలి సెట్ కోల్పోయింది. రెండో సెట్‌లోనూ రాణించిన జపాన్ ద్వయం సునాయాసంగా సెట్‌తో పాటు టైటిల్ గెలుచుకుంది. మరో వైపు సింగిల్స్ విభాగంలో కైరియాన్ జాక్వెట్ (ఫ్రాన్స్), బిల్లీ హారిస్ (బ్రిటన్) ఫైనల్లోకి ప్రవేశించారు. తొలి సెమీస్‌లో జాక్వెట్ 6–3, 6–1తో విట్ కొప్రివా (చెక్ రిపబ్లిక్)పై...రెండో సెమీస్‌లో హారిస్ 4–6, 7–6 (7/4), 6–2తో ట్రిస్టన్ స్కూల్‌కేట్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందారు.

ఆఖరి బంతికి ఢిల్లీ గెలిచింది

ఉత్కంఠపోరులో ముంబై ఓటమి

- 2 వికెట్లతో గట్టెక్కిన క్యాపిటల్స్
- నాట్ సీవర్ పోరాటం వృథా
- గెలిపించిన షఫాలీ, నికీ ప్రసాద్

వడోదర: లక్ష్యఛేదనలో ఢిల్లీకి చివరి 12 బంతుల్లో 21 పరుగులు కావాలి...అయితే 5 బంతుల్లో 5 పరుగులే వచ్చాయి. సమీకరణం 7 బంతుల్లో 16 పరుగులకు మారడంతో ముంబైకే విజయావకాశాలు ఉన్నాయి. కానీ ఆపై డ్రామా సాగింది... ఆఖరి బంతి దాకా సాగిన రనౌట్/నాటౌట్ హంగామా ఢిల్లీనే గట్టెక్కించింది. కలిత వేసిన 20వ ఓవర్లో తొలి నాలుగు బంతుల్లో 8 పరుగులు రాగా, ఐదో బంతికి నికీ ప్రసాద్ (33 బంతుల్లో 35; 4 ఫోర్లు) క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆఖరి బంతికి 2 పరుగులు చేయాల్సిన తరుణంలో హైదరాబాదీ ఆల్‌రౌండర్ తొలి పరుగు పూర్తి చేసింది. అయితే రెండో పరుగు తీసే ప్రయత్నంలో డైవ్ చేయగా... కీపర్ వికెట్లను గిరాటేసింది. మూడో అంపైర్‌కు నివేదించగా... రీప్లేలో ఆమె పడిన డైవ్‌తో బ్యాట్ క్రీజ్‌ను దాటినట్లు తేలడంతో రెండో పరుగొచ్చింది. దీంతో ఢిల్లీ 2 వికెట్ల తేడాతో గెలిచింది. ఆఖరి బంతిదాకా చెమటోడ్చిన ముంబై ఇండియన్స్ జట్టు 2 వికెట్ల తేడాతో ఓడింది. డబ్ల్యూపీఎల్‌లో శనివారం ఆసక్తికరంగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 19.1 ఓవర్లలో 164 పరుగుల వద్ద ఆలౌటైంది. నాట్ సీవర్ బ్రంట్ (59 బంతుల్లో 80 నాటౌట్; 13 ఫోర్లు) చెలరేగింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (22 బంతుల్లో 42; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిపించింది. ఢిల్లీ బౌలర్లలో అనాబెల్ సదర్లాండ్ 3, శిఖా పాండే 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 165 పరుగులు చేసి గెలిచింది. ఓపెనింగ్‌లో షఫాలీ వర్మ (18 బంతుల్లో 43; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేసింది. మిడిలార్డర్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికీ ప్రసాద్ గెలిచేందుకు అవసరమైన పరుగుల్ని జతచేసింది.

సీవర్, హర్మన్ దంచేసినా...

ముంబై ఓపెనర్లు హేలీ మాథ్యూస్ (0), యస్తిక (11) సహా ఆఖరి వరుస బ్యాటర్లు షబ్నిమ్ (0), సైకా ఇషాక్ (0) వరకు ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదు. వన్‌డౌన్‌లో నాట్ సీవర్ బ్రంట్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఇద్దరే ముంబైని ఆదుకున్నారు. వాళ్లిదరు మెరిపించడంతో ఒకానొక దశలో ముంబై 10.3 ఓవర్లలోనే వంద పరుగులకు చేరింది.



సీవర్

మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించాక ధాటిగా ఆడుతున్న కెప్టెన్ హర్మన్ అవుటైంది. తర్వాత వచ్చి నవారెవరూ బాధ్యత కనబర్చలేదు. కానీ సీవర్ బ్రంట్ 36 బంతుల్లో అర్ధసెంచరీ సాధించి ఆఖరి దాకా అజేయంగా పోరాడింది.

అదరగొట్టిన షఫాలీ

ఓపెనర్ షఫాలీ వర్మ పవర్ ప్లేలో పవర్ హిట్టింగ్‌తో కెప్టెన్ మెగ్ లానింగ్ (15)తో కలిసి ఢిల్లీకి మెరుపు ఆరంభమిచ్చింది. ఆరో ఓవర్ ఐదో బంతికి షఫాలీ జోరుకు హేలీ కళ్లెం వేయగా, మరుసటి ఓవర్లో లానింగ్‌ను షబ్నిమ్ అవుట్ చేసింది. తర్వాత జెమీమా (2), అనాబెల్ సదర్లాండ్ (13), అలైస్ క్యాప్సి (16)లు విఫలమవడంతో ఢిల్లీ ఆట పడుతూలేస్తూ సాగింది. ఈ దశలో నికీ ప్రసాద్, సారా బ్రైస్ (10 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) జోడీ ఆరో వికెట్‌కు వేగంగా 31 పరుగులు జతచేయడంతో ఢిల్లీ గెలుపుదారిలో పడింది. స్వల్పవ్యవధిలో సారా, శిఖాపాండే (2) నిష్క్రమించినా ఆఖరి బంతి దాకా పోరాడిన ఢిల్లీ టెయిలెండర్లు జట్టును గెలిపించారు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక (బి) శిఖాపాండే 11; హేలీ (సి) లానింగ్ (బి) శిఖాపాండే 0; సీవర్ బ్రంట్ నాటౌట్ 80; హర్మన్‌ప్రీత్ (సి) నికీ (బి) అనాబెల్ 42; అమెలియా రనౌట్ 9; సజన (సి) బ్రైస్ (బి) అనాబెల్ 1; అమన్‌జ్యోత్ (బి) క్యాప్సి 7; సంస్కృతి (సి) లానింగ్ (బి) మిన్నుమణి 2; కలిత రనౌట్ 1; షబ్నిమ్ రనౌట్ 0; సైకా ఇషాక్ (బి) అనాబెల్ 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (19.1 ఓవర్లలో ఆలౌట్) 164. వికెట్ల పతనం:** 1–1, 2–32, 3–105, 4–129, 5–133, 6–146, 7–156, 8–159, 9–160, 10–164. **బౌలింగ్:** శిఖా పాండే 4–0–14–2, అలైస్ క్యాప్సి 2–0– 25–1, అరుంధతి 4–0–40–0, మిన్నుమణి 4–0–23–1, అనాబెల్ 3.1–0–34–3, రాధా యాదవ్ 2–0–26–0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: మెగ్ లానింగ్ (బి) షబ్నిమ్ 15; షఫాలీ (సి) అమన్‌జ్యోత్ (బి) హేలీ 43; జెమీమా (సి) హర్మన్‌ప్రీత్ (బి) అమెలియా 2; అనాబెల్ (బి) సీవర్ బ్రంట్ 13; క్యాప్సి (సి) షబ్నిమ్ (బి) అమెలియా 16; నికీ ప్రసాద్ (సి) అమెలియా (బి) కలిత 35; సారా బ్రైస్ (సి) కలిత (బి) హేలీ 21; శిఖా పాండే రనౌట్ 2; రాధా యాదవ్ నాటౌట్ 9; అరుంధతీ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 165. వికెట్ల పతనం:** 1–60, 2–60, 3–66, 4–76, 5–109, 6–140, 7–147, 8–163. **బౌలింగ్:** షబ్నిమ్ 4–0–18–1, సైకా 3–0–43–0, సీవర్ బ్రంట్ 4–0–38–1, హేలీ మాథ్యూస్ 4–0–31–2, అమెలియా కెర్ 4–0–22–2, కలిత 1–0–10–1.



అరుంధతి, రాధ విజయానందం

శ్రేయాంక స్థానంలో స్నేహ్ రాణా



బెంగళూరు: డబ్ల్యూపీఎల్ టీమ్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరులో కీలక మార్పు జరిగింది. గాయంతో బాధపడుతున్న స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ టోర్నీ నుంచి తప్పుకుంది. శుక్రవారం జరిగిన టోర్నీ తొలి మ్యాచ్‌లో కూడా ఆమె బరిలోకి దిగలేదు. శ్రేయ స్థానంలో స్నేహ్ రాణాను ఆర్‌సీబీ జట్టులోకి తీసుకున్నారు. గత ఏడాది గుజరాత్ జెయింట్స్ తరఫున ఆడిన రాణా ఈ సారి వేలంలో ఎంపిక కాలేదు. రాణాను రూ.30 లక్షలకు బెంగళూరు ఎంచుకుంది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
గుజరాత్ X యూపీ వారియర్స్
రాత్రి గం. 7:30 స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

దుబాయ్ చేరుకున్న టీమిండియా

ఈ నెల 20న బంగ్లాతో 'చాంపియన్స్' తొలి పోరు



ముంబై: భారత క్రికెట్ జట్టు దుబాయ్ చేరుకుంది. త్వరలో పాకిస్తాన్ ఆతిథ్యమివ్వబోయే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల్ని భారత్ దుబాయ్‌లో ఆడనున్న సంగతి తెలిసిందే! ఈ నేపథ్యంలోనే రోహిత్ సేన యూఏఈకి బయల్దేరింది. శనివారం మధ్యాహ్నం ఇక్కడి ఛత్రపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సహా ఇతర జట్టు సభ్యులంతా టీమ్ బస్‌లో రాగా, కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం కారులో ఎయిర్‌పోర్ట్‌కి వచ్చాడు. కాచుకొని ఉన్న అభిమానులంతా ఒక్కసారిగా 'రోహిత్ భాయ్' అంటూ కేకలు వేశారు. తొలి పోరులో ఈ నెల 20న బంగ్లాతో భారత్ తలపడనుంది. ఆ తర్వాత యావత్ క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూసే దాయాదుల సమయం 23న జరుగుతుంది. ఇక ఆఖరి లీగ్‌లో న్యూజిలాండ్ (మార్చి 2న)తో పోటీపడుతుంది.

చిరస్మరణీయం చేసుకోవాలని...

గతేడాది కరీబియన్ గడ్డపై టి20 ప్రపంచకప్ నెగ్గిన రోహిత్ సేనపై భారత క్రికెట్ అభిమానులంతా మరో ఐసీసీ ట్రోఫీ తెస్తాడని గంపెడాశలు పెట్టుకున్నారు. కెరీర్ చరమాంకంలో ఉన్న తమ స్టార్లు రోహిత్, కోహ్లి ఖాతాలో మరో ఐసీసీ ట్రోఫీ చేరాలని వారంతా ఆశిస్తున్నారు. ఇటీవల ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లలో బుమ్రాలేని టీమిండియా 4–1తో టి20 సిరీస్‌ను, 3–0తో వన్డే సిరీస్‌ను వశం చేసుకుంది. క్లీన్‌స్వీప్ చేసిన వన్డే సిరీస్‌లో మెరుపు శతకంతో కెప్టెన్, నిలకడైన ఫిఫ్టీతో కోహ్లి ఫామ్‌లోకి వచ్చారు. కింగ్ కోహ్లి మరో 37 పరుగులు చేస్తే వన్డే క్రికెట్ చరిత్రలో 14,000 పరుగులు చేసిన మూడో బ్యాటర్‌గా ఘనత వహిస్తాడు. రోహిత్ కూడా 12 పరుగులు చేస్తే 11,000 పరుగుల క్లబ్‌లో చేరే పదో బ్యాటర్ అవుతాడు. బుమ్రా ఫిట్‌నెస్ సమస్యలతో జట్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. కీలకమైన ఐసీసీ ట్రోఫీకి ఇది పెద్ద లోటే అయినా షమీలాంటి సీనియర్ వున్న బౌలింగ్ దళం ఆత్మవిశ్వాసంతో ఉంది. అలాగే యువ బౌలర్లలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, సీమర్ హర్షిత్ రాణాలు బుమ్రాలేక పోవడంతో వచ్చే అవకాశాల్ని ఒడిసి పట్టుకోవాలని పట్టుదలతో ఉన్నారు.


హైదరాబాద్‌లో క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్

మార్చి 22 నుంచి ఐపీఎల్

న్యూఢిల్లీ: ఐపీఎల్–2025 సీజన్‌లో తొలి మ్యాచ్‌కు కోల్‌కతా వేదిక కానుంది. డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ హోం గ్రౌండ్‌లో మార్చి 22న జరిగే ఈ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో కేకేఆర్ తలపడుతుంది. మార్చి 23న ఉప్పల్ స్టేడియంలో రాజస్తాన్ రాయల్స్‌తో జరిగే పోరుతో గత ఏడాది రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ సీజన్‌ను ప్రారంభిస్తుంది. అదే రోజు ఆదివారం చెన్నై వేదికగా ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ జరుగుతుంది. చాంపియన్స్ ట్రోఫీ ముగిసిన 12 రోజుల తర్వాత ఐపీఎల్ మొదలవుతుంది. మే 25న ఫైనల్‌కు కూడా కోల్‌కతానే వేదిక కానుండగా... క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు హైదరాబాద్‌లోనే జరుగుతాయి. పది జట్లు పాల్గొనే ఈ టోర్నీలో పది టీమ్‌ల సొంత మైదానాలతో పాటు రెండు ఇతర వేదికలు (ధర్మశాల, గువహటి) కలిపి మొత్తం 12 చోట్ల లీగ్‌ను నిర్వహిస్తారు. రాజస్తాన్ రాయల్స్ టీమ్‌కు గువహటి తమ రెండో సొంత వేదిక కాగా...ప్రతీ ఏడాదిలాగే ఈ సారి కూడా పంజాబ్ కింగ్స్ తమ మూడు హోం మ్యాచ్‌లను ధర్మశాలలో ఆడుతుంది.

సాక్షి సినిమా

తండేల్ మా నమ్మకాన్ని నిలబెట్టింది - చందు మొండేటి



"తండేల్' సినిమా షూట్ అప్పుడు ఎన్ని కోట్ల కలెక్షన్లు వసూలు చేస్తుందనే ఆలోచన మా యూనిట్‌కి లేదు. కానీ ఈ చిత్రం మా అందరికీ మంచి గౌరవాన్ని తీసుకొస్తుందని బలంగా నమ్మాం. ప్రేక్షకులు అంతే గౌరవంతో గొప్ప ఘన విజయాన్ని ఇచ్చారు. మా నమ్మకాన్ని 'తండేల్' నిలబెట్టింది. అలాగే కలెక్షన్లలో వంద కోట్లకు చేరువ కావడం సంతోషంగా ఉంది" అని డైరెక్టర్ చందు మొండేటి తెలిపారు. అక్కినేని నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలైంది. ఈ నేపథ్యంలో శనివారం చందు మొండేటి పంచుకున్న విశేషాలు.

- పాకిస్తాన్ వాళ్లు మన తెలుగు సినిమాలు చూస్తారు. అక్కడి జైలులో ఒక సెంట్రీ అల్లు అర్జున్‌గారి ఫ్యాన్. ఆయన ఆటోగ్రాఫ్ తీసుకోవాలనుంది అంటూ అక్కడ ఖైదీలుగా ఉన్న మన 22 మంది మత్స్యకారులతో ఆ సెంట్రీ అన్నారట. ఈ విషయాన్ని ఆ 22 మంది నాతో చెప్పారు. 'తండేల్' బయోపిక్ కాదు. వాస్తవిక ఘటనలతో కూడుకున్న కాల్పనిక ప్రేమకథ. అందుకే పాత్రలకి రియల్ పేర్లు పెట్టలేదు.
- 'తండేల్' కథని తొలిసారి విన్నప్పుడు పాక్ నేపథ్యంలో చేద్దామనుకున్నాను. కానీ, కథలో అందమైన భావోద్వేగం ఉంది. అలాగే ప్రేమకథలో ఎడబాటు, విరహం చాలా ప్రత్యేకం. ఇద్దరు ప్రేమికులు ఒక విషయాన్ని కమ్యూనికేట్ చేయాలంటే నెల రోజులు ఆగాలి. ఈ పాయింట్ నాకు బాగా అనిపించింది. అందుకే ఈ చిత్రాన్ని మేం భావోద్వేగాలతో కూడిన అందమైన, స్వచ్ఛమైన ప్రేమకథ అనే ప్రమోట్ చేశాం. పాకిస్తాన్ ఎపిసోడ్ ఇంకా ఉంటే బాగుండేదనే ఫీలింగ్‌ని కొందనే ప్రేక్షకులు వ్యక్త పరిచారు. ఆ ఫీలింగ్ ఉన్నప్పటికీ ఈ మూవీలోని ప్రతి అంశానికి ఆడియన్స్ చాలా కనెక్ట్ అయ్యారు.
- నాగచైతన్య సిన్సియర్‌గా ఎఫర్ట్ పెట్టారు కాబట్టే 'తండేల్' సక్సెస్‌కి మించిన ప్రశంసలు ఆయన నటనకి వస్తున్నాయి. నాగచైతన్య కెరీర్‌లో తొలి వంద కోట్ల సినిమా 'తండేల్'. ఈ క్రెడిట్ నిర్మాతలు అరవింద్, వాసుగార్లు, చైతన్య, దేవిశ్రీలతో పాటు యూనిట్‌కి దక్కుతుంది. నా అక్షర రూపానికి వారంతా విజువల్‌ని ఇచ్చారు. 'తండేల్' సక్సెస్ తర్వాత 'థ్యాంక్యూ చందు. వి లవ్ యూ' అని నాగార్జునగారు అనడం నాకు గొప్ప ప్రశంస. 'తండేల్ దర్శకుడి సినిమా' అని రాఘవేంద్రరావుగారు చెప్పడం మరచిపోలేని ప్రశంస. ఇక మా 'తండేల్' పైరసీ బారిన పడినప్పుడు గుండెల్లో గునపంతో పొడిచినట్లు, మన పిల్లల్ని ఎవరో కిడ్నాప్ చేసి తీసుకెళ్లిపోయినంత బాధగా అనిపించింది. నా తర్వాతి చిత్రం 'కార్తికేయ 3'. సూర్యగారితో తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా చేస్తాను.



రాజా గౌతమ్, బ్రహ్మానందం, ఆర్‌వీఎస్ నిఖిల్, రాహుల్ యాదవ్

తండ్రిగా చాలా సంతోషంగా అనిపించింది - బ్రహ్మానందం

''బ్రహ్మ ఆనందం' సినిమా చూసిన వారు 'మీ కన్నా.. మీ అబ్బాయి బాగా చేశాడు' అని రాజా గౌతమ్‌ని మెచ్చుకుంటుంటే ఓ తండ్రిగా చాలా సంతోషంగా అనిపించింది. ప్రేక్షకులకు కొత్తగా కనిపించాలనే ఆలోచనతోనే నేను సినిమాలు చేస్తుంటాను. చాలా కాలం తర్వాత 'బ్రహ్మ ఆనందం' వంటి ఓ మంచి సినిమా, మంచి పాత్ర చేశాననే సంతృప్తి కలిగింది'' అని నటుడు బ్రహ్మానందం చెప్పారు. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వంలో బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్లుగా నటించారు. సావిత్రి, ఉమేష్ కుమార్ సమర్పణలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. శనివారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో రాజా గౌతమ్ మాట్లాడుతూ–''బ్రహ్మ ఆనందం' చూసిన వారు నా నటన గురించి మాట్లాడుతుండటం హ్యాపీగా ఉంది'' అని పేర్కొన్నారు. ''నా గత చిత్రాల్లా 'బ్రహ్మ ఆనందం'కి కూడా మంచి మౌత్ టాక్ వచ్చింది. అన్ని చోట్లా షోలు ఫుల్ అవుతున్నాయి'' అని రాహుల్ యాదవ్ చెప్పారు. ''ప్రేక్షకులతో కలిసి సినిమా చూశాం... మేం ఊహించని సన్నివేశాల్లోనూ నవ్వుతున్నారు'' అని ఆర్‌వీఎస్ నిఖిల్ తెలిపారు.



మాధవ్ కోదాడ, ఈటల రాజేందర్

జర్నలిజం విలువలపై...

నేను, నా ఫ్రెండ్ ఆనంద్ జర్నలిస్టులం... జర్నలిజం విలువల కోసం ఏం చేయడానికైనా మేం తెగిస్తాం'' అనే డైలాగ్స్‌తో మొదలైంది 'నేనెక్కడున్నా' సినిమా ట్రైలర్. బాలీవుడ్ నటుడు మిమో చక్రవర్తి, సశా చెత్రి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా ఇది. మాధవ్ కోదాడను దర్శకుడిగా పరిచయం చేస్తూ, కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''మహిళా సాధికారత, జర్నలిజం విలువలపై తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు.

కొత్త లవ్‌స్టోరీతో వస్తున్నాం - జాన్వీ నారంగ్



రమ్య, జాన్వీ నారంగ్, పవీష్, అనిఖా, రబియా

పవీష్, అనిఖా సురేంద్రన్, ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్, వెంకటేశ్ మీనన్, రబియా, రమ్యా రంగనాథన్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్'. ఆర్‌కే ప్రొడక్షన్స్‌తో కలిసి హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' టైటిల్‌తో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ రిలీజ్ చేస్తోంది. ''ఓ కొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం'' అని శనివారం విలేకరుల సమావేశంలో చెప్పారు నిర్మాత జాన్వీ నారంగ్.

అరి వీర భయంకర ప్రేమ



అక్సా ఖాన్, వైదిక

అక్సా ఖాన్, వైదిక, ఐశ్వర్య, కనిక మోంగ్యా, అర్చనా రాయ్, డెబొర, అమిత శ్రుతీ రాజ్, సోమదత్త, నాగమహేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అరి వీర భయంకర'. కిషన్ ప్రసాద్ దర్శకత్వంలో శేషుబాబు సీహెచ్, కాసుల రామకృష్ణ నిర్మిస్తున్నారు. శేషుబాబు సీహెచ్ మాట్లాడుతూ– ''దర్శకత్వ శాఖలో అపార అనుభవం ఉన్న కిషన్‌గారి దర్శకత్వంలో ఈ మూవీ నిర్మిస్తుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు. కిషన్ ప్రసాద్ మాట్లాడుతూ– ''అరి వీర భయంకర' వైవిధ్యమైన ప్రేమకథా చిత్రం. ఈ తరంలో అమ్మాయిలు, అబ్బాయిలు ఎలా ఉన్నారు? అనేది చూపిస్తున్నాం'' అన్నారు.



మహేంద్రన్, అజయ్, రవి వర్మ, మణి తెల్లగూటి

రేపటి వెలుగు కోసం...

శ్రద్ధా దాస్, అజయ్, సాహితీ అవంచ, ఆమని, మాస్టర్ మహేంద్రన్, ప్రభాకర్, అంబటి అర్జున్, రౌడీ రోహిణి ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'త్రికాల'. మణి తెల్లగూటి దర్శకత్వంలో రాధిక, శ్రీనివాస్ నిర్మించారు. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. 'యుద్ధం రేపటి వెలుగు కోసం... కానీ, ఈ అంధకాసురుడి యుద్ధం వెలుగుని నాశనం చేయడానికి..' అంటూ నటుడు తనికెళ్ల భరణి డైలాగ్‌తో ట్రైలర్ ఆరంభమైంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో అజయ్ మాట్లాడుతూ– ''త్రికాల' అద్భుతంగా వచ్చింది'' అన్నారు. ''వేసవిలో రాబోతున్న మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అని మణి తెల్లగూటి కోరారు. ''సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలని, మన సూపర్ హీరోలను అందరికీ చూపించాలనీ 'త్రికాల' తీశాం'' అని రాధిక తెలిపారు. ''మా సినిమాకి కంప్యూటర్ గ్రాఫిక్స్ పని ఎక్కువగా ఉండటంతో ఆలస్యం అయింది'' అన్నారు శ్రీనివాస్.



చిరంజీవి

మాస్ ఇంట్రో

చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్ మూవీ 'విశ్వంభర'. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాశ్ శంకర్‌పల్లిలో వేసిన ఓ భారీ సెట్‌లో చిరంజీవి ఇంట్రడక్షన్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్ర సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి ఈ పాట కోసం ఓ పవర్‌ఫుల్ మాస్ యాంథమ్‌ను కంపోజ్ చేయగా, శోభి మాస్టర్ నృత్య రీతులను సమకూర్చుతున్నారు. ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ పాట చిత్రీకరణ సందర్భంగా 'విశ్వంభర' నుంచి చిరంజీవి స్టైలిష్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''యాక్షన్, ఎమోషన్‌లతో పాటు విజువల్ వండర్‌లా ఈ మూవీ ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ సినిమాకు చోటా కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా చేస్తున్నారు.

జటాధర జర్నీ స్టార్ట్



సుధీర్‌బాబు, ప్రేరణ, హరీష్ శంకర్

సుధీర్‌బాబు హీరోగా వెంకట్ కల్యాణ్ దర్శకత్వంలో రూపొందు తున్న చిత్రం 'జటాధర'. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కె.ఆర్. బన్సల్, ప్రేరణా అరోరా నిర్మిస్తున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు శనివారం హైదరాబాద్‌లో జరిగాయి. ఈ కార్యక్రమానికి దర్శకుడు హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్, దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి, వెంకీ అట్లూరి, శిల్పా శిరోద్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీ స్టూడియోస్ సీఈవో ఉమేష్ కేఆర్ బన్సల్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ప్రేక్షకులకు ఓ అద్భుతమైన అనుభూతిని ఇస్తుంది'' అని తెలిపారు. ''జటాధర' కథ అనంత పద్మనాభస్వామి ఆలయం చుట్టూ తిరుగుతుంది. అక్కడి సంపద, దాని చుట్టూ అల్లుకున్న వివాదాలు, నేపథ్యం, చరిత్ర... వంటి అంశాలతో ఉంటుంది. నిధి కోసం చేసే పోరాటంలో హీరో కొన్ని శాపాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ పోరాటం ఎలా సాగింది? ఈ శాపం ఏంటి? అని తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఎదురు చూడాల్సిందే'' అని యూనిట్ తెలిపింది.

సాక్షి పెళ్ళిచూపులు
15
ఆదివారం 16-2-2025

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



యాదవ/ కట్నం ప్రసక్తి లేదు / B.Tech (Civil)/ Govt.AEE/ట్రాన్స్‌కో/ 18 Lakhs PA / 5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-15459]

SC మాల & క్రిస్టియన్ / కట్నం ప్రసక్తి లేదు / M.Tech, EEE/Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/1 Lakh PM/5'8" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-15459]

కుల పట్టింపు లేదు: Ag 58, సెంట్రల్ గవర్నమెంట్ జాబ్, సొంత ఇల్లు కలిగిన వరునికి మంచి సాంప్రదాయమైన, విడో, పిల్లలు ఉన్న ఏ బాదర బందీ లేని వధువు కావలెను. సంప్ర॥ 94999 47658. [MH-13081]

వైశ్య డైవర్సీ వయస్సు: 56, పిల్లలు లేరు ఒంటరి మంచి సంపాదన కలిగిన వరునికి వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు నో బ్రోకర్స్ డైరెక్ట్. సంప్ర: 73862 13167 [G-2021]

కాపు / 49Y / 5.5 Height / 50 లక్షల స్థిరాస్తి / బిజినెస్ / వరుడునకు మంచి మనసున్న వధువు కావలెను. నో కేస్ట్ డైరెక్ట్ 92486 06455 [R-1206978]

KHATIKA 32/5'10", B.Tech, MBA, Business, 13+LPA, Hyd Seeks well Settled Bride Inter/Degree from Good Family. No Brokers. Call Ph: 9014416597 [HA-99843]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్ /34y/1L P.M/Hydలో సొంత ఇల్లు, విలేజ్ లో 5 ఎకరాల వ్యవసాయ భూమి గల హైదరాబాద్ వరుడికి టీచ్ తెలంగాణ వధువు కావలెను. పిల్లలు లేకుంటే డైవర్సీ /విడో ఓకే కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-782730]

ముదిరాజ్ అబ్బాయి 30/5.10 M.Tech (Mechanical) (Business - 50 Cr) తగిన వధువు కావలెను. NLG, MLG సెల్ : 98486 77948, 96527 87068. [M-1268602]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/MBBS/Doctor/Very Handsome/ 3L/M/1990/5'11"/100Cr *MD/ 96/6'/50Cr *95/5'10"/400Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/Business /B.Tech/MS /1994/ 6'/800Cr *96/6'/500Cr *95/5'7"/ 2000 Cr *95/ 5'11"/ 7000Cr. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9347807015/9849321309

Reddy/B.Tech /MS / H1/USA *1994/ 5'11"/ 400K/30Cr *93/5'11"/ 240K/ 25Cr *95/5'8"/125K/20Cr *98/6'/400Cr * Cont. K.C. Reddy- Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/Now in Hyd/ BE/ MS/ H1 / USA / Very Handsome Boy/ 1990/5'10"/100Cr * Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/IIT/B.Tech/MS/H1/USA *1996/6' *94/5'11" *98 / 5'11" / 230K / 30Cr *96/6'/ 25Cr *91/5'7" /200K * Cont: K.C. Reddy -Hyd-Ph: 9347807015/9849321309

Reddy / USA-Doctor * MBBS/MD / 1995/ 5'11" *92/6' *89/5'10"/ *95/5'8" *98/ 5'8" *89/5'9" *92/5'11" *83/5'6" *75/6' * Cont : K.C. Reddy -Hyd. Ph : 9347807015

Reddy/Builder / B.Tech / 1998 / 6'/60Cr * 96/ 5'11"/65Cr *94/6'/70Cr *95/5'10"/ 300 Cr *95/5'8"/500Cr * Cont : K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/IIT/B.Tech/MBA/Job India *94/ 5'9"/1 Cr/yr/30Cr *98/ 5'11"/ 50L/yr/8Cr * 94/5'11"/ 70L/yr/25Cr * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/Catholic *USA-Citizen/ 1986/ 5'7"/250K *94/5'8"/100K *90/6'/90K *91/6'/55Cr * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015 /9849321309

Reddy/Divorcee *B.Tech/ MS/ 1989/ 5'9"/50Cr *86/5'11"/70L/yr/15Cr *81/ 5'8"/300Cr *MD/94/5'9"/80Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015 /9849321309 [D-984]

వరుడు కావలెను

Reddy/B.Tech / Most Beautiful/ 1984/5'7"/ 30Cr / Needs divorcee or unmarried. Well Settled any * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/MBBS / MD / Most Beautiful/ 1994/5'6"/30Cr *98/5'7"/100Cr *97/5'6"/ 500Cr *95/5'7"/20Cr * Cont: K.C. Reddy -Hyd-Ph: 9347807015/9849321309

Reddy/M.Sc / Most Beautiful / 1994/ 5'4½"/ 90Cr *95/5'5"/100Cr *B.Tech/99/ 5'7"/100Cr *97/5'4"/150Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/BA / M.Sc/1988/5'3"/300Cr *MS/ Most Beautiful/1994/5'3"/300Cr *B.Com/ 1994/5'7"/50Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/Own Company/ Most Beautiful/ 1995/5'5"/ 100Cr/12Cr/ yr/ Incom *95/5'3"/75Cr * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech / MS / H1 / USA *1997/5'4"/ 100Cr *96/5'3"/30Cr *98/5'4"/10Cr *99/5'6"/ 100Cr *97/5'5"/10Cr *95/5'6"/5Cr * Cont. K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/IIT / B.Tech / MS/USA *1996/5'7" *97/5'4"/200K *95/5'6"/200K *94/5'4"/200K *97/5'5"/ *90/5'3"/200K. * Cont : K.C. Reddy -Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MBA(IIM)/1997/5'4"/25L/ yr/MDS/Doctor/1995/5'8"/20Cr *BDS/ 98/ 5'5"/20Cr *MDS/95/5'5"/5Cr *Cont: K.C. Reddy-Hyd.Ph: 9347807015/9849321309

Reddy/USA-Doctors * MD/1996/ 5'2" *95/ 5'5" *95/5'7" *97/5'6" *95/5'2" *96/5'5"/ 100 Cr *92/5'4" *87/5'4" * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Divorcee/B.Tech/1993/5'4"/10Cr * 88/5'6"/30Cr *91/5'4"/10Cr* MD/Doctor/ *92/ 5'3"/9Cr *93/5'8"/40Cr B.Arc/ 93/5'6"/50Cr * Cont : K.C. Reddy- Hyd-Ph: 9849321309

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Govt Officer, BE (IIIT), 28, 5' 11", Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 27, 6' 1", Engineer, Rich, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 6', Sr. SWE, 400 K, 20 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 10", Bank Of America, SWE, Rich, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Business, BE, MS (USA), 26, 5' 7", 100 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 5", 20 Crores, Hyderabad, Rich, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 27, 5' 3", PG Doctor, 20 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 27, 5' 6", Rich Family, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Europe, BE, MS, 28, 5' 11", SWE, 72 K Euros, 20 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 30, 5' 8", Lead Analyst, 40 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 6', PG Doctor, Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), MBA, 33, 5' 10", 25 L P/A, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 6, SWE, Amazon, 100 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", Developer, 22 L P/A, Rich, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 28, 5' 8", PG Doctor, Rich Family, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, 30, 5' 4", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

★★

క్రైస్తవ మాల Legally Divorced 34 సం॥ 5'10" MD, Govt డాక్టర్ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడుకు వధువు కావలెను. డైరెక్ట్ సం॥ 89853 15880 [O-787332]

కుల, కట్నం ప్రసక్తి లేదు. Reddy / 40 సం॥ / B.Tech./ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ / Salary: 1 lakh - P.M. / తగిన వధువు కావలెను. సెల్: 7337586682. [A-1510]

రిచ్ పద్మశాలి 33 సం॥, PG, Job, 40K P/M, 5.6 ft, కట్నం ప్రసక్తి లేని వరునికి Any BC / OBC / 10th ఆపైన చదువు Job Not Necessary, 28 to 32 yrs, రాయలసీమకు చెందిన వధువు కావలెను. సంప్ర : 9290739030. [A-1511]

A.P. SMP Settled in Hyd. invite alliance for their son 2nd marriage 32y, 5'9" B.Tech, MBA, working in MNC as Manager req. fair, well educated below 30y can © Shariff 9869223554 [B-7846]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Q:డిగ్రీ, Age:31/ సొంత బిజినెస్, అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము ఐనా OK) 1st/2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 8143011223 [HA-15459]

రెడ్డి/ఆస్తి కుల పట్టింపు లేదు/26y/5'3"/ B.Tech/ 4 కోట్ల స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు వరుడు కావలెను మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. Ph: 9885492498 [HA-15459]

కాపు/విడో/48/PG Govt.Job / VRS / 90K PM/ఫ్యామిలీ పెన్షన్ / మార్బుల్ & గ్రానైట్ బిజినెస్/ఇల్లు & కాంప్లెక్స్ రెంట్స్/ 30ఎ. పొలం/30 కోట్ల ప్రాపర్టీ/పూర్తి ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు FC/BC వరుడు కావలెను. ఇల్లరికం ఓకే. 9642589295 [HA-15459]

రెడ్డి/2nd మ్యారేజ్ (కుల/ఆస్తి) పట్టింపు లేదు. 30Y/Q: డిగ్రీ/సొంత వ్యాపారం, ల్యాండ్, వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం) OK. అన్ని వయస్సుల వారికి 1st, 2వ సంబంధాలు కలవు. 9030062353 [HA-15459]

కుల పట్టింపు లేదు / 45yr Govt.టీచర్ 1 లక్ష PM, డైవర్సీ నో పిల్లల్స్ 10ఎ॥ ల్యాండ్ వెల్ సెటిల్డ్ గల వధువుకి 1వ, 2వ లేట్ వరుడు కావలెను పిల్లలు ఉన్నా OK. అర్జెంట్ (ఫీజు 1000/- మాత్రమే) సంప్ర : 7286031653 [HA-15459]

రెండవ పెళ్ళి/37 yrs/ కుల పట్టింపు లేదు MBA/ డైవర్సీ Govt.ఎంప్లాయ్ 2,00,000/- వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం & పిల్లలు ఉన్నా OK) సంప్రదించండి : 9133715309 [HA-15459]

రెండవ పెళ్ళి/24y&25y&27y& 29y&30y &32y& 34y & 35y&36y&38y& 40y&42y& 43y& 45y & 46y & 47 & 49y&50y/" మా సేవ" (Since 1998) : PH/WA: 9291503949 [HA-15459]

రెడ్డి/ విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు / Age: 35/ B.Com / Pvt. Jobగల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) All Cast marriages Available. Ph: 8121347478 [HA-15459]

రెండవ సంబంధం కుల పట్టింపు లేదు : 35/5'4"/B.Sc MBA/మోర్గాన్ అండ్ స్టాన్లీ/ బెంగళూరు * 40/5'3"/ B.Tech/ MS/USA/ H1B/ CISCO/డల్లాస్ USA అమ్మాయిలకు SC/ ST క్రిస్టియన్స్, ముస్లింమ్స్ తప్ప తగిన అబ్బాయిలు కావలెను. సం॥ "శుభమస్తు" DSNR, HYD. S. రాములు గౌడ్. 8790690309 [HA-783524]

యాదవ/ కురుమ 30 / 5'7 / B.Tech / Govt Job Hyd 29/ 5'6/ B.Tech/ SW/ 20 Lakhs PA VJA 28/ 5'4/ MBBS PG/ Guntur 24/5'4/ MS Canada సంపన్నకుటుంబం. KK Yadav 98493 06274 [G-820182]

★★

రెడ్డి,కమ్మ/విడో/48Y/5'3"/ఒంగోలులో సొంత ఫ్లాట్లు /Hydలో సొంత బిజినెస్ రెంట్స్/మంచి ఆస్తి గల వధువు కి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్)(ఇల్లరికం OK)(నోబ్రోకర్స్)7799083500, 7386660643 [HA-33967]

వేదికలు



మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-15399]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7702272594 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15460]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15460]

Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7702272594/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15460]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 /Blue Trend Matrimonial (P) Ltd. [HA-15460]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7702272594 /Blue Trend Matrimonial (P) Ltd. [HA-15460]

పెళ్లి సంబంధాలు & ప్రయత్నిస్తున్న వారందరికి 'ఓం నమో వెంకటేశాయ'. All Caste సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, NRI, Group 1, 2 వారికి చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, ✆ 7093722724. [T-3255]

ఫ్రీ రిజిస్ట్రేషన్: 16 రో॥ అన్ని కులాల వారికి తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి మ్యారేజీ లైన్స్. ✆ 94418 29644, 98490 58673, 9493 661 288. వాట్సప్ [B-621]

రాయల్ స్టార్ మ్యాట్రిమోనీ : అన్ని కులములకు చెందిన ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్., గ్రూప్ 1,2, సాఫ్ట్‌వేర్, బిజినెస్, డాక్టర్స్, యు.ఎస్.ఎ, యు.కె, హై ప్రొఫైల్స్ సంబంధములు కలవు ✆ 89703 31456 [B-1266884]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1326]

బ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం Free Register 13/April/2025న Kamala Nagar Welfare Office, ECIL, Hyd. Ph: 9704656103/9533608887 Whatsapp. No. [HA-1314]

మాల, మాదిగలకు పెళ్లి సంబంధాలు చూడబడును. రిజిస్ట్రేషన్ ఉచితం. కె.వి. మ్యాట్రిమోని, చిక్కడపల్లి, హైదరాబాద్, ప్రొఫైల్ పంపండి, వాట్సాప్. 7842881934 [HA-1334]

★★

మాల (క్రైస్తవ, హిందూ) B.Tech, M.Tech, MS, MBA, MBBS చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ జాబ్ చేస్తున్న వధూవరుల వివరాలకు kalyanamala.org ✆ 9440545049 [B-1268407]

అన్ని కులాల వారికి 1st, 2nd, గవర్నమెంట్, ప్రైవేట్, డాక్టర్స్, ఇంజనీర్స్ మరియు ఎంప్లాయీస్ వధూవరులకు పెళ్ళి సంబంధాలు చూడబడును. ✆ 74160 94972 [R-1206918]

పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ టాప్

- 18 పతకాలు సాధించిన తెలంగాణ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు సత్తాచాటారు. ఈనెల 10 నుంచి 15 వరకు జార్ఖండ్‌లోని రాంచీలో నిర్వహించిన 68వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీస్ బృందం పలు విభాగాల్లో 18 పతకాలు గెలుచుకుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న పోలీస్ బృందాల్లో తెలంగాణ పోలీస్ బృందం 'ఓవరాల్ టీం చాంపియన్‌షిప్' సాధించింది. మొత్తం 6 బంగారు, 4 రజత, 8 కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, విధ్వంస నిరోధక తనిఖీలు, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్‌స్క్వాడ్ పోటీ, ఓవరాల్ టీం చాంపియన్‌షిప్ పతకాలు దక్కాయి. శనివారం నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో జార్ఖండ్ ఆర్థిక, క్రీడాశాఖమంత్రి రాధాకృష్ణ కిశోర్ పాల్గొన్నారు. తెలంగాణ పోలీస్ బృందం తరఫున సీఐడీ ఎస్పీ బి.రాంరెడ్డి 'ఓవరాల్ టీం చాంపియన్‌షిప్'ట్రోఫీని స్వీకరించారు. తెలంగాణ డీజీపీ జితేందర్, ఈ గెలుపుపై సంతోషం వ్యక్తం చేస్తూ.. 'ఈ విజయానికి కారకులైన పోలీస్ సిబ్బంది, శిక్షకులు, సహాయక సిబ్బందికి నా హృదయపూర్వక అభినందనలు. ఈ ఘనత తెలంగాణ పోలీస్ బలగాల నిబద్ధత, సమర్థత, విశ్వసనీయతకు నిదర్శనం' అన్నారు. సీఐడీ డీజీ, తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ నోడల్ ఆఫీసర్ శిఖా గోయల్ మాట్లాడుతూ 'మా బృందం అద్భుతమైన ప్రదర్శన కనబరిచినందుకు గర్విస్తున్నాం'అని చెప్పారు.

వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్‌కు డాక్టరేట్



సాక్షి, హైదరాబాద్: కోల్‌కతాలోని సెయింట్ జేవియర్ యూనివర్సిటీ 6వ స్నాతకోత్సవంలో వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) వ్యవస్థాపకుడు, చాన్స్‌లర్ జి.విశ్వనాథన్‌కు ప్రతిష్టాత్మక డాక్టర్ ఆఫ్ లిటరేచర్‌ను ప్రదానం చేసింది. విద్య, నాయకత్వం, ప్రజా సేవల రంగాల్లో ఆయన చేసిన విశిష్ట సేవలకుగాను ఈ గుర్తింపు దక్కింది. న్యూటౌన్‌లోని బిస్వా బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వర్సిటీ స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ జేమ్స్ ఆర్జెన్ టీట్, ఎస్‌జే అండ్ వైస్ చాన్స్‌లర్ జాన్ ఫెలిక్స్ రాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ తనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్‌తో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో విద్యావేత్తలు, ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాబార్డ్ పంట రుణాలు తగ్గాయ్!

- గత ఏడాది కన్నా లక్ష్యంలో రూ.3,645 కోట్లు తగ్గుదల
- ఈసారి లక్ష్యంగా పెట్టుకున్న రుణాలు రూ. 87,149 కోట్లు
- 2021–22 నుంచి ఇదే తంతు.. లక్ష్యానికి, వాస్తవాలకు భారీ తేడా
- స్టేట్ ఫోకస్ పేపర్‌లో వెల్లడించిన నాబార్డు



సాక్షి, హైదరాబాద్: రైతుకు రుణాల జారీలో రాష్ట్ర స్థాయి బ్యాంకులే కాక... జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) కూడా చిన్నచూపే చూస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు కొన్నేళ్లుగా గణనీయంగా పెరుగుతుండగా, రైతుకు ఇచ్చే రుణాల విషయంలో మాత్రం బ్యాంకులు లక్ష్యాలకు దూరంగానే ఉంటున్నాయి. 2025–26 సంవత్సరానికి నాబార్డు విడుదల చేసిన ఫోకస్ పేపర్ ఈ విషయాన్ని వెల్లడిస్తోంది. 2025–26 సంవత్సరానికి తెలంగాణలో రుణాల లక్ష్యం రూ.3.86 లక్షల కోట్లుగా పేర్కొన్నప్పటికీ... ఇందులో కేవలం పంటలకు సంబంధించి పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కోసం కేటాయించిన నిధులు రూ. 87,149 కోట్లు మాత్రమే. ఈ మొత్తం 2024–25లో పెట్టుకున్న రూ.90,794 కోట్ల లక్ష్యం కంటే రూ.3,645 కోట్లు తక్కువ కావడం గమనార్హం.

ఐదేళ్లుగా లక్ష్యానికి దూరంగా రుణాలు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2024–25 లక్ష్యానికన్నా రూ.3,645 కోట్లు తక్కువగా రుణ అంచనాను ప్రకటించిన నాబార్డ్ అంతకుముందు మూడేళ్లు కూడా పంటలకు ఇచ్చే రుణాల విషయంలో లక్ష్యాలను చేరుకోలేదు. 2021–22లో పంట రుణాల కింద రూ. 59,440 కోట్లు లక్ష్యంగా నిర్ణయించుకొని కేవలం రూ. 42,854 కోట్లు మాత్రమే ఇవ్వగలిగింది. 2022–23లో రూ.67,764 కోట్ల లక్ష్యాలకు గాను రూ. 59,060 కోట్ల వరకే ఇచ్చింది. 2023–24లో అత్యధికంగా రూ.10వేల కోట్ల లోటు కనిపించింది. ఆ ఏడాది రూ. 73,437 కోట్ల లక్ష్యానికి గాను రూ. 64,940 కోట్లు మాత్రమే పంట రుణాలుగా ఇవ్వగలిగారు.

రుణాలు, పెట్టుబడి 1.39 లక్షల కోట్లు

పంటకు సంబంధించి రుణాలు 87,149 కోట్లు కాగా నీటి వనరులు, యాంత్రీకరణ, ప్లాంటేషన్, హార్టికల్చర్, అటవీ, బీడు భూముల వినియోగంతో పాటు పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖలకు సంబంధించి టర్మ్‌లోన్లు, పెట్టుబడి కలిపి 2025–26 సంవత్సరానికి నాబార్డ్ రూ.1.39 లక్షల కోట్ల రుణ అంచనా వేసింది. ఇందులో యాంత్రీకరణకు రూ. 5,608 కోట్లు, నీటి వనరులకు రూ.2,613 కోట్లు, అటవీ, బీడు భూముల సాగుకు రూ. 793 కోట్లు కేటాయించింది. పశుసంవర్ధక శాఖలో డెయిరీ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకలు, పందులు, చేపల పెంపకానికి రూ.16వేల కోట్ల వరకు కేటాయించారు.

53 శాతం నిధులు ఎంఎస్ఎంఈలకే..

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు నాబార్డు అత్యధికంగా రూ. 2.03 లక్షల కోట్లు కేటాయించింది. ఇది రాష్ట్రానికి కేటాయించిన మొత్తం బడ్జెట్‌లో 53 శాతం. వ్యవసాయ టర్మ్ లోన్లు 12 శాతం కాగా, వ్యవసాయ మౌలిక వసతులకు కేవలం 2 శాతం కేటాయించారు.

మహాకుంభాభిషేక ప్రతిష్టకు ఘనంగా ఏర్పాట్లు

యాదగిరిగుట్టలో ఈనెల 19 నుంచి 23 వరకు ఉత్సవాలు	వానమామలై పీఠాధిపతి, రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం
23వ తేదీన స్వామివారికి దివ్య స్వర్ణ విమాన గోపురం అంకితం	దేశంలోనే అతిపెద్దది.. తెలంగాణలో మొదటిది



ఆలయ ఈవో భాస్కర్‌రావు

సాక్షి, యాదాద్రి/ యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేక ప్రతిష్టా మహోత్సవానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. శనివారం యాదగిరిగుట్ట ఆలయంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 23 వరకు మహాకుంభాభిషేక ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, 19 నుంచి 23 వరకు పంచకుండాత్మక సుదర్శన నారసింహ మహాయాగం జరిపించి, దివ్య విమాన గోపురాన్ని స్వామి వారికి అంకితమిస్తామన్నారు. 23న ఉదయం 11:54కి స్వర్ణ విమాన గోపురానికి కుంభాభిషేకం చేసి, స్వామి వారికి స్వర్ణ గోపురాన్ని సమర్పిస్తారన్నారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఈసీ పర్మిషన్ తీసుకుని విశిష్ట అతిథులైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సహా ముఖ్య అతిథులకు ప్రత్యేక ఆహ్వానాన్ని పంపిస్తున్నట్లు చెప్పారు.

ఐదు రోజులపాటు ఉత్సవాలు..

ఈనెల 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వానమామలై మఠం పీఠాధిపతి, పరమహంస మధుర కవి, రామానుజ జీయర్ స్వామి రానున్నట్లు ఆలయ ఈవో వెల్లడించారు. రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో మహోత్సవాన్ని జరిపించనున్నట్లు తెలిపారు. దేశంలో అతి పెద్ద దివ్య స్వర్ణ విమాన గోపురంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి గోపురం తీర్చిదిద్దబడిందని, తెలంగాణలో మొట్టమొదటి బంగారు విమాన గోపురమని ఈవో తెలిపారు. ఈ విమాన గోపురానికి మొత్తం 65 కేజీల 84 గ్రాముల బంగారాన్ని తీసుకున్నామని వెల్లడించారు. కాగా, మహోత్సవాలను ప్రత్యక్షంగా వీక్షించలేని వారు ఎల్‌సీడీ స్క్రీన్‌ల ద్వారా చూడవచ్చని, ఇవి టోల్‌గేట్‌తో సహా, యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో, బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.





గోపురంపై అమర్చే గరుడ విగ్రహం నమూనా, (పక్కన) గోపురంపై అమర్చే విష్ణుమూర్తి విగ్రహం

విమానగోపురంపై పొందుపరిచిన విగ్రహాలు ఇవీ..

దివ్యవిమానం బంగారు తాపడం పనులు ఈనెల 18 వరకు పూర్తికానున్నాయి. ఐదంతస్తుల తాపడంలో 40 రకాల విగ్రహాలు బంగారు పూతతో చెక్కారు. దశావతారాలు, నరసింహస్వామి వారి రూపాలను చెక్కారు. ఇంకా 4 గరుడ విగ్రహాలు, 8 సింహాలు స్వర్ణతాపడంపై పొందుపరిచారు. విమాన గోపురం తోపాటు ఆలయంపై ఉన్న 39 కళశాలకు కూడా బంగారు తాపడం చేశారు.

సువర్ణ పుష్పార్చన సేవలు రద్దు

ఈ మహోత్సవంలో భాగంగా ఐదు రోజుల పాటు సువర్ణ పుష్పార్చన సేవలు రద్దు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. 23న నిత్యకల్యాణం రద్దు చేస్తున్నామని, ఉదయం బ్రేక్ దర్శనాలు కూడా ఉండవన్నారు. 17న ఆలయాన్ని శుద్ధి చేయనున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల వరకు దర్శనాలు ఉండవన్నారు.





బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క నృత్యం చేశారు

రేవంత్ పాలనలో గిరిజనులు అనాథలయ్యారు

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- తెలంగాణ భవన్‌లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు



తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ జయంతి వేడుకలో సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత తదితరులు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో గిరిజనులు అనాథలుగా మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి నిధుల కేటాయింపులు కూడా ఆశించిన మేర లేవన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం గిరిజనుల ఆరాధ్య దైవం మహావీర్ శ్రీసంత్ సేవాలాల్ జయంతి వేడుకలు జరిగాయి. సత్యవతి రాథోడ్‌తో పాటు మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు. పోడు భూముల రైతుబంధు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు తదితరాలు కేసీఆర్ పాలనలోనే సాధ్యమయ్యాయన్నారు. సీఎం రేవంత్‌కు దమ్ముంటే గవర్నర్ కోటాలో గిరిజనులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సత్యవతి రాథోడ్ సవాలు చేశారు. రేవంత్ రెడ్డి అధికారం తెచ్చిన అహంకారంతో మాట్లాడుతున్నారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. వేడుకల్లో భాగంగా సేవాలాల్ మహారాజ్‌కు గిరిజన సాంప్రదాయం ప్రకారం 'భోగ్ భండార్'సమర్పించారు.

ఎంఎన్‌జే ఆసుపత్రిలో 'నాన్‌లోకల్' రగడ

- ఏపీకి అలాట్ అయిన ప్రొఫెసర్‌కు ఉన్నత హోదా
- ఆరోగ్య శాఖకు లేఖ రాసిన ఎంఎన్‌జే ప్రొఫెసర్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజనలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినప్పటికీ... ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలోనే ఏడేళ్లుగా కొనసాగుతున్న ఓ ప్రొఫెసర్‌కు ఏకంగా ఉన్నతస్థాయి హోదా కల్పించడం విమర్శలకు దారితీస్తోంది. విభజన చట్టం నిబంధనలను తుంగలో తొక్కి నియామకాలు చేయడం ఏంటని ఆసుపత్రిలోని ప్రొఫెసర్లు మండిపడుతున్నారు. దీనిపై రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి ఆరుగురు ప్రొఫెసర్లు లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఒక డాక్టర్ ఏపీకి ఆప్షన్ ఇవ్వగా, ఆమేరకు కేంద్ర ప్రభుత్వం ఆయనను ఏపీకి కేటాయించింది. అయితే ఏపీలో తన కేడర్‌కు సమాన హోదా గల పోస్టు లేదని సదరు ప్రొఫెసర్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు సదరు డాక్టర్ అభ్యర్థనను పరిశీలించాలని కేంద్రానికి సూచిస్తూ మూడు నెలల్లోగా తగిన ఉత్తర్వులు ఇవ్వాలని, అప్పటివరకు యథాతథ స్థానంలో కొనసాగించాలని ఆదేశించింది. తరువాత ప్రభుత్వస్థాయిలో జరిగిన సర్దుబాట్లలో భాగంగా ఎంఎన్‌జే హాస్పిటల్‌లోనే సర్జికల్ ప్రొఫెసర్‌గా కొనసాగుతూ వచ్చారు. గత ఏడాది ప్రభుత్వం ఆయనకు అదే ఆసుపత్రిలో కీలక పోస్టు కట్టబెట్టడంతో మిగతా ప్రొఫెసర్లు విస్తుపోయారు. ఏపీకి కేటాయించిన ప్రొఫెసర్ నిబంధనలకు విరుద్ధంగా ఏడెనిమిదేళ్లుగా తెలంగాణలో విధులు నిర్వర్తిస్తుంటే, ఆ తప్పును సవరించకుండా ఏకంగా ఉన్నతస్థాయి హోదా కట్టబెట్టడం ఏంటని ప్రశ్నించారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

సర్కార్‌పై భారమని వినతి

ఏపీలో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 63 సంవత్సరాలు కాగా, తెలంగాణలో 65గా ఉంది. ఏపీకి కేటాయించిన ప్రొఫెసర్ వయసు 63 దాటింది. అంటే ఏపీలో రిటైర్ కావాల్సిన వ్యక్తి. ఆయనను ఇక్కడే కొనసాగిస్తుండటంతో 65 ఏళ్ల వరకు జీతభత్యాలతోపాటు రిటైర్‌మెంట్ తరువాత బెనిఫిట్స్ కూడా ప్రభుత్వమే ఇచ్చుకోవాల్సి ఉంటుందని ప్రొఫెసర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.



ఆహా.. ఏమి టీ

ఖమ్మంలో స్వయం సహాయక సంఘాల 'స్త్రీ టీ క్యాంటీన్లు'

- మహిళలకు శిక్షణ, యూనిట్ల కేటాయింపు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో ముందడుగు
- విజయవంతంగా నడుస్తున్న 22 క్యాంటీన్లు
- మరో 300 యూనిట్ల ఏర్పాటుకు కార్యాచరణ
- ఒక్కో క్యాంటీన్‌కు బ్యాంకు లింకేజీతో రూ.1.5 లక్షల రుణం

రోజూ ఇంట్లో పొద్దున్నే చాయ్ చేసి కుటుంబసభ్యులకు అందించే చేతులు.. ఇప్పుడు అదే చాయ్‌తో, అదే కుటుంబానికి ఆదాయాన్ని అందిస్తున్నాయి. స్వయం ఉపాధితో పాటు మరొకరికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో స్త్రీ టీ క్యాంటీన్లు నడుపుతున్న మహిళల విజయ ప్రస్థానమిది. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో ఏర్పాటైన ఈ క్యాంటీన్లు విజయవంతంగా నడుస్తున్నాయి. దీంతో మరికొన్ని క్యాంటీన్ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధమవుతోంది.

సాక్షి ప్రతినిధి, ఖమ్మం

ఉపాధి కల్పనే లక్ష్యం

స్వయం సహాయక సంఘాల మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గం చూపించాలని భావించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్.. అందుకోసం వారితో టీ క్యాంటీన్లు ఏర్పాటు చేయించాలని సంకల్పించారు. అందుకోసం అన్ని శాఖల అధికారులతో చర్చించి ముందుడుగు వేశారు. టీ క్యాంటీన్‌కు ప్రత్యేక లోగో, బ్రాండ్ తయారు చేయించారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మొదటి విడతలో జిల్లాలో 41 షాపులు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. తొలి షాపును కలెక్టరేట్ వద్దే ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలోని క్యాంటీన్ ఆదాయంతో పోలీస్తే గేటు బయట ఏర్పాటైన స్త్రీ టీ క్యాంటీన్‌కు రెట్టింపు ఆదాయం వస్తుండటంతో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 10, మండలాల్లో మరో 30కి పైగా మంజూరు చేశారు. ప్రస్తుతం 22 టీ క్యాంటీన్లను నడుస్తున్నాయి. మొత్తం 300 వరకు స్త్రీ టీ క్యాంటీన్లు ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటి ఏర్పాటుకు బ్యాంకు లింకేజీతో సంఘం తరఫున రూ.1.5 లక్షల వరకు రుణం అందిస్తున్నారు. సంఘంలోని మహిళలందరికీ ఒకటే కాకుండా అర్హత, ఆసక్తిని బట్టి ఒక్కొక్కరికి ఒక క్యాంటీన్ కేటాయిస్తున్నారు.



ఖమ్మం రూరల్ మండలం తరుణీహాట్ సమీపాన స్త్రీ టీ క్యాంటీన్ వద్ద స్థానికులు

నిరంతరం పర్యవేక్షణ...

స్త్రీ టీ క్యాంటీన్ మంజూరు చేసే సమయంలో లబ్ధిదారులు గతంలో ఏదైనా వ్యాపారం చేశారా లేదా? అన్నది పరిగణనలోకి తీసుకున్నారు. యూనిట్ కేటాయించాక ఏ మేరకు లాభాలుంటాయనే అంశంపై రెండు నెలలపాటు మండల, జిల్లా సమాఖ్యల్లో చర్చించారు. చట్టాలు, పన్నుల చెల్లింపు, వ్యాపార నిర్వహణపై 400 మంది మహిళలకు హైదరాబాద్‌కు చెందిన నిపుణులతో శిక్షణ ఇప్పించారు. ఆపై రద్దీ ప్రాంతాలను గుర్తించి క్యాంటీన్లు ఏర్పాటుచేయించారు. అంతటితో వదిలేయకుండా మూడు నెలలపాటు వాటి నిర్వహణ, లాభాలను పరిశీలిస్తున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఈ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. యూనిట్లలో దివ్యాంగులకు 25 శాతం కేటాయించారు. టీతోపాటు కూల్‌డ్రింక్స్, ఇతరత్రా కలిపి కాస్త పెద్ద యూనిట్లు కూడా ఏర్పాటుచేయించాలని నిర్ణయించారు. ఇవి ఖమ్మం కార్పొరేషన్‌లో మూడు, మండలాల్లో 10 వరకు ఏర్పాటు కానున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక ఇవి గ్రౌండ్ అవుతాయి. పదేళ్ల తర్వాత కూడా కొనసాగాలనే సంకల్పంతో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఇంకొకరికి ఉపాధి



గ్రామంలో మాకు టీ స్టాల్ ఉన్నా పెద్దగా ఆదాయం ఉండేది కాదు. కలెక్టర్ ఇచ్చిన అవకాశంతో కలెక్టరేట్ వద్ద టీ స్టాల్ పెట్టాను. ఇప్పుడు మరొకరికి ఉపాధి కల్పిస్తున్నా. నెలకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తుండగా, రూ.10 వేలు మిగులుతున్నాయి.

– పోతగాని రాజేశ్వరి, స్త్రీ టీ క్యాంటీన్ ఓనర్, కలెక్టరేట్ బస్టాప్, ఖమ్మం.

స్వయం ఉపాధి లభించింది..



మా స్త్రీ టీ క్యాంటీన్ గతనెల 4న ప్రారంభమైంది. ప్రస్తుతం టీ, కాఫీ, అల్లం టీ అమ్ముతున్నాం. కరెంట్ సౌకర్యం రాగానే పాలు, పెరుగు కూడా అమ్ముతాం. రోజురోజుకు వ్యాపారం పుంజుకుంటోంది. మొదటి నెల రూ.50 వేలు వచ్చింది. రుణ కిస్తీ చెల్లించగా.. కొంత మిగులుతోంది.

– శ్రీరంగం గీత, జలగం నగర్, నవ్య గ్రామసమాఖ్య.

మహిళల ఆర్థిక ఎదుగుదల కోసమే..



మహిళలు స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో స్త్రీ టీ క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. ప్రభుత్వం తరఫున యూనిట్ గ్రౌండింగ్ చేశాం కదా అని వదిలేయకుండా స్థల గుర్తింపు, ఏమేం అమ్మాలి, నాణ్యతపై క్షుణ్ణంగా చర్చించి, శిక్షణ ఇప్పించాకే ముందడుగు వేశాం. యూనిట్ ఏర్పాటయ్యాక నిత్యం పరిశీలిస్తూ ఏళ్ల తరబడి కొనసాగేలా చూస్తున్నాం.

– ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్, ఖమ్మం.

మహదేవపూర్ అడవుల్లోకి మళ్లీ పులి!

- నస్తూర్‌పల్లిలో పాదముద్రల గుర్తింపు
- మహదేవపూర్ అడవుల్లో ఆవాసంకోసం యత్నం
- ప్రత్యేక బృందాలతో అన్వేషిస్తున్న అటవీశాఖ.. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన



పులి జాడకోసం అన్వేషిస్తున్న అటవీ సిబ్బంది


కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ అడవుల్లోకి మళ్లీ పులి వచ్చిందనే సమాచారంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ అడవుల్లో తన ఆవాసం ఏర్పాటు చేసుకోవడానికి ఆరు రోజులుగా పులి కాటారం, మహదేవపూర్ ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు తెలియడంతో ఆ రెండు రేంజ్‌ల పరిధిలో ప్రత్యేక బృందాలతో అన్వేషిస్తున్నారు. నస్తూర్‌పల్లి వద్ద పులి అడుగులు కనిపించడంతో అక్కడి నుంచి గూడూరు, వీరాపూర్ వరకు పరిశీలిస్తూ వెళ్లగా ఆచూకీ లభించలేదు. అడవిలో అక్కడక్కడా ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేసినా.. ఎక్కడా చిక్కలేదు. అయితే, శనివారం మహదేవపూర్ మండలం కుదురుపల్లి సమీపంలో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పులి కనిపించినట్లు రోడ్డుమీద వెళ్తున్న వాహనదారులు అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. దట్టమైన అడవి కావడంతో పాటు తాగునీటి వసతి ఉండటంతో పులి ఇక్కడ ఆవాసం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పశువుల కాపరులు ఆ ప్రాంతాలకు వెళ్లొద్దని, రైతులు వంటచెరుకు కోసం రావొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మహదేవపూర్ అడవుల్లో ఎక్కువ సంఖ్యలో ట్రాకింగ్ కెమెరాలు అమర్చితే పులి జాడ తెలుస్తుందని భావిస్తున్నారు. కుదురుపల్లి నుంచి కాటారం, అన్నారం ప్రాంతాల్లో అడవులు దట్టంగా వ్యాపించి ఉన్నాయి. చిన్నచిన్న వాగులతో నీటి వసతి కూడా ఉంది. దీంతో పులి రోజుకు 20-25 కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఈ విషయమై అటవీశాఖ రేంజ్ అధికారి రవిని సంప్రదించగా కుదురుపల్లి వద్ద పులి కనిపించినట్లు వాహనదారులు తెలిపారని, దీంతో ఆదిలాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక యానిమల్ ట్రాకింగ్ టీం పగ్‌మార్క్‌లను పరిశోధిస్తోందని వివరించారు. గతంలో ఈ ప్రాంతంలో సంచరించిన కే-8 పులి మళ్లీ వచ్చిందా? లేక మరేదైనా కొత్త పులా అనేది తెలియాల్సి ఉందని అధికారులు చెపుతున్నారు.

భారత్‌కు మెటా 'ప్రాజెక్ట్ వాటర్‌వర్త్'

సముద్ర కేబుల్స్ ద్వారా అనుసంధానం

50,000 కిలోమీటర్ల మేర కేబుల్ లైన్స్

డిజిటల్ కనెక్టివిటీని పెంచడమే లక్ష్యం



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా డిజిటల్ కనెక్టివిటీని పెంచేందుకు సోషల్ మీడియా దిగ్గజం మెటా సాహసోపేత కార్యక్రమానికి నడుం బిగించింది. ప్రపంచంలోనే అతి పొడవైన సముద్రగర్భ కేబుల్ ప్రాజెక్ట్ 'ప్రాజెక్ట్ వాటర్‌వర్త్'కు శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టులో భాగంగా ఈ దశాబ్దం చివరి నాటికి ఈ ప్రాజెక్టుతో భారత్‌ను అనుసంధానించనున్నట్టు మెటా శనివారం ప్రకటించింది. కంపెనీకి అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా భారత్‌ను ఈ సందర్భంగా అభివర్ణించింది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే భారత్ ప్రపంచ డిజిటల్ హబ్‌గా అవతరిస్తుంది. ఈ ప్రాజెక్ట్ కోసం ఎంత మొత్తం వ్యయం కానుందనేది కంపెనీ వెల్లడించలేదు.

భూమి చుట్టు కొలత కంటే ఎక్కువ

ప్రాజెక్ట్ వాటర్‌వర్త్‌లో భాగంగా ఐదు ప్రధాన ఖండాలను కలుపుతూ 50,000 కిలోమీటర్ల దూరం సముద్ర గర్భంలో కేబుల్స్ వేస్తారు. ఇది భూమి చుట్టు కొలత కంటే ఎక్కువ. సముద్రంలో 7,000 మీటర్ల లోతు వరకు ఈ కేబుల్స్ వేస్తారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా 13న విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ ప్రాజెక్ట్‌ను కూడా చేర్చారు. నమ్మకమైన సంస్థల సహకారంతో హిందూ మహాసముద్రంలో సముద్రగర్భ కేబుల్స్ నిర్వహణ, మరమ్మతు, రుణం సమకూర్చాలని భారత్ భావిస్తోంది.

అధునాతన సాంకేతికతతో..

'మెటా తన అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన భారత దేశంలో పెట్టుబడులు పెడుతోంది. భారత్, అమెరికా ఇతర ప్రదేశాలను అనుసంధానించడానికి ప్రపంచంలోనే అతి పొడవైన, అత్యధిక సామర్థ్యం, సాంకేతికంగా అధునాతనమైన సముద్ర కేబుల్ ప్రాజెక్ట్‌ను చేపట్టింది' అని మెటా ప్రతినిధి శనివారం తెలిపారు. ఇంటర్నెట్ కార్యకలాపాలకు సముద్రగర్భ కేబుల్స్ ముఖ్యమైనవి. ఈ కేబుల్స్ వివిధ దేశాలను అనుసంధానిస్తాయి. స్థానిక టెలికం కంపెనీలు తమ వినియోగదారులకు ఇంటర్నెట్ సదుపాయాన్ని అందించడానికి సముద్రగర్భ కేబుల్స్‌తో కనెక్ట్ అవుతాయి. 'భారత్‌లో డిజిటల్ సేవలకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ పెట్టుబడి ఆర్థిక వృద్ధి, స్థిర మౌలిక సదుపాయాలు, అందరికీ డిజిటల్ సేవలు అందాలన్న మెటా నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. భారత్‌లో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది' అని మెటా ప్రతినిధి వివరించారు.

ఆన్‌లైన్ కోచింగ్‌లకు బీఐఎస్?

- మెటీరియల్ నాణ్యత, ఫ్యాకల్టీ ప్రమాణాలు పెంచేందుకు కేంద్రం కసరత్తు
- కోచింగ్ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లకు వర్తింపు



సాక్షి, హైదరాబాద్: కరోనా మహమ్మారి అనంతరం డిజిటల్ ఎడ్యుకేషన్‌పై ఆధారపడటం బాగా పెరిగింది. హోం ట్యూషన్లు మొదలు సివిల్స్ కోచింగ్ వరకు అంతా వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లలో ఆన్‌లైన్ కోచింగ్‌లు సర్వసాధారణంగా మారాయి. అయితే, ఒక్కో కోచింగ్ సెంటర్ ఒక్కో తరహా మెటీరియల్‌ను తమ ఇష్టానుసారంగా తయారు చేసి వినియోగదారులకు అందిస్తోంది. ఆన్‌లైన్‌లో కోచింగ్ క్లాస్‌లు తీసుకునే ఫ్యాకల్టీ విద్యార్హతలపైనా ఎక్కడా పెద్దగా పట్టింపు లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆన్‌లైన్ కోచింగ్ సెంటర్లకు, వారు ఇచ్చే మెటీరియల్ నాణ్యత, ఫ్యాకల్టీ నిపుణత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)ను రంగంలోకి దించేందుకు కేంద్ర విద్యాశాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఆన్‌లైన్ కోచింగ్ తీసుకునే విద్యార్థులను సైతం వినియోగదారులుగా పరిగణిస్తూ బోధనతోపాటు ప్రొఫెషనల్ కంటెంట్ తయారీలోనూ నాణ్యత పెంచడమే ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. బీఐఎస్ మార్క్ తీసుకురావడం వల్ల ఆన్‌లైన్‌లో విద్యాప్రమాణాలు మెరుగయ్యే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు సైతం ఆన్‌లైన్ కోచింగ్ సెంటర్ల ద్వారా పొందే స్టడీ మెటీరియల్ తగిన విధంగా ఉండేలా యాజమాన్యం సైతం జాగ్రత్తలు తీసుకుంటుందని పేర్కొంటున్నారు. నానాటికీ ఆన్‌లైన్ కోచింగ్ సెంటర్లు, క్లాసుల ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో వెబ్‌సైట్లతోపాటు మొబైల్ యాప్‌లకు ఇది వర్తింపజేయనున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల కోచింగ్ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌ల యాజమాన్యాల్లో జవాబుదారీతనం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆన్‌లైన్ విద్యలో ప్రమాణాలు పెంచాల్సిన అవసరం చాలా ఉందని విద్యావేత్త, ఎన్‌సీఈఆర్టీ మాజీ డైరెక్టర్ జేఎస్ రాజ్‌పుత్ అభిప్రాయపడ్డారు.

మార్గదర్శకాలు కావాలి

నాణ్యత లేని కంటెంట్, బలహీనమైన డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు విద్యార్థులకు సరైన విద్యను అందించలేవు. అందుకే ఆన్‌లైన్ విద్యలో నాణ్యతను పెంచడానికి స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం.

-అభాష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఢిల్లీ యూనివర్సిటీ

భారత ఇ-లెర్నింగ్ మార్కెట్ విలువ (రూ.లలో)

2023లో: 88 వేల కోట్లు

2029 నాటికి: 2.46 లక్షల కోట్లు (అంచనా)

(అరిజ్టన్ అడ్వైజరీ సంస్థ నివేదిక)

కస్టమ్స్ సేవలు అత్యంత కీలకం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. శామ్ కోషి



సాక్షి, హైదరాబాద్: అక్రమ వాణిజ్యాన్ని నిరోధించడంలో, జాతీయ ఆర్థిక వ్యవస్థను రక్షించడంలో, సజావుగా అంతర్జాతీయ లావాదేవీలను నిర్ధారించడంలో కస్టమ్స్ అధికారులది కీలకపాత్ర అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శామ్ కోషి అన్నారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం-2025 వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సరిహద్దు వాణిజ్యాన్ని పర్యవేక్షించడంలో, నిబంధనలను అమలు చేయడంలో, ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడంలో కస్టమ్స్ ఏజెన్సీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సమర్థత, భద్రత, శ్రేయస్సుకు దాని నిబద్ధతపై కస్టమ్స్ డెలివరీ' అనే ఇతివృత్తంతో ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లోని దాశరథి ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కస్టమ్స్ శాఖలోని మెరిటోరియస్ అధికారులకు, తెలంగాణ అగ్ర ఎగుమతిదారులు, దిగుమతిదారులకు మెరిట్ సర్టిఫికెట్లను జస్టిస్ శామ్ కోషి ప్రదానం చేశారు. హైదరాబాద్ కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ అజాజుద్దీన్, స్వాగత ప్రసంగం, హైదరాబాద్ జోన్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్ ముఖ్య ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో అతిథులుగా డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ సహ-చైర్మన్, ఎండీ జి.వి.ప్రసాద్, జీఎంఆర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.ప్రసన్న పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి దిగుమతిదారులు, ఎగుమతిదారులు, కస్టమ్స్ బ్రోకర్లు, విమానాశ్రయాల సంరక్షకులు, అనేక ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

అక్కడే చదువు.. అక్కడే కొలువు



చదువుకున్న పాఠశాల, కళాశాలల్లోనే టీచర్లుగా పనిచేసే అదృష్టం కొందరికే దక్కుతుంది. అలాంటి అరుదైన అవకాశం పొందారు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థిని బిల్లకంటి ప్రసూనాదేవి. తెలుగు లెక్చరర్ అయిన ఆమెది మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామం. ఆమె రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1990-92 మధ్య ఎంపీసీ గ్రూపులో ఇంటర్ పూర్తి చేశారు. 2000 సంవత్సరంలో ఏపీఎస్ ఆర్టీసీలో కొద్దిరోజులు కండక్టర్‌గా పనిచేశారు. 2008 డీఎస్సీ ద్వారా తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి దుప్పెల్లి, పాటిమట్ల ఉన్నత పాఠశాలల్లో పని చేశారు. 2012లో తెలుగు జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం తాను చదువుకున్న కాలేజీలోనే లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఈ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్ బి.సంజీవ జనవరి 31న ఉద్యోగ విరమణ చేయటంతో, ఆ స్థానంలో ప్రసూనాదేవిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఆర్‌జేడీ బి.జయప్రద శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తాను చదువుకున్న కళాశాలలోనే లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా పనిచేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సహచర అధ్యాపకులు, తల్లిదండ్రుల సహకారంతో కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు.

-రామన్నపేట

లైవ్ ఆర్ట్.. 'పోచం' రికార్డ్



మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన ఏల్పుల పోచం అరుదైన రికార్డు నెలకొల్పాడు. దేశవ్యాప్తంగా లైవ్ డ్రాయింగ్ ప్రదర్శనలు నిర్వహించిన తొలి తెలంగాణ వ్యక్తిగా రికార్డు సొంతం చేసుకున్నాడు. ఇప్పటికే ఎన్నో అవార్డులు పొందిన ఆయన.. శనివారం హరియాణాలోని ఫరీదాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అధికారికంగా స్థానం సంపాదించారు. పోచం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఏడేళ్లపాటు నిర్వహించిన కళాయాత్రకు అరుదైన గౌరవం దక్కింది. దేశవ్యాప్తంగా లైవ్ డ్రాయింగ్‌ను పరిచయం చేయాలని సంకల్పించిన పోచం.. 2017లో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్ర ప్రారంభించారు. 28 రాష్ట్రాల్లో 13 వేలకుపైగా చిత్రాలు గీశాడు. ఆయా రాష్ట్రాల సంస్కృతులకు అద్దంపట్టే చిత్రాలను గీసి ప్రశంసలు అందుకున్నాడు. 2024, జూన్ 7న యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. పోచం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకోవడంపై ఆయన గురువు మద్దూరి రాజుయాదవ్, మిత్ర బృందం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో పోచం లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ప్రెస్టీజియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డులు కూడా అందుకున్నాడు.

-చెన్నూర్

అంధత్వమున్నా.. అర్థశాస్త్రంలో పీహెచ్‌డీ



పుట్టుకతోనే చూపు లేదు. పైగా పేదరికం. అయితేనేం.. ఆ వ్యక్తి సంకల్పం ముందు వైకల్యం కూడా తల వంచింది. పుట్టుకతోనే అంధుడైన జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన మత్స్యకారులు అన్నెపు లక్ష్మి, సోమయ్య కుమారుడు యాకన్న అకుంఠిత దీక్షతో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి అర్థశాస్త్రంలో పీహెచ్‌డీ సాధించాడు. యాకన్న ఇంటర్ వరకు స్వగ్రామంలో, డిగ్రీ జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, అర్థశాస్త్రంలో పీజీ ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో పూర్తి చేశాడు. యూజీసీ నెట్‌లో అర్హత సాధించి ఓయూలోని అర్థశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ ఎం.రాములు పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశారు. 'యాన్ ఇంపాక్ట్ ఆఫ్ మిషన్ కాకతీయ ఆన్ గ్రోత్ ఆఫ్ అగ్రికల్చర్ సెక్టార్ ఇన్ తెలంగాణ స్టేట్: ఏ కేస్ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై అతడు చేసిన పరిశోధనకు వర్సిటీ ఇటీవల డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా యాకన్న మాట్లాడుతూ.. పేదరికం, వైకల్యం చదువుకు అడ్డుకాదని, రాజ్యాంగం ప్రసాదించిన ఫలాలను అందిపుచ్చుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించాడు. తన తల్లిదండ్రులు, గురువుల సహకారంతోనే పీహెచ్‌డీ విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపాడు.

– దేవరుప్పుల

అద్వైత్.. 'మెమొరీ'లో అద్భుతః



స్పెయిన్ దేశస్తురాలి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అద్వైత్

వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన వండర్ కిడ్ అద్వైత్‌రాజ్ మరో అరుదైన రికార్డు సాధించాడు. నాలుగున్నరేళ్ల అద్వైత్‌రాజ్ అద్భుతమైన జ్ఞాపకశక్తితో 5 నిమిషాల్లోనే 195 దేశాల పేర్లు, వాటి రాజధానుల పేర్లు చెప్పేస్తూ అబ్బురపరుస్తున్నాడు. ఒక్క నిమిషంలో రసాయన శాస్త్రంలోని 118 ఆవర్తన మూలకాల పేర్లు చెప్పాడు. దీంతో అతడికి 2025 సంవత్సరానికి బెస్ట్ మెమొరీ కిడ్ అవార్డు లభించింది. శనివారం ఢిల్లీలోని ఫరీదాబాద్‌లోని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ మెయిన్ బ్రాంచ్‌లో జరిగిన సమావేశంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. అతడు జనవరిలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా చోటు సాధించాడు. అద్భుత జ్ఞాపకశక్తి, విజ్ఞాన నైపుణ్యాలు కలిగిన అద్వైత్‌ను 8 దేశాల నుంచి వచ్చిన పరిశీలకులు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఈ అవార్డు అందజేశారు. చిన్న వయస్సులోనే తెలంగాణ రాష్ట్రం నుంచి అద్వైత్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించటంపై అతడి తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

– సంగెం

'రైల్వే స్టేషన్'లోకి దారేదీ?

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఎటు చూసినా గందరగోళం
- ఆధునీకరణ నేపథ్యంలో ప్రవేశ ద్వారాల మూసివేత
- సూచికలు లేక ఇబ్బందిపడుతున్నామన్న ప్రయాణికులు

సికింద్రాబాద్ (హైదరాబాద్): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. జనరల్ బోగీల్లో ప్రయాణించే వేలాది మంది బండెడు లగేజీ మోసుకుంటూ.. పిల్లల్ని భుజాన వేసుకుని రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించడం, స్టేషన్ నుంచి బయటికి రావడం కోసం నానా అగచాట్లు పడుతున్నారు. ఆధునీకరణ కోసం రెండు ప్రధాన ద్వారాలను బారికేడ్లతో మూసివేసిన రైల్వే అధికారులు.. అందుబాటులో ఉన్న మార్గాలు ఎక్కడి నుంచి ఉన్నాయో చెప్పే ఏర్పాట్లు చేయలేదు. లిఫ్టులు, ఎస్కలేటర్లు తొలగించారు. దీనితో స్టేషన్ లోపలికి వెళ్లడం, బయటికి రావడం కోసం అవస్థల పాలవుతున్నారు. ఇక రైల్వేస్టేషన్ ప్రవేశద్వారాల ముందు బారికేడ్లు ఉండటం, ఉన్న కాస్త స్థలంలో ప్రయాణీకుల కోసం వచ్చే వాహనాలతో ఇబ్బంది ఎదురవుతోంది.

కనీ కనిపించకుండా.. : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 2, 4 నంబర్ ప్రవేశద్వారాలను మూసివేసిన అధికారులు.. ప్రయాణీకుల రాకపోకల కోసం 3, 5 నంబర్ ద్వారాలను అందుబాటులో ఉంచారు. ఇందులో 3వ నంబర్ ద్వారం ఓ మోస్తరు విశాలంగా ఉండగా, పార్శిల్ కార్యాలయం పక్కన ఉన్న 5వ నంబర్ ద్వారం ఇరుకుగా ఉండి ఇబ్బంది రెట్టింపు అవుతోంది. మరోవైపు ప్లాట్ ఫామ్‌లపై సేదతీరే అవకాశం లేక ప్రయాణికులు గంటల తరబడి స్టేషన్‌కు ముందు తాత్కాలిక జనరల్ బుకింగ్ కార్యాలయం వద్ద ఇరుకైన ప్రదేశంలో పడిగాపులు కాస్తున్నారు.



ఎలా వెళ్లాలో చెప్పేవారు లేరు..

రైలు వచ్చే కొంత సమయం ముందు మాత్రమే లోనికి అనుమతిస్తున్నారు. జనరల్ బుకింగ్ కార్యాలయం ముందు ఇరుకైన స్థలంలోనే గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. స్టేషన్ ముందు తాగునీరు, టాయిలెట్ల వసతి లేదు. ఎక్కడి నుంచి స్టేషన్ లోనికి వెళ్లాలో సూచించేవారు లేరు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– సుజన్, ప్రయాణికుడు

ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపే.. : సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చే రైళ్లలో రాకపోకలు సాగించే లక్షన్నర మంది ప్రయాణికుల్లో 70శాతం మంది 1వ నంబర్ ప్లాట్‌ఫామ్ మీదుగానే స్టేషన్‌లోకి, బయటికి వెళ్తుంటారు. పదో నంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి రాకపోకలు సాగించే అవకాశమున్నా.. సరిగా రవాణా సదుపాయాలు లేక వెళ్లడం లేదు.

నల్సార్‌లో మిలోన్ కె. ఆర్బిట్రేషన్ సెంటర్ ప్రారంభం



శామీర్‌పేట్: నల్సార్ లా యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో మిలోన్ కె. బెనర్జీ ఆర్బిట్రేషన్ సెంటర్ (ఎంకేబీఏసీ)ను శనివారం ప్రారంభించారు. ఎంకేబీఏసీ చైర్ పర్సన్‌గా పనిచేస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రోహింటన్ ఫాలి నారిమన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత అటార్నీ జనరల్‌గా పనిచేసిన న్యాయనిపుణుడు మిలోన్ బెనర్జీ కుమారుడు గౌరబ్ బెనర్జీ ఇచ్చిన విరాళంతో ఈ కేంద్రాన్ని స్థాపించారని చెప్పారు. ఈ సెంటర్ ఆర్బిట్రేషన్‌పై పరిశోధన, శిక్షణకు కేంద్రంగా ఉంటుందని నల్సార్ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు పేర్కొన్నారు.

హామ్ విధానంలో రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం, నిర్వహణను హైబ్రిడ్ అన్యూటీ మోడ్ (హెచ్‌ఏఎం-హామ్) విధానంలో చేపట్టనున్నారు. రాబోయే మూడేళ్లలో రూ.25 వేల కోట్ల ఖర్చుతో రహదారి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మార్చి 15న హామ్ విధానంలో రోడ్ల మరమ్మతు పనులు చేపట్టేందుకు ముమ్మర కసరత్తులు పూర్తయ్యాక ఈ విధానం ద్వారా పనులు ప్రారంభిస్తారు. రాష్ట్రంలోని చాలా వరకు రోడ్లు 30 టన్నుల సామర్థ్యం గల వాహనాలు వెళ్లేందుకు అనువుగా లేకపోవడంతో ఇందుకు తగ్గట్టుగా రహదారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా తీర్చిదిద్దే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో 5 వేల కి.మీ గ్రామీణ రహదారుల నిర్మాణానికి హామ్ విధానంలో టెండర్లు వేసేలా పీఆర్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మొత్తంగా వచ్చే మూడేళ్లలో హామ్ విధానంలో 12 వేల కి.మీ మేర రహదారుల నిర్మాణం చేపట్టేలా లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ఈ విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వమే బ్యాంకు గ్యారంటీ ఇవ్వడం ద్వారా కాంట్రాక్టర్లకు నిధులు సమకూరనున్నాయి. ఈ రుణాలను 10 నుంచి 15 ఏళ్ల వ్యవధిలో బ్యాంకులకు ప్రభుత్వం తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోనున్నారు. నిర్మాణ సంస్థకే పదేళ్ల పాటు రహదారుల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. గ్రామీణ రహదారి వ్యవస్థ బలోపేతం కోసం హామ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు పీఆర్‌ఆర్‌డీ అధికారులు తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

రాజాబావి.. రాజసం ఏదీ?



కాకతీయుల కాలంలోని అద్భుతమైన నిర్మాణం

బావి చుట్టూ గదులు కూడా..

సొరంగమార్గం ద్వారా రాకపోకలు కొనసాగేవని ప్రచారం

చారిత్రక సంపద పరిరక్షణపై అధికారుల నిర్లక్ష్యం

జూలూరుపాడు: సుమారు ఏడు శతాబ్దాల క్రితం కాకతీయ రాజులు నిర్మించిన చారిత్రక కట్టడం కనుమరుగవుతోంది. కాకతీయుల కాలంలో తాగు నీటి అవసరాలు, శత్రు సైన్యాల నుంచి తమను రక్షించుకోవడానికి దట్టమైన అడవి ఉన్న జూలూరుపాడు ప్రాంతంలో రాజాబావిని రాతికట్టడంతో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. సువిశాలమైన రాజాబావికి రెండు వైపులా నివాసం కోసం గదులు నిర్మించి ఉంటారని తెలుస్తోంది. ఈ బావి పైభాగాన తూర్పు, పడమరకు ఎదురెదురుగా 10 గదులు నిర్మించారు. బావిలోకి దిగేందుకు 30 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పుతో రాళ్లతో మెట్లు నిర్మించారు. ఈ బావి చుట్టూ 8 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు గల పైకప్పు ఒకేరాయిలా కనిపిస్తోంది. పూడిక మట్టితో నిండిపోవడంతో బావి లోతు ఎంత అనేది తెలియడం లేదు. సున్నం, రాళ్లతో నిర్మించిన ఈ ప్రాచీన కట్టడం నేటికీ చెక్కు చెదరలేదు. అయితే, గుప్తనిధుల కోసం తవ్వకాలు, చెత్తాచెదారం పేరుకుపోవడం, బావిలో పూడిక పెరగడంతో నానాటికీ వైభవం కోల్పోతున్నా సంరక్షణపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



బావి చుట్టూ ఉన్న గదులు

దండయాత్రల నుంచి రక్షణకు..

శత్రువులు దండయాత్ర చేసినప్పుడు రక్షణ కోసం కాకతీయ రాజులు పలు ప్రాంతాల్లో సొరంగ మార్గాలు ఏర్పాటు చేసుకునేవారని చరిత్ర చెబుతోంది. ఇందులో భాగంగానే వివిధ ప్రాంతాల మీదుగా సొరంగ మార్గాల ద్వారా ఖమ్మం ఖిలాకు వచ్చేవారని, కాకతీయుల రాజధాని అయిన ఓరుగల్లు (వరంగల్)కోటకు, పాత ఖమ్మం జిల్లాలోని జూలూరుపాడు రాజుల బావి, భేతాళపాడు గుట్టలపై ఉన్న కోట వరకు వచ్చేవారని తెలుస్తోంది. జూలూరుపాడు నుంచి పాపకొల్లులోని పుట్టకోట, చంద్రుగొండ మండలం బెండాలపాడు గుట్టల్లో వెలిసిన శ్రీవీరభద్రస్వామి, కనగిరి గుట్టల్లోని ఆలయాలు, అప్పట్లో సైనికులు తలదాచుకునేందుకు ఏర్పాటు చేసిన కొన్ని స్థావరాలు నేటికీ కనిపిస్తాయి. అక్కడ ఉన్న సొరంగ మార్గాల ద్వారా శత్రువుల నుంచి రక్షణ పొందటంతోపాటు, శత్రువులపై మెరుపు దాడులు నిర్వహించేందుకు ఈ మార్గాలను ఉపయోగించుకునేవారు.



బావిలోకి దిగుడు మెట్లు

గుప్తనిధుల కోసం తవ్వకాలు..

కాకతీయ రాజులు వజ్ర వైఢూర్యాలు, బంగారు అభరణాలను ఈ బావిలో భద్రపరిచే వారని నమ్ముతుంటారు. బావిలో గుప్త నిధులు ఉన్నాయనే ప్రచారంతో ఏడేళ్ల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు బావి పైభాగాన ఉన్న గదుల్లో తవ్వకాలు జరిపారు. ఈ క్రమంలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కనిపించినా అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో చారిత్రక కట్టడం ధ్వంసానికి గురవడంతో బావి ఆనవాళ్లు భావితరాలకు కన్పించకుండా పోయే పరిస్థితి ఏర్పడనుంది.

తగ్గని నీటిమట్టం..

బావి నీటిని గతంలో ఈ ప్రాంత వాసులు తాగునీటిగా ఉపయోగించేవారు. బావిలో నీటిమట్టం తరగకపోవడంతో, బావిలో ఏమైనా గుప్త నిధులు ఉన్నాయా అని తెలుసుకునేందుకు కొన్నేళ్ల క్రితం గ్రామస్తులు ఆయిల్ ఇంజిన్లు పెట్టి నీటిని 15 రోజుల పాటు పంటలకు వినియోగించినా నీటిమట్టం ఎంతమాత్రం తగ్గలేదు. దీంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. బావిలోకి దిగుడు మెట్లు, బావి చుట్టూ తిరగటానికి వీలుగా ప్లాట్‌ఫామ్ ఉన్నాయి. ఈ తరం ఇంజనీర్లకు సైతం అంతు చిక్కని అద్భుత సాంకేతిక నైపుణ్యంతో రాతిబావిని నిర్మించడం విశేషం. అలాంటి బావి పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి గురవుతూ పూడిక మట్టి, ముళ్ల పొదలతో నిండిపోయింది. బావి చుట్టూ ఉన్న స్థలం కూడా ఆక్రమణకు గురికావడంతో ముళ్ల పొదలు, చెట్లతో కళావిహీనంగా మారింది. చారిత్రక సంపద ధ్వంసం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రాజాబావి నీళ్లు తాగే వాళ్లం



40 ఏళ్ల క్రితం రాజాబావి నీళ్లు తాగే వాళ్లం. వేసవి కాలంలో కూడా నీళ్లు బాగా ఉండేవి. ఈ నీటిని పంటల సాగుకూ ఉపయోగించేవారు. ప్రస్తుతం పూడికతో నిండిపోవడంతో పాటు ముళ్ల పొదలు, చెట్లు పెరగడంతో అటువైపు ఎవరూ వెళ్లడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయాలి.

– చిన్నకేశి వెంకటేశ్వర్లు, జూలూరుపాడు

చారిత్రక కట్టడాన్ని కాపాడాలి



వందల ఏళ్ల నాటి చారిత్రక కట్టడం కనుమరుగు కాకుండా చూడాలి. రాజాబావి ధ్వంసమవుతుండటంతో భావితరాలకు కన్పించకుండాపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి చారిత్రక సంపదను రక్షించేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలి.

– తాళ్లూరి వెంకటేశ్వర్లు, జూలూరుపాడు

బావి అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



రాజాబావి అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి. కొన్ని దశాబ్దాలుగా అధికారులు పట్టించుకోకపోవడంతో ముళ్ల పొదలు, చెట్లతో నిండి కళావిహీనంగా మారింది. దీన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– నర్వనేని పుల్లారావు, జూలూరుపాడు

పురాతన సంపదను కాపాడతాం



కాకతీయుల కాలం నాటి పురాతన కట్టడమైన రాజా బావిని కాపాడుతాం. ఈ సమస్యను ఉన్నతాధికారులు, పర్యాటక శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. స్థానిక గ్రామ పంచాయతీ నుంచి ఏమైనా చేయవచ్చేమో పరిశీలిస్తాం. ముళ్ల పొదలు, చెట్లు తొలిగించి, పూర్వవైభవం వచ్చేలా చర్యలు చేపడతాం.

– డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ జూలూరుపాడు

గొర్రెల కాపరులకు ఎక్స్‌గ్రేషియా

సాక్షి, హైదరాబాద్‌: వివిధ ప్రమాదాల్లో చనిపోయిన ముగ్గురు గొర్రెల కాపరులకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఎండీ సుబ్బారాయుడు ఈ ఎక్స్‌గ్రేషియాను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ఎక్స్‌గ్రేషియా ఫైళ్లను త్వరితగతిన క్లియర్‌ చేయించి మంజూరు ఇచ్చామని, ఈ ప్రభుత్వ సాయాన్ని పిల్లల చదువు కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. ముగ్గురు గొర్రెల కాపరులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం పట్ల తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్‌ యాదవ్‌ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్‌ అధికారులు, జిల్లాల పశు వైద్య అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ప్రభుత్వంలో మాటలు తప్ప.. చేతలు లేవు: రాకేశ్‌కుమార్‌

సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం మాటలకే పరిమితమైంది తప్ప పేదలకు పథకాలు అందించే పని చేయడం లేదని బీఆర్‌ఎస్‌ నేత చిరుమళ్ల రాకేశ్‌కుమార్‌ ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్నాలుగు నెలల పాలనలో పింఛన్లు పెంచలేదని, రేషన్‌ కార్డులు ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికి మూడుసార్లు దరఖాస్తులు తీసుకున్నా.. ఒక్క రేషన్‌ కార్డు ఇవ్వలేదన్నారు. మోసపూరిత మాటలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదల బతుకుల్ని ఆగం చేస్తోందని రాకేశ్‌ మండిపడ్డారు. కేసీఆర్‌ హయాంలో 6 లక్షల 47 వేల రేషన్‌ కార్డులు జారీ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌ పార్టీ వచ్చిన తర్వాత తెలంగాణ రైజింగ్‌ కాదు.. తెలంగాణ డౌన్‌ ఫాల్‌ మొదలైందని ఆరోపించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ నాయకులు వెంకటేశ్వర్లు, కిశోర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

బీజేపీకి ముస్లింలంటే ఎందుకంత భయం?



సాక్షి, హైదరాబాద్‌: ముస్లింలంటే బీజేపీకి ఎందుకంత భయమని మాజీ ఎంపీ, సీనియర్‌ కాంగ్రెస్‌ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లింల పట్ల ద్వేషంగా మాట్లాడటాన్ని ఇప్పటికైనా బీజేపీ నేతలు విరమించుకోవాలని సూచించారు. దేశానికి కాంగ్రెస్‌ ఏం చేసిందని ప్రశ్నిస్తోన్న కిషన్‌రెడ్డి.. పదేళ్లలో బీజేపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్‌ చేశారు. దేశానికి స్వాతంత్య్రం కోసం ముస్లింలు కూడా ఉద్యమించారు కదా? అని వీహెచ్‌ ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ కులం బడుగు బలహీన వర్గాల కులమన్నారు. రాహుల్‌గాంధీ లైన్‌లోనే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన నిర్వహించారని చెప్పారు. అసలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన చేస్తారో లేదో తెలంగాణ బీజేపీ నేతలు స్పష్టం చేయాలని వీహెచ్‌ డిమాండ్‌ చేశారు.

అప్పుడే.. మామిడి పండ్లొచ్చేశాయ్‌!

వేసవి ఇంకా మొదలు కాకున్నా.. రాష్ట్రంలో మామిడి చెట్లకు పిందెలు కాస్తున్నాయి. ఖమ్మంలో.. ఏకంగా మామిడిపండ్లు అమ్ముతున్నారు!. అదేమిటని ఆరా తీస్తే కర్ణాటకలో ముందుగానే పంట చేతికొస్తుందని.. అక్కడి నుంచి తెప్పించి అమ్ముతున్నట్లు ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతానికి చెందిన ఒక వ్యాపారి చెప్పాడు. కేజీ రూ.250 చొప్పున అమ్ముతుండగా.. స్థానికులు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారని వెల్లడించాడు.

- స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్, ఖమ్మం





స్కానర్‌ కొట్టు.. కల్లు పట్టు

మారుతున్న కాలానికి అనుగుణంగా మారితేనే మనుగడ సాధ్యం.. మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లికి చెందిన గీత కార్మికుడు గంగపురపు వెంకన్న ఇందుకు నిదర్శనం. వెంకన్న వద్దకు కల్లు తాగడానికి వచ్చే వారిలో ఎక్కువ మందికి స్మార్ట్‌ ఫోన్‌ ఉంది. వెంకన్న వద్ద స్మార్ట్‌ ఫోన్‌ లేకపోవడంతో చెల్లింపులకు ఇబ్బంది ఏర్పడి.. గిరాకీ దెబ్బ తింది. దీంతో చేసేదిలేక వెంకన్న ఇటీవల తన బ్యాంక్‌ ఖాతాపై క్యూఆర్‌ కోడ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఇప్పుడు కల్లు ప్రియులంతా క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేసి.. డబ్బు చెల్లించి కల్లు తాగుతున్నారు.

-కేసముద్రం



యక్షగాన కళాకారుల భిక్షాటన

టీవీలు, స్మార్ట్‌ ఫోన్ల రాకతో వీధి నాటకాలు అంతరించిపోయాయి. నేటి తరానికి యక్షగానం అంటే తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆదరణ లేక యక్షగాన కళాకారులు.. బతుకు కోసం భువనగిరిలో భిక్షాటన చేస్తూ కనిపించారు.

–భువనగిరి టౌన్‌



గుమ్మి.. జ్ఞాపకాలు విరజిమ్మి

గ్యాస్‌ పొయ్యిలు వచ్చాక కట్టెల పొయ్యిల్ని మరిచిపోయారు. కానీ ఒకప్పుడు కట్టెల పొయ్యి వెలిగించి వంట చేయాలంటే.. కంకిబెండ్లు, పిడకలు, కట్టెలు.. సేకరించి.. ఇలా గుమ్మిలో దాచుకోవలసిందే. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనుకుల గ్రామ శివారులోని ఓ ఇంట్లోని గుమ్మిలో దాచిన కంకిబెండ్లు పాత జ్ఞాపకాలను ఇలా గుర్తు చేశాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

రెరా ఉన్నా.. ఆగని రియల్‌ మోసాలు



హైదరాబాద్, వరంగల్‌ మినహాయిస్తే 2020 వరకు అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో 112 మున్సిపాలిటీల్లో 3,167 ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలు

నిబంధనలు అతిక్రమించడంలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా టాప్‌

నిజామాబాద్‌ నగరానికి ఆనుకొని ఉన్న బైపాస్‌ రోడ్డులో రైల్వే లైన్‌ పక్కనే ఓ రియల్టర్‌ అక్రమంగా లేఅవుట్‌ వేశాడు. దీనికి మున్సిపల్, డీటీసీపీ అధికారులు అనుమతులు ఇచ్చారు. తీరా సదరు లేఅవుట్‌లో రైల్వేశాఖ రెండోలైన్‌ వేస్తోంది. ప్లాట్లు కొనుక్కున్న బాధితులు లబోదిబోమంటూ వెళ్లి అడిగితే... రైల్వేలైన్‌నే రాకుండా చేస్తానని సదరు రియల్టర్‌ మోసపూరిత మాటలు చెబుతున్నాడు. గట్టిగా ప్రశ్నిస్తే తనకేం సంబంధం లేదంటూ లెక్కలేకుండా మాట్లాడుతున్నాడు. ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: రాష్ట్రంలో పైసాపైసా కూడబెట్టుకొని కష్టార్జితంతో ప్లాట్లు కొనుక్కుని మోసపోయిన అనేకమంది మధ్యతరగతి వారు కోర్టుల చుట్టూ తిరుగుతూ కన్నీరు పెడుతున్నారు. అధికార యంత్రాంగం అవినీతి కారణంగానే ఇలాంటి దుస్థితి నెలకొందనే ఆరోపణలు ఉన్నాయి.

రోజురోజుకు పెరుగుతున్న లేఅవుట్లు

విచ్చలవిడి రియల్‌ ఎస్టేట్‌ మోసాలను అరికట్టేందుకు 'రియల్‌ ఎస్టేట్‌ రెగ్యులేషన్‌ అథారిటీ'(రెరా) ఏర్పాటు చేసినా అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలు మరింతగా పెరిగాయే తప్ప తగ్గడం లేదు. మరోవైపు గత తొమ్మిదేళ్లలో అధికారులు ఇచ్చిన అనుమతులే సక్రమం కాదని ప్రభుత్వం చెబుతుండడంతో చాలామంది నష్టపోయి లబోదిబోమంటున్నారు. రియల్‌ మోసాలు సర్వసాధారణం కావడంతో సామాన్యులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.

- 2020 ఫిబ్రవరి వరకు రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్‌ మున్సిపల్‌ కార్పొరేషన్లు మినహా ఇతర 112 మున్సిపాలిటీల్లో 3,167 ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలు చేపట్టారు. ఈ లెక్కలను అప్పటి మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ శాఖ డైరెక్టర్, ఇప్పటి 'రెరా'చైర్మన్‌ ఎన్‌.సత్యనారాయణ అధికారికంగా ప్రకటించడం గమనార్హం.
- ఇందులో అత్యధికంగా ఒక్క ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోనే 173 ఎకరాల్లో 176 అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేసినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పైగా ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో 62 రియల్‌ఎస్టేట్‌ సంస్థలు 2012 బిల్డింగ్‌ రూల్స్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలు వేసిన జిల్లాల్లో నిజామాబాద్‌ టాప్‌లో ఉండడం విశేషం.
- 2020 వరకు నిజామాబాద్‌ జిల్లాలో 116 ఎకరాల్లో, కామారెడ్డి జిల్లాలో 580 ఎకరాల్లో, సిద్దిపేట జిల్లాలో 185 ఎకరాల్లో, వికారాబాద్‌ (పరిగి) జిల్లాలో 235 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు చేశారు. వీటిపై చర్యలు తీసుకోకపోడంతో గత నాలుగేళ్లలో ఈ అక్రమాలు రెట్టింపు అయ్యాయి.
- 2017 తర్వాత వెంచర్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు 'రెరా'రిజిస్ట్రేషన్‌ తప్పనిసరి అయ్యింది. 2019 తెలంగాణ మున్సిపల్‌ చట్టం ప్రకారం ఏ మున్సిపాలిటీలోనైనా లేఅవుట్, నిర్మాణానికి అనుమతులు తప్పనిసరి. అధికార యంత్రాంగం ఈ నిబంధనలు అమలు చేయకపోవడంతో రియల్‌ అక్రమాలు, మోసాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. 2020 తర్వాత నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా అక్రమ వెంచర్లు, నిర్మాణాలు చేశారు.
- నిజామాబాద్‌లో రైల్వేజోన్‌లో, గంగాస్థాన్‌లో, వినాయక్‌నగర్‌లో వేసిన అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోయిన బాధితుల పక్షాన, మున్సిపల్‌ అధికారులను బాధ్యులను చేస్తూ లోకాయుక్తలో ఫిర్యాదు చేయనున్నట్టు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి 'సాక్షి'కి తెలిపారు.



దారిపొడుగునా.. పుష్పవిలాసం

విజయవాడలోని పలు ప్రాంతాల్లో రోడ్ల డివైడర్లపై కాగితపు పూలు కనువిందు చేస్తున్నాయి. వివిధ రంగుల్లో పోగుపోసినట్లు అందంగా కనిపిస్తున్న పూలను చూసి వాహనచోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్, విజయవాడ



వృక్షో రక్షతి రక్షితః

భూమిపై మానవ మనుగడకు అడవులే కీలకం. చెట్లను కాపాడుకుంటే అవి మనల్ని కాపాడుతాయి. అనంతపురంలో జరిగిన బాలోత్సవ్‌లో అడవులను కాపాడుకుందాం అంటూ చిన్నారులు ఇచ్చిన ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ప్లాస్టిక్ కవర్లు మా పొట్టకొట్టాయి

'ఒకప్పుడు హోటల్స్‌లో భోజనం పార్శిల్స్ కోసం బుట్టలు అల్లి ఇచ్చేవాళ్లం. గంపలు, తట్టలు, బుట్టలు అల్లి పొట్టపోసుకునేవాళ్లం.. ఈ ప్లాస్టిక్ కవర్లు వచ్చి మా పొట్ట కొట్టాయి. ఇల్లు గడవడమే కష్టంగా ఉంది' అంటూ వాపోతున్నారు మేదర కుటుంబాలవారు. ఒక్క ఏలూరులోనే 350 కుటుంబాలు బుట్టలు అల్లి జీవనం సాగిస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు

ఇన్సులిన్ మీరే కొనుక్కోండి

- ప్రభుత్వాస్పత్రుల్లో మధుమేహుల దీనావస్థ
- నెలకు లక్ష వరకు వెయిల్స్ అవసరం.. సరఫరాలో సర్కారు విఫలం
- గత ప్రభుత్వంలో రోగులకు ఇంటి దగ్గర వేసుకోవడానికి వీలుగా వెయిల్స్ అందజేత



సాక్షి, అమరావతి: ప్రజారోగ్య వ్యవస్థను కూటమి ప్రభుత్వం కకావికలం చేసింది. కనీసం బీపీ, షుగర్ రోగులకు సాంత్వన చేకూర్చలేని దీనావస్థలోకి ప్రభుత్వాస్పత్రులను నెట్టేసింది. బోధనాస్పత్రుల్లో వందకు పైగా రకాల మందులు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. నాలుగైదు నెలలుగా ఆస్పత్రుల్లో మధుమేహ బాధితులను ఇన్సులిన్ కొరత వేధిస్తోంది. గత ప్రభుత్వంలో రోగులు ఇంటివద్దే ఇన్సులిన్ తీసుకోవడానికి వీలుగా ఆస్పత్రుల్లో వెయిల్స్ ఇచ్చేవారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చేరిన వారికి కూడా ఇన్సులిన్ వెయిల్స్ అందుబాటులో ఉండటం లేదు. బయట కొని తెచ్చుకోండని స్లిప్‌లు రాసిస్తున్న అధ్వాన్న పరిస్థితులు దాపురించాయని బాధితులు మండిపడుతున్నారు. టైప్–1 షుగర్ బాధితులతో పాటు, టైప్–2 బాధితుల్లో సమస్య తీవ్రంగా ఉన్న వారికి రక్తంలో గ్లూకోజ్‌ను నియంత్రించడానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇస్తుంటారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లో హ్యూమన్ యాక్టాపిడ్, హ్యూమన్ మిక్స్‌టార్డ్ 70/30 ఇన్సులిన్ కొరత ఉంటోంది. ముఖ్యంగా హ్యూమన్ మిక్స్‌టార్డ్ రకం సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచే సరఫరా చేయడం లేదని తెలుస్తోంది.

పేద రోగులపై ఆర్థిక భారం

ప్రభుత్వాస్పత్రుల్లో నెలకు లక్ష వరకూ హ్యూమన్ మిక్స్‌టార్డ్ ఇన్సులిన్ వెయిల్స్ అవసరం అవుతాయని అంచనా. కొద్ది నెలలుగా ఆస్పత్రులకు ఈ రకం ఇన్సులిన్ సరఫరా నిలిచిపోయింది. కొన్నిచోట్ల ఆస్పత్రులు పెట్టిన ఇండెంట్‌లో నామమాత్రంగానే సరఫరా అవుతోంది. దీంతో కొన్ని బోధనాస్పత్రులు, ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్ల కోసం స్థానికంగా కొనుగోలు చేస్తున్నారు. ఇక కొన్నిచోట్ల అవుట్‌పేషెంట్లకు ఇన్సులిన్ వెయిల్స్ ఇవ్వడాన్ని పూర్తిగా నిలిపేశారు. షుగర్ మోతాదు 300, 400పైగా ఉండే రోగులకు నెలకు 3 నుంచి 5 వెయిల్స్ అవసరం అవుతుండగా కర్నూలు జీజీహెచ్‌లో నెలకు ఒక వెయిల్ మాత్రమే ఇస్తున్నారు. ఆ వెయిల్ అయిపోయాక నెలలో రెండోసారి వెళితే ఇవ్వడం లేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, కాకినాడ జీజీహెచ్‌లలో ఓపీలో రోగుల నెలవారీ అవసరాలకు అనుగుణంగా వెయిల్స్ ఇవ్వడం లేదు. పీహెచ్‌సీలకు రెండో క్వార్టర్‌లో పెట్టిన ఇండెంట్ మేరకే ఇన్సులిన్ సరఫరా లేదని మెడికల్ ఆఫీసర్‌లు, ఫార్మాసిస్ట్‌లు చెబుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇదిగో అదిగో అనే సమాధానాలే ఉంటున్నాయని పేర్కొంటున్నారు. ఇన్సులిన్ లేక మెటార్ఫిన్, జిమ్ ఫ్రైడ్ వంటి మాత్రలు ఇస్తుంటే.. షుగర్ లెవెల్స్ తగ్గడం లేదని రోగులు తమపై గొడవకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో వెయిల్ ధర రూ.170కు పైగా ఉంటోంది. 300 నుంచి 350 మధ్య షుగర్ మోతాదు ఉండే బాధితులకు నెలకు నాలుగు వెయిల్స్ నిమిత్తం రూ.700 చొప్పున వెచ్చించాల్సి వస్తోంది. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాల వారికి ఇంత సొమ్ము వెచ్చించడం తలకు మించిన భారంగా మారుతోంది. చాలామంది ఇన్సులిన్ కొనుగోలు చేయలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

స్టాక్ లేదంటున్నారు

కొన్నేళ్లుగా షుగర్ సమస్యతో బాధపడుతున్నాను. నాకు నెలకు నాలుగు వెయిల్స్ వరకూ అవసరం అవుతాయి. గతంలో పెద్దాస్పత్రిలో నెలకు సరిపడా వెయిల్స్ ఇచ్చేవారు. ఇప్పుడు ఒక వెయిల్ మాత్రమే ఇస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అది కూడా లేదంటున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఆస్పత్రిలో స్టాక్ లేదని చెబుతున్నారు. నెల నెలా ఇన్సులిన్ కొనుగోలు చేయడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– వెంకటేశ్వర్లు, మధుమేహ బాధితుడు, కర్నూలు

ఏడు లక్షల కుటుంబాల్లో అందరూ చనిపోయారట!

- ప్రతీ ఇల్లూ జియో ట్యాగింగ్‌లో ప్రభుత్వ యంత్రాంగం నమోదు
- ఇదంతా నిజమేనా అని అధికారుల్లో కలవరం
- క్షేత్రస్థాయిలో పునఃపరిశీలనకు 'డెత్ ఆడిట్' చేపడుతున్న గ్రామ, వార్డు సచివాలయాల శాఖ
- పంచాయతీ కార్యదర్శుల ద్వారా పది శాతం, ఎంపీడీఓల ద్వారా ఐదు శాతం కుటుంబాల పరిశీలన
- టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యానికి పరాకాష్ట

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని టీడీపీ కూటమి సర్కారు పాలన ఎంత అధ్వానంగా ఉందో చెప్పడానికి ఇది చక్కని ఉదాహరణ. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి పరాకాష్ట. నెల రోజుల క్రితం రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ ఇంటినీ జియో ట్యాగింగ్ చేసే నిమిత్తం ప్రభుత్వం సర్వే నిర్వహించింది. ఇందులో.. రాష్ట్రవ్యాప్తంగా 7,10,419 కుటుంబాల్లోని మొత్తం సభ్యులందరూ గత ఐదారేళ్లలో మరణించినట్లు నమోదు చేసింది. ఇప్పుడిది గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. వీరంతా నిజంగా చనిపోయారా అని సంశయం అధికారులను కలవరపాటుకు గురిచేస్తోంది. నిజానిజాలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేయాలని నిర్ణయించింది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో తీవ్ర చర్చనీయాంశమైన ఈ ఉదంతం కథాకమామిషు ఏమిటంటే..

2019లో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు సమయంలో హౌస్ హోల్డ్ డేటా పేరుతో ప్రతి కుటుంబంలోని సభ్యుల వివరాలను నాటి ప్రభుత్వం సేకరించింది. ఈ డేటా ప్రకారం.. రాష్ట్రంలో మొత్తం 1.69 కోట్ల కుటుంబాలు ఉన్నట్లు తేలింది. అయితే, నెలరోజుల క్రితం గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటి జియో ట్యాగింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సమయంలో ఆ డేటాలోని 7,10,419 కుటుంబాలకు చెందిన మొత్తం సభ్యులందరూ చనిపోయినట్లు నమోదు చేశారు. ఇది వాస్తవమా, లేదంటే ఏమైనా పొరపాట్లు చోటుచేసుకున్నాయా అని తలపట్టుకుంటున్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇప్పుడు 'డెత్ ఆడిట్' పేరుతో పునఃపరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మొత్తం చనిపోయినట్లు పేర్కొన్న కుటుంబాల వివరాలను మండల, మున్సిపాలిటీల వారీగా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు పంపి.. డెత్ మార్క్‌డ్ హౌస్ హోల్డ్‌గా గుర్తించిన వాటిలో కనీసం 10 శాతం కుటుంబాలను ఆయా గ్రామ కార్యదర్శులు లేదా వార్డు సెక్రటరీల ద్వారా పునఃపరిశీలన చేయాలని నిర్ణయించింది. అలాగే, ఒక్కో మండలం లేదా నగర పరిధిలో కనీసం ఐదు శాతం కుటుంబాలను ఆయా మండల ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్ పునఃపరిశీలన చేసి నిర్ధారించాలంటూ జిల్లా అధికారులకు ఆ శాఖ సూచించింది. దీంతో.. సోమవారం నుంచి ఈ పరిశీలన ప్రారంభం కానుంది.

హమాలీలతో ఆటలా?

- పౌరసరఫరాల సంస్థలోని హమాలీలకు కూలి రూ.3 పెంచుతున్నట్లు నవంబర్‌లో మంత్రి ప్రకటన
- మూడు నెలలైనా జీవో విడుదల చేయని ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పౌరసరఫరాల సంస్థలో పని చేస్తున్న హమాలీలకు కూలి రేట్ల పెంపు విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి కూలి రేట్లు పెంచాల్సి ఉంది. గత ఏడాది నవంబర్ 21న హమాలీల జేఏసీతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చర్చలు జరిపి కూలిని రూ.3 పెంచుతున్నట్టు ప్రకటించారు. కానీ, ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి జీవో మాత్రం జారీ చేయలేదు. ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని హమాలీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

5,791 కుటుంబాలపై ప్రభావం

పౌరసరఫరాల సంస్థకు చెందిన 252 ఎంఎల్‌ఎస్ పాయింట్లలో 5,791 మంది హమాలీలు రోజువారీ కూలీలుగా పని చేస్తున్నారు. వీరికి ప్రతి రెండేళ్లకు ఒకసారి ప్రభుత్వం కూలి రేట్లు పెంచుతుంది. గత ప్రభుత్వంలో రెండుసార్లు కూలి రేట్లను సకాలంలో పెంచింది. ఈ క్రమంలో రెండు దఫాల్లో క్వింటాకు కూలి (ఎగుమతి, దిగుమతికి) రూ.19 నుంచి రూ.25లకు పెరిగింది. అయితే, గత ఏడాది జనవరి నుంచి కొత్తగా కూలి రేట్లు పెంచాల్సి ఉండగా, ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ఆలస్యమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక హమాలీలకు కూలి రేట్ల పెంపును విస్మరించింది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా హమాలీలు స్టాక్ తరలింపును నిలిపివేయడంతో నవంబర్ 21న హమాలీ సంఘాల జేఏసీతో మంత్రి నాదెండ్ల మనోహర్ చర్చలు జరిపి కూలి రేట్లు రూ.3 చొప్పున పెంచడానికి అంగీకరించారు. ఆ తర్వాత జీవో విడుదలను విస్మరించారు.

అధికారులు చెప్పినా...

ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జనవరి 24న ఎంఎల్‌ఎస్ పాయింట్లలో హమాలీలు ధర్నాకు దిగారు. అధికారులు వారంలో జీవో విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ధర్నాను విరమించారు. కానీ, 20 రోజులు గడుస్తున్నా మళ్లీ ప్రభుత్వంలో చలనం లేదు. దీంతో వచ్చే వారం రాష్ట్రవ్యాప్తంగా స్టాక్ తరలింపును నిలిపివేసేందుకు హమాలీలు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

'పీఎం-ఈ-డ్రైవ్' పథకంతో ఈవీ రంగానికి ప్రోత్సాహం

దేశంలో ఐదేళ్లలో 16.14లక్షల ఈవీ వాహనాలు

- ఆంధ్రప్రదేశ్‌లో 1,266, తెలంగాణలో 1,289 ఛార్జర్‌లు
- 14.28లక్షల టూవీలర్‌లు, 1.64లక్షల త్రీవీలర్, 22వేల ఫోర్ వీలర్‌లు
- వెల్లడించిన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ



సాక్షి, న్యూఢిల్లీ: ముంచుకొస్తున్న పర్యావరణ ముప్పును అరికట్టేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. కొన్ని సంవత్సరాల క్రితం కొన్ని కార్ల కంపెనీలు మాత్రమే ఈవీలను తయారు చేసేవని, ప్రస్తుతం అన్ని కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తున్నాయని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఇటీవల పార్లమెంట్‌లో తెలిపింది. ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం 'ప్రధాన మంత్రి–ఈ–డ్రైవ్' అనే పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని తెలిపింది. ఈ పథకం ద్వారా ఈ–కార్లకు జీఎస్‌టీ, పన్ను, పర్మిట్‌లో మినహాయింపు వంటి అనేక ప్రయోజనాలు అందిస్తున్నట్లు చెప్పింది. 2030 నాటికి ప్రైవేటు ఎలక్ట్రిక్ కార్లలో 30శాతం, ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల వాహనాలలో 80శాతం వృద్ధిని సాధించే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసిన వారికి ఏ విధమైన అవాంతరాలు ఏర్పడకుండా ఉండేందుకు ఛార్జింగ్ పాయింట్‌లను, ఛార్జింగ్ స్టేషన్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించింది.

ఆంధ్రప్రదేశ్‌లో 1,266, తెలంగాణలో 1,289..

'ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్'(ఎఫ్‌ఏఎంఈ) సబ్సిడీ పథకం కింద దేశవ్యాప్తంగా 4,523 ఛార్జర్‌లు ఉండగా, 251 ఛార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. 'ఆయిల్ మార్కెటింగ్ కంపెనీస్'(ఓఎంసీఎస్) పథకం కింద దేశవ్యాప్తంగా 20,035 ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉన్నట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌ఏఎంఈ పథకం కింద 354 ఛార్జర్‌లు ఇన్‌స్టాల్ జరగగా, 20 ఛార్జింగ్ స్టేషన్‌లు, ఓఎంసీఎస్ కింద రాష్ట్రవ్యాప్తంగా 912 ఛార్జింగ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇక తెలంగాణలో ఎఫ్‌ఏఎంఈ కింద 238 ఛార్జర్‌లు ఇన్‌స్టాల్ చేయగా, ఒకే ఒక్క ఛార్జింగ్ స్టేషన్ ఉండగా, ఓఎంసీఎస్ కింద 1,051 స్టేషన్లు అందుబాటులో ఉన్నాయి.

దేశవ్యాప్తంగా 16.14లక్షల ఈవీలు..

దేశవ్యాప్తంగా ఎఫ్‌ఏఎంఈ పథకం సెకెండ్ ఫేజ్‌లో 16,14,737 లక్షల ఈవీలు ఉన్నట్లు కేంద్రం తెలిపింది. వీటిలో టూవీలర్‌లు 14, 28,009లక్షలు, త్రీవీలర్‌లు 1,64,180, ఫోర్ వీలర్‌లు 22,548 ఉన్నట్లు తెలిపింది. ఈసంఖ్యను రానున్న రోజుల్లో పెంచేదిశగా తాము ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ వివరించింది.

వయో పరిమితిలో ద్వంద్వ నీతి!



కానిస్టేబుల్ అభ్యర్థులతో ప్రభుత్వం చెలగాటం

- రేంజ్ కో రీతిలో వ్యవహరిస్తున్న హోమ్ శాఖ
- నష్టపోతున్న 1,500 మంది అభ్యర్థులు
- న్యాయం చేయాలని కోరుతున్నా పట్టించుకోని వైనం

సాక్షి, అమరావతి : పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల అభ్యర్థులతో చంద్రబాబు ప్రభుత్వం చెలగాటమాడుతోంది. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షల నిర్వహణకు వచ్చేసరికి వయో నిబంధన అడ్డంకిగా చెబుతూ అడ్డుకోవడం విడ్డూరంగా ఉంది. అది కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రీతిలో కాకుండా రేంజ్ కో రీతిలో వ్యవహరిస్తుండటం విస్మయ పరుస్తోంది. కర్నూలు రేంజ్ పరిధిలో కొందరు అభ్యర్థులకు అడ్డంకికానీ వయో నిబంధన.. ఇతర రేంజ్‌ల పరిధికి వచ్చే సరికి అడ్డంకిగా చూపిస్తుండటం ప్రభుత్వ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తోంది. 2022లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. జనరల్, బీసీ అభ్యర్థులకు 18 ఏళ్ల నుంచి 27 ఏళ్లు.. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 18 ఏళ్ల నుంచి 32 ఏళ్ల మధ్య వయసు ఉండాలని వయో నిబంధన పెట్టారు. కానిస్టేబుల్ పోస్టులకు 5,03,487 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. రాష్ట్ర పోలీస్ నియామక మండలి (ఎస్‌ఎల్‌పీఆర్‌బీ) అధికారిక వెబ్‌సైట్ ద్వారా వచ్చిన ఆ దరఖాస్తులను ఆమోదించారు. అంటే అర్హత నిబంధనలు సరిపోబట్టే దరఖాస్తులను ఆమోదించినట్టుగా భావించాలి. ఇక 2023 జనవరి 22న నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో 91,507 మంది అర్హత సాధించారు. అనంతరం తమ సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని హోమ్ గార్డులు హైకోర్టును ఆశ్రయించారు. దాంతో ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు నిర్వహించాల్సిన దేహదారుఢ్య పరీక్షలు వాయిదా పడ్డాయి. న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయే సరికి ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించలేకపోయారు.

రేంజ్‌కో రీతా.. ఇదేం ద్వంద్వ నీతి?

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జనవరిలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. నాలుగు కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు ఎన్నో ఆశలతో హాజరైన అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం వయో నిబంధన పేరిట సైంధవుడిలా అడ్డుకోవడం విభ్రాంతి కలిగించింది. రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసి, ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారిలో 1,500 మందికిపైగా అభ్యర్థుల వయసు పైబడిందని వారిని అనర్హులుగా ప్రకటించింది. జనరల్, బీసీ అభ్యర్థులకు గరిష్ట వయసు 27 ఏళ్లు.. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు గరిష్ట వయసు 32 ఏళ్ల పరిమితి దాటిపోయిందని 1,500 మంది అభ్యర్థులను దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించ లేదు. దరఖాస్తు చేసే నాటికి తమకు తగిన అర్హతలు ఉన్నందునే ఎస్‌ఎల్‌పీఆర్‌బీ తమ దరఖాస్తులను ఆమోదించిందని అభ్యర్థులు ఎంతగా ప్రాధేయపడినా హోమ్ శాఖ పట్టించుకోలేదు. 1990, 1991లలో జన్మించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు గరిష్ట అర్హత వయసు దాటిపోయింది కాబట్టి వారిని దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించ లేదు. కానీ కర్నూలు రేంజ్ పరిధిలో 1989 మేలో జన్మించిన ఓ ఎస్సీ అభ్యర్థికి దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించిన విషయం వెలుగు చూసింది. ఆ అభ్యర్థి దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. అందులో అర్హత కూడా సాధించారు. మరి అదెలా సాధ్యమని కానిస్టేబుల్ అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఆ అభ్యర్థి ఎస్‌ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో చేసిన దరఖాస్తు, దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించిన పత్రం, ఆ పరీక్షల్లో అర్హత సాధించినట్టుగా ఇచ్చిన ధ్రువీకరణ పత్రం కాపీలను సోషల్ మీడియాలో పోస్టు చేసి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కొందరు అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబడుతున్నారు. తమను కూడా దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించాలని, ఈ ప్రక్రియను పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు. న్యాయ పోరాటం చేస్తామని కూడా చెబుతున్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే సహించం: ఉద్యోగ సంఘాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఉద్యోగులను భర్తీ చేయాలన్న కేబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ, కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి ఏర్పాటు చేసిన ఆప్కాస్ సంస్థను రద్దు చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని యూనియన్ నేతలు శనివారం డిమాండ్ చేశారు. దీనిపై ఆదివారం (ఫిబ్రవరి 16న) అన్ని జిల్లాల్లోను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విస్తృత సమావేశాలు నిర్వహించి 17న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వర్‌రావు, ఆప్కాస్ అధ్యక్షుడు జి.చినబాబు తెలిపారు.

మార్చి 6న 'చలో విజయవాడ'

మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై మార్చి 6న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని చేపడతామని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు తెలిపారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే మునిసిపల్ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా...

'వెటర్నరీ' దుర్వినియోగం తగదు

ఏపీఎస్‌వీసీ ప్రెసిడెంట్ డాక్టర్ పీవీ లక్ష్మయ్య స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఎటువంటి అనుభవం, అర్హత లేకుండానే కొందరు అనధికారికంగా వెటర్నరీ సేవలు అందిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ (ఏపీఎస్‌వీసీ) ప్రెసిడెంట్ డాక్టర్ పీవీ లక్ష్మయ్య విమర్శించారు. ఏపీఎస్‌వీసీలో నమోదుకాని సంస్థలతోపాటు కొందరు వ్యక్తులు కూడా తమ పేర్ల వెంట 'వెటర్నరీ' హోదాలు తగిలించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. వీటిని తొలగించేందుకు రెండు వారాల గడువును ఇస్తున్నట్లు తెలిపారు. వెటర్నరీ వృత్తి నియంత్రణలు, నైతిక ప్రమాణాలు, సేవల సంబంధిత సమస్యలపై ఇక్కడ శనివారం జరిగిన ఒక అత్యున్నత స్థాయి సమావేశానికి లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రూరల్ లైవ్ స్టాక్ యూనిట్ (ఆర్‌ఎల్‌ఎస్‌యూ), రైతు సేవా కేంద్రాలను (పూర్వపు ఆర్‌బీకే) వెటర్నరీ సంస్థలుగా పరిగణించరాదని అన్నారు. ఈ సమావేశానికి వెటర్నరీ అసోసియేషన్లు, విశ్వవిద్యాలయాలు, ప్రాణి సంవర్ధక శాఖ ప్రతినిధులు హాజరై పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వెటర్నరీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ సమావేశాలలో ఏపీఎస్‌వీసీ భాగస్వామిగా ఉండాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెరగాలి

మంత్రి అనిత పిలుపు

సాక్షి, అమరావతి: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను నియంత్రించడంతోపాటు ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో డిజిటల్ ఎవిడెన్స్ ప్రాముఖ్యతపై విజయవాడలో శనివారం రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారుతున్న కాలంలో న్యాయ విచారణలో డిజిటల్ సాక్ష్యం పాత్ర కీలకంగా మారిందన్నారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ ఇంట్లో టీవీ, రిఫ్రిజిరేటర్ ఉన్నట్టే, సీసీ టీవీ ఉండాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రామకోటేశ్వరరావు, ఈగల్ (ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) సంస్థ డైరెక్టర్ ఆకే రవికృష్ణ, ఏపీఎఫ్‌ఎస్‌ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.లక్ష్మీ నరసింహస్వామి, ఏపీ హైకోర్టు అడ్వకేట్ ఎ.మిథున్‌కుమార్ వర్క్‌షాపులో పాల్గొన్నారు.

28న వ్యాపార ప్రణాళికపై సెమినార్

సాక్షి, అమరావతి: 'వ్యాపార ప్రణాళిక–వ్యాపార అభివృద్ధి వ్యూహం' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటించింది. ఈ నెల 28వ తేదీన విజయవాడలోని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో ఈ సెమినార్ జరుగుతుంది. ఈ సెమినార్‌లో రిజిస్ట్రేషన్లు పూర్తిగా ఉచితమని, ఆసక్తి గలవారు 9848077227 నంబర్‌లో సంప్రదించాలని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ రీజియన్ చైర్మన్ మలినేని రాజయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ అంబుడ్స్‌మెన్ పోస్టుకు నోటిఫికేషన్

జారీ చేసిన ఏపీఈఆర్‌సీ


సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ అంబుడ్స్‌మెన్ నియామకానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర న్యాయ వ్యవస్థలో సూపర్ టైమ్ స్కేల్ పరిధిలో ఉన్న జిల్లాస్థాయి న్యాయమూర్తిగా పని చేసిన వారు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొంది. మార్చి 13వ తేదీలోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను కర్నూలులోని ఏపీఈఆర్‌సీ కార్యాలయానికి పంపించాల్సిందిగా పేర్కొంది.

స్పిరిట్‌లో విష్ణు


విష్ణు

'స్పిరిట్' సినిమా కోసం స్పెషల్ అప్లికేషన్ పెట్టుకున్నారు హీరో మంచు విష్ణు. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న మూవీ 'స్పిరిట్'. ఈ చిత్రంలో తొలిసారిగా పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు ప్రభాస్. ఈ వేసవిలో 'స్పిరిట్' సినిమా చిత్రీకరణను ప్రారంభించనుంది యూనిట్. దీంతో నటీనటుల కోసం 'ఎక్స్'లో ఓ నోట్‌ను షేర్ చేసింది.''ఫిల్మ్ అండ్ థియేటర్ బ్యాక్‌గ్రౌండ్‌లో అనుభవం ఉన్న నటీనటులు మా సినిమాలో యాక్ట్ చేసేందుకు అప్లికేషన్స్ పెట్టుకోవచ్చు అంటూ కొన్ని షరతులతో 'స్పిరిట్' టీమ్ ఓ నోట్‌ను షేర్ చేసింది. ఈ నోట్‌ను 'ఎక్స్'లో షేర్ చేసి, తాను 'స్పిరిట్' సినిమా కోసం అప్లికేషన్ పెట్టుకున్నానని, ఏం జరుగుతుందో చూడాలన్నట్లుగా విష్ణు మంచు పేర్కొన్నారు. మరో వైపు విష్ణు మంచు హీరోగా నటిస్తున్న 'కన్నప్ప'లో రుద్రగా ప్రభాస్ ఓ గెస్ట్ రోల్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ ఏప్రిల్ 25న రిలీజ్ కానుంది. మరి... ప్రభాస్ 'స్పిరిట్' లో నటించే చాన్స్ విష్ణు మంచుకు దక్కుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక టీ–సిరీస్, భద్రకాళి పిక్చర్స్ పతాకంపై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్ 'స్పిరిట్' సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

వైజాగ్‌లో కింగ్‌డమ్


విజయ్ దేవరకొండ

వైజాగ్ వెళ్లారట విజయ్ దేవరకొండ. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా 'కింగ్‌డమ్' అనే మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఫిల్మ్ చిత్రీకరణ ఇప్పటికే 75 శాతానికి పైగా పూర్తయింది. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ కోసం విజయ్ దేవరకొండ వైజాగ్ వెళ్లారని తెలిసింది. దాదాపు 20 రోజులకు పైగా వైజాగ్‌లో 'కింగ్‌డమ్' చిత్రీకరణ జరుగుతుందని, కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్‌లు చిత్రీకరణ జరిగేలా ఈ చిత్రదర్శకుడు గౌతమ్ తిన్ననూరి ప్లాన్ చేశారని ఫిల్మ్‌నగర్ సమాచారం. అలాగే ఈ సినిమాలో విజయ్ దేవరకొండ క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని, రెండు రకాల టైమ్‌లైన్స్‌తో కథ సాగుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుందనే టాక్ ఆల్రెడీ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఇటీవల 'కింగ్‌డమ్' సినిమాను మే 30న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించిన విషయం విదితమే. ఇక ఈ చిత్రమే కాకుండా దర్శకులు రాహుల్ సంకృత్యాన్, రవికిరణ్ కోలాలతో విజయ్ దేవరకొండ ఆల్రెడీ సినిమాలు కమిటైన సంగతి తెలిసిందే.

బర్త్ డే స్పెషల్


బుచ్చిబాబు, రామ్‌చరణ్

'ఉప్పెన' సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు బుచ్చిబాబు సానా ద్వితీయ చిత్రాన్ని హీరో రామ్‌చరణ్‌తో చేసే అవకాశం దక్కించుకున్న సంగతి తెలిసిందే. రామ్‌చరణ్ హీరోగా రూపొందుతోన్న ఈ చిత్రానికి 'ఆర్‌సీ 16' అనే వర్కింగ్ టైటిల్ ఫిక్స్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా శనివారం (ఫిబ్రవరి 15) బుచ్చిబాబు బర్త్ డే. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో 'ఆర్‌సీ 16' యూనిట్ ఆధ్వర్యంలో ఆయన పుట్టిన రోజు వేడుకని నిర్వహించారు. రామ్‌చరణ్ కూడా బుచ్చిబాబుతో కలిసి ఉన్న ఫొటోని సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉంటే.. 'ఆర్‌సీ 16' సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ముగిసింది. రామ్ చరణ్‌తో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు బుచ్చిబాబు. ఈ సినిమా ఈ ఏడాది విడుదల కానుంది. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, 'మీర్జాపూర్' ఫేమ్ దివ్యేందు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, రత్నవేలు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు.

రెండు దశాబ్దాల తర్వాత..!


తమన్

రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ యాక్టర్‌గా కెమెరా ముందుకు వస్తున్నారు ఎస్. తమన్. శంకర్ దర్శకత్వంలో సిద్ధార్థ్, భరత్, మణికందన్, నకుల్, జెనీలియా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బాయ్స్'. 2003లో విడుదలైన ఈ మూవీ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే ఆ తర్వాత తమన్ యాక్టర్‌గా కొనసాగలేదు. 'మళ్ళీ మళ్ళీ (2009)' మూవీతో మ్యూజిక్ డైరెక్టర్‌గా కెరీర్‌ను స్టార్ట్ చేసి, ది టాప్ మ్యూజిక్ డైరెక్టర్స్‌లో ఒకరిగా కొనసాగుతున్నారు తమన్. ఇప్పుడు మళ్లీ లీడ్ యాక్టర్‌గా ఓ సినిమా చేయనున్నారు. అధర్వ హీరోగా ఆకాశ్ భాస్కరన్ స్వీయ దర్శక నిర్మాణంలో 'ఇదయమ్ మురళి' అనే తమిళ మూవీ రానుంది. ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో నట్టి, తమన్, ఎన్‌ఎమ్ నిహారిక, ప్రగ్యా, సుధాకర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నట్లు తెలిపారు మేకర్స్. ఇలా రెండు దశాబ్దాల తర్వాత తమన్ మళ్లీ ఓ సినిమాలో లీడ్ రోల్ చేస్తుండటం కన్ఫార్మ్ అయిపోయింది. 2003లో వచ్చిన 'బాయ్స్'లో ఓ లీడ్ రోల్‌లో నటించిన తమన్ ఆ తర్వాత అప్పుడప్పుడు కొన్ని చిత్రాల్లో గెస్ట్ రోల్స్‌లో మాత్రమే నటించారు. పూర్తి స్థాయి నటుడిగా తమన్ మళ్లీ నటిస్తున్నది 'ఇదయమ్ మురళి' చిత్రంలోనే.

ప్రభాస్ ఫౌజీలో యువరాణి?


ఆలియా భట్

ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్). 'సీతా రామం' మూవీ ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో జరుగుతోంది. ఇదిలా ఉంటే... ఈ సినిమాలో బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ ఓ కీలక పాత్రలో అతిథిగా మెరవనున్నారనే టాక్ వినిపిస్తోంది. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆలియా ఓ యువరాణి పాత్ర చేయనున్నారని భోగట్టా. సినిమాలో కీలకంగా ఉండే ఈ పాత్ర కోసం చిత్రయూనిట్ ఆమెను సంప్రదించగా, ఆమె కూడా పచ్చజెండా ఊపారని బాలీవుడ్ టాక్. మరి 'ఫౌజీ'లో ఆలియా భట్ అతిథి పాత్రలో నటిస్తారా? లేదా అనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే రాజమౌళి దర్శకత్వం వహించిన 'ఆర్ఆర్ఆర్' (2022) చిత్రంలో రామ్‌చరణ్‌కి జోడీగా ఆలియా భట్ నటించిన సంగతి తెలిసిందే. ఇక జయప్రద, మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'ఫౌజీ'కి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

నా జీవితం నువ్వే..!


కార్తీక్ ఆర్యన్


శ్రీలీల

'తూ మేరీ జిందగీ హై (నువ్వే నా జీవితం)...' అంటూ గిటార్‌తో లవ్ సాంగ్ పాడుతున్నారు బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్. ఎవరి కోసం అంటే శ్రీలీల కోసం అన్నమాట. కార్తీక్ ఆర్యన్, శ్రీ లీల జంటగా అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో హిందీలో ఓ లవ్ అండ్ మ్యూజికల్ మూవీ తెరకెక్కనుంది. గుల్షన్ కుమార్, టీ సిరీస్ సమర్పణలో భూషణ్ కుమార్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమాకు చెందిన కొత్త వీడియోను శనివారం రిలీజ్ చేసి, ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా వెల్లడించారు. అలాగే ఈ సినిమాను ఈ ఏడాది దీపావళి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా కూడా తెలిపారు. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. కాగా ఇప్పటివరకూ శ్రీలీల ఫలానా హిందీ చిత్రంలో నటిస్తున్నారంటూ ఓ నాలుగైదు సినిమాల గురించి ప్రచారం జరిగింది. అయితే అధికారిక ప్రకటన వచ్చింది మాత్రం కార్తీక్ ఆర్యన్ సరసన కమిట్ అయిన చిత్రమే. ఇక బాలీవుడ్ లవ్ ఫ్రాంచైజీ 'ఆషికీ' లో భాగంగా 'ఆషికీ 3' మూవీ రానుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తారని సమాచారం. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

వేసవిలో ఇడ్లీ కొట్టు


చింతపల్లి రామారావు


ధనుష్

ధనుష్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న తమిళ చిత్రం 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు). ఈ మూవీలో నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రాజ్ కిరణ్, అరుణ్ విజయ్, షాలినీ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. వండర్‌బార్ ఫిలిమ్స్, డాన్ పిక్చర్స్ బ్యానర్స్‌పై ధనుష్, ఆకాశ్ భాస్కరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'ఇడ్లీ కడై' తెలుగు విడుదల హక్కులను శ్రీ వేదాక్షర మూవీస్ అధినేత, నిర్మాత చింతపల్లి రామారావు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి రామారావు మాట్లాడుతూ– ''రాయన్' మూవీ తర్వాత ధనుష్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న 'ఇడ్లీ కడై'పై మంచి అంచనాలున్నాయి. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ధనుష్‌కి ఇది నటుడిగా యాభై రెండో చిత్రం, అలాగే ఆయన దర్శకత్వం వహిస్తున్న నాలుగో సినిమా. ఈ మూవీకి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం, కిరణ్ కౌశిక్ సినిమాటోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని ఈ ఏడాది వేసవిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో నటించిన 'విడుదల 2' చిత్రాన్ని ఇటీవల మా బ్యానర్‌లో తెలుగులో రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది'' అని తెలిపారు.

రా రా రాక్షస


ప్రజ్వల్ దేవరాజ్

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన చిత్రం 'రాక్షస'. లోహిత్ హెచ్. దర్శకత్వం వహించారు. అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్, విహాన్ కృష్ణ ఇతర పాత్రల్లో నటించారు. మందపాటి సంస్కృతి, అక్షర సమర్పణలో రూపొందిన ఈ సినిమా శివరాత్రి కానుకగా ఈ నెల 28న తెలుగు, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ మూవీని కంచి కామాక్షి కోల్‌కత్తా కాళీ క్రియేషన్స్ అధినేత ఎంవీఆర్ కృష్ణ తెలుగులో విడుదల చేస్తున్నారు. 'కాంతారా, విరూపాక్ష' మూవీస్ ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ 'రాక్షస'కి సౌండ్ ట్రాక్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. వేణు ఉన్ని సంగీతం అందించిన ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ని గురువారం విడుదల చేశారు. ఈ పాటకి ప్రేమ్ బీఎస్ సాహిత్యం అందించగా, సాయిచరణ్ పాడారు. 'మాయలో మాయకి చిక్కినాక... దారిలో కానరాక చొచ్చుకెళ్లాక... రూపమే అదృశ్యం అయ్యాక... నా నీడే వెచ్చగా తగిలాక.. వెళ్లే దారిలో తిరిగే సుడిగుండంలా మొత్తం అంతా మాయే.. కలయో నిజమో అసలేమీ తెలియదే.. భయంతో గట్టిగా పిలిచే నువ్వెవరే.. రా రా రాక్షస..' అంటూ ఈ పాట సాగుతుంది. ''రాక్షస' చిత్రానికి తెలుగు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు ఎంవీఆర్ కృష్ణ.

నిలవదే ఎదురుగా నా మది!


చరణ్ సాయి, ఉషశ్రీ

చరణ్ సాయి, ఉషశ్రీ జంటగా నటించిన చిత్రం 'ఇట్స్ ఓకే గురు'. మణికంఠ ఎం దర్శకత్వంలో వండర్ బిల్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సురేష్ అనపురపు, బస్వ గోవర్ధన్ గౌడ్ నిర్మించారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. మోహిత్ రెహ్మానియక్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'నిలవదే నిలవదే..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటకి లక్ష్మీ ప్రియాంక సాహిత్యం అందించగా, సిద్ధార్థ్ మీనన్ పాడారు. 'నిలవదే నిలవదే.. ఎదురుగా నా మది.. తపన తెర చాటులో.. తగని ఆరాటమే, రెండై ఉన్న ప్రాణాలే ఒకటయ్యాయిలా, నీతో ఉన్న కాలాలే మధురమే...' అంటూ లవ్ ఫీల్‌తో సాగుతుందీ పాట. సుధాకర్ కోమాకుల కీలక పాత్రలో నటించిన ఈ చిత్రానికి కెమేరా, ఎడిటర్: సన్ని .డి, నేపథ్య సంగీతం: ఏజే ప్రియన్.

బిజినెస్ రీల్

రూ. 6,091 కోట్లు కట్టండి

వొడా ఐడియాకు డాట్ ఆదేశం



న్యూఢిల్లీ: 2015లో కొనుగోలు చేసిన స్పెక్ట్రం బకాయిలకు సంబంధించి రూ. 6,091 కోట్ల బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలని లేదా రూ. 5,493 కోట్ల నగదును చెల్లించాలని టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియాను టెలికం శాఖ (డాట్) సూచించింది. ఇందుకోసం మార్చి 10 డెడ్‌లైన్‌గా విధించింది. ఈ బకాయిలను ఈక్విటీ రూపంలో చెల్లించే విషయంపై డాట్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు వొడాఫోన్ ఐడియా నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హిమాంశు కపానియా తెలిపారు. గతేడాది డిసెంబర్ 31 నాటికి కంపెనీలో 23.15 శాతం వాటాతో ప్రభుత్వం అతి పెద్ద వాటాదారుగా ఉంది.

గుజరాత్ టైటాన్స్‌లో టోరెంట్ గ్రూప్‌కి వాటాలు

67 శాతం కొనుగోలు



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్, ఎనర్జీ దిగ్గజం టోరెంట్ గ్రూప్ తాజాగా క్రీడారంగంలోకి ప్రవేశిస్తోంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌లో మెజారిటీ వాటాలు కొనుగోలు చేయనుంది. హోల్డింగ్ కంపెనీ టోరెంట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (టీఐపీఎల్) ద్వారా గుజరాత్ టైటాన్స్‌లో 67 శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు టోరెంట్ గ్రూప్ తెలిపింది. ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ సీవీసీలో భాగమైన ఐరీలియా కంపెనీ నుంచి ఈ వాటాను కొనుగోలు చేయనున్నట్లు వివరించింది. డీల్‌లో భాగంగా ఐరీలియా 33 శాతం వాటాతో మైనారిటీ షేర్‌హోల్డరుగా కొనసాగుతుంది. ప్రస్తుతం ఐపీఎల్‌లో పది టీమ్‌లు ఉండగా వీటిలో పలు జట్లు కార్పొరేట్ దిగ్గజాల చేతుల్లో ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, జేఎస్ డబ్ల్యూ గ్రూప్, జీఎంఆర్ గ్రూప్, ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్ తదితర దేశీ దిగ్గజాలతో పాటు డయాజియో (యునైటెడ్ స్పిరిట్స్ ద్వారా)లాంటి బహుళ జాతి కంపెనీలకు కూడా టీమ్‌లు ఉన్నాయి.

ఫోర్టిస్ హెల్త్‌కేర్ చేతికి శ్రీమన్

- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కొనుగోలు
- డీల్ విలువ రూ. 462 కోట్లు

ముంబై: ఆరోగ్య పరిరక్షణ రంగ కంపెనీ ఫోర్టిస్ హెల్త్‌కేర్ జలంధర్(పంజాబ్)లోని శ్రీమన్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని కొనుగోలు చేయనుంది. సొంత అనుబంధ సంస్థ ఫోర్టిస్ హాస్పిటల్ ద్వారా ఇందుకు స్లంప్‌సేల్ ప్రాతిపదికన రూ. 462 కోట్లు వెచ్చించనుంది. ఇందుకు శ్రీమన్ ఎంటర్‌ప్రైజెస్‌తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం ఆసుపత్రి మొత్తం నిర్వహణ, బిల్డింగ్, సంబంధిత భూమిని సొంతం చేసుకోనుంది. భవిష్యత్‌లో అవసరమైతే విస్తరణకు వీలుగా భూమిని వినియోగించుకునేందుకు వీలుంటుందని ఫోర్టిస్ హెల్త్‌కేర్ పేర్కొంది.

హెచ్‌పీసీఎల్‌తో బోయింగ్ జోడీ



ముంబై: విమానాల తయారీలో ఉన్న యూఎస్ దిగ్గజం బోయింగ్ తాజాగా ప్రభుత్వ రంగ చమురు సంస్థ హెచ్‌పీసీఎల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా దేశీయ మార్కెట్లో స్థిర విమాన ఇంధనం (సస్టేనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్-ఎస్ఏఎఫ్) ఉత్పత్తిని తదుపరి స్థాయికి తీసుకువెళ్లేందుకు అవకాశాలను ఇరు సంస్థలు అన్వేషిస్తాయి. అలాగే దేశీయంగా ఉత్పత్తి అయిన ఎస్ఏఎఫ్ ధృవీకరణకు, బలమైన ఎస్ఏఎఫ్ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి విధానాల కోసం కృషి చేస్తాయని బోయింగ్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపింది. దేశీయంగా విరివిగా లభ్యమవుతున్న ఇథనాల్, లిపిడ్ ఫీడ్‌స్టాక్‌లను ఉపయోగించడం ద్వారా ఎస్ఏఎఫ్‌కు కీలక ఉత్పత్తిదారుగా అవతరించే సామర్థ్యం భారత్‌కు ఉందని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వెల్లడించింది. భారత్‌కు చెందిన 80 కంపెనీలతోసహా ప్రపంచవ్యాప్తంగా సుమారు 340 విమానయాన సంస్థలు ఐఏటీఏలో సభ్యులుగా ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-2-2025

విశాఖ	465-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

రుణగ్రహీతలకు శుభవార్త

ముంబై: బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గృహ రుణ గ్రహీతలకు తీపి కబురు చెప్పింది. రుణ రేట్లను తగ్గించినట్లు బ్యాంక్ ప్రకటన పేర్కొంది. దీనితో గృహ రుణ గ్రహీతలకు ఈజీ మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్ల (ఈఎంఐ) భారం తగ్గనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోను ఇటీవలే పావుశాతం తగ్గించిన నేపథ్యంలో (6.5 శాతం నుంచి 6.25 శాతానికి) ఎస్‌బీఐ తాజా నిర్ణయం తీసుకుంది. తగ్గించిన రేట్లు ఇలా...

- వివిధ రుణాలకు వర్తించే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత లెండింగ్ రేట్ (ఈబీఎల్ఆర్), అలాగే రెపో ఆధారిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్) 25 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతానికి సమానం) తగ్గించింది. ఈ తగ్గింపు ఫిబ్రవరి 15వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది.
- అయితే బ్యాంక్ మార్జినల్ కాస్ట్-బేస్డ్ లెండింగ్ రేట్లు (ఎంసీఎల్ఆర్), బేస్ రేట్, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేట్‌ను (బీపీఎల్ఆర్) యథాతథంగా కొనసాగించింది.

రెపో ఆధారిత రుణల విషయానికి వస్తే...

రెపో ఆధారిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్) ప్రత్యక్షంగా రెపో రేటుకు అనుసంధానమై ఉంటుంది. ఎస్‌బీఐ తాజా నిర్ణయంతో ఈ రేటు 8.75 శాతం నుంచి 8.50 శాతానికి తగ్గుతుంది. దీనితో ఆర్ఎల్ఎల్ఆర్‌కు అనుసంధానమైన గృహ, వాణిజ్య రుణాలు తగ్గుతాయి.

ఆకర్షణీయం..

ఈబీఎల్ఆర్ లేదా ఆర్ఎల్ఎల్ఆర్‌కు అనుసంధానమైన రుణ గ్రహీతల రుణ నిబంధనలను బట్టి వారి ఈఎంఐలు లేదా రుణ వ్యవధి తగ్గుతుంది. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపుతో గృహ రుణాలను మరింత ఆకర్షణీయంగా చేస్తూ, ఈబీఎల్ఆర్, ఆర్ఎల్ఎల్ఆర్‌ను ఎస్‌బీఐ తగ్గించడం కస్టమర్లకు ప్రయోజనం కలిగించే అంశమని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఈ తగ్గిన రుణ రేటు ప్రయోజనాలు పొందడానికి మార్జినల్ కాస్ట్ రుణ రేటు (ఎంసీఎల్ఆర్) కస్టమర్లు తక్కువ వడ్డీరేటు రుణ విధానానికి మారవలసి ఉంటుంది.



ఈబీఎల్ఆర్ 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఎస్‌బీఐ

- దీనితో తగ్గనున్న ఈఎంఐల భారం

ఈబీఎల్ఆర్ అంటే?

ఈబీఎల్ఆర్ అంటే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్. ఎస్‌బీఐ 2019 అక్టోబర్ నుంచి తన ఫ్లోటింగ్ రేటు గృహ రుణాలను అనుసంధానించడానికి ఈబీఎల్ఆర్‌ను ప్రామాణికంగా తీసుకుంది. దీనితో అన్ని ఫ్లోటింగ్ రేట్ హోమ్ లోన్‌లకు వడ్డీ రేట్లు ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌తో అనుసంధానమవుతాయి. తాజా నిర్ణయంతో గృహ రుణ ఫ్లోటింగ్ రేట్లు తగ్గుతాయన్న మాట. దీనితోపాటు ఈబీఎల్ఆర్‌కు అనుసంధానమైన అన్ని వ్యక్తిగత ఇతర రిటైల్ రుణాలు సైతం దిగివస్తాయి. తాజా నిర్ణయం ప్రకారం ఈబీఎల్ఆర్ 9.15% నుంచి 8.90 శాతానికి తగ్గింది.

'రుణ' పునఃపరిశీలనకు సూచన...

తాజా రుణ రేట్లు, సంబంధిత పరిణామాల నేపథ్యంలో కొత్త రుణగ్రహీతలు రుణదాతను (బ్యాంక్) ఎంచుకునే ముందు వివిధ బ్యాంకుల రుణ రేట్లను సరిపోల్చుకోవాలని, వారి సామర్థ్యానికి అనువైన రుణ రేట్లను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే రుణగ్రహీతలు తప్పనిసరిగా తమ రుణ ఒప్పందాలను సమీక్షించుకోవాలని వారు సూచిస్తున్నారు. అవసరమైతే రీఫైనాన్సింగ్ ఎంపికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంటున్నారు. సెంట్రల్ బ్యాంక్ రెపో తగ్గింపు నేపథ్యంలో కెనరా బ్యాంక్, పీఎన్‌బీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి అనేక బ్యాంకులు కూడా తమ రెపో ఆధారిత రుణ రేటును పావు శాతం తగ్గించాయి. ఈ బ్యాంకుల నుండి గృహ రుణ గ్రహీతలు తమ ఈఎంఐలను అలాగే రుణ చెల్లింపు వ్యవధి కాల పరిమితులను సమీక్షించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

మహీంద్రా ఈవీల రికార్డు





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మహీంద్రా తయారీ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలు ఎక్స్‌ఈవీ-9ఈ, బీఈ-6 సరికొత్త రికార్డు సృష్టించాయి. తొలి రోజు 30,179 యూనిట్ల బుకింగ్స్‌తో ఈవీ రైడ్‌కు సిద్ధం అయ్యాయి. ఎక్స్ షోరూం ధర వద్ద వీటి విలువ రూ.8,472 కోట్లు. బుకింగ్స్‌లో ఎక్స్‌ఈవీ-9ఈ వాటా 56 శాతం నమోదైంది. ఈ రెండు మోడళ్లలో కలిపి అధిక సామర్థ్యం ఉన్న వేరియంట్స్‌కు వినియోగదార్లు మొగ్గుచూపారు. 79 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచిన ప్యాక్-3ని 73 శాతం కస్టమర్లు ఎంచుకున్నారు. ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాల వైపు మార్కెట్ మళ్లుతోందనడానికి ఈ బుకింగ్స్ నిదర్శనంగా నిలిచాయి. 2024లో దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 99,068 యూనిట్లు మాత్రమే. ఈ నేపథ్యంలో మహీంద్రా కొత్త ఈవీల రికార్డు స్థాయి బుకింగ్స్ ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఎక్స్‌ఈవీ-9ఈ, బీఈ-6 డెలివరీలు మార్చి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ రెండు మోడళ్లు 59 కిలోవాట్ అవర్, 79 కిలోవాట్ అవర్ లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీ ఆప్షన్స్‌తో తయారయ్యాయి. ఒకసారి చార్జ్ చేస్తే వేరియంట్‌ను బట్టి 535-682 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి.

హ్యుండై ఎగుమతులు 37 లక్షల యూనిట్లు

అతిపెద్ద దిగుమతిదారుగా ఆఫ్రికా • ఐ10 మోడల్ వేరియంట్లదే హవా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుండై మోటార్ ఇండియా 37 లక్షల యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను భారత్ నుంచి ఎగుమతి చేసి సరికొత్త మైలురాయిని అధిగమించింది. దేశం నుంచి 1999లో కంపెనీ ఎగుమతులు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం 60 దేశాలకు వివిధ మోడళ్ల కార్లను సరఫరా చేస్తోంది. 2024లో సంస్థకు సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, మెక్సికో, చిలీ, పెరూ అతిపెద్ద ఎగుమతి మార్కెట్లుగా అవతరించాయి. గత ఏడాది హ్యుండై 1,58,686 యూనిట్లు ఎగుమతి చేసి భారత్‌లో ప్యాసింజర్ వెహికిల్స్‌కు అతిపెద్ద ఎగుమతిదారుగా నిలిచింది. ఇక మన దేశం నుంచి హ్యుండై కార్లకు అతిపెద్ద దిగుమతిదారుగా ఆఫ్రికా తొలి స్థానంలో ఉంది. ఇప్పటి వరకు మొత్తం 10 లక్షలకుపైగా వాహనాలను ఆఫ్రికా అందుకుంది.

తొలి స్థానంలో ఐ10..

గడిచిన 25 ఏళ్లలో భారత్ నుంచి 150కిపైగా దేశాలకు వాహనాలను సరఫరా చేసినట్టు హ్యుండై తెలిపింది. తమిళనాడులో కంపెనీకి తయారీ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఎగుమతుల్లో ఐ10 మోడల్ ఫ్యామిలీ 15 లక్షల యూనిట్లను దాటి టాప్-1లో నిలిచింది. వెర్నా సిరీస్‌లో 5,00,000 యూనిట్లు నమోదయ్యాయి. దక్షిణ కొరియా వెలుపల హ్యుండై అతిపెద్ద ఎగుమతి కేంద్రంగా భారత్‌ను నిలపాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందని హ్యుండై మోటార్ ఇండియా ఎండీ ఉన్సూ కిమ్ వెల్లడించారు. ఇటీవల దక్షిణాఫ్రికాకు ఎక్స్‌టర్ మోడల్‌ను ఎగుమతి చేయడం ప్రారంభించామని, అక్కడి మార్కెట్లో భారత్‌లో తయారు చేసిన ఎనిమిదవ వాహనంగా ఈ మోడల్ గుర్తింపు పొందిందని చెప్పారు.



ఏటా లక్ష మందికి విదేశాల్లో ఉపాధి

- వృద్ధుల సంరక్షణ కార్యకలాపాల్లో నియామకం
- ఎన్ఎస్‌డీసీ సీఈవో వేద్‌మణి తివారీ



న్యూఢిల్లీ: భారత్ నుంచి ఏటా లక్ష మందికి అంతర్జాతీయంగా సంరక్షణ కార్యకలాపాల్లో ఉపాధి కల్పించనున్నట్టు జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ సీఈవో వేద్ మణి తివారీ ప్రకటించారు. మరో రెండేళ్ల తర్వాత నుంచి నియామకాలు మొదలవుతాయన్నారు. వృద్ధ జనాభా పెరుగుతున్న దేశాల్లో వారి సంరక్షణ సేవల్లో నియమించనున్నట్టు చెప్పారు. దేశంలో నిరుద్యోగం గురించి ప్రస్తావించగా.. అధికారిక లెక్కల ప్రకారం ఇది 6.5 శాతంగా ఉందని, అమెరికాలోనూ 4.5 శాతం మంది నిరుద్యోగులు ఉన్నట్టు గుర్తు చేశారు. గడిచిన ఏడాది కాలంలో భారత్ నుంచి 20,000 మంది నిర్మాణ రంగ కార్మికులు ఇజ్రాయెల్‌కు వెళ్లారని చెప్పారు. దేశవ్యాప్తంగా 100 నైపుణ్య మదింపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తివారీ తెలిపారు. ''ఇజ్రాయెల్ లేదా జపాన్ లేదా జర్మనీ వెళ్లాలనుకునే వారు ఈ కేంద్రాల వద్ద హాజరు కావాలి. అక్కడ నైపుణ్యాలను పరీక్షించి సర్టిఫికెట్ ఇస్తారు. అప్పుడు వర్క్‌వీసా కోసం దరఖాస్తు పెట్టుకోవచ్చు''అని వివరించారు. ఎన్ఎస్‌డీసీ 4 కోట్ల మందికి శిక్షణ ఇవ్వగా, మూడు నెలల్లోనే 94 లక్షల మందికి ఉపాధి లభించినట్టు తివారీ వెల్లడించారు. అత్యాధునిక నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ కోసం దేశవ్యాప్తంగా కొత్తగా 50 భవిష్యత్ నైపుణ్య కల్పన కేంద్రాలను, 10 ఎన్ఎస్‌డీసీ ఇంటర్నేషనల్ అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. పరిశ్రమల అనుసంధానతతో కూడిన శిక్షణా కార్యక్రమాలు 300కు మించగా, 13 ప్రముఖ టెక్నాలజీలు వీటి పరిధిలో ఉన్నట్టు చెప్పారు. ఏటా 2 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలన్నది తమ లక్ష్యంగా పేర్కొన్నారు.

రిలయన్స్ ఇన్‌ఫ్రాకు భారీగా పెరిగిన నష్టాలు

ముంబై: రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నష్టాలు రూ.3,298 కోట్లకు పెరిగాయి. గతేడాది ఇదే కాలంలో కంపెనీకి రూ.421 కోట్ల నష్టం వాటిల్లింది. టర్నోవర్ రూ.4,717 కోట్ల నుంచి రూ.5,129 కోట్లకు చేరింది. వ్యయాలు రూ.5,069 కోట్ల నుంచి రూ.4,963 కోట్లకు దిగివచ్చాయి. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇన్‌ఫ్రా రోడ్లు, విద్యుత్, మెట్రో రైల్‌తోపాటు ఇతర మౌలిక రంగాలకు ఇంజనీరింగ్, నిర్మాణ సేవలు అందిస్తోంది.

ఫండ్ ఇన్వెస్టర్లకు సెబీ 'మిత్రా' ప్లాట్‌ఫామ్

యాక్టివ్‌గా లేని పెట్టుబడుల గుర్తింపు సులభతరం

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్ల కోసం 'మిత్రా' డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను సెబీ తీసుకొచ్చింది. మ్యూచువల్ ఫండ్స్‌లో ఎప్పుడో ఇన్వెస్ట్ చేసి, వాటి వివరాలు మర్చిపోయిన వారు, దీర్ఘకాలంగా ఎలాంటి లావాదేవీలు లేకుండా ఉండిపోయిన వాటిని సులభంగా గుర్తించేందుకు ఈ ప్లాట్‌ఫామ్ సాయపడనుంది. ఇలాంటి చురుగ్గాలేని (ఇనాక్టివ్), చాలా కాలంగా క్లెయిమ్ చేయకుండా ఉండిపోయిన (అన్‌క్లెయిమ్డ్) పెట్టుబడులను తిరిగి గుర్తించి, వెనక్కి తీసుకోవడానికి ఈ చర్య తీసుకుంది. గతంలో చేసిన పెట్టుబడుల వివరాలను మర్చిపోయి, తాజా కాంటాక్ట్ సమాచారం లేక, తమ పేరిట చేసిన పెట్టుబడులపై అవగాహన లేని వారి విషయంలో వ్యక్తమవుతున్న ఆందోళనలకు ఈ ప్లాట్‌ఫామ్ పరిష్కారం చూపుతుందని సెబీ తన తాజా సర్క్యులర్‌లో వెల్లడించింది. ఈ తరహా యాక్టివ్‌గా లేని ఫోలియోలు (పెట్టుబడులు) మోసపూరిత ఉపసంహరణలకు దారితీయవచ్చని పేర్కొంది. రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లు అభివృద్ధి చేసిన ఈ ప్లాట్‌ఫామ్.. క్లెయిమ్ చేయకుండా పేరుకుపోయిన పెట్టుబడులను తగ్గించేందుకు సాయపడుతుందని పేర్కొంది. పదేళ్లుగా పెట్టుబడులు, మరే ఇతర ఆర్థికేతర లావాదేవీలు లేకుండా ఉండిపోయిన పెట్టుబడులను ఇనాక్టివ్‌గా పరిగణిస్తుంటారు. ఇన్వెస్టర్లకు సంబంధించి ఇనాక్టివ్ ఫోలియోలు, అన్‌క్లెయిమ్డ్ డివిడెండ్‌లను గుర్తించి.. వాటిని తగ్గించే బాధ్యతను 'యూనిట్ హోల్డర్ ప్రొటెక్షన్ కమిటీ'పై పెట్టింది. తాజా చర్యల గురించి ఇన్వెస్టర్లలో అవగాహన కల్పించాలంటూ ఏఎంసీలు, ఆర్‌టీఏలు, ఆర్ఐఏలు, యాంఫి, మ్యూచువల్ ఫండ్స్ పంపిణీదారులను సెబీ ఆదేశించింది.



గ్లాండ్ ఫార్మాలో మెజారిటీ వాటాకై పీఈల పోటీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జెనరిక్ ఇంజెక్టబుల్స్ తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ గ్లాండ్ ఫార్మాలో మెజారిటీ వాటాను దక్కించుకోవడానికి దిగ్గజ ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు పోటీపడుతున్నాయి. వీటిలో బ్లాక్‌స్టోన్, బ్రూక్‌ఫీల్డ్, వార్‌బర్గ్ పింకస్ ఉన్నాయి. చైనాకు చెందిన షాంఘై ఫోసన్ ఫార్మా నుంచి ఈ వాటా కొనుగోలుకై పీఈ సంస్థలు చర్చలు జరుపుతున్నాయని సమాచారం. ఈ డీల్ ద్వారా గ్లాండ్ ఫార్మాను 3 బిలియన్ డాలర్లుగా విలువ కట్టినట్టు తెలుస్తోంది. గ్లాండ్ ఫార్మాలో 74 శాతం వాటాను 2017లో 1.2 బిలియన్ డాలర్లు వెచ్చించి ఫోసన్ కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఈ వాటా 51 శాతంగా ఉంది. డీల్‌ను నడిపించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్స్‌గా మోర్గాన్ స్టాన్లీ, యూబీఎస్‌ను నియమించారు. బీఎస్ఈలో ఫిబ్రవరి 14 నాటికి గ్లాండ్ ఫార్మా మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.24,007.62 కోట్లుగా ఉంది. షేరు ధర అంత క్రితం ముగింపుతో పోలిస్తే 1.63 శాతం క్షీణించి రూ.1,457.20 వద్ద స్థిరపడింది. డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో గ్లాండ్ ఫార్మా నికరలాభం అంత క్రితంతో పోలిస్తే రూ.192 కోట్ల నుంచి రూ.205 కోట్లకు ఎగసింది. టర్నోవర్ 10.4 శాతం తగ్గి రూ.1,384 కోట్లు సాధించింది.

రిలయన్స్ కన్స్యూమర్ చేతికి వెల్వెట్



చెన్నై: వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల విభాగంలో స్థానాన్ని పటిష్టం చేసుకునే దిశగా తమిళనాడుకు చెందిన ఎఫ్ఎంసీజీ సంస్థ వెల్వెట్‌ను కొనుగోలు చేసినట్లు రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ తెలిపింది. అయితే, ఇందుకోసం ఎంత వెచ్చించినదీ వెల్లడించలేదు. ఘనవారసత్వం గల భారతీయ బ్రాండ్లను కొనుగోలు చేయాలన్న తమ లక్ష్యానికి అనుగుణంగా వెల్వెట్‌ను దక్కించుకున్నట్లు కంపెనీ వివరించింది. ఇదే ఉద్దేశంతోనే గతంలో క్యాంపా, రావల్‌గావ్ సుగర్ (పాన్ పసంద్, కాఫీ బ్రేక్ ప్రమోటరు)ని కూడా కొనుగోలు చేసినట్లు పేర్కొంది. వెల్వెట్ బ్రాండ్ పేరిట ముందుగా తమిళనాడులో షాంపుల శ్రేణిని ప్రవేశపెడతామని, తర్వాత సబ్బులు, బాడీ వాష్‌లు మొదలైన ఉత్పత్తులతో మిగతా మార్కెట్లకు విస్తరిస్తామని రిలయన్స్ కన్స్యూమర్ సీవోవో కేతన్ మోదీ తెలిపారు. శాచెట్ కింగ్‌గా పేరొందిన తమిళనాడు పారిశ్రామిక దిగ్గజం, దివంగత సీకే రాజ్‌కుమార్ 1980లలో వెల్వెట్ బ్రాండ్‌ను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దీనికి ఆయన భార్య సుజాత రాజ్‌కుమార్, కుమారుడు అర్జున్ రాజ్‌కుమార్ ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్నారు.

లాభాల్లోకి గ్లెన్‌మార్క్ ఫార్మా

క్యూ3లో రూ. 348 కోట్లు



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ దిగ్గజం గ్లెన్‌మార్క్ ఫార్మా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో రూ. 348 కోట్ల నికర లాభం ఆర్జించింది. వివిధ ప్రాంతాలలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 351 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,507 కోట్ల నుంచి రూ. 3,388 కోట్లకు ఎగసింది. వివిధ ప్రాంతాలలో పటిష్ట వృద్ధిని సాధించినట్లు కంపెనీ చైర్మన్, ఎండీ గ్లెన్ సల్దానా పేర్కొన్నారు. యూరోపియన్ బిజినెస్ పురోగతి కొనసాగుతున్నట్లు తెలియజేశారు. రెస్పిరేటరీ, ఇంజక్టబుల్స్ పోర్ట్‌ఫోలియో మద్దతుతో 2026 నుంచి ఉత్తర అమెరికా అమ్మకాలు జోరందుకోనున్నట్లు అంచనా వేశారు. కాగా.. యూఎస్ఎఫ్‌డీఏ ఈ నెల 3-14 మధ్య జీఎంపీ తనిఖీలు చేపట్టినట్లు గ్లెన్‌మార్క్ తెలియజేసింది. 5 అభ్యంతరాలతో ఫామ్ 483 జారీ అయినట్లు వెల్లడించింది. అయితే డేటా ఇంటెగ్రిటీపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 6.3% క్షీణించి రూ. 1,321 వద్ద ముగిసింది.

నజారా టెక్ లాభం క్షీణత

రూ. 14 కోట్లు



న్యూఢిల్లీ: గేమింగ్స్, ఈస్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ నజారా టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 54 శాతం క్షీణించి రూ. 14 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 30 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 67 శాతం జంప్‌చేసి రూ. 535 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 320 కోట్ల టర్నోవర్ మాత్రమే సాధించింది. ప్రిఫరెన్షియల్ ఈక్విటీ జారీ ద్వారా అక్సానా ఎస్టేట్స్ ఎల్ఎల్‌పీ నుంచి రూ. 495 కోట్లు సమీకరిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. నిధులను విస్తరణకు వినియోగించనుంది. ఆదాయంలో గేమింగ్ విభాగం నుంచి 53 శాతం లభించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో నజారా షేరు బీఎస్ఈలో 0.6 శాతం వృద్ధితో రూ. 929 వద్ద ముగిసింది.

మహీంద్రా లైఫ్‌స్పేస్ రూ.1,500 కోట్ల రైట్స్ ఇష్యూ



ముంబై: రుణాలు తగ్గింపు, వృద్ధి ప్రణాళికల్లో భాగంగా మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్ రైట్స్ ఇష్యూను ప్రకటించింది. ఈక్విటీల జారీ ద్వారా రూ.1,500 కోట్ల నిధుల సమీకరణ చేపట్టనుంది. ఇందుకు బోర్డు సభ్యులు ఆమోదం తెలిపినట్లు కంపెనీ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. మహీంద్రా లైఫ్‌స్పేస్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో రూ.22 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే కాలంలో రూ.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. టర్నోవర్ రెండితలకుపైగా పెరిగి రూ.186 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.125 కోట్ల నుంచి రూ.201 కోట్లకు చేరాయి.

ఎంటీఆర్ ఫుడ్స్ వేటలో ఐటీసీ!

- ఖాతాలోకి ఈస్టర్న్ కాండిమెంట్స్ సైతం
- డీల్ విలువ 1.4 బిలియన్ డాలర్లు
- దక్షిణాదిలో మరింత పాగాకు మార్గం



ప్రముఖ బ్రాండ్స్‌గా..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విభిన్న రంగాల్లో ఉన్న ఐటీసీ తాజాగా ఎంటీఆర్ ఫుడ్స్, ఈస్టర్న్ కాండిమెంట్స్‌ను కొనుగోలు చేయాలని నిర్ణయించిందని సమాచారం. డీల్ విలువ 1.4 బిలియన్ డాలర్లు. ఈ మేరకు నార్వేకు చెందిన ఓర్క్‌లా ఏఎస్ఏతో ముందస్తు చర్చలు జరుపుతోంది. డీల్ కార్యరూపంలోకి వస్తే కీలకమైన దక్షిణాది మార్కెట్లలో విస్తరించేందుకు ఐటీసీకి మార్గం సుగమం అవుతుంది. 2007లో ఎంటీఆర్, 2020లో ఈస్టర్న్‌ను కొనుగోలు చేయడం ద్వారా ఓర్క్‌లా భారత్‌లో ఎంట్రీ ఇచ్చింది. గత ఏడాది ఐపీవోకు రావాలని ఓర్క్‌లా ఇండియా ప్రయత్నించింది. కానీ ఇప్పుడు మెరుగైన విలువను సాధిస్తే ప్రైవేట్ ఒప్పందం ద్వారా మెజారిటీ వాటాను విక్రయించాలని భావిస్తోంది. ప్రైవేట్ అమ్మకం అనుకూలమైన విలువను ఇవ్వకపోతే పబ్లిక్ లిస్టింగ్‌కు వెళ్లాలని సంస్థ నిర్ణయించింది. ఫ్రోజెన్ మోమో, బావ్ విక్రయంలో ఉన్న ఎఫ్ఎంసీజీ కంపెనీ ప్రసుమను ఇటీవలే కొనుగోలు చేసిన ఐటీసీ.. ఎంటీఆర్ ఫుడ్స్, ఈస్టర్న్ కాండిమెంట్స్ కొనుగోలు ప్రక్రియ కార్యరూపం దాలిస్తే సుగంధ ద్రవ్యాలు, రెడీ-టు-కుక్ ఫుడ్ విభాగాలలో సంస్థ ఉనికి మరింత బలోపేతం అవుతుంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ మార్కెట్లలో ఎంటీఆర్ ఫుడ్స్, ఈస్టర్న్ కాండిమెంట్స్ ప్రముఖ బ్రాండ్స్‌గా ఉన్నాయి. 2023-24లో ఓర్క్‌లా ఇండియా సాధించిన రూ.2,400 కోట్ల ఆదాయంలో ఈ రెండు బ్రాండ్స్ 80 శాతం కంటే ఎక్కువ సమకూర్చాయి. బెంగళూరుకు చెందిన మైయా కుటుంబం 1950లో ప్రారంభించిన ఎంటీఆర్ ఫుడ్స్ కాలక్రమేనా విభిన్న ఉత్పత్తుల విభాగాల్లోకి ప్రవేశించింది. ఉత్తర అమెరికా, పశ్చిమ ఆసియా, జపాన్, ఆగ్నేయాసియా వంటి మార్కెట్లకు ఉత్పత్తులను సరఫరా చేస్తోంది.

అబ్బాయిల ఓటమి... అమ్మాయిల గెలుపు

- స్పెయిన్ చేతిలో పురుషుల జట్టు పరాజయం
- ఇంగ్లండ్‌పై మహిళల జట్టు విజయం
- ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్



భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ పురుషుల ప్రొ లీగ్‌లో భారత జట్టు పరాజయం పాలైంది. భారత అంచె పోటీల్లో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత్ 1–3 గోల్స్ తేడాతో స్పెయిన్ చేతిలో ఓడింది. 2024 పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక పోరులో భారత జట్టు చేతిలో ఎదురైన పరాజయానికి స్పెయిన్ బదులు తీర్చుకున్నట్టైంది. భారత్ తరఫున సుఖ్‌జీత్‌సింగ్ (25వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. స్పెయిన్ తరఫున బోర్జా లాకల్లె (28వ నిమిషంలో), ఇగ్నాషియా కొబొస్ (38వ ని.లో), బ్రూనో అవిలా (56వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. భారత జట్టు పదే పదే దాడులు చేసినా స్పెయిన్ రక్షణ పంక్తి సమర్థవంతంగా అడ్డుకుంది. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు ఎంత ప్రయత్నించినా... గోల్ చేయలేకపోయాయి. రెండో క్వార్టర్‌ను ఇరు జట్లు మరింత దూకుడుగా ప్రారంభించాయి. ఈ క్రమంలో సుఖ్‌జీత్ సింగ్ గోల్‌తో భారత్ ఆధిక్యం లోకి వెళ్లగా... మూడు నిమిషాల వ్యవధిలోనే గోల్ కొట్టిన స్పెయిన్ స్కోరు సమం చేసింది. ఆ తర్వాత వరుసగా రెండు క్వార్టర్స్‌లో ఒక్కో గోల్ బాదిన స్పెయిన్ మ్యాచ్‌ను చేజిక్కించుకుంది. ఆదివారం మరోసారి స్పెయిన్‌తో భారత్ ఆడనుంది.

హోరాహోరీ పోరులో భారత అమ్మాయిల విజయం



ఎఫ్ఐహెచ్ మహిళల ప్రొ లీగ్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. భారత అంచె పోటీల్లో భాగంగా శనివారం హోరాహోరీగా సాగిన తొలి పోరులో భారత్ 3–2 పాయింట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. కళింగ స్టేడియంలో జరిగిన పోరులో తమకన్నా మెరుగైన ర్యాంక్ ఉన్న ఇంగ్లండ్ జట్టుపై భారత్ స్ఫూర్తిదాయకమైన ప్రదర్శన కనబర్చింది. భారత్ తరఫున వైష్ణవి (6వ నిమిషంలో), దీపిక (25వ ని.లో) నవ్‌నీత్ కౌర్ (59వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. వైష్ణవి, దీపిక పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచగా... ఆట ఆఖరి నిమిషంలో అదిరిపోయే ఫీల్డ్‌గోల్‌తో నవ్‌నీత్ జట్టుకు విజయాన్ని అందించింది. ఇంగ్లండ్ తరఫున డార్సీ బౌర్నె (12వ నిమిషంలో), ఫియానా క్రాక్లెస్ (58వ ని.లో) చెరో గోల్ కొట్టారు. ఎఫ్ఐహెచ్ ర్యాంకింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో ఉన్న భారత్.. వైష్ణవి గోల్‌తో తొలి క్వార్టర్‌లోనే ఖాతా తెరిచింది. అయితే కాసేపటికే ఏడో ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్ స్కోరు సమం చేసింది. రెండో క్వార్టర్‌లో దీపిక గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన భారత్... సునాయాసంగానే మ్యాచ్ గెలిచేలా కనిపించింది. ఈ క్రమంలో గోల్‌కీపర్ సవిత పూనియా కొన్ని చక్కటి సేవ్‌లతో ప్రత్యర్థికి స్కోరు చేసే అవకాశం ఇవ్వలేదు. చివర్లో ఇంగ్లండ్ స్కోరు సమం చేసినా... నిమిషం వ్యవధిలోనే మరో గోల్ కొట్టిన భారత్ విజయం సాధించింది. ఆదివారం జరగనున్న మ్యాచ్‌లో మరోసారి ఇంగ్లండ్‌తో భారత అమ్మాయిల జట్టు తలపడుతుంది.

ఎట్టకేలకు సినెర్‌పై నిషేధం

- డోపింగ్ వ్యవహారంపై మెతక వైఖరి వీడి 3 నెలల వేటు
- ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందే ముగియనున్న సస్పెన్షన్


సినెర్

లండన్: వరల్డ్ టాప్ ర్యాంక్ టెన్నిస్ ప్లేయర్ యానిక్ సినెర్‌పై ఎట్టకేలకు మూడు నెలల నిషేధం విధించారు. స్టార్ అయినా... ఎంతటి వారైనా... డోపింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదనే సంకేతాన్ని ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) ఇచ్చినట్లయ్యింది. దాదాపు ఏడాదిగా నలుగుతున్న ఈ కేసుకు ఎట్టకేలకు నిషేధంతో తెర పడనుంది. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత, ఇటలీకి చెందిన ప్రపంచ నంబర్‌వన్ సినెర్ గత మార్చిలో డోపింగ్‌లో పట్టుబడ్డాడు. అతని నమూనాల్లో నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలినా... ఈ టాప్ ర్యాంకర్‌పై అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) మెతక వైఖరి అవలంభించింది. అతని టెస్టు ఫలితాన్ని ప్రపంచానికి తెలియనివ్వలేదు. కొన్ని నెలల తర్వాత బయటికి పొక్కినా కూడా 23 ఏళ్ల సినెర్ తను ఉద్దేశ పూర్వకంగా తీసుకోలేదని, బహుశా మసాజ్‌కు వాడిన తైలం వల్లా తన శరీరంలోకి ప్రవేశించి ఉండొచ్చనే వివరణతో ఐటీఐఏ సంతృప్తి చెంది పెద్దగా చర్యలేం తీసుకోలేదు. దీంతో టెన్నిస్ ఇంటిగ్రిటీపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. పలువురు దిగ్గజాలు, స్టార్లు, విశ్లేషకులు 'ఒక్కొక్కరికి ఒక్కోలా చట్టాలు–చర్యలా' అంటు దుమ్మెత్తిపోశారు. అయినా ఐటీఐఏ నిమ్మకు నీరెత్తినట్లే ఉండిపోయింది కానీ చర్యలు మాత్రం చేపట్టలేదు. 'వాడా' మాత్రం పరీక్షల్లో పట్టుబడ్డాడు కాబట్టి ఏడాదైనా నిషేధం విధించాలని స్పోర్ట్స్ అర్బిట్రేషన్ కోర్టులో అప్పీల్ చేసింది. చివరకు తాజాగా ఐటీఐఏ, సినెర్, వాడాల మధ్య ఒప్పందం కుదరడంతో వాడా ఇటీవల అప్పీల్‌ను ఉపసంహరించుకుంది. ఒప్పందంలో భాగంగా మూడు నెలలు నిషేధం విధించేందుకు ఐటీఐఏ సిద్ధమవగా... సినెర్ కూడా విమర్శలకు చెక్ పెట్టేందుకు సమ్మతించడంతో డోపింగ్ వివాదం ముగిసింది. ఫిబ్రవరి 9వ తేదీ నుంచి మే 4 వరకు ఈ నిషేధం అమలవుతుంది. ఈ కాలంలో అతను ఏ స్థాయి టెన్నిస్ టోర్నీల్లో పాల్గొనేందుకు వీలుండదు. అయితే మే 25 నుంచి జరిగే సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్ ఆడేందుకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో అతను బరిలోకి దిగుతాడు.

ఇదేం సస్పెన్షన్?

సినెర్‌కు విధించిన మూడు నెలల శిక్ష పట్ల టెన్నిస్‌లో పలువురు ఆటగాళ్లు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో విమర్శించిన తరహాలోనే సినెర్ చాలా తక్కువ శిక్షతో బయటపడ్డాడని... టెన్నిస్‌లో ఒక్కో ఆటగాడికి ఒక్కో రకమైన నిబంధన ఉందని వారు వ్యాఖ్యానించారు. 'సినెర్ సన్నిహితులు తమ పరపతిని బాగా ఉపయోగించినట్లుంది. కేవలం మూడు నెలల నిషేధంతో సరిపెట్టేలా చేసుకోగలిగారు. ఒక్క టైటిల్ వెనక్కి తీసుకోలేదు. కనీసం ప్రైజ్‌మనీలో కూడా కోత విధించలేదు. మరి అతను తప్పు చేసినట్లా, చేయనట్లా. టెన్నిస్‌కు దురదృష్టకరమైన రోజు. ఇక్కడ నిజాయితీ మిగల్లేదు' అని కిరియోస్ అన్నాడు. మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన స్టాన్ వావ్రింకా కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'టెన్నిస్ ఇక ఏమాత్రం స్వచ్ఛమైన ఆట కానే కాదు' అని చెప్పాడు. టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ కూడా 'ఇక్కడి వ్యవస్థ నిజంగా చెడిపోయింది. ఇది ఒక క్లబ్‌లా మాత్రమే వ్యవహరిస్తోంది. ఒక్కో కేసుకు ఒక్కో రకంగా స్పందిస్తోంది. అన్నింటా అసమానతలు ఉన్నాయి. ఎలాంటి పారదర్శకత, పద్ధతి లేవు. ఇది ఆటగాళ్లను అగౌరవపర్చడమే. ఇకపై మార్పు అవసరం' అని స్పందించింది.


కిరియోస్

జాతీయ కోచ్‌గా జీతు రాయ్



న్యూఢిల్లీ: భారత దిగ్గజ షూటర్ జస్పాల్ రాణా తిరిగి కోచ్‌గా జాతీయ షూటింగ్ జట్టుతో చేరాడు. భారత జాతీయ రైఫిల్ సమాఖ్య (ఎన్ఆర్ఏఐ).. జస్పాల్ రాణాను 25 మీటర్ల పిస్టల్ విభాగానికి 'హై పెర్ఫార్మెన్స్' కోచ్‌గా నియమించింది. అతడితో పాటు మాజీ ఆటగాడు జీతు రాయ్‌ను కూడా కోచింగ్ బృందంలో భాగం చేసింది. జీతూ ఆటగాడిగా ఆసియా క్రీడల్లో రెండు, కామన్వెల్త్ క్రీడల్లో రెండు పతకాలు గెలవడంతో పాటు ఆరు వరల్డ్ కప్ పతకాలు సాధించింది. అతని ఖాతాలో వరల్డ్ చాంపియన్‌షిప్ రజతం కూడా ఉంది. తొలి సారి అతను కోచ్‌గా బాధ్యతలు చేపడుతున్నాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో జీతూ రాయ్ శిక్షణ ఇవ్వనున్నాడు. రైఫిల్ విభాగానికి హెడ్ కోచ్‌గా ఇటీవల ద్రోణాచార్య అవార్డు దక్కించుకున్న దీపాలీ దేశ్‌పాండేను ఎంపిక చేసింది. మొత్తంగా ఎన్ఆర్ఏఐ 16 మంది కొత్త కోచ్‌లను ఎంపిక చేసింది. వీరితో పాటు ఇప్పటికే ఉన్న 19 మందిని కూడా కొనసాగించనున్నారు. పిస్టల్ విభాగంలో జీతు యువ షూటర్లకు శిక్షణ ఇవ్వనుండగా... 10 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌కు పూజ ఘట్కర్, 25 మీటర్ల పిస్టల్ విభాగానికి పెంబా తమాంగ్, స్కీట్‌కు అమరిందర్ చీమ, ట్రాప్‌కు వర్ష తోమర్ కోచ్‌లుగా వ్యవహరించనున్నారు. ఇద్దరు హై పెర్ఫార్మెన్స్ మేనేజర్లుగా మాన్‌షేర్ సింగ్, రోనక్ పండిట్‌ను ఎన్ఆర్ఏఐ నియమించింది. రాణాతో పాటు డీఎస్ చండేల్ (ఎయిర్ రైఫిల్), అన్వర్ సుల్తాన్ (ట్రాప్), మనోజ్ కుమార్ (50 మీటర్ల రైఫిల్) హై పెర్ఫార్మెన్స్ కోచ్‌లుగా వ్యవహరించనున్నారు.

గుల్వీర్ జాతీయ రికార్డు



న్యూఢిల్లీ: భారత యువ అథ్లెట్ గుల్వీర్ సింగ్ బోస్టన్‌లో జరిగిన ఇన్విటేషనల్ టోర్నీలో జాతీయ రికార్డు నెలకొల్పాడు. 3000 మీటర్ల ఇండోర్ రేసులో గుల్వీర్ సింగ్ 7 నిమిషాల 38.26 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. తద్వారా 16 ఏళ్ల క్రితం సురేందర్ సింగ్ (7:49.47) నెలకొల్పిన రికార్డును గుల్వీర్ బద్దలు కొట్టాడు. 2022 హాంగ్జౌ ఆసియా క్రీడల 10,000 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించిన గుల్వీర్... సీజన్ ఆరంభంలోనే రికార్డు నెలకొల్పడం ఆనందంగా ఉందన్నారు. 'సీజన్ తొలి ఇండోర్ టోర్నీలోనే మంచి ప్రదర్శన కనబర్చడం సంతోషంగా ఉంది. దీంతో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. ఈ స్ఫూర్తితో ఔట్ డోర్ ఈవెంట్‌లలోనూ సత్తా చాటుతా' అని 26 ఏళ్ల గుల్వీర్ పేర్కొన్నాడు. ఇదే టోర్నీలో పాల్గొన్న భారత మరో రన్నర్ రాహుల్ 8 నిమిషాల 8.27 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. ప్రస్తుతం గుల్వీర్ పేరిటే 5000 మీటర్లు, 10,000 మీటర్ల జాతీయ రికార్డులు ఉన్నాయి. 5000 మీటర్ల పరుగును 13 నిమిషాల 11.82 సెకన్లలో పూర్తి చేసిన గుల్వీర్... 10,000 మీటర్ల రేసును 27 నిమిషాల 14.88 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. ఈ ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరగనున్న నేపథ్యంలో భారత మిడిల్, లాంగ్ డిస్టాన్స్ రన్నర్‌లు ప్రస్తుతం అమెరికాలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు.

గుకేశ్‌కు చివరి స్థానం



హాంబర్గ్ (జర్మనీ): ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ నిరాశ పరిచాడు. శనివారం ముగిసిన ఈ టోర్నీలో గుకేశ్ ఆఖరి స్థానంతో సరిపెట్టుకున్నాడు. ప్లే ఆఫ్ పోరులో గుకేశ్ 0.5–1.5 పాయింట్ల తేడాతో అలిరెజా ఫిరౌజా (ఇరాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. క్వార్టర్ ఫైనల్లో ఫాబియానో కరువానా (అమెరికా) చేతిలో ఓడిన గుకేశ్... ప్లే ఆఫ్ రౌండ్ లోనూ ఆకట్టుకోలేకపోయాడు. తొలి రౌండ్‌ను 'డ్రా'చేసుకున్న గుకేశ్... రెండో రౌండ్‌లో తెల్ల పావులతో ఆడినా సత్తా చాటలేకపోయాడు. 30 ఎత్తుల్లో పరాజయం పాలయ్యాడు. ఓవరాల్‌గా విన్సెంట్ కైమెర్ (జర్మనీ) అగ్రస్థానం దక్కించుకోగా... ఫాబియా కరువానా (అమెరికా), మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఆ తర్వాత వరుసగా జవోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్; 4వ స్థానం), హికారు నకమురా (అమెరికా; 5వ స్థానం), నొద్రిబెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్; 6వ స్థానం), అలిరెజా ఫిరౌజా (7వ స్థానం) నిలిచారు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్లు పాల్గొన్న ఈ టోర్నీలో గుకేశ్ ఎనిమిదో స్థానంతో ముగించాడు. ఈ టోర్నీ మొత్తంలో గుకేశ్ ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించలేకపోయాడు.

ఐదుగురు స్పిన్నర్లా?

చాంపియన్స్ ట్రోఫీపై అశ్విన్ వాఖ్య



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసిన భారత జట్టులో ఐదుగురు స్పిన్నర్లు ఉండటంపై భారత మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఎలా చూసినా ఈ సంఖ్య ఎక్కువేనని అతను అభిప్రాయ పడ్డాడు. పాకిస్తాన్ ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీలో... టీమిండియా ఆడే మ్యాచ్‌లను దుబాయ్ వేదికగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అశ్విన్ మాట్లాడుతూ.. 'దుబాయ్‌లో ఐదుగురు స్పిన్నర్లు అవసరమా? అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌తో పాటు పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు తుది జట్టులో చోటు దక్కొచ్చు. వరుణ్ చక్రవర్తిని కూడా ఆడించాలనుకుంటే... ఒక పేస్ బౌలర్‌ను తగ్గించి పాండ్యానే రెండో పేసర్‌గా పరిగణించాల్సి ఉంటుంది. అదనపు పేసర్‌ను బరిలోకి దింపాలంటే ఒక స్పిన్నర్‌ను తగ్గించుకోక తప్పదు' అని అభిప్రాయపడ్డాడు. చాంపియన్స్ ట్రోఫీ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో అక్షర్, జడేజా, కుల్దీప్, వరుణ్‌తో పాటు వాషింగ్టన్ సుందర్ కూడా ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అశ్విన్... టీమిండియాలో 'సూపర్ స్టార్ కల్చర్'పై కూడా కీలక వ్యాఖ్యలు చేశాడు. 'భారత జట్టులో సూపర్ సెలబ్రిటీ విధానాన్ని తగ్గించాలి. దాన్ని ఏమాత్రం ప్రోత్సహించకూడదు. జట్టులో ఉండేది ఆటగాళ్లే... సూపర్ స్టార్లు కాదు. కెరీర్‌లో ఎంతో సాధించిన కోహ్లి, రోహిత్ ఇప్పుడు మరో సెంచరీ కొట్టినా అదేమీ పెద్ద ఘనత కాదు, మీ వ్యక్తిగత రికార్డు కూడా కాదు. అంతా జట్టు కోసమే' అని అశ్విన్ పేర్కొన్నాడు. ప్లేయర్లు వ్యక్తిగత మైలురాళ్లను పట్టించుకోకుండా జట్టు ప్రయోజనాల కోసమే ఆడాలని అశ్విన్ సూచించాడు. జాతీయ జట్టు తరఫున 106 టెస్టులాడి 537 వికెట్లు పడగొట్టిన అశ్విన్... 116 వన్డేల్లో 156 వికెట్లు తీశాడు. 65 టి20ల్లో 72 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా మూడో టెస్టు అనంతరం అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.

చెన్నైయిన్ విజయం

చెన్నై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) వరుసగా రెండో విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో చెన్నైయిన్ ఎఫ్‌సీ 2–1 గోల్స్ తేడాతో పంజాబ్ ఎఫ్‌సీపై విజయం సాధించింది. చెన్నైయిన్ జట్టు తరఫున విల్మార్ జోర్డాన్ గిల్ (19వ నిమిషంలో), డానియల్ చిమ చుకువా (84వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. పంజాబ్ జట్టు తరఫున లూకా మాజ్సెన్ (48వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. మ్యాచ్‌లో ఇరు జట్లు చెరో 12 షాట్లు ఆడాయి. అందులో ఐదేసి సార్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడి చేశాయి. అయితే మ్యాచ్ ఆరంభంలోనే జోర్డాన్ గిల్ గోల్‌తో చెన్నైయిన్ జట్టు ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత పంజాబ్ జట్టు స్కోరు సమం చేసినా... మ్యాచ్ మరి కాసేపట్లో ముగుస్తుందనగా... చెన్నైయిన్ మరో గోల్‌తో విజయం సాధించింది. తాజా సీజన్‌లో 21 మ్యాచ్‌లు ఆడిన చెన్నైయిన్ 6 విజయాలు, 9 పరాజయాలు, 6 'డ్రా'లతో 24 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో 10వ స్థానంలో ఉంది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో మోహన్ బగాన్ జట్టు 3–0 గోల్స్ తేడాతో కేరళా బ్లాస్టర్స్‌పై గెలుపొందింది. జేమీ మెక్‌లారెన్ (18వ, 40వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో విజృంభించగా... అల్బర్టో రోడ్రిగోజ్ (66వ నిమిషంలో) మరో గోల్ సాధించాడు. తాజా సీజన్‌లో 21 మ్యాచ్‌లు ఆడిన మోహన్ బగాన్ జట్టు 15 విజయాలు, 2 పరాజయాలు, 4 'డ్రా'లతో 49 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక 'టాప్'లో సాగుతోంది. లీగ్‌లో భాగంగా ఆదివారం జరగనున్న మ్యాచ్‌లో మోహమ్మదన్ స్పోర్ట్స్ క్లబ్‌తో ఈస్ట్ బెంగాల్ జట్టు తలపడుతుంది.


గోల్ చేసిన ఆనందంలో డానియల్ చిమ చుకువా

కట్టుబడినందుకు కట్టడి చేశారు

అసోసియేటెడ్ ప్రెస్‌ను బహిష్కరించిన ట్రంప్ !

అధ్యక్ష భవనం, ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలోకి అనుమతి నిరాకరణ

'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'అనే పాత పేరుకే కట్టుబడినందుకు ఆగ్రహించిన ప్రభుత్వం

అమెరికాలో దాదాపు వందకు పైగా సంచలనాత్మక కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీచేసిన డొనాల్డ్ ట్రంప్ అక్కడి అసోసియేటెడ్ ప్రెస్ వార్తాసంస్థపై కత్తిగట్టారు. అమెరికా తీరప్రాంతమైన 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'పేరును 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. అయినాసరే పాత పేరునే తమ రోజువారీ వార్తల్లో, కథనాల్లో వినియోగిస్తామని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) కరాఖండీగా చెప్పింది. దీంతో అధ్యక్షుడి నిర్ణయాన్నే బేఖాతరు చేస్తారా అన్న ఆగ్రహంతో ట్రంప్ పాలనాయంత్రాంగం శుక్రవారం నుంచి ఏపీ పాత్రికేయులకు అధ్యక్షభవనం, ఎయిర్‌ఫోర్స్ వన్ అధ్యక్ష విమానంలో రిపోర్టింగ్ కోసం అనుమతి నిరాకరించింది. అన్ని దేశాల్లో దినపత్రికలు, మేగజైన్‌లు, ఇతర వార్తాసంస్థలకు రోజువారీ వార్తలు, కథనాలు అందించే ప్రపంచంలో అతిపెద్ద న్యూస్‌ఏజెన్సీల్లో ఏపీ కూడా ఒకటి. ఇంతటి కీలకమైన బాధ్యతలు నిర్వర్తించే తమ ప్రతినిధులను అధ్యక్షభవనం వంటి ముఖ్యమైన చోటుకు రానివ్వకపోవడంపై 'ఏపీ'తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది వార్తాస్వేచ్ఛను అడ్డుకోవడమేనని వ్యాఖ్యానించింది. దీనిపై ట్రంప్ ప్రభుత్వం స్పందించింది. ''అధ్యక్షుని నిర్ణయాన్ని బేఖాతరు చేయడమంటే వార్తల్లో విభజన తెచ్చే సాహసం చేయడమే. పైగా తప్పుడు విషయాన్ని అందరికీ చేరవేయడమే. అధ్యక్షుని నిర్ణయానికి గౌరవం ఇవ్వని వ్యక్తులకు వైట్‌హౌస్‌లో, ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో తగు స్థానం లేదు. ఆ స్థానాన్ని ఇన్నాళ్లూ వైట్‌హౌస్‌లోకి రాలేక రిపోర్టింగ్ చేయలేకపోయినా ఇతర మీడియా ప్రతినిధులకు కల్పిస్తాం''అని వైట్‌హౌస్ డెప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ టేలర్ బుడోవిచ్ వాదించారు. దీనిపై ఏపీ మళ్లీ స్పందించింది. ''అమెరికన్ వినియోగదారులను మినహాయిస్తే ప్రపంచవ్యాప్తంగా ఉన్న మా వినియోగదారులకు 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'అనే పేరు వాస్తవం. ఆ దృక్కోణంలో పాత పేరుకే కట్టుబడి ఉన్నాం. ఈ విషయంలో అధ్యక్షుడు కార్యనిర్వాహక ఉత్తర్వును ధిక్కరించినట్లుగా భావించకూడదు''అని ఏపీ స్పష్టంచేసింది.

దశాబ్దాలుగా పూల్ రిపోర్టర్‌గా..

ప్రముఖ మీడియా సంస్థల కొద్దిపాటి మీడియా ప్రతినిధులు, కెమెరామెన్‌లకు మాత్రమే వైట్‌హౌస్, ఎయిర్‌ఫోర్స్ వన్ వంటి కీలక ప్రదేశాల్లోకి అనుమతిస్తారు. ఇది దశాబ్దాలుగా కొనసాగుతోంది. నాటి అమెరికా అధ్యక్షుడు జేమ్స్ ఏ గార్‌ఫీల్డ్ హత్యోదంతం తర్వాత కొద్దిమంది మీడియా వాళ్లనే అనుమతించడం మొదలెట్టారు. ఇది 1881 ఏడాదినుంచి మొదలైంది. ఈ మీడియా బృంద సభ్యులను పూల్ రిపోర్టర్ అంటారు. 'ఏపీ'ప్రతినిధి చాన్నాళ్లుగా ఇలా పూల్ రిపోర్టర్‌గా కొనసాగుతున్నారు. తమను లోపలికి అనుమతించకపోవడం పూర్తి వివక్షాపూరిత నిర్ణయం అని ఏపీ ప్రతినిధి ఒకరు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేయాలని 'ఏపీ'భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్క ఏపీనే బయటకు గెంటేయడంపై వైట్‌హౌస్‌లోని 'ది వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్(డబ్ల్యూహెచ్‌సీఏ)'తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ''ప్రస్తుతానికైతే ఏపీకి బదులు రొటేషన్‌లో భాగంగా వేరే ప్రతినిధికి అవకాశం కల్పిస్తాం. సాధారణంగా ప్రతి రోజూ రొటేషన్‌లో ఏపీకి అవకాశం ఉంటుంది. కానీ ఇలా ఏకపక్షంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అమెరికా రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. భావప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లజేస్తూ ప్రభుత్వం సెన్సార్‌షిప్‌కు తెరలేపుతోంది''అని డబ్ల్యూహెచ్‌సీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

– సాక్షి, నేషనల్ డెస్క్



సెర్బియాలోని క్రగుజెవాక్‌లో శనివారం నిరసనల్లో పాల్గొన్న వేలాది మంది కాలేజీ విద్యార్థులు, నిరసనకారులు. గత ఏడాది నవంబర్ ఒకటో తేదీన నోవీ సాద్ సిటీలోని రైల్వేస్టేషన్ బయటివైపు పైకప్పు కుప్పకూలడంతో 15 మంది చనిపోయారు. ఇటీవల ఆధునీకరించిన పైకప్పు కూలడంతో నిర్మాణంలో అవినీతి భారీ స్థాయిలో జరిగిందంటూ విద్యార్థిలోకం ఆందోళన బాట పట్టింది.

'370' రద్దుతో కొత్త కశ్మీరం

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

కాత్రా: 2019లో చారిత్రక ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ నూతన ప్రయాణం మొదలైందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. పవిత్రమైన జమ్మూకశ్మీర్ ఇక కల్లోలిత ప్రాంతం ఎంతమాత్రమూ కాదని స్పష్టం చేశారు. ఒకప్పుడు అశాంతి నెలకొన్న ప్రాంతంలో నేడు నిజమైన స్థిరత్వం, భద్రత నెలకొన్నాయన్నారు. ఆర్టికల్ 370 మినహా అన్ని అధికరణాలను రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ముసాయిదాలో పేర్కొన్నారని ధన్‌ఖడ్ వివరించారు. ఆర్టికల్ 370ని ఆయన ఎందుకు తిరస్కరించారనే నేపథ్యాన్ని తెలుసుకునేందుకు చారిత్రక కోణంలో ఆలోచించాలని కోరారు. అదేవిధంగా, జమ్మూకశ్మీర్ మినహా అన్ని సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసే బాధ్యతను ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ భుజాన వేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు, జమ్మూకశ్మీర్‌లో మార్పు పవనాలు శాంతి, ప్రగతిని తీసుకువచ్చాయి. 'ఒకప్పటి జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ను 2019లో కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం చారిత్రక ఘటన. భరతమాత గొప్ప ముద్దుబిడ్డ కలలు గన్న 'ఒకే దేశం, ఒకే విధానం, ఒకే గుర్తు, ఒకే ప్రధాని'(ఏక్ దేశ్, ఏక్ నిషాన్, ఏక్ విధాన్, ఏక్ ప్రధాన్) అన్న ఆకాంక్ష దీనితో నెరవేరింది'అని బీజేపీ సైద్ధాంతిక కర్త శ్యామా ప్రసాద్ ముఖర్జీని ఉద్దేశిస్తూ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ శనివారం శ్రీ మాతా వైష్ణోదేవి యూనివర్సిటీ(ఎస్ఎంవీడీయూ)10వ స్నాతకోత్సవంలో ప్రసంగించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, విద్యా మంత్రి సకీనా ఫిర్దౌస్ పాల్గొన్నారు. స్నాతకోత్సవంలో 684 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, 147 మంది మాస్టర్స్ డిగ్రీ, 34 మందికి ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీలు, 44 మందికి పీహెచ్‌డీ డిగ్రీలు ప్రదానం చేశారు.



శ్రీ మాతా వైష్ణోదేవి వర్సిటీ స్నాతకోత్సవంలో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ మాటామంతీ

1980–1989 మధ్య ఎంతో అంతరం

జమ్మూకశ్మీర్‌కు మొట్టమొదటిసారిగా 1980ల్లో కుటుంబంతో వచ్చాను. పర్యాటక ప్రాంతాలైన గుల్మార్గ్, సోనామార్గ్ తదితర చోట్ల తిరిగాం. 1989లో పార్లమెంట్‌కు ఎన్నికయ్యాక జరిగిన రెండో పర్యటన మాత్రం బాధాకరంగా సాగింది. కేంద్ర మంత్రివర్గ సభ్యుల బృందంలో ఒకడిగా శ్రీనగర్‌కు వచ్చా. శ్రీనగర్ వీధుల్లో వెళ్తుంటే ప్రజలు పట్టుమని పది మంది కూడా కనిపించలేదు. అంతా నిరాశాపూరిత వాతావరణం ఆవరించి ఉంది'అని అప్పటి ఘటనలను ఆయన గుర్తు చేసుకున్నారు. 'ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రశాంతత నెలకొంది. 2023లో కనీసం రెండు లక్షల మంది పర్యాటకులు జమ్మూకశ్మీర్‌ను సందర్శించారనే విషయం రాజ్యసభలో ప్రకటించడం గొప్ప విషయం. దీనివల్ల స్థానిక ఆర్థిక రంగం ఎంతో బలోపేతమైందన్నారు. అదేవిధంగా, దాదాపు 35 ఏళ్ల అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది'అని ఉపరాష్ట్రపతి వివరించారు. ఒకప్పుడు భూతల స్వర్గంగా పేరున్న జమ్మూకశ్మీర్ ఇప్పుడు సంపదకు, కలలకు చిహ్నంగా మారిందని ప్రకటించారు. 'ఇక్కడ మార్పు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నడూ లేని విధంగా రూ.65 వేల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలు అందాయి. మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ సంస్థల నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవేశించాయి. జమ్మూకశ్మీర్, భారత్ నూతన ఉషోదయానికి నిర్మాతలమవుదాం'అని ఆయన పిలుపునిచ్చారు.

జాతి ప్రయోజనాలే అత్యున్నతం

రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యముంటుందని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ పేర్కొన్నారు. మనం భారతీయులం, భారతీయతతోనే మనకు గుర్తింపు. జాతీయవాదం మన మతం. ఎలాంటి పరిస్థితుల్లోనైనా జాతీయవాదాన్ని ప్రథమంగా ఉంచడం మన కర్తవ్యం'అని స్పష్టం చేశారు. ఏ రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకంటే జాతీయ ప్రయోజనాలదే అత్యున్నత స్థానమన్నారు. ఈ దిశగా పడే ప్రతి అడుగు వలస పాలననాటి భావనలను విడనాడి, న్యాయ పాలన దిశగా సాగుతుందని వివరించారు. జమ్మూకశ్మీర్ కేవలం ఒక ప్రాంతం కాదు, జాతి పునరుజ్జీవనంలో ఒక ముఖ్యమైన భాగమన్నారు.

ఉగ్ర లింకులున్న ముగ్గురు ఉద్యోగుల తొలగింపు

జమ్మూ: ఉగ్ర మూకలతో సంబంధాలున్నట్లు తేలడంతో పోలీసు కానిస్టేబుల్ సహా ముగ్గురు ఉద్యోగులను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శనివారం విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరిలో పోలీస్ కానిస్టేబుల్ ఫిర్దౌస్ అహ్మద్ భట్, స్కూల్ టీచర్ అష్రాఫ్ భట్, అటవీ శాఖ ఉద్యోగి నిసార్ అహ్మద్ ఖాన్ ఉన్నారు. నిసార్ అహ్మద్ ఖాన్ 2000వ సంవత్సరంలో నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన మంత్రి హత్య కేసులో అరెస్టయ్యాడు. ఇతడికి హిజ్బుల్ ముజాహిదీన్‌తో సంబంధాలున్నట్లు తేలింది. అదేవిధంగా, 2005లో స్పెషల్ పోలీస్ అధికారి(ఎస్‌పీవో)గా నియమితుడై, 2011లో కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొందిన ఫిర్దౌస్‌కు ఉగ్రలింకులున్నట్లు తేలడంతో గతేడాది సస్పెండ్ చేశారు. ఆయుధాలు, డ్రగ్స్ సరఫరా చేసే ఇతడు ప్రస్తుతం కొట్ భల్వాల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అనంత్‌నాగ్ జిల్లాలో దాడులకు పథక రచన చేస్తుండగా మరో ఇద్దరు ఉగ్రవాదులతోపాటు పట్టుకున్నారు. రియాసికి చెందిన అష్రాఫ్ భట్ రెహబార్–ఇ–తలీం టీచర్‌గా 2008లో చేరాడు. ఇతడికి లష్కరేతోయిబాతో సంబంధాలున్నాయి. పాక్ కేంద్రంగా పనిచేసే మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మహ్మద్ కాసిమ్ ఆదేశాల మేరకు ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇతడిని పోలీసులు 2022లో అరెస్ట్ చేశారు.

గుర్రంపై ఊరేగుతూ ప్రాణాలొదిలిన పెళ్లికొడుకు

షోపూర్(ఎంపీ): పెళ్లి సంబరాల్లో మునిగితేలుతున్న ఓ పెళ్లికొడుకు హఠాన్మరణం అక్కడి వారందరినీ హతాశులను చేసింది. మధ్యప్రదేశ్‌లోని షోపూర్ జిల్లాలో పెళ్లివేడుకలో ఈ విషాదం చోటుచేసుకుంది. పెళ్లి సందర్భంగా గుర్రంపై ఊరేగుతూ శుక్రవారం రాత్రి వరుడు విగతజీవిగా మారిన వైనం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సూస్వాడా గ్రామానికి చెందిన 26 ఏళ్ల ప్రదీప్ జాట్ పెళ్లి వేడుక శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అక్కడి వేదికవైపు ప్రదీప్ పెళ్లికొడుకు దుస్తుల్లో గుర్రంపై బయల్దేరారు. ఇదే సమయంలో హఠాత్తుగా ముందుకు ఒరిగి అలాగే గుర్రంపై కూలబడిపోయారు. ఇది గమనించిన బంధువులు వెంటనే ప్రదీప్‌ను జాగ్రత్తగా కిందకు దింపి హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతని ప్రాణం పోయిందని జిల్లా ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ ఆర్‌బీ గోయల్ ధ్రువీకరించారు. గుండెపోటు కారణంగా పెళ్లికొడుకు ప్రాణాలు కోల్పోయి ఉంటారని వైద్యులు భావిస్తున్నారు. పెళ్లికొడుకు ప్రదీప్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ)కి షోపూర్ జిల్లా అధ్యక్షునిగా గతంలో పనిచేశారు.

శ్వేతసౌధంలో ట్రంప్ మగ్‌షాట్

అరెస్ట్‌నాటి ఫొటోనే ఫ్రేమ్ కట్టి మరీ వైట్‌హౌస్‌లో తగిలించుకున్న వైనం

ఏదైనా కేసులో ఒక నేత అరెస్ట్ అయితే ఆ విషయాన్ని పత్రికా సమావేశంలోనో, మరే సందర్భంలోనో ప్రస్తావిస్తే ఆ నేతకు అస్సలు నచ్చదు. అసలు తనను అన్యాయంగా అరెస్ట్ చేశారని అంతెత్తున లేచి ఖండిస్తారు. అరెస్ట్‌నాటి ఫొటోలను ఒకవేళ మళ్లీ ఆయన ముందే పెడితే ఉగ్రరూపం దాల్చినా ఆశ్చర్య పోనక్కర్లేదు. అలాంటిది తెంపరితనానికి మారుపేరుగా నిలిచిపోయిన అగ్రరాజ్యానికి అధినేత డొనాల్డ్ ట్రంప్ ఇంకెలా స్పందిస్తారో అని చాలా మంది భావించడం సహజం. కానీ అలాంటి ఆలోచనలకు పటాపంచలు చేస్తూ, విభిన్నంగా ట్రంప్ తన అరెస్ట్ నాటి ఫొటోను పెద్ద సైజులో తీయించి చక్కగా బంగారు రంగు ఫ్రేమ్ కట్టి ఏకంగా అధ్యక్షభవనంలోనే తగిలించారు. అది కూడా ఎక్కడో కనిపించనట్లు ఓ మూలన కాకుండా నేరుగా కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీచేసే ఓవల్ ఆఫీస్ గోడకే తగిలించారు. రెండ్రోజుల క్రితం అమెరికా పర్యటనకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీ వైట్‌హౌస్‌కు వెళ్లినప్పుడు అక్కడి మీడియా కెమెరామెన్‌లు ఓవల్ ఆఫీస్ అంతటినీ తమ కెమెరాల్లో బంధించిన వేళ ఈ మగ్‌షాట్ ఫొటోఫ్రేమ్ విషయం వెలుగులోకి వచ్చింది.



వైట్‌హౌస్ ఓవెల్ ఆఫీస్ గది వద్ద ట్రంప్ మగ్‌షాట్ ఫొటోఫ్రేమ్

ఏమిటీ మగ్‌షాట్ ?

2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి జార్జియా రాష్ట్రంలో ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై నాటి రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్‌ను అరెస్ట్‌చేశారు. ఆ సందర్భంగా 2023 ఆగస్ట్‌లో జార్జియా రాష్ట్రంలోని ఫుల్టన్ కౌంటీ జైలుకు వచ్చి ట్రంప్ లొంగిపోయారు. కస్టడీలోకి తీసుకునే ముందు అరెస్ట్ అయిన నిందితుడి ముఖం స్పష్టంగా తెలిసేలా దగ్గరి ఫొటో అంటే మగ్ షాట్‌ను నిబంధనల ప్రకారం తీసుకుంటారు. ట్రంప్ ఫొటో సైతం అలాగే తీశారు. మాజీ అధ్యక్షుడిని ఇలా మగ్‌షాట్ తీయడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి. దీంతో ట్రంప్ మగ్‌షాట్ ఆన్‌లైన్‌లో విపరీతంగా వైరల్ అయింది. ఆ ఫొటోను ఆనాడు ప్రఖ్యాత న్యూయార్క్ పోస్ట్ సైతం ఫ్రంట్‌పేజీలో ప్రచురించింది. ఆ ఫ్రంట్‌పేజీ కటౌట్‌నే ట్రంప్ ఫ్రేమ్ కట్టించారు. మగ్‌షాట్‌పై నాటి అధికార డెమొక్రాట్లు, నాటి అధ్యక్షుడు జో బైడెన్ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. అయితే ట్రంప్‌కు మద్దతుగా ఇదే మగ్‌షాట్ ఫొటోలను ఆన్‌లైన్‌లో ప్రచారానికి రిపబ్లికన్ నేతలు వాడుకున్నారు. తాజాగా మగ్‌షాట్‌ను వైట్‌హౌస్‌లో ఫ్రేమ్ కట్టిన విషయం అందరికీ తెలియడంతో వైట్‌హౌస్ డెప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ డాన్ స్కావినో ఒక పోస్ట్‌చేశారు. ''హ్యాపీ వేలంటైన్ డే. అందమైన ఓవల్ ఆఫీస్‌లోకి మీకందరికీ స్వాగతం''అని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. ఈ ఫొటోఫ్రేమ్‌ను మాజీ అమెరికా అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్, ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్‌ల ఫొటోల సమీపంలో తగిలించారు. ఆనాడు అరెస్ట్ అయిన వెంటనే పూచీకత్తు మీద ట్రంప్ విడుదలయ్యారు. ఎలాగూ ఫొటో వైరల్‌గా మారడంతో దీనిని వ్యాపారవస్తువుగా ట్రంప్ మార్చేశారు. స్వయంగా ఆయన తన మగ్‌షాట్ ఫొటోల విక్రయం ద్వారా దాదాపు రూ.61 కోట్లు ఆర్జించారు. టీ–షర్ట్‌లు మొదలు డిజిటల్ ట్రేడింగ్ కార్డుల దాకా అన్నింటిపైనా ఈ మగ్‌షాట్‌నే ముద్రించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

కారు తగిలిందని ఆటోడ్రైవర్ దాడి..

మాజీ ఎమ్మెల్యే మృత్యువాత

దొడ్డబళ్లాపురం: ఆటోకు కారు తాకిన విషయమై చెలరేగిన గొడవ మాజీ ఎమ్మెల్యే ప్రాణాలనే తీసింది. ఈ సంఘటన కర్ణాటకలోని బెళగావిలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గోవాలోని పోండా నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే లావూ సూర్యాజీ మామలేదార (69) ఓ పని నిమిత్తం బెళగావికి వచ్చారు. ఆయన నడుపుతున్న కారు ఒక ఆటోకు తగిలింది. దీంతో ఆటో డ్రైవర్ ముజాహిద్ సనాది (28) గొడవపడి దాడి చేశాడు. అనంతరం సూర్యాజీ కారులో తను బస చేసిన లాడ్జికి వెళ్లారు. కారును నిలిపి నాలుగడుగులు వేయగానే కుప్పకూలి ప్రాణాలొదిలారు. మార్కెట్ ఏరియా పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆటో డ్రైవర్ ముజాహిద్‌ని అరెస్టు చేశారు.

కారు, బస్సు ఢీకొని 10 మంది మృతి

మహా కుంభ్‌కు వెళ్తుండగా విషాదం

ప్రయాగ్‌రాజ్: బస్సు, బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మహాకుంభ మేళాకు వెళ్తున్న 10 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన ప్రయాగ్‌రాజ్‌లోని మెజా పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బాకు చెందిన 10 మంది బొలెరో వాహనంలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగే కుంభమేళాకు వెళ్తున్నారు. వీరి వాహనం హైవేపై ఎదురుగా వేగంగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ఘటనలో బొలెరోలోని మొత్తం పది మందీ తీవ్రగాయాలతో మృతి చెందారు. బస్సులోని కొందరు గాయపడ్డారు. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.



మహాకుంభ్‌మేళా ఆవరణలో శనివారం అగ్నిప్రమాదం జరిగి అగ్నికీలలు ఎగిసిపడుతున్న దృశ్యం

రష్యా బీర్ క్యాన్‌పై మహాత్ముడి చిత్రం

సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తంచేస్తున్న జనం

న్యూఢిల్లీ: అహింస, మద్యపానం నిషేధం కోసం జీవితాంతం పోరాటం సాగించిన జాతిపిత మహాత్మాగాంధీ చిత్రం రష్యా బీర్ క్యాన్‌పై ప్రత్యక్షమైంది. రష్యాకు చెందిన రివార్ట్ అనే బీర్ బ్రాండ్‌పై మహాత్ముడి ఫొటోతోపాటు ఆయన సంతకాన్ని సైతం ముద్రించారు. సదరు కంపెనీ తీరుపై సోషల్ మీడియాలో జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీర్ క్యాన్ చిత్రాలను ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నందిని శతపథి మనవడు సుపర్నో శతపథి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ విషయాన్ని రష్యా దృష్టికి తీసుకెళ్లాలని, బీర్ క్యాన్‌పై గాంధీజీ ఫొటో తొలగించేలా చర్యలు తీసుకోవాలని భారత ప్రధాన నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. మద్యపాన వ్యతిరేకి అయిన గాంధీజీ చిత్రాలన్ని బీర్ క్యాన్ ముద్రించి అమ్ముకోవడం తనకు ఆవేదనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. 'మీ మిత్రుడైన రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సమాచారం చేరవేయండి, వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోండి'అని మోదీని కోరారు. సుపర్నో శతపథి షేర్ చేసిన పోస్టు సోషల్ మీడియాలో గంటల వ్యవధిలోనే చర్చనీయాంశంగా మారింది. లక్షల మంది దీనిపై స్పందించారు. రష్యా బీర్ కంపెనీ తీరును తప్పుపట్టారు.

ప్రసంగాలు కాదు, యువతకు ప్రోత్సాహం కావాలి

డ్రోన్ల తయారీ రంగంలో మనం బలమైన పోటీదారుగా ఎదగాలి

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ)పై కేవలం మాటలు చెబితే సరిపోదని, నిర్మాణాత్మక కార్యాచరణ కావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. మన పోటీదార్లు ఏఐలో నూతన సాంకేతిక విధానాలతో ముందుకు దూసుకెళ్తుంటే, మన ప్రధాని నరేంద్ర మోదీ టెలిప్రాంప్టర్‌తో ప్రసంగాలు ఇవ్వడానికే పరిమితం అవుతున్నారని ఆక్షేపించారు. మన దేశంలో ప్రతిభకు కొదవ లేదని, కావాల్సిందల్లా ప్రోత్సాహమేనని సూచించారు. బలమైన ఉత్పత్తి వ్యవస్థను నిర్మించాలన్నారు. ఉత్త మాటలు పక్కనపెట్టి, నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని, తద్వారా మన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని తెలిపారు. ఈ మేరకు రాహుల్ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. యుద్ధరీతుల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టేలా డ్రాగన్ దేశం చైనా అత్యాధునిక డ్రోన్ల ఉత్పత్తి ప్రారంభించిందని వెల్లడించారు. డ్రోన్ల తయారీ రంగంలో మనం బలమైన పోటీదారుగా ఎదిగేలా ఒక సమగ్ర వ్యూహాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్ టెక్నాలజీపై 9 నిమిషాల నిడివిగల వీడియోను రాహుల్ గాంధీ షేర్ చేశారు. భవిష్యత్తు అవసరాల కోసం ఇలాంటి సాంకేతికతను అభివృద్ధి చేయగల ప్రతిభ, ఇంజనీరింగ్ స్కిల్స్ ఇండియాకు ఉన్నాయని స్పష్టంచేశారు. పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై తాను మాట్లాడిన వీడియోను సైతం రాహుల్ గాంధీ షేర్ చేశారు. యుద్ధ రంగంలో డ్రోన్ల ప్రాధాన్యతను ఆయన ఈ వీడియోలో ప్రస్తావించారు.

గౌరవ్ గొగోయ్ భార్యకు పాక్ లింకులు..

సిట్‌తో దర్యాప్తు: సీఎం హిమంత

గౌహతి: కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ భార్య, బ్రిటిష్ పౌరురాలైన ఎలిజబెత్ కొల్బర్న్‌కు పాకిస్తాన్‌తో సంబంధాలున్నాయంటూ వచ్చిన ఆరోపణలపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేస్తామని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంతోపాటు సానుభూతిపరులు ఎవరున్నారనే విషయమై లోతుగా విచారణ జరుగుతుందని తెలిపారు. గతంలో గౌరవ్ తండ్రి, దివంగత తరుణ్ గొగోయ్ సీఎంగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి కార్యాలయంలోకి పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ చొరబడిందా అనే అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో కొల్బర్న్ పాకిస్తాన్‌కు వెళ్లి వచ్చారన్నారు. లీడ్ పాకిస్తాన్‌లో పనిచేస్తున్న సమయంలో కొల్బర్న్‌కు సహోద్యోగిగా ఉన్న అలీ తౌకీర్ షేక్ ప్రస్తుతం పాకిస్తాన్ ప్రణాళికా సంఘం సలహాదారుగా ఉన్నారని చెప్పారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఆర్టికల్ ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



స్థానిక ప్రభుత్వాలు

మండల పరిషత్

మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల పరిషత్ మధ్యస్థ అంచె. 1986లో ఎన్టీ రామారావు హయాంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 330 పంచాయతీ సమితిల స్థానంలో 1104 మండలాలను ఏర్పాటు చేశారు. మండల పరిషత్‌లో సుమారు 15 నుంచి 18 గ్రామ పంచాయతీలు, 35 వేల నుంచి 55 వేల జనాభా ఉంటుంది. మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో తాలుకా పంచాయతీ అని, మధ్యప్రదేశ్‌లో జన్‌పథ్ పంచాయతీ, తమిళనాడులో పంచాయతీ సంఘం, అరుణాచల్ ప్రదేశ్‌లో అంచల్ కమిటీ, ఉత్తరప్రదేశ్‌లో క్షేత్ర పంచాయతీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మండల పరిషత్ అని వ్యవహరిస్తారు.

మండల పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి ఓటర్లతో ప్రత్యక్షంగా ఎన్నికైన సభ్యులు(ఎంపీటీసీ).
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఆ ప్రాంతంలో రిజిస్టర్ అయిన ఎమ్మెల్సీ, రాజ్యసభ మెంబర్ సభ్యులుగా ఉంటారు.
- ఎంపీటీసీ సభ్యులు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఒకరిని కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకుంటారు.
- మండల పరిషత్ సమావేశాలకు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. వీరికి ఓటు హక్కు ఉండదు.
- 3 నుంచి 4 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక ప్రాదేశిక నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తారు.
- ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల పదవీ కాలం అయిదేళ్లు.
- కలెక్టర్, వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు మండల పరిషత్‌లో శాశ్వత ఆహ్వానితులు. వీరికి ఓటు వేసే అధికారం లేదు.
- ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986 జూన్‌లో ఏర్పాటు చేశారు. 1987 జనవరి 7న నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

విధులు

గ్రామ పంచాయతీ, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో మండల పరిషత్ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం విత్తనాలు, ఎరువుల సరఫరా, నీటి సౌకర్యం కల్పించి బీడు భూములను సాగులోకి తేవడం, అడవుల పెంపకం, పశుగణాభివృద్ధి, ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణ, ప్రసూతి కేంద్రాలు, టీకాలు, అంటు రోగాల నివారణ, ప్రాథమిక విద్యా సౌకర్యాల కల్పన, పర్యవేక్షణ.

ఆర్థిక వనరులు

- భూమి శిస్తు, రాష్ట్రం విధించే పన్నులు, ఫీజుల నుంచి వచ్చే వాటా.
- సామాజిక అభివృద్ధికి సంబంధించిన నిధులు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అఖిల భారత సంస్థలు ఇచ్చే గ్రాంట్లు.
- మండల పరిషత్ విధించే పన్నుల ద్వారా వచ్చే ఆదాయం
- దాతలు ఇచ్చే విరాళాలు
- మండల పరిషత్ కార్యనిర్వహణాధికారిగా మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌ను ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 9 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. హైదరాబాద్‌కు జిల్లా పరిషత్ లేదు.

జిల్లా పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజక వర్గాల నుంచి ఓటర్లతో ఎన్నికైన సభ్యులు (జెడ్పీటీసీలు)
- జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు.
- అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు.
- జెడ్పీటీసీ సభ్యుల నుంచి ఒకరిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ప్రతి జిల్లా పరిషత్‌లో జిల్లా మహాసభ ఉంటుంది. ఇందులో జిల్లాలోని మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారు.
- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇతడు జిల్లా పరిషత్‌కు పాలనా పరమైన అధికారిగా విధులు నిర్వహిస్తాడు.

జిల్లా పరిషత్ స్థాయి సంఘాలు

1. ప్రణాళికా, ఆర్థిక స్టాండింగ్ కమిటీ
2. గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ
3. వ్యవసాయ స్టాండింగ్ కమిటీ
4. విద్య, వైద్య సేవల స్టాండింగ్ కమిటీ
5. స్త్రీ, సంక్షేమ స్టాండింగ్ కమిటీ
6. సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ
7. పన్నుల స్టాండింగ్ కమిటీ

- ప్రతి స్థాయి కమిటీలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవీరీత్యా సభ్యుడిగా ఉంటాడు. కానీ అతడికి ఓటు వేసే అధికారం ఉండదు. ఇతర సభ్యులను నామినేట్ చేస్తాడు.
- జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశాలకు జిల్లా కలెక్టర్ హాజరు కావొచ్చు. కానీ ఓటు హక్కు ఉండదు.

జిల్లా పరిషత్ విధులు

- జిల్లా పరిషత్ జిల్లాలోని మండల పరిషత్‌ల వార్షిక బడ్జెట్లను ఆమోదిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను మండల పరిషత్‌లకు పంపిణీ చేస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల అమలు.
- గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల ఆర్థిక విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు ఇస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమయ్యే గణాంక సమాచారాన్ని అందిస్తుంది.
- జిల్లాలో సెకండరీ పాఠశాలలు, వృత్తి విద్యా పాఠశాలలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుంది.
- జిల్లాలో వైద్య సౌకర్యాల నిర్వహణ.

ఆర్థిక వనరులు

1. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు.
2. అఖిల భారత సంస్థలు అందించే గ్రాంట్లు
3. భూమి పన్ను.
4. ఎండోమెంట్స్,ట్రస్టుల ద్వారా వచ్చే ఆదాయం
5. ఫీజులు.
6. ప్రజలు, సంస్థలు ఇచ్చే విరాళాలు.
7. మండల పరిషత్‌ల నుంచి వచ్చే కంట్రిబ్యూషన్లు.
8. లాభసాటి సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం.

- 243 (జె) అధికరణం ద్వారా పంచాయతీల ఖర్చులను రికార్డ్ చేయడం. ఆడిటింగ్‌కు సంబంధించి తగిన శాసనాన్ని శాసనసభ చేయాలి.
- 243 (జెడ్‌డీ) అధికరణం ప్రకారం జిల్లా ప్రణాళికా అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలి.
- ఎస్సీ, ఎస్టీలు నివసించే ప్రదేశాల్లో పంచాయతీరాజ్ విధానం అమలు కోసం 1994 లో 'దిలీప్‌సింగ్ బురియా' కమిటీని ఏర్పాటు చేశారు.
- దిలీప్‌సింగ్ బురియా కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేసింది. ఈ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం 1996 డిసెంబర్ 24న ఆమోదించింది.

ఈ కమిటీ ప్రతిపాదించిన మూడంచెలు

1. గ్రామసభ
2. గ్రామ పంచాయతీ
3. పంచాయతీ సమితి/ తాలుకా పంచాయతీ

మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ పీఠికలోని 'భారత ప్రజలమైన మేము' అనే పదాలు ఏ విషయాన్ని తెలియజేస్తాయి?
ఎ) ప్రజలు స్వార్థపరులు
బి) ప్రజలే సార్వభౌములు
సి) ప్రజలు చేతకాని వారు
డి) ఏదీకాదు
2. సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెబుతూ రాజ్యాంగంలో 'మౌలిక లక్షణాలు' అనే అంశాన్ని స్పష్టీకరించింది?
ఎ) గోలక్‌నాథ్ కేసు
బి) మినర్వా మిల్స్ కేసు
సి) ఇందిరా సహానీ కేసు
డి) కేశవానంద భారతి కేసు
3. భారత రాజ్యాంగం మొదట కల్పించిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
ఎ) అయిదు బి) ఏడు
సి) ఆరు డి) తొమ్మిది
4. ఏ తరహా ప్రభుత్వ విధానాన్ని భారత రాజ్యాంగం అవలంబించింది?
ఎ) ఏక కేంద్ర ప్రభుత్వం
బి) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
సి) అధ్యక్ష తరహా ప్రభుత్వం
డి) నియంతృత్వ ప్రభుత్వం
5. రాజ్యాంగంలో అస్పృశ్యత నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
ఎ) 14 బి) 15 సి) 16 డి) 17
6. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించిన ఆర్టికల్?
ఎ) 17 బి) 16 (4) సి) 18 డి) 18 (2)
7. భారత రాజ్యాంగం పౌరులకు ఎన్ని రకాల స్వేచ్ఛలను కల్పించింది?
ఎ) అయిదు బి) ఏడు
సి) ఆరు డి) ఎనిమిది
8. ప్రస్తుతం ఆస్తి హక్కు 300–ఎ ఆర్టికల్ కింద ఏ హక్కుగా మారింది?
ఎ) రాజకీయ హక్కు బి) ఆర్థిక హక్కు
సి) పౌర హక్కు డి) నైతిక హక్కు
9. 2002లో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యను 21 (ఎ) ఆర్టికల్ కింద చేర్చారు?
ఎ) 80 బి) 81 సి) 87 డి) 86
10. భారత పౌరులకు రాజ్యాంగం ద్వారా లభించిన పౌరసత్వం?
ఎ) ద్వి పౌరసత్వం బి) ఏక పౌరసత్వం
సి) త్రి పౌరసత్వం డి) ఏదీకాదు
11. భారత రాజ్యాంగంలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులు ఎన్ని?
ఎ) 9 బి) 10 సి) 11 డి) 12
12. ఒక వ్యక్తిని 24 గంటలకు మించి కస్టడీలో ఉంచడానికి వీలు లేదని తెలిపే ఆర్టికల్?
ఎ) 20 బి) 21 సి) 22 డి) 23
13. ప్రాథమిక విధులపై పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీ?
ఎ) స్వరణ్‌సింగ్ కమిటీ
బి) సైమన్ కమిటీ
సి) సర్కారియా కమిటీ
డి) వెంకటాచలయ్య కమిటీ
14. దేశంలో తొలిసారిగా ఉమ్మడి పౌరస్మృతిని అమల్లోకి తెచ్చిన రాష్ట్రం?
ఎ) సిక్కిం బి) తమిళనాడు
సి) ఉత్తరాఖండ్ డి) హర్యానా
15. ఏ ప్రధానమంత్రి హయాంలో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు?
ఎ) రాజీవ్‌గాంధీ
బి) ఇందిరాగాంధీ
సి) చంద్రశేఖర్
డి) పి.వి.నరసింహారావు
16. ప్రపంచంలో ఆదేశిక సూత్రాలను మొదటిసారిగా ఏ దేశంలో రూపొందించారు?
ఎ) న్యూజిలాండ్ బి) స్పెయిన్
సి) ఐర్లాండ్ డి) రష్యా
17. న్యాయవ్యవస్థ నుంచి కార్యనిర్వాహక వర్గాన్ని వేరు చేయాలని సూచించే ఆర్టికల్?
ఎ) 49 బి) 50 సి) 51 డి) 52
18. ఆదేశిక సూత్రాల ప్రధాన లక్ష్యం 'ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటం' అని పేర్కొన్నది ఎవరు?
ఎ) ఎం.ఎన్.రాయ్ బి) రాజేంద్రప్రసాద్
సి) బి.ఆర్.అంబేద్కర్
డి) హెచ్.జె. లాస్కీ
19. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను ఎన్నో భాగంలో పొందుపర్చారు?
ఎ) 4 బి) 5 సి) 6 డి) 4(ఎ)
20. ప్రపంచంలో మొదటిసారిగా సమాచార స్వేచ్ఛను చట్టం చేసిన దేశం?
ఎ) ఫ్రాన్స్ బి) స్వీడన్
సి) అమెరికా డి) చైనా

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) బి; 5) డి; 6) బి; 7) సి; 8) సి; 9) డి; 10) బి; 11) సి; 12) సి; 13) ఎ; 14) సి; 15) బి; 16) బి; 17) బి; 18) సి; 19) డి; 20) బి.

'మధ్యధరా సముద్ర 'లైట్ హౌస్'గా పిలిచేది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం

భూఉపరితలంపై సుమారు 71 శాతం సముద్రాలు ఆక్రమించి ఉన్నాయి. దక్షిణార్ధ గోళంలో సముద్ర భూభాగం వాటా 80.9 శాతం కాగా, ఉత్తరార్ధగోళంలో ఇది 60.7 శాతం. అందువల్ల దక్షిణార్ధగోళాన్ని సముద్ర అర్ధగోళంగా వ్యవహరిస్తారు.

సముద్ర భూతలం నాలుగు రకాలు..

సముద్ర భూతల నైసర్గిక స్వరూపం ఖండ నిమ్నోన్నతాల కంటే వైవిధ్యంగా ఉంది. నైసర్గిక స్వరూపాన్ని అనుసరించి సముద్ర భూతలాన్ని.. ఖండ తీరపు అంచు, ఖండ తీరపు వాలు, ఖండతీరపు ఉన్నతి, అబిసల్ మైదానంగా విభజించవచ్చు. తీరరేఖను అనుకుని ఉన్న సముద్ర భూతల భాగాన్ని ఖండ తీర అంచుగా వ్యవహరిస్తారు. ఇది తిన్నని వాలు (<1°) కలిగి ఉంటుంది. ఇది చాలా తక్కువ లోతు (<200 మీ.) ఉండే సముద్ర ప్రాంతం. ఈ ప్రాంతం స్వభావ రీత్యా ఖండ భాగాలకు చెందింది. అంటే సముద్ర ముంపునకు గురైన ఖండ భాగం. అందువల్ల ఇది ఖండ భాగాలకు చెందిన సియాలిక్ భూ పటలాన్ని కలిగి ఉంది. ఖండతీర అంచు తర్వాత అకస్మాత్తుగా సముద్ర భూతలం వాలు నిటారుగా (3°-5°) మారుతుంది. ఈ ప్రాంతాన్ని ఖండతలపు వాలుగా పిలుస్తారు. ఈ భాగంలో సముద్ర లోతు 200 మీ. నుంచి 2500 మీ.కు వేగంగా పెరుగుతుంది. మొత్తం సముద్ర భూతలంలో ఖండతీరపు వాలు ప్రాంతం సుమారు 8.5 శాతం. సముద్ర తీరపువాలులో అనేక సముద్ర అంతర్గత అగాధ దరులు (Submarine Canyons) ఏర్పడ్డాయి. ఖండతీరపు వాలు, అబిసల్ మైదానం మధ్య ఉన్న సంధి మండలమే ఖండతీరపు ఉన్నతి. ఈ ప్రాంతంలో వాలు మధ్యస్తంగా (1°-3°) ఉంటుంది. అబిసల్ మైదానం విశాలమైన సమతల మైదానం. ఈ ప్రాంతంలో లోతు 2500–6000 మీటర్లు. ఈ లోతైన సముద్ర భాగంలో అనేక సముద్ర కొండలు, గయోట్లు విస్తరించి ఉన్నాయి. సముద్ర కొండలు అగ్నిపర్వత తరగతికి చెందినవి. వీటి ఎత్తు 1000 మీ. -2000 మీ. ఉంటుంది. పసిఫిక్ మహాసముద్రంలో సుమారు పది వేల అగ్నిపర్వతాలు ఉన్నాయి. అబిసల్ మైదానంపై సమతల శిఖరాలు ఉన్న కొండలే గయోట్లు. ఈ సముద్ర కొండలను వేరు చేస్తూ విశాలమైన లోతట్టు హరివాణాలు ఉన్నాయి. మొత్తం సముద్ర భూతల వైశాల్యంలో అబిసల్ మైదానం వాటా సుమారు 80 శాతం. అట్లాంటిక్ మహాసముద్రంలో అబిసల్ మైదానం వాటా 60 శాతం మాత్రమే. లోతైన సముద్ర భాగాల్లో అఖాతాలు ఉంటాయి. పసిఫిక్ మహాసముద్రంలో అఖాతాలు ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నాయి. ఇవి సాధారణంగా ద్వీపకల్ప వక్రతల సమీపంలో ఏర్పడతాయి. పోర్టొరికో, బార్లెటికైమాన్, శాండ్‌విచ్‌లు అట్లాంటిక్ మహాసముద్రంలో ముఖ్య అఖాతాలు. హిందూ మహాసముద్రంలోని ముఖ్య అఖాతం జావా లేదా గ్రేటర్ సుండా .

పసిఫిక్ మహాసముద్రంలోని ముఖ్య అఖాతాలు	
1) మెరియానా	(11,176 మీ.)
2) కుర్లీ–కామాచాట్క	(10,542 మీ.)
3) ఫిలిప్పైన్	(10,539 మీ.)
4) కెర్మాడక్	(10,822 మీ.)
5) టాంగా	(10,850 మీ.)
6) న్యూహెబ్రైడ్స్	

సముద్రాల మధ్యభాగాల్లో అగ్నిపర్వత ప్రక్రియ వల్ల పొడవైన రేఖీయ పర్వత శ్రేణులు ఏర్పడ్డాయి. వీటిని మిడ్ ఓషియానిక్ రిడ్జ్‌లుగా పిలుస్తారు. అట్లాంటిక్ మహాసముద్రంలో మిడ్ అట్లాంటిక్ రిడ్జ్ విశిష్టమైంది. ఇది ఉత్తర–దక్షిణంగా ఏర్పడి అట్లాంటిక్ మహాసముద్రాన్ని పశ్చిమ, తూర్పు భాగాలుగా వేరుచేస్తోంది. భూమధ్యరేఖ సమీపంలోని రొమాంచ్ లోతు ప్రాంతం మిడ్ అట్లాంటిక్ రిడ్జ్‌ను రెండుగా విభజిస్తోంది. ఉత్తర మిడ్ అట్లాంటిక్ రిడ్జ్ భాగం ఐస్‌లాండ్ సమీపంలో విశాలమైన పీఠభూమిలా ఏర్పడింది. దీన్ని టెలిగ్రాఫ్ పీఠభూమి అని పిలుస్తారు. ఐరోపా–ఉత్తర అమెరికాలను కలుపుతూ సముద్రం ద్వారా నిర్మించిన టెలిగ్రాఫ్ కేబుళ్లు ఈ పీఠభూమి నుంచే వెళ్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో మిడ్ ఓషియానిక్ రిడ్జ్‌లు కేవలం ఆగ్నేయ ప్రాంతంలో మాత్రమే విశిష్టంగా ఏర్పడ్డాయి. హిందూ మహాసముద్రంలో లక్షదీవులు–చాగోస్ దీవుల మధ్య ఈ రిడ్జ్ ఏర్పడింది.

లవణీయత

ఇది సముద్ర జలాల ముఖ్య భౌతిక ధర్మం. సముద్ర జలాల్లో నిక్షిప్తమైన వివిధ లవణాల గాఢతనే లవణీయతగా పేర్కొనవచ్చు. సోడియం, పొటాషియం, కాల్షియంల క్లోరైడులు, సల్ఫేటులు, కార్బొనేటులు ముఖ్య లవణాలు. సోడియం క్లోరైడ్ అతిముఖ్య లవణం. అందువల్లే సముద్ర నీటి నుంచి ఉప్పును తయారు చేస్తారు. ఖండాల మీది శిలలు క్రమక్షయం చెందడంతో ఏర్పడిన శిథిల శిలా పదార్థం.. సముద్రాలను చేరడమే సముద్ర జలాల లవణీయతకు ప్రధాన కారణం. సముద్ర భూతలం మీది అగ్నిపర్వత ప్రక్రియ, రోదసి నుంచి భూమికి చేరే ఉల్కాపాతాలు సముద్ర జలాల లవణీయతకు కారణాలు.

లవణీయతను గ్రా/కి.గ్రా.లలో కొలుస్తారు. సముద్రాల సగటు లవణీయత సుమారు 34.75 గ్రా./కి.గ్రా. అయితే లవణీయత విస్తరణలో ప్రాంతీయ వ్యత్యాసాలున్నాయి. గ్రీన్ లాండ్, ఐస్‌లాండ్‌ల సమీపంలోని ఆర్కిటిక్ సముద్రంలో లవణీయత కనిష్టంగా 5 గ్రా./కి.గ్రా. కంటే తక్కువ. మృత సముద్రంలో లవణీయత గరిష్టంగా 350 గ్రా./కి.గ్రా. కంటే ఎక్కువ. అధిక ఉష్ణోగ్రతల వల్ల భాష్పీభవన రేటు అధికంగా ఉండటంతో 'ఆయన రేఖ, ఉప ఆయనరేఖ' ప్రాంతాల్లో సముద్రాల లవణీయత గరిష్టం. ధృవాల వైపు వెళ్లే కొద్దీ లవణీయత క్రమంగా క్షీణిస్తుంది. భూమధ్యరేఖా ప్రాంతం లో ఉష్ణోగ్రత అధికమైనప్పటికీ, అధిక వర్షపాతం వల్ల లవణీయత తక్కువగా ఉంటుంది.

హిమనీ నదాలు కరగడం వల్ల గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్ సమీపంలోని ఆర్కిటిక్ మహాసముద్రం, అంటార్కిటికా ఖండం సమీపంలోని సముద్రం, బాల్టిక్ సముద్రాల్లో లవణీయత తక్కువ. సాధారణంగా ఖండాంతర్భాగాల్లోని సముద్రాల్లో లవణీయత అధికంగా ఉంటుంది. ఉదాహరణకు మధ్యధరా, కాస్పియన్ సముద్రాలు. అయితే డాన్, నీపర్, నీస్టర్ లాంటి పెద్ద నదులు భారీ మొత్తాల్లో మంచి నీటిని తీసుకురావడంతో నల్లసముద్రంలో లవణీయత స్థాయి తక్కువగా ఉంది. నదీ ముఖద్వారాల వద్ద పెద్ద మొత్తాల్లో మంచినీరు చేరడంతో లవణీయత తక్కువగా ఉంటుంది.

అగ్ని పర్వతాలు మూడు రకాలు

భూపటలంలో లోతుకు వెళ్లేకొద్దీ ప్రతి 32 మీటర్లకు 1°C చొప్పున ఉష్ణోగ్రత పెరుగుతుంది. పటల అంతర్భాగాల్లోని కొన్ని ప్రాంతాల్లో పీడనం స్థానికంగా తగ్గడంతో శిలల ద్రవీభవన స్థానం క్షీణిస్తుంది. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో శిలలు ద్రవ లేదా పాక్షిక ద్రవ స్థితిలో ఉంటాయి. ఈ శిలా ద్రవాన్నే 'మాగ్మా' అంటారు. ఉపరితలం మీదకు ఉద్భేదనం చెందిన మాగ్మాను 'లావా'గా పిలుస్తారు. లావా ఉద్భేదనాన్నే 'అగ్నిపర్వత ప్రక్రియ' అంటారు. ఉద్భేదనా మార్గాన్ని అనుసరించి ఇవి రెండు రకాలు..

1) కేంద్ర ఉద్భేదనం, 2) భ్రంశ ఉద్భేదనం.

కేంద్ర ఉద్భేదనంలో మాగ్మా గొట్టం లాంటి ఏక వాహిక ద్వారా ఉపరితలాన్ని చేరుతుంది. ఈ గొట్టం చుట్టూ లావా ఘనీభవించి 'శంఖు ఆకార అగ్నిపర్వతాలు' ఏర్పడతాయి. అగ్నిపర్వత శంఖువుల శిఖరంపై ఉన్న గరాటు ఆకార ప్రవేశ ద్వారాన్ని 'అగ్నిపర్వత బిలాలు' (Craters) అంటారు. కొన్ని సందర్భాల్లో ఈ బిలాల్లో నీరు చేరి అగ్నిపర్వత బిల సరస్సులు (Crater Lakes) ఏర్పడతాయి. ఉదాహరణకు దక్కన్ పీఠభూమిలోని 'లోనార్' సరస్సు (మహారాష్ట్ర).

భ్రంశ ఉద్భేదనం

భూపటలంలో ఉన్న అనేక పగుళ్లు, సంధులు, భ్రంశ తలాల ద్వారా అధిక పీడనానికి గురైన లావా ఉద్భేదనం చెందడాన్ని 'భ్రంశ ఉద్భేదనం' అంటారు. పలుచని, అల్ప స్నిగ్ధత ఉన్న లావా భ్రంశ ఉద్భేదనం చెంది విస్తారంగా ప్రవహించినప్పుడు..లావా డోమ్‌లు, లావా పీఠభూములు ఏర్పడతాయి. లావా పీఠభూమికి దక్కన్ పీఠభూమి మంచి ఉదాహరణ. సుమారు 65–130 మిలియన్ ఏళ్ల క్రితం(క్రెటేషియస్–ఇయోసిన్) భౌమ్య యుగంలో బసాల్ట్ రకానికి చెందిన లావా భ్రంశ ఉద్భేదనం చెంది.. లావా పీఠభూమి రూపాంతరం చెందింది. ఈ ప్రాంతంలోని బసాల్ట్ శిలలు క్రమక్షయం చెంది, సారవంతమైన నల్లరేగడి నేలలు ఏర్పడ్డాయి.

ఉద్భేదనం నాలుగు రకాలు

తీవ్రత, పదార్థాల స్వభావాన్ని బట్టి ఉద్భేదనాలు నాలుగు రకాలు. అవి.. 1) వెసూవియన్ రకం, 2) స్ట్రాంబోలియన్ రకం, 3) ఐస్‌లాండిక్ రకం, 4) ప్లీనియన్ రకం. వెసూవియన్ ఉద్భేదనం అతి తీవ్రమైంది. ఇది లావాతో పాటు దట్టమైన పొగ, బూడిద వెదజల్లుతుంది. ఐస్‌లాండిక్ రకం ఉద్భేదనంలో లావా విస్ఫోటన రహితంగా నెమ్మదిగా ఉబికి వస్తుంది. పలుచని లావా విస్తారంగా ప్రవహించి లావాడోమ్‌లు లేదా లావా పీఠభూములు ఆవిర్భవిస్తాయి. ఐస్‌లాండ్, హవాయి దీవుల్లోని అగ్నిపర్వత ప్రక్రియ ఈ కోవకు చెందింది.



మధ్యధరా సముద్రంలోని ఇటలీకి చెందిన సిసిలీ దీవిలో ఉన్న స్ట్రాంబోలియన్ అగ్నిపర్వతం లావాతోపాటు అత్యధిక ఉష్ణోగ్రతతో నీటి ఆవిరి, దుమ్ము, ధూళి కణాలను అధికంగా వెదజల్లుతుంది. దీనివల్ల స్ట్రాంబోలియన్ అగ్నిపర్వత శిఖర బిలం వద్ద పొడవాటి జ్వాల ఏర్పడుతుంది. ప్రాచీన, మధ్య యుగాల్లో మధ్యధరా సముద్రంలో ప్రయాణించే నావికులకు జ్వాలతో కూడిన స్ట్రాంబోలియన్ అగ్నిపర్వతం లైట్ హౌస్‌గా ఉపయోగపడేది. ప్లీనియన్ రకమైన అగ్నిపర్వత ఉద్భేదనంలో లావాతో పాటు దట్టమైన పొగ, దుమ్ము, ధూళి ఉద్భేదనం చెందుతాయి.ప్లీనియన్,స్ట్రాంబోలియన్ ఉద్భేదనాలు ఓ మోస్తరు విస్ఫోటన తీవ్రతతో ఉంటాయి. ఉద్భేదన తరచుదనం ప్రాతిపదికగా అగ్నిపర్వతాలను క్రియాశీలక, నిద్రాణ, విలుప్త అగ్నిపర్వతాలుగా విభజించవచ్చు.

నిద్రాణ అగ్నిపర్వతాలు

తరచుగా విస్ఫోటనం చెందేవి క్రియాశీలక అగ్నిపర్వతాలు. ఇటీవల కాలంలో ఉద్భేదనా చరిత్ర(దాఖలాలు) లేనప్పటికీ.. సమీప భవిష్యత్‌లో ఉద్భేదనం చెంది, క్రియాశీలకమయ్యే అవకాశాలున్నవి 'నిద్రాణ అగ్నిపర్వతాలు'.

విలుప్త అగ్నిపర్వతాలు

విలుప్త అగ్నిపర్వతాల బిలాల్లో సరస్సులు ఏర్పడి ఉంటాయి. లావా ఉద్భేదనా మార్గం పూర్తిగా ధ్వంసమై ఉంటుంది. ఇవి ఉద్భేదనం చెందే అవకాశం లేదు. వీటిని మృత అగ్నిపర్వతాలుగా పేర్కొనవచ్చు. దక్కన్ పీఠభూమి, అండమాన్ దీవులు, హిమాలయాల్లోని అగ్ని పర్వతాలు, తూర్పు ఆఫ్రికాలోని కిలిమంజారో విలుప్త అగ్నిపర్వతాల కోవకు చెందినవి.

క్రియాశీలక అగ్నిపర్వతాలు

ప్రపంచంలోని క్రియాశీలక అగ్నిపర్వతాల్లో 90 శాతానికి పైగా పసిఫిక్ మహాసముద్రంలోనే కేంద్రీకృతమయ్యాయి. ఇవి ప్రధానంగా పలకలు అభిసరణం చెందే సబ్‌డక్షన్ మండలాల్లో ఏర్పడ్డాయి. పసిఫిక్ మహాసముద్ర ప్రధాన పలక ఈ ప్రాంతంలో జపాన్, ఫిలిప్పైన్, బిస్మార్క్, నాజ్కా, కొకస్ లాంటి ఉప సముద్ర పలకలతో అభిసరణం చెందడం వల్ల సబ్‌డక్షన్ మండలంలో క్రియాశీలక అగ్నిపర్వతాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు ఫ్యూజియామా (జపాన్), పినటూబో (ఫిలిప్పైన్స్), క్రాకటావో (ఇండోనేషియా), రాంగిటాటో (న్యూజిలాండ్), సెయింట్ హెలెనెన్ (అలస్కా), మవునాలోవా (హవాయి) మొదలైనవి. అండమాన్‌లోని 'బారెన్' దీవుల్లో క్రియాశీలక అగ్నిపర్వత ప్రక్రియను గమనించవచ్చు. మధ్యధరా సముద్ర ప్రాంతంలోనూ క్రియాశీలక అగ్నిపర్వత ప్రక్రియ సంభవిస్తుంది. ఉదాహరణకు ఎత్నా, వెసూవియన్, స్ట్రాంబోలి అగ్నిపర్వతాలు.

భూపటలంలోని మాగ్మా కొన్ని సందర్భాల్లో భూ ఉపరితలాన్ని చేరకముందే మార్గ మధ్యంలోనే ఘనీభవిస్తుంది. ఫలితంగా పటల అంతర్భాగంలో వివిధ రకాల అగ్నిపర్వత సంబంధ భూ స్వరూపాలు ఏర్పడతాయి. ప్రత్యేక ఆకృతి లేని విశాల భూ స్వరూపాలను 'బాథొలిథ్' అంటారు. పటలంలోని శిలా పొరలకు సమాంతరంగా మాగ్మా ఘనీభవించడం వల్ల ఏర్పడే భూస్వరూపాలు 'సిల్స్'. శిలా పొరలకు అడ్డంగా క్షితిజ లంబదిశలో మాగ్మా ఘనీభవించడం వల్ల ఏర్పడే భూస్వరూపాలు 'డైక్స్'. సాసర్ ఆకారంలో ఉండే భూ స్వరూపాలు 'లాకోలిథ్'. అలల మాదిరి ఆకృతి ఉన్న భూ స్వరూపాలు 'ఫాకోలిథ్'.

ప్రాక్టీస్ బిట్స్

1. దక్కన్ పీఠభూమి ఏ రకమైన మాగ్మా ఘనీభవించడం వల్ల ఏర్పడింది? – బసాల్ట్
2. భారతదేశంలో క్రియాశీలక అగ్నిపర్వత ప్రక్రియ సంభవిస్తున్న ఏకైక ప్రాంతం? – బారెన్ దీవులు (అండమాన్)
3. నిశ్శబ్దంగా లావా ఉద్భేదనం ఏ ప్రాంతంలో సంభవిస్తుంది? – ఐస్‌లాండ్
4. 'మధ్యధరా సముద్ర 'లైట్ హౌస్'గా పిలిచేది? – స్ట్రాంబోలి అగ్నిపర్వతం
5. భూపటలంలో క్షితిజ సమాంతరంగా ఏర్పడే అగ్ని పర్వత సంబంధ భూ స్వరూపాలను ఏమని పిలుస్తారు? – సిల్స్

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
ఆదివారం । 16-2-2025

వేయి స్తంభాల గుడి నిర్మాత ఎవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

1. శ్రీముఖ శాతవాహనుడి కాలంనాటి నాణేలు ఎక్కడ లభించాయి?
ఎ) వరంగల్ బి) ఉట్నూరు
సి) కరీంనగర్ డి) చెన్నూరు
2. 'వాత్స్యాయనుడు' ఏ పాలకుల ఆస్థానంలో ఉండేవారు?
ఎ) కాకతీయులు
బి) విజయనగర రాజులు
సి) తూర్పు చాళుక్యులు
డి) శాతవాహనులు
3. శాతవాహన వంశ స్థాపకుడెవరు?
ఎ) గౌతమీపుత్ర శాతకర్ణి
బి) శ్రీముఖుడు
సి) యజ్ఞశ్రీ శాతకర్ణి డి) హాలుడు
4. కాకతీయులు మొదటగా ఏ రాజులకు సేనానులుగా పనిచేశారు?
ఎ) తూర్పు చాళుక్యులు
బి) కళ్యాణి చాళుక్యులు
సి) రాష్ట్రకూటులు డి) పాండ్యులు
5. మొదటిసారిగా ఏ శాసనంలో కాకతీయుల ప్రస్తావన కనిపించింది?
ఎ) హాతిగుంఫా శాసనం
బి) మాగల్లు శాసనం
సి) బయ్యారం చెరువు శాసనం
డి) పాకాల శాసనం
6. కాకతీయులు మొదట ఏ ప్రాంతాన్ని పాలించారు?
ఎ) కొరివి బి) ఓరుగల్లు
సి) ముదిగొండ డి) హన్మకొండ
7. తూర్పు చాళుక్య రాజైన దానర్ణవుడికి సహాయం చేసిన కాకతీయ సేనాని?
ఎ) బేతరాజు బి) ప్రోలరాజు
సి) కాకర్త్యగుండన డి) రుద్రదేవుడు
8. పల్నాటి యుద్ధంలో జోక్యం చేసుకున్న కాకతీయ పాలకుడెవరు?
ఎ) రుద్రదేవుడు బి) గణపతిదేవుడు
సి) మహాదేవుడు డి) ప్రతాపరుద్రుడు
9. 'చలమర్తి గండ' అనే బిరుదు ఎవరిది?
ఎ) కాకర్త్యగుండన బి) దుర్గరాజు
సి) మొదటి బేతరాజు
డి) మొదటి ప్రోలరాజు
10. కాకతీయుల మొదటి రాజధాని ఏది?
ఎ) హన్మకొండ బి) ఓరుగల్లు
సి) కొరివి డి) కోటిలింగాల
11. ఓరుగల్లు పట్టణ నిర్మాత?
ఎ) గణపతి దేవుడు బి) రుద్రదేవుడు
సి) కాకర్త్యగుండన డి) మహాదేవుడు
12. కాకతీయుల పాలనా కాలం?
ఎ) క్రీ.శ. 950 నుంచి 1300 వరకు
బి) క్రీ.శ. 1000 నుంచి 1368 వరకు
సి) క్రీ.శ. 1000 నుంచి 1323 వరకు
డి) క్రీ.శ. 950 నుంచి 1342 వరకు
13. 'ఆంధ్రదేశాధీశ్వర' బిరుదు పొందిన పాలకులెవరు?
ఎ) కాకతీయులు బి) శాతవాహనులు
సి) ఇక్ష్వాకులు
డి) విజయనగర రాజులు
14. రామప్ప ఏ జిల్లాలో ఉంది?
ఎ) నల్గొండ బి) ఖమ్మం
సి) వరంగల్ డి) కరీంనగర్
15. ఎవరి పాలనా కాలంలో 'మార్కోపోలో' మోటుపల్లి రేవును సందర్శించాడు?
ఎ) ప్రతాపరుద్రుడు బి) రుద్రమదేవి
సి) గణపతి దేవుడు డి) మహాదేవుడు
16. కాకతీయుల కాలంలో ఏ మతం ఆధిపత్యంలో ఉండేది?
ఎ) శైవం బి) వైష్ణవం
సి) బౌద్ధం డి) జైనం
17. హనుమకొండ ప్రాంతంపై పూర్తి వంశపారంపర్య హక్కులను మొదటి ప్రోలరాజు ఎవరి ద్వారా పొందాడు?
ఎ) చాళుక్య దానర్ణవుడు
బి) కాలచూరి బిజ్జలుడు
సి) చాళుక్య రెండో తైలపుడు
డి) చాళుక్య మొదటి సోమేశ్వరుడు
18. 'బయ్యారం చెరువు శాసనాన్ని' వేయించిన వారు?
ఎ) రుద్రమదేవి బి) మైలమదేవి
సి) గణపాంబ డి) అనితల్లి
19. కిందివారిలో కాకతీయ రాజ్య పునఃస్థాపనకు సహాయపడినవారెవరు?
ఎ) రుద్రమదేవి బి) మైలాంబ
సి) కామసాని డి) అనితల్లి
20. కాకతీయ వంశ మూలపురుషుడు?
ఎ) వెన్ననృపుడు బి) కాకర్త్యగుండన
సి) మొదటి బేతరాజు డి) కాకతీరాజు
21. ఏకవీర దేవి ఆలయం ఎక్కడ ఉంది?
ఎ) ఘణపురం బి) కొలనుపాక
సి) మొగిలిచర్ల డి) ఇనుగుర్తి
22. కిందివాటిలో సరికాని జత ఏది?
ఎ) వల్లభా చార్యుడు - నీతిసార యోగం
బి) రుద్రదేవుడు - నీతిసారం
సి) విద్యానాథుడు - ప్రతాపరుద్ర యశోభూషణం
డి) జాయపసేనాని - నృత్త రత్నావళి
23. మొదటగా చెరువులను తవ్వించిన కాకతీయ రాజు?
ఎ) మొదటి బేతరాజు
బి) మొదటి ప్రోలరాజు
సి) రుద్రదేవుడు డి) రుద్రమదేవి
24. వేయి స్తంభాల గుడి నిర్మాత ఎవరు?
ఎ) గణపతి దేవుడు బి) ప్రతాపరుద్రుడు
సి) రుద్రదేవుడు డి) మహాదేవుడు
25. దేవాలయాలను నిర్మించిన మొదటి కాకతీయ పాలకుడెవరు?
ఎ) రుద్రదేవుడు బి) మహాదేవుడు
సి) మొదటి ప్రోలరాజు
డి) మొదటి బేతరాజు
26. స్వతంత్రంగా కాకతీయ రాజ్య పాలనను ప్రారంభించినవారెవరు?
ఎ) కాకర్త్యగుండన బి) వెన్ననృపుడు
సి) మొదటి ప్రోలరాజు
డి) రెండో ప్రోలరాజు
27. హనుమకొండలో కాకతీయ వంశ పాలనను ప్రారంభించినవారు?
ఎ) మొదటి ప్రోలరాజు
బి) మొదటి బేతరాజు
సి) రుద్రదేవుడు డి) కాకర్త్యగుండన
28. కరీంనగర్ ప్రాంతాన్ని కాకతీయుల కాలంలో ఏ పేరుతో పిలిచేవారు?
ఎ) ముల్కినాడు బి) సబ్బినాడు
సి) రేనాడు డి) పాకనాడు
29. కాకతీయుల కాలంలో గ్రామపాలనను పర్యవేక్షించేవారిని ఏమని పిలిచేవారు?
ఎ) ఆయగారు బి) ఇనామ్‌దార్
సి) గ్రామణీ డి) గోమేయక
30. కాకతీయుల శిల్పకళకు సంబంధించి ప్రత్యేకమైన నిర్మాణాలేవి?
ఎ) కోటగుళ్లు బి) తోరణ స్తంభాలు
సి) త్రికూటాలయాలు
డి) ఆలయాల ప్రాకారాలు
31. పాకాల సరస్సును తవ్వించిన వారెవరు?
ఎ) బయ్యన నాయకుడు
బి) రేచర్ల రుద్రుడు
సి) మల్యాల గొండప్ప
డి) జగదల ముమ్మడి నాయకుడు
32. 'భట్టారకులు' అంటే ఎవరు?
ఎ) సైనికులు బి) వ్యాపారులు
సి) ప్రభుత్వ ఉద్యోగులు
డి) రాయబారులు
33. తెలుగు ప్రాంత విమోచన ఉద్యమ నాయకుడెవరు?
ఎ) ముసునూరి ప్రోలయ నాయకుడు
బి) ముసునూరి కాపయ నాయకుడు
సి) అద్దంకి వేమారెడ్డి
డి) రాచకొండ పద్మనాయకుడు
34. కాకతీయుల చివరి రాజు?
ఎ) రుద్రదేవుడు బి) రుద్రమదేవి
సి) ప్రతాపరుద్రుడు డి) గణపతిదేవుడు
35. 'ఆంధ్ర సుల్తాన్‌లు'గా పేరు పొందిన పాలకులు ఎవరు?
ఎ) బహమనీ సుల్తాన్‌లు
బి) నిజాం షాహీలు
సి) అసఫ్ జాహీలు
డి) కుతుబ్ షాహీలు
36. హుస్సేన్‌సాగర్ (హైదరాబాద్) చెరువును తవ్వించినవారు?
ఎ) నిజాం అలీఖాన్ బి) సాలార్‌జంగ్
సి) ఇబ్రహీం కుతుబ్ షా
డి) అబుల్ హసన్ తానీషా
37. హైదరాబాద్ నగర నిర్మాత ఎవరు?
ఎ) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
బి) అసఫ్ జా మీర్ ఉస్మాన్ ఖాన్
సి) ఇబ్రహీం కుతుబ్‌షా
డి) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
38. చార్మినార్‌ను నిర్మించినవారు?
ఎ) అబుల్ హసన్ తానీషా
బి) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
సి) ఇబ్రహీం కుతుబ్ షా
డి) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
39. హైదరాబాద్‌లోని పురాతనమైన కట్టడాలు ఎక్కువగా ఏ రకమైన సంస్కృతికి సంబంధించినవి?
ఎ) ఇండో - ఆర్యన్ బి) ఇండో-గ్రీకు
సి) ఇండో - యూరోపియన్
డి) ఇండో - పర్షియన్
40. తెలంగాణలో అసఫ్ జాహీల పాలన ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
ఎ) 1723 బి) 1724
సి) 1725 డి) 1726
41. 'మహత్‌సిబ్' అనే అధికారి ప్రధాన విధి?
ఎ) రాజు ముఖ్య సలహాదారుడు
బి) గూఢచర్యం సి) ముఖ్య లేఖకుడు
డి) నైతిక విలువల ప్రచారం
42. దాశరథీ శతకాన్ని ఎవరు రచించారు?
ఎ) అద్దంకి గంగాధర కవి
బి) కందుకూరి రుద్రకవి
సి) పొన్నెగంటి తెలగనార్యుడు
డి) కంచెర్ల గోపన్న
43. గోల్కొండపై మొట్టమొదటి కోటను నిర్మించినవారు?
ఎ) కాకతీయులు బి) కుతుబ్ షాహీలు
సి) నిజాం షాహీలు డి) అసఫ్ జాహీలు
44. తెలుగు కవులు 'మల్కిభరాముడు'గా ఎవరిని కీర్తించారు?
ఎ) భక్త రామదాసు
బి) అబుల్ హసన్ తానీషా
సి) ఇబ్రహీం కుతుబ్ షా
డి) సుల్తాన్ కులీ కుతుబ్ షా
45. గోల్కొండ రాజ్యాన్ని సందర్శించిన ఫ్రెంచి యాత్రికుడు?
ఎ) నికోలో కాంటె బి) న్యూనిజ్
సి) టావెర్నియర్ డి) మార్కోపోలో
46. కాకతీయుల కాలంలో గోల్కొండను ఏమని పిలిచేవారు?
ఎ) మంగళపురం బి) రుద్రారం
సి) చాపల బండ డి) గోవుల కొండ
47. కోహినూర్ వజ్రం ఎక్కడ లభించింది?
ఎ) వజ్రకూరు బి) నేలకొండపల్లి
సి) కొల్లూరు డి) చెన్నారం
48. గోల్కొండ నుంచి రాజధానిని హైదరాబాద్‌కు మార్చిన కుతుబ్ షా పాలకుడు?
ఎ) ఇబ్రహీం బి) మహమ్మద్ కులీ
సి) సుల్తాన్ కులీ
డి) అబుల్ హసన్ తానీషా
49. అసఫ్ జాహీల మొదటి రాజధాని ఏది?
ఎ) హైదరాబాద్ బి) ఔరంగాబాద్
సి) రాయచూర్ డి) పర్బనీ
50. ఔరంగాబాద్ నుంచి తన రాజధానిని హైదరాబాద్‌కు మార్చిన అసఫ్ జాహీ రాజు?
ఎ) నాసర్‌జంగ్ బి) నిజాం అలీఖాన్
సి) మీర్ ఉస్మాన్ అలీఖాన్
డి) నిజాం ఉల్ ముల్క్
51. సికింద్రాబాద్ నగరాన్ని ఎవరి పేరు మీద నిర్మించారు?
ఎ) మొదటి అసఫ్ జా
బి) రెండో అసఫ్ జా
సి) మూడో అసఫ్ జా
డి) నాలుగో అసఫ్ జా
52. ఉస్మానియా విశ్వ విద్యాలయ స్థాపకుడు?
ఎ) మీర్ ఉస్మాన్ అలీఖాన్
బి) నిజాం అలీఖాన్
సి) మీర్ మహబూబ్ అలీఖాన్
డి) నిజాం అలీఖాన్
53. 'కాశీయాత్ర చరిత్ర'ను రాసిందెవరు?
ఎ) దాశరథి
బి) కొనగంటి సత్యనారాయణ
సి) ఏనుగుల వీరస్వామి
డి) కోలా శేషాచలం
54. 'హైదరాబాద్ అంబేడ్కర్'గా పేరు పొందిన వారెవరు?
ఎ) భాగ్యరెడ్డి వర్మ
బి) అరిగే రామస్వామి
సి) బొజ్జం నర్సింహులు
డి) బి.ఎస్. వెంకటరావు
55. చార్మినార్ ఎత్తు ఎంత?
ఎ) 52 మీ. బి) 50.2 మీ.
సి) 49.8 మీ. డి) 48.7 మీ.
56. మహాత్మాగాంధీ 'వరంగల్'ను సందర్శించిన రోజు?
ఎ) 1947 జనవరి 2
బి) 1947 ఫిబ్రవరి 20
సి) 1946 ఫిబ్రవరి 5
డి) 1946 జనవరి 8
57. 'హైదరాబాద్' వారపత్రిక సంపాదకుడు?
ఎ) మందుముల నర్సింగరావు
బి) భాగ్యరెడ్డి వర్మ సి) వామన్ నాయక్
డి) మాడపాటి హనుమంతరావు
58. 'తెలంగాణా సర్దార్' బిరుదు ఎవరిది?
ఎ) జమలాపురం కేశవరావు
బి) రావి నారాయణరెడ్డి
సి) బూర్గుల రామకృష్ణారావు
డి) సురవరం ప్రతాపరెడ్డి

సమాధానాలు

1) సి; 2) డి; 3) బి; 4) సి;
5) బి; 6) ఎ; 7) సి; 8) ఎ;
9) బి; 10) ఎ; 11) బి; 12) సి;
13) ఎ; 14) సి; 15) బి; 16) ఎ;
17) డి; 18) బి; 19) సి; 20) ఎ;
21) సి; 22) ఎ; 23) బి; 24) సి;
25) డి; 26) డి; 27) బి; 28) బి;
29) ఎ; 30) బి; 31) డి; 32) సి;
33) ఎ; 34) సి; 35) డి; 36) సి;
37) ఎ; 38) డి; 39) డి; 40) బి;
41) డి; 42) డి; 43) ఎ; 44) సి;
45) సి; 46) డి; 47) సి; 48) బి;
49) బి; 50) బి; 51) సి; 52) ఎ;
53) సి; 54) డి; 55) డి; 56) సి;
57) బి; 58) ఎ.

What is the code for "earn"

BANK EXAMS
REASONING

Model Questions

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
1) April 2) June 3) July
4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
1) The person whose joining date is in May
2) The person whose joining date is in January
3) D 4) A
5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
1) Only two people sit to the left of D
2) D is sitting second to the right of the person whose joining date is in July
3) E and B are immediate neighbours of D
4) D's joining date is in May
5) None is true
5. Who among the following has joining date in June?
1) F 2) E 3) G 4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
1) None 2) One 3) Two
4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
1) A and the person whose joining date is in August
2) The person whose joining date is in May and E
3) C and G
4) The persons whose joining dates are in March and June
5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
1) D sits at one of the extreme ends of the line
2) A sits on the immediate left of D
3) Q faces D
4) C is an immediate neighbour of D
5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
1) P 2) Q 3) R 4) S
5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
1) P 2) Q 3) R 4) S
5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
1) A 2) B 3) C 4) D
5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
1) si 2) ru 3) ha 4) ma
5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
1) pa jo 2) zi ki 3) ma ki
4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
1) ru 2) pa 3) jo
4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
1) ki to 2) ma pa 3) fi ma
4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
1) well 2) manage
3) time 4) enough
5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
1) ru si 2) da ha 3) si pa
4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
How many steps will be required to complete the rearrangement?
1) Five 2) Six 3) Seven
4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
Which of the following is definitely the input?
1) enemy 25 joy defeat yes 52 37 46
2) 37 enemy 25 joy yes defeat 52 46
3) enemy joy defeat 25 52 yes 46 37
4) Cannot be determined
5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
How many more steps will be required to complete the rearrangement?
1) Three 2) Four 3) Five
4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
Which of the following steps will be the last but one?
1) VII 2) IV 3) V
4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
Which of the following will be step VI?
1) 33 store 52 of 75 81 full goods
2) 33 store 52 of 75 full 81 goods
3) 33 store 52 of 75 goods 81 full
4) There will be no such step
5) None of these

Explanations

(1-7):

March	June	May	Jan	July	April	Feb	Aug
A	E	C	B	F	G	H	D

1. 4 **2.** 1 **3.** 1 **4.** 5 **5.** 2
6. 3 **7.** 1

(8-12):

	Q	P	S	R
Row 2	Q	P	S	R
Row 1	B	C	D	A

8. 4 **9.** 1 **10.** 2 **11.** 5 **12.** 1

(13-18):
time and money ® ma jo ki... (i)
manage time well ® pa ru jo...(ii)
earn more money® zi ha ma..(iii)
earn well enough ® si ru ha ...(iv)
From (i) and (ii), time ® jo
From (i) and (iii), money ® ma
From (i), and ® ki
From (ii) and (iv) well ® ru
From (ii), manage ® pa
From (iii) and (iv), earn ® ha
From (iii), more ® zi
From (iv), enough ® si
13. 3 **14.** 5 **15.** 2
16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**
17. 1
18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):
The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.
19. Input: 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always
Step VI: 31 shut 45 open 49 door 86 aways **Ans: 2**
20. Can't proceed backward. **Ans: 4**
21. Step II: 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**
22. Input: where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**
23. Step II: 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**